# అనగనగా ఓ మంచికథ

2020 -2021



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 248

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి జూన్ 2021 సంచిక వరకూ వచ్చిన

# అనగనగా మంచి కథలు




| సంఖ్య | కథపేరు | రచయిత(త్రి) పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | మణిపూసలు | కె.లింగరాజు | 3 |
| 2 | అయాచితం | వి.వి. సూర్యనారాయణ | 7 |
| 3 | ఆ పిచ్చితల్లి | ఆశాలత పాల్ | 10 |
| 4 | రహస్యపు రోగిని | అడబాల శ్రీరామ వెంకట సుబ్బారావు | 13 |
| 5 | ఇప్పటి పావురం రేపటి నెమలి | బుచ్చిబాబు | 15 |
| 6 | ఉద్ధరింపు | కొడవటిగంటి కుటుంబరావు | 23 |
| 7 | తోకాడించని కుక్క | పినిశెట్టి శ్రీరామమూర్తి | 29 |
| 8 | కాలచక్రం | బుచ్చిబాబు | 38 |
| 9 | మార్పు | పినిశెట్టి శ్రీరామమూర్తి | 53 |
| 10 | కదిలే రైల్లోంచి కనిపించే చెట్టు | గొల్లపూడి మారుతీరావు | 55 |
| 11 | అయ్యవారిని చెయ్యబోతే కోతయింది | కరుణ కుమార | 62 |
| 12 | కవిరాయడు– మహారాజు | చింతా దీక్షితులు | 68 |
| 13 | 4 వ మజిలీ | శ్రీ సుభా | 72 |
| 14 | భావి వాంఛ | పినిశెట్టి శ్రీరామ్మూర్తి | 80 |
| 15 | ఓ సినిమా కథ | గొల్లపూడి మారుతీరావు | 85 |
| 16 | కాకీ చొక్కాలో కాఫీ చుక్క | గొల్లపూడి మారుతీరావు | 92 |
| 17 | తెలివితేటల విలువ | భానుమతీ రామకృష్ణ | 102 |
| 18 | ఒడ్డుకు చేరిన ఒంటి కెరటం | శివరాజు సుబ్బలక్ష్మి | 105 |

# మణిప్రూసలు

## కె.లింగరాజు

### (రూపవాణి, 1945 జూన్ 1 సంచిక నుంచి)


మణిప్రూసలు
శ్రీ కె. లింగరాజు

"వెళతావా అక్కడికి రాజూ?"
సంశయిస్తూనే అడిగేడు రామజోగి ఆ అడగడం నాకు నిజంగా నవ్వే తెచ్చిపెట్టింది
"అది మంచిది కాదోయి"

ఇదే నన్ను రోజూ ప్రశ్నలు అడిగేవి
ప్రకూ ఎంత మంచిదో వీళ్ళకేం తెలుసు రోజూ నేను మా యింటి దగ్గరనుంచి షికారుకి వెళ్తుతూంటే పవర్‌పేటలో బి-116 ఎలక్ట్రిక్ స్తంభందగ్గర తన యింటి దగ్గరనుంచి ఎంత కమ్మగా, తియ్యగా, తన

"వెళతావా అక్కడికి రాజూ ?"

సంశయిస్తూనే అడిగేడు రామజోగి ఆ అడగడం నాకు నిజంగా నవ్వే తెచ్చి పెట్టింది.

"అది మంచిది కాదోయి"

ఓ సారి అతనికేసి కరుగ్గానే చూచేను ఆ మాట నాకు సూది పొడిచినట్టే అయ్యింది. ఆ ముక్కకి తోడుగానే రామజోగి యీ సంఘంలో మనిషే కదూ? అని యేదో హృదయానికి అందిచ్చింది కూడాను.

"దానికి ఒంటినిండా క్రోకడైల్సువోయి" పట్టలేక వుండలేక చెప్పేసేడు.

పాపం ! ఎంత ప్రేమో నీమీద అంది సమాధానంగా యింకోళ్ళ మీద సమాధే కట్టేస్తున్నాడని వెనువెంటే అందిచ్చేసింది కూడాను.

నేను నిజంగా చెడిపోతాననే యిదంతా ? ఈ జాగ్రత్త ముందు డేంజర్ లైట్లున్నూ ?

"ఐతే నాకేం?" అన్నాను

"సరే, వెళతావన్న మాట" నిట్టూర్పుగా, పరీక్ష పోయిన వాడి ముఖంలాగే పెట్టేడు.

"మహారాజులా"

నా గొప్పతనానికి ఓ సారి అంతస్సులేచి క్రింద పడింది కూడాను

'అంతే !'

దాంతో రామజోగి వెళ్ళిపోయేడు

ప్రకూ అంటే ఎందుకు రామజోగికి కోపం ? ప్రకూ కూడా ఓ మనిషే కాదూ? ఆమె వ్యభిచారం వల్ల పొట్టనింపుకొంటోందనేటప్పటికి, దాన్ని భూతంలాగా, పిశాచం లాగా, చీడ పురుగులాగా యెందుకు వీళ్ళంతా చూడాలి ?

ఆమె మంచిది కాదన్నాడు రామజోగి వెళ్ళి చూచి వచ్చేడేం? ఆమె శరీరమంతా వ్యాధులతో నిండిపోయింది ? ఏం యీయన ఎప్పుడైనా వెళ్ళి అనుభవించినట్లే చెప్పి పారేసేడేదో ! తనకి అందరూ ఆడిపోసుకునే మాటలుకి యింకో రెండు చిలువలు పలవలు అల్లి యెందుకు చెప్పాలి ?

ప్రకూ హృదయం వీళ్ళెవరైనా చదవగల్గేరా ?

ఇదే నన్ను రోజూ ప్రశ్నలు అడిగేవి

ప్రకూ ఎంత మంచిదో వీళ్ళకేం తెలుసు రోజూ నేను మా యింటి దగ్గర నుంచి షికారుకి వెళ్ళుతూంటే పవర్ పేటలో బి-116 ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర తన యింటి దగ్గరనుంచి ఎంత కమ్మగా, తియ్యగా, తన చూపులతో నాతో మాట్లాడేదో? ఎన్ని సార్లు ప్రథమంలో మాట్లాడాలని, ఎల్లాగయినా నన్ను పలకరించాలని వుబలాటపడి ప్రతీక్షించేదో ! ఆ నిరాశల్లో నిట్టూర్పును విడుస్తూండేదో? ఇంకా ఎన్నో ఏం ఇల్లాంటి ప్రకూకి హృదయం లేదనే అనుకోవాలా?

సంఘం అంతా అనుకొనేలా అది నాకోసం వుచ్చులు పన్నుతుందనే, నేను అనుకొని..

అవ్వాళ రమ్మని ఎంత మృదువుగా చెప్పిందో? ఆ ముక్కలలో మృగ్యంగా యెన్ని అర్థాలు వుంచిందో.

ఈ ఆలోచనలతోనే ప్రకూ యిల్లు చేరేను.

ఎదురుగా వున్న ఎలక్ట్రిక్ స్తంభం బి-116 సెంటినల్ లాగే తన బ్రౌన్ అవుట్ బుట్టలోంచి వెల్తుర్ని పంపించింది.

"వచ్చేరా!? రారనే అనుకొన్నాను" అంది

"ఏం" అన్నట్లుగా ఓ సారి ఆ చిలిపి కళ్ళల్లోకి చూస్తే కులికే పోయింది.

"రండి! లోపలికి" అంటూ మృదువుగా తగిలీ తగలనట్టుగా నడుస్తూ, దాంతోనే ముక్కు క్షోణాలకి అంటీ ముట్టనట్టుగా తన "మాగనెట్" ను పంపిస్తూ నడిచింది.

వసారాలోంచి సావిడి, దానికి వున్న గది, గది లోంచి దక్షణపు కటకటాల గదిలోకి వెళ్ళేం.

"కూర్చోండి" ఎదురుగా మంచం చూపింది.

అంతకంటే యెక్కువ ఆదరణ, ఆ అందంలోనే నాకు స్ఫురించింది అవి ఆమె లాంటి వాళ్ళకు వుగ్గు పాలతోనే వస్తాయి కాబోలు. ఆ మంచం మీద ఎంతమంది జీవనాలకు ఆమె సౌఖ్యం, సుఖం, రతి పారవశ్యం చేసి, సొలసి పోయిందో కూర్చొన బోతూంటే వెలితిగా హృదయం సంక్షోభించింది కాని కూర్చున్నాను. నాకు దగ్గరగానే తనూ కూర్చుంది.

ఆ కూర్చోడంతోనూ అంటీ ముట్టనట్టుగా, తగిలీ తగలనట్టుగా కూర్చుంది.

ఆమె చేతుల్లో చిన్న నారింజకాయ నలుస్తూయుంటే, ఏదో ఆమె పెదిమలు కదిలాయి మాట్లాడాలనే అభిలాష, మళ్ళీ ఏం మాట్లాడాలనే సంశయం, మాట్లాడక పోతే ఎల్లాగా అన్న ఆందోళన, ఉట్టినే కూర్చుంటే యేం బావుంటుందన్న ఆదటు కనిపించింది. నాకు నవ్వు వచ్చింది. ఏమైనా అనుకుంటుందేమోనని లోలోపలే నవ్వుకున్నాను నేను.

"ఎందుకు పిలిచేవూ?"

అంత ఠక్కున సూటిగా ప్రశ్నే వేస్తానని వూహించలేకపోయింది ఉలిక్కి పడింది.

"ఆ ఊరికేనే" మళ్ళీ చిరునవ్వు నవ్వుతూ "మీతో మాట్లాడాలని వుండేదండీ"

"నాతో నా ?" అంత అవసర కార్యం ఏమిటబ్బా అని నా మనస్సు అడిగింది.

"అవును రోజూ మీరు వెడుతూంటే చూచేదాన్నా మిమ్మల్ని చూచిన కొద్దీ పలకరించాలనీ యేమిటేమిటో మాట్లాడాలనీ మా యింటికి పిలవాలనీ యింకా దేముదు మేలు చేస్తే" సూటిగా చూచి నవ్వేసింది ఆ చూపులు హృదయాన్ని దూసుకు పోయేయి.

"ఐతే మాట్లాడూ?"

"ఏం మాట్లాడనూ? ఏం తోచటం లేదండీ" అంది తన ఆ చిన్న చాకును తుడిచి, లోనున్న తెల్ల బొద్దును కోస్తూ ఆ అమాయకత్వానికి, ముగ్ధానికి నాకు వూపేసినట్లు చేసింది.

"ఐతే ప్రకూ యిల్లా పిలుస్తున్నానని యేమీ అనుకోవు కదూ?"

"అబ్బే మీరెల్లా పిలిచినా నాకు యిష్టమేనండీ" అంది ఆ తొనలు చక్కగా నకు అందివ్వడంలో తన వేళ్ళని నాకు తగిలే అవసరానికంటే యెక్కువ సేపే వుంచింది ఆమె హృదయాన్ని ఆ వూగిపోయే లోలక్కులు వూగనే వూగించేసేయి.

ఓ సారి కవి సింహావలోకనం చేసినట్లే ఆమెకేసి చూచేను ఆ యెర్ర జార్జెటు, చారల బుట్ట చేతుల క్రేపుసిల్కు జాకెట్టు, ఆ చెవుల మీంచి తీసి వెనక్కు సగం జెడవేసిన కచీరీ భారం, ఆ పొడుగుగా చక్రాల్లా వూగిపోయే లోలక్కులు, ఆ ఆహ్వానాలు పంపుతున్న వక్షస్థలం, ఆ నల్లటి గుడ్డలో దాగిపోయిన పంచదార, ఆ లిప్ స్టిక్ పట్టిన తాంబూలపు రేఖల పెదిమలు.

"ఏం ? ఎందుకంత యిష్టం మనం యిద్దరం యెప్పుడూ మాట్లాడుకోనైనా లేదు కదా?"

"ఏమో నాకు తెలియదు" అనేసి తక్కింది చూపుల్లో చెప్పేసింది నాకు నిజంగా విస్మయం ఆవరించనే ఆవరించింది.

"అయితే నువ్వు యింత అందంగా వున్నావు కదా? ఎందుకిల్లాంటి వృత్తిలోకి దిగేవు ప్రకూ?"

ఇలాంటి ప్రశ్నలు యిదివరకెవరూ ప్రకూని అడగలేదు కాబోలు! ఆమె దగ్గరకు వచ్చిన వారు, ఆహ్వానింపబడినవారు, డబ్బిచ్చి ఆమెను కొనుక్కున్న వారు, అందరూ ఆమె శరీరాన్ని, అంగ సౌష్టవాన్ని, ఆఖరుకి ఆమె వల్ల తమ కోర్కె తీర్చుకోడానికి కాని, నా ప్రశ్నకు హడలి పోయింది కాని ఆ ఆశ్చర్యంలోంచి త్వరలోనే తేరుకొంది.

దీర్ఘంగా నా కేసి చూస్తూ "నిజంగా మీకు కారణం కావాలేం?" అంది ఆ చూపులో నన్ను న్యూనత పరచడానికే ఆ ప్రశ్న వేస్తున్నావు అన్నట్టుగానే కనుపించింది.

"కాదు ప్రకూ నిజంగానే అడుగుతున్నాను నిన్ను చూస్తూంటే యేదో ఎక్కడో పడిపోతున్నావన్నట్లుగా వుంటుంది" ఆమె నవ్వింది.

"మా అమ్మ వ్యభిచారం చేసింది ఆ వృత్తిలో వుండగానే నేను పుట్టేను. ఆమె దానివల్ల జీవించింది నేనూ దానివల్లే జీవించుతున్నాను" అంది, రామాయణం అంతా రెండు ముక్కల్లో చెప్పినట్టుగా.

"ఏం సుఖంగా వుంటుందని దీన్ని మొదలెట్టేవు ప్రకూ? మీ అమ్మ నీకేం చెప్పలేదూ? ప్రతీవాడూ వచ్చి నానా హింసలు పెట్టి నలిపి"

"ఏడిసేరు యెధవలు ఆ అల్లాంటి పైడాబు రాయుళ్ళంతా మా కాలిక్రింద చెప్పులా వుంటారు" ఆమె ఎద ఓ సారి విరుచుకుంది.

నా ప్రశ్నలు నాకు ఓ స్టార్ నో, ఓ నాయకుడినో, ఓ కవినో, యింటర్వ్యూ చేస్తున్నట్టుగా తోచింది, అల్లా ప్రశ్నలు వేస్తే వచ్చిన నూత్నానందము అంతా బుగ్గిలో పోసినట్టే అవుతుందేమో అనిపించింది ఇంకా ఇంకా ప్రశ్నలు వేస్తే మరింతగా చిన్నబుచ్చుకొని, ఏదో సంఘాన్నుంచి పతితుల్ని తప్పిద్దామని సమయం దొరికితే చాలు ఘంటలు కొద్దీ 'చోర్' చేసి వదలి పెట్టే నాయకుడిలా నువ్వు ప్రశ్నల పరంపరతో దులిపేస్తే నిన్నూ ఓ నాయకుడు త్రిలోక రక్షకుడవుతావని అంతస్సు వెక్కిరించింది.

నాకు చిన్నబోయినట్లే అయింది

కొత్తగా పురిటాలైన భార్యను "ఈ పిల్లవాణ్ణి నాకే కన్నావా?" అని అడిగినట్లు అయింది.

నా ముఖంలో కాదు హృదయంలో కూడా మూగిపోయిన యీగల్ని, వలేసి అంతరాళాల్లో వుచ్చులొగ్గి, పట్టుకొంటున్నట్టు తోచింది _ ప్రకూ ఆమె చూపులకి యిక నేను మాట్లాడలేక పోతానేమో అనుకొన్నా.

"నా స్నేహితు దేమన్నాడో తెలుసా నిన్ను గురించి?" అప్రయత్నంగానే అన్నాను.

వులుకూ పలుకూ లేకుండా నాకేసి చూసింది ఆ చూపుల్లో ఏం అన్నాడో నాకు తెలుసు అన్నట్టు వున్నా "ఏమన్నాడేమిటి" అంది.

"నువ్వు గుడిసేటివని" సంక్షేపించేను.

"అవును రంకులంజననీ, నా వంటినిండా జబ్బులున్నాయనీ, నేను నిన్ను నావశం చేసుకోడానికి, నీ దగ్గర డబ్బు గుంజుకోడానికి, నిన్ను కూడా అధోగతి పాలు చెయ్యడానికి, నేను కనుకొట్టుతున్నానని, నేను నవ్వుతూ పిలుస్తున్నానని అల్లాగే కాదూ అతను అంట" వురుముతున్నట్టుగానే మాట్లాడింది త్రాచుపామును తోక తొక్కితే లేచినట్లే లేచింది "అంటాడు అతనొక్కడే కాదు ప్రపంచకం అంతా అంటుంది పవర్ పేటలో ప్రతి స్త్రీ, ప్రతీ పురుషుడు, ప్రతీ బిడ్డ అంటుంది. యెందుకనగూడదూ అంటారు నే చేసే పని తప్పయితే ప్రతీవారూ అనరూ ? నేను గుడిసేటిని కానూ ? కానూ? వ్యభిచారిణి కానూ ? అంటుంది రాజూ యీ సంఘం అంటుంది ఈ లోకం కూస్తుంది. కాని యీలోకం, సంఘం నేను విడిచి పెట్టేసేను. నా దగ్గరికి వచ్చే వాళ్ళు వస్తూనే

వుంటారు వాళ్ళ కామం తీర్చుకొంటారు కాస్తో కూస్తో చేతిలో పెడతారు దాంతో నా పొట్ట గడచిపోతుంది నా పొట్టకు లోటు లేకుండా వున్నంతకాలం నేనెందుకు విచారపడాలి ? దుఃఖించాలి ఒకళ్ళు అంటున్నారని ఎందుకు కుళ్ళాలి?"

"ఏమంటావు ?" అన్నట్టుగా చూచింది.

"పోనీ!?" సంశయించేను.

"అవును రాజూ పెళ్ళి చేసుకొని నాకేం చెయ్యాలో తెలియదు అయినా కాని నేను యీ దిగుబడి రొంపులో ఓ సారి జారినపుడు, పెళ్ళి చేసుకొందుకు ఎవడొస్తాడు ? పోనీ పెళ్ళి చేసుకొన్నా, నా ప్రాథమిక జీవితంలో అలవాటుపడ్డ పోకడలు, స్వేచ్ఛ, యివన్నీ ఎల్లా కట్టుబడి పోగొట్టుకోవాలో తెలియదు ఆ వివాహ జీవనంలో వుండే కట్టుబాట్లు నాకు అతీతంలైపోతాయేమో అనుకొంటూ

ఇంతమంది వస్తారు అందరూ ఆ ప్రశ్నే అడుగుతారు కాని ఒక్కరు ముందుకు రాలేరు యీ బ్రోతల్స్ అవీ పెట్టిస్తామంటారు ? అవన్నీ యీ చెడిన గూడేలని గుళ్ళ క్రింద మారుస్తారా ? అది వారికి అశక్తి అవదూ ?

సంఘం, ప్రపంచం, యివన్నిటితోటే సంబంధం మా కులం మాకు దూరమే చేస్తాయి రోజూ వాట్లకోసం మేం బ్రతకటం అన్నది మిథ్య కాదూ?

మా జాతి వుద్ధరణ అంటున్న వారెవరైనా యివి ఆలోచించారా? మా స్వతంత్రంలో భావాలు గుర్తించేరా, ఏదో అది చీడపురుగంటారు తీసివెయ్యండి అంటారు? అంతే కాని"

ఇక చెప్పలేనట్టుగా ఆపు చేసింది.

ఆ మాటల్లో వచ్చీ రాని హృదయం ఆవేదనల్లో గల భావాన్ని గుర్తించుకోమన్నట్టుగానే నవ్వింది

"అవును వాళ్ళ ప్రపంచపు భావాలని వాటిని గురించి యెంతమంది ఆలోచించేరోయి పుల్లయ్య?" అని లోకాయించి అడిగినట్లే అయింది.

ప్రకూ నన్నింత సందిగ్ధంలో పెడుతుందని అనుకోలేదు నేను.

గోడమీద గడియారం తొమ్మిది కొట్టింది.

"మరి వెళ్ళి వస్తాను" అని లేచేను.

"నేనన్న మాటలు కష్టం గల్గించాయా, రాజూ ? అదో వెర్రి మొత్తికోళ్ళు" అంటూనే నా చెయ్యి పట్టుకొని అడిగింది ఆ స్పర్శలో ఏదో ఆవేదన చెప్పింది.

"లేదు ప్రకూ యీనాడు నన్ను యింకొక పథకంలో మార్చేవు! అంతే" అన్నాను వీధి గుమ్మం వరకూ వచ్చేము

"రాజూ అప్పుడప్పుడు వస్తూ వుంటావు కదా!" గుచ్చి అడిగినట్లు అడిగింది.

"అల్లాగే ప్రకూ"

మెట్లు దిగేను "మాట రాజూ"

ఎందుకో అనుకొన్నా దగ్గరగా వచ్చి రెండు చేతులతోనూ బుగ్గల్ని పట్టుకొని ముద్దు పెట్టుకుంది.

"ఈ సారి మీ స్నేహితుని గూడా తీసుకు రావూ ?" అంది బ్రౌన్ అవుట్ బుట్టలోంచి తొంగి చూస్తున్న బి-116 లాంతరు స్తంభం గాలికి యిటూ అటూ వూగింది.

ఆ వెలుతురు చక్రంలోకి వెడుతూంటే. వెనకాల కీలకంగా, కష్టంతో నవ్వినట్టే అయింది.

# అయాచితం

## వి. వి. సూర్యనారాయణ

## (ఆనందవాణి, 1950 ఏప్రిల్ 16 సంచిక నుంచి)

శేఖరం పద్మావతిని వివాహం చేసుకోబోతున్నాడంటే యెవ్వరూ యీర్ష్యపడలేదు. కాని ఆశ్చర్యపడ్డ వాళ్లు మాత్రం లేకపోలేదు. అనుభవజ్ఞులూ శేఖరంతో చనువుగా తిరిగే పరిచయస్తులూ కూడా అతను వివాహం చేసుకోడంలో గల కీలకాన్ని కనిపెట్టలేక పోయారు. ఇన్నేళ్ళూ పట్నంలో డాక్టరుగా వుంటూ ప్రస్తుతం ప్రాక్టిసుయెత్తి పెట్టేస్తూన్న తన స్నేహితుడు రామారావు దగ్గర పుస్తకాలూ, హాస్పిటల్ పరికరాలూ, చవగ్గాకొని తను కూడా ప్రాక్టీసు పట్టణంలోనే మొదలు పెట్టడానికి సర్వ సన్నాహాలూ చేసుకున్నాడు, శేఖరం – ఆ పరికరాలన్నీ కొనడానికి ఆధమం అయిదువేల రూపాయలన్నా కావాలి.

పద్మావతి దగ్గర చనిపోయిన భర్త తాలూకు ఆస్తి పదివేల రూపాయలు పైచిలుకు ఉందని యెల్లాగో పసికట్టగల్గేడు శేఖరం. అయితే, ఆ ఆస్తి కోసమే పద్మావతిని వివాహం చేసుకోబోతున్నాడని మాత్రం అభిజ్ఞ వర్గాలు కూడా ఊహించలేనంత చాకచక్యంతో అతను సంచరించ గలగడంలోనే ఉంది విశేషం –

శేఖరం తను యెంతో హోదాగల పెద్ద మనిషిలాగ కనిపించడానికి ఏ లోటూ యెన్నడూ చేయలేదు. నిజం యెల్లాగున్నా పైకి మాత్రం మంచి అనుభజ్ఞుడిలా కనపడి ఊళ్ళో పేరు ప్రతిష్టలు గడించుకున్నాడు. అట్లా పెద్దల్లో పెద్దలాగా కనుపించడం కూడా అట్టే తేలికైనపని కాదు.

పద్మావతి కూడా చాలా చురుకైన పిల్లనే చెప్పాలి. భర్త పోయిన తరువాత సంవత్సరం పాటు షోకులు చెయ్యరేదు. కాని, తరువాత పుర్వాశ్రమంలో మల్లేనే తన్ను శృంగారించుకునేందుకు శాయశక్తులూ పాటుపడేది. చక్కగా దువ్వి వదులుగా వేసిన బారెడు వాల్జడా, కోలటి ముఖం మీద చిన్న గుండ్రని కుంకుమబొట్టూ తల కదిపితే ఊగిసలాడే లోలాకులజతా ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసేవి. పైగా టిస్యూ చీరల శృంగారం, తల్లో తురుముకొన్న విరజాజులు గుబాళించే సౌరభం – యువకులను మత్తెక్కించి ఆకర్షించడానికి చాలు –

పేదవాడైన శేఖరాన్ని పద్మావతి వివాహం చేసుకుంటుందని కాని, భర్త చచ్చిపోయిన పద్మావతిని ఆచారపనులు ఇంటిలో పుట్టి పెరిగిన శేఖరం వివాహం చేసుకుంటాడని కాని, యెవరూ ఊహించలేదు. అందుకే వారి వివాహం కొందరిలో ఆశ్చర్యాన్నీ, కొందరిలో అలజడినీ రేకెత్తించింది.

వివాహం అయిన కొన్నాళ్ళవరకూ శేఖరం తన ప్రాక్టీసు గురించి పద్మావతికి తెలియపర్చలేదు. భార్యతో అన్యోన్యంగా ఉన్నట్లు కనుపించేవాడు. తన భర్త తనతో అరమరకలు లేకుండా అన్యోన్యంగా ఉండడం తన భావి జీవిత సౌఖ్యానికి పునాది రాయిగా ఊహించుకొని మురిసిపోయేది పద్మావతి. శేఖరం భార్యయడల చూపే అనునయమూ ప్రేమ, ఆపేక్షా అతనికి అనుకూలంగా పని చేశాయనే చెప్పాలి. తన తెలివి తేటలవల్లా చాకచక్యం వల్లా తాను ప్రాణం కోరినా యివ్వడానికి వెనుదీయని స్థితీలోకి తీసుకు వచ్చాడు భార్యని – 'నిదానిస్తే అన్నీ వాటంతటవే జరుగుతాయి' అనే రకం మనిషేమో, చాలా నెమ్మదిగా ఓర్పుతో మెలకువతో ప్రవర్తిస్తూ జయాన్ని తన కాళ్ళవద్దకే లాక్కురాగలిగేడు శేఖరం.

అందు కనుగుణంగానే పద్మావతికి పెళ్ళయిన మర్నాటినుంచీ భర్త పై ఒక విధమైన ప్రేమా గౌరవం అలవడ్డాయి. యెప్పుడూ శేఖరం తన వద్దనే ఉండాలి – తనను ముద్దులలో కౌగిలింతలలో ముంచి తేలుస్తూవుండాలి – శేఖరం కూడా అలాగే చేస్తుండేవాడు. పద్మావతి అతని తల పట్టుకొని, ముఖాన్ని తన ముఖం మీదకు వంచుకొని, 'కళ్లు మూసుకొండి' అనేది. అతను మూసుకునేవాడు. ఆమె ముద్దు పెట్టుకొనేది. అతను నవ్వేవాడు,

నాక్కావాలసింది యిచ్చేరు, మీకేం కావాలి? అనడిగేదామె. 'నువ్వే నాక్కావాలి' అనేవాడు అతను. మళ్ళా యిద్దరు కేరింతలు కొడుతూ ప్రణయసీమల్లో విహరించేవారు – రోజూ ఇదే వరస.

ఒకనాడామె మామూలుగానే అడిగింది, 'మీకేం కావాలి?' అని

ఈసారతను "నువ్వే కావాలి" అనలేదు. "డబ్బు కావాలి" అన్నాడామెను దగ్గరకు లాక్కుంటూ.

"యెందుకూ?"

"పట్నంలో ప్రాక్టీసు పెడదామనుకుంటున్నాను – దానికి కొన్ని పరికరాలూ, పుస్తకాలూ, కొనుక్కోవాలి"

"యెందుకు పోనిద్దురూ, మనకు గడవదాయేమిటి? ఇల్లాగే రోజూ మిమ్మల్ని నేనూ, నన్ను మీరూ చూస్తూ కూర్చుంటే యెంత హాయి, యెంత ఆనందము"

"కూర్చుని యెన్నాళ్లు తినగలం చెప్పు. కష్టపడి సంపాదించుకుని తినేదానికి, కూర్చుని తినేదానికీ తేడాలేదా?"

"సరే మీ యిష్టం యెంత కావాలేమిటి?"

"ఆ ( యెంత? ... పదివేలుంటే చాలు, మళ్ళా సంవత్సరానికి గిర్రున తిరిగి వస్తాయి మన పది వేలూ మనకి" నిజానికి శేఖరానికి అయిదువేల రూపాయలుంటే చాలు. కాని పాచిక మాత్రం పదివేలకే వేశాడు.

అతని పాచిక పడింది. ఆమె పదివేల రూపాయల నోట్లూ తీసికొచ్చి అతని చేతిలో పెట్టి "ఐతే యెప్పుడు ప్రయాణం? నేను కూడా మీతో వచ్చేస్తాను" అంది.

"శుభస్య శీఘ్రం. రేపే బయలు దేరుదాం" అన్నాడు శేఖరం.

మర్నాడు అనుకున్న టైంకే యిద్దరూ స్టేషన్ కు చేరుకున్నారు. రైలు రెండు గంటలు లేటు అని తెలుసుకునేసరికి శేఖరం చాలా చికాకు పడ్డాడు – యెంత తొందరగా ఆవూరు వదిలుపెడుదామా అని వుంది శేఖరానికి, పద్మావతితో అన్నాడు.

"రైలు రావడానికింకా చాలా సేపు కూర్చోవాలి. బస్సులోపోతే హాయిగా వుంటుందేమో!"

"అలాగే" అంది. పద్మావతి అమాయకంగా.

వెనక్కి తిరిగివెళ్ళి యిద్దరూ బస్సెక్కేరు – పద్మావతిని వెనకవైపు ఆడవాళ్ళ సీట్లో కూర్చో పెట్టి, శేఖరం ముందు సీట్లో కూర్చున్నాడు. అప్పటికే బస్సు కిటకిటలాడుతుందేమో కూర్చుందుకి సీటు దొరక్క పద్మావతి నించునే ఉంది "రైట్" అని అరిచి 'కూర్చోవమ్మా' అని గదిమేడు కండక్టరు, యెలాగైతేనేం యిద్దరి ఆడవాళ్ళు మధ్య యిరికింది పద్మావతి – ఒక వైపు నుండి చుట్ల కంపూ, మరొకవైపు నుండి చేపలకంపూ పలకరిస్తునాయి. ఈ విధమైమ నానావిధపరిమళాలను ఆహ్వానిస్తూ కాలుసర్దుకోవడానికి కూడా వీలు లేనంత యిరుగ్గా కూర్చోడం పద్మావతికి ముళ్ళ మీద కుర్చున్నట్లుంది – కుదుపుల్తో లోపలకూర్చున్న మనుష్యులు సరాసరి ఊపుకు తగుల్తూ ఒక్కొక్కసారి వీళ్ళ బుర్రలు డీకొటుకుంటుంటే బయలుదేరింది బస్సు. గవరమనిషీ, పోలీసూ, కలక్టరాఫీసు గుమస్తా, సబినస్పెక్టరూ వర్తకుడూ, వంటబ్రాహ్మడు – అంతా యెరమరికలు లేకుండా ఒకళ్ళ ఒళ్ళో ఒకళ్లు కూర్చున్నారు. ఈ విధంగానైనా సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని అమల్లో పెడుతూ, అలవాటు చేస్తున్న బస్సు వాళ్ళను అభినందించ వలసిందే!

మార్గమధ్యంలో బస్సు ఆగింది. శేఖరం దిగి సోడాత్రాగి, పద్మావతికొకటి తెచ్చేడు – ఇట్లా అడక్కుండానే గ్రహించి తనక్కావలసిందంతా సమకూర్చేభర్తను పద్మావతి లోలోపల అభినందించుకొంది – చుట్టూ జనం లేకుండా వుంటే యధాశక్తి బహుకరించి వుండేదికూడా.

"డబ్బు జాగ్రత్తగా వుందా?" అనడిగింది.

"నిక్షేపంలా వుంది" – అంటూ వెళ్ళి తన సీటులో కూర్చున్నాడు.

కలక్టరాఫీసు గుమస్తా క్రిందికిదిగి ఒక తెలుగు పేపరు కొనుక్కొచ్చేడు – దాన్నే మూడు ముక్కలు చేసి పోలీసూ, వర్తకుడూ కూడా పంచుకున్నారు. మరొకడు ఆప్యాయంగా చుట్టకొనుక్కొని దాని పొగతో అందరికీ ధూపం వేస్తున్నాడు. పద్మావతికి చాలా అసహ్యం అనిపించింది – తల తిరిగింది – డోకొచ్చినంత పనైంది.

రజాకార్ల దురంతాలు మితిమీరిపోతున్నాయి. పేపరు చదువుకుంటున్నాడు, గుమస్తా హుం అని హుంకరించి, గుడ్లెర్రజేస్తూ, బెల్టు బిగిసున్నాడు పోలీసు. ఆ రజాకార్లు తన ఎదురుగానే వున్నట్లు భావిస్తూ — మూలకూర్చున్న ముసలమ్మ అడుగూతూంది అమాయకంగా, "బాబూ.. రజాకార్లంటేనూ ఈ కార్ణంతేసే వుంటాయా! యింకా పెద్దపెద్దవుంటాయా?" అందరూ కొల్లుని నవ్వేరు. ముసలమ్మ చిన్నబుచ్చుకుంది.

రాజకీయాలూ, వేదాంతం, వాణిజ్యం — చతుష్షష్టికళలకు సంబంధించిన వివరాలూ చర్చలు సాగుతూనే ఉన్నాయి. బస్సుకుదుపుల్తో పరిగెడుతూనే ఉంది. పద్మావతి కూర్చూనే కునికిపాట్లు పడూతూంది.

పద్మావతికి తెలివొచ్చేసరికి బస్సు ఒక చిన్న ఊళ్ళోఆగింది. అప్పటికి బస్సు చాలా మటుకు కాళీ అయిపోయింది. ముందు సీట్లోకి చూస్తే అందులో భర్త లేడు. కండక్టరును పిల్చి అడిగింది, "ఇందాకట్నుంచీ ముందు సీట్లో కూర్చున్నాయనేరీ?"

"ఎక్కడో దారిలో దిగిపోయుంటారు."

"అహ మేమిద్దరం పట్నంలో దిగాలే"

"ఏమో అది నాకేం తెల్సు?"

"చెప్పవోయ్, చెప్పు, ఆయన ఎక్కడదిగేరో ఎందుకు దిగేరో? ఆయన నా భర్త కనక అడుగుతున్నాను" ఆత్రుతగా కళ్ళల్లో నీరు తెచ్చుకుని ఆదిగింది.

"నన్నిడిచి పెట్టెల్లినాడే నారాజు .." కొంటెగా సంగతులు వేస్తూ నందూరివారి పాట ఆలాపిస్తున్నాడు కాలేజీ విద్యార్థి కాబోలు.

"ఇదిగో ఆలస్యం చెయ్యక దిగవమ్మా ఇక్కడే దిగుతావా, పట్నంలో దిగుతావా? చెప్పు నీమొగుడొక్కడే ఆకాశంలోంచి ఊడిపడ్డట్టు మాటాడుతావేం? దిగి వెనక్కువెళ్ళే బస్సెక్కు" తొందరపడుతున్నాడు కండక్టరు.

ఆమెకు అపరిమితమైన దుఃఖం వచ్చింది — 'దిగుతాను' అంది అప్పుడే కదిలిన బస్సు ఆమె కోసం మళ్ళా ఆగింది. ఆమె దిగింది ... బస్సు కదిలింది. తన ముందు సీట్లో కూర్చున్న నాయుడుగారు మీసాలు మెలేస్తూ, కోర చూపులు చూస్తూ మీసాల సందులోంచి చిరునవ్వు నవ్వుతున్నాడు —

మగదక్షతలేని ఆడ బ్రతుకెంత అలుసైపోయింది? భర్త కనిపిస్తాడెమోనని మళ్ళాచుట్టూ ఓసారి కలయ జూసి పద్మావతి గట్టిగా ఏడవడం మొదలెట్టింది. దారినపోతూన్న పోలీసు ఊడిపోతూన్న తోలుపటకా సవరించుకుంటూ దగ్గరకొచ్చి 'ఏయ్! ఎవరు నువ్వు? ఎందుకేడుస్తున్నావు?' అని పరామర్శిస్తున్నాడు ఆమెతో పాటే అక్కడ దిగిన వంట బ్రాహ్మడు జరిగిన సంగతంతా చెప్పాడు.

"ఈరకమంతా మనకి తెలుసులే నాతోరా" అని చెయ్యిపట్టుకున్నాడు పోలీసు. ఆమె చీత్కారించుకుని చెయ్యి విదలించేసింది ఎక్కడకో?

తనెక్కడికి పోతున్నదో తనకే తెలియదు స్థిమితంగా ప్రశ్నించుకుంది, "నేనెక్కడికి వెళ్ళాలి? ఏం చెయ్యాలో?" జవాబు దొరకలేదు, తన భర్తకు హటాత్తుగా మతైనాపోయిండాలి, లేక తన సంగతి మరిచిపోయైనా ఉండాలి.

అయితే తనిప్పుడేం చెయ్యడం? — మళ్ళా మొదటి ప్రశ్నే, పద్మావతి దగ్గర రెండు రూపాయలు మాత్రమే ఉన్నాయి. తిరిగి వెనక్కి వెళ్ళడానిక్కూడా సరిపోదు సొమ్ము. ఏం చెయ్యగలదు కంగారులోనూ, దుఃఖంలోనూ మతి స్థిమితం ఉండదు, అదృష్టవశాత్తూ ఆ వూళ్ళో తన మేనత్త కొడుకు రామదాసున్నట్లు జ్ఞాపకం వచ్చింది. రామదాసు ఆ వూళ్ళోనే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాడు. పద్మావతి దారిపొయ్యేవాళ్ళ సహాయంతో అతని యిల్లు కనుక్కో గలిగింది.

అప్పుడే స్కూలుకు బయలుదేరబోతూన్న రామదాసు పద్మావతిని గుమ్మంలోనే చూసి ఆశ్చర్యపోయేడు.

"పద్మా! నువ్వా? ... ఏమిటిది? .. ఒంటరిగా ఎక్కణ్ణుంచి?" స్థబ్దుడైపోయాడు. ఆమె ఆ పరిస్థితుల్లో ఒంటరిగా రావడాన్ని చూసి.

"నా భర్త మాయమైపోయేడు బావా!" జాలిగా చూసింది పద్మావతి.

"నీ భర్తా? ... ఏక్కడ?"

"బస్సులో"

"బస్సులో!?"

"ఔను ..." యేడుస్తూ సంగతంతా వివరించింది.

అంతా సాంతంగా విన్న తర్వాత అన్నాడు రామదాసు. "నేనున్నానుగా నువ్వేం భయపడకు. అయినా ఉదయాన్ని బాగా ఉన్నాడా?"

"నిక్షేపంలా"

"సరే, కూడా ఏమైనా డబ్బుందా, అతనితో"

"ఆ.. నా తాలూకు పదివేల రూపాయలూ ఉన్నాయి"

"అంతేనా? పదివేలూనా?"

"ఔను"

"అయితే యీపాటికి తిరుగుత్రోవ పట్టివుంటాడు"

పద్మావతికి భర్త వాలకమేమీ బోధపడలేదు. భర్త చేసిన పని ఊహించుకుని నిర్ఘాంతపోయింది గాద్గదికంగా ఏదో మాట్లాడింది. "నా భర్తా అలా చేస్తారా?"

"నీ పదివేల రూపాయలతోనూ ఉడాయించేడని చెప్పేనుగా, అంతే. ఆ డబ్బుకు నీళ్ళ దారే!"

"అంతేనంటావా?" తెలివి తప్పి పడిపోయింది పద్మావతి. పడిపోకుండా అతను చేతుల్లో పట్టుకున్నాడు.

వీధిని పోయేవాళ్ళంతా వింతగా చూడ్డం మొదలెట్టేరు, అంచేత అతడామెను మెల్లగా భుజం మీద వేసుకొని యింట్లోకి తీసికెళ్ళి పరుపుమీద పడుకోబెట్టేడు. ఇంట్లో పని మనిషి ఆశ్చర్యపోయి చూస్తూంది పని మనిషిని పిల్చి, రామదాసు చెప్పేడు,

"అచ్చమ్మా! ఈ రోజు నేను స్కూలుకు వెళ్ళను హెడ్మాస్టరుగారికి ఈ శలవు చీటీ ఇచ్చేసి, మా యిద్దరికీ భోజనం కారియర్ లో తీసుకురా."

(మొపాసా ఆధారంగా)

# ఆ పిచ్చితల్లి

## ఆశాలత పాల్

## (ఆనందవాణి, 1950 ఏప్రిల్ 2 సంచిక నుంచి)

నేను, శీలా ఒకే క్లాసులో చదువుకునే వాళ్ళము. శీలా తండ్రి పేరు ఆనందరావు గారు తల్లిపేరు ఆనందమయి. వారు బాగా డబ్బుగలవారే ఆనందరావు గారికి శీలా అంటే అమిత ప్రేమ. శీలాకి నాకు ఉన్న స్నేహాన్నిబట్టి ఆయన నన్ను కూడా అతిగారాబంగా చూచేవారు. నేను తరుచు వాళ్ళ యింటికి వెళ్ళేదాన్ని.

ఒకసారి ఎండా కాలము శెలవులకి నేను మా చిన్నాన్న గారి ఊరికి వెళ్ళాను అది ఒక పల్లెటూరు చిన్న చిన్న పిల్లలు మామిడి కాయలు దొంగతనంగా కోసుకుంటున్నారు. ఆడవాళ్ళు చెఱువులనుండి నీరు తెస్తున్నారు. ఒక చెట్టుక్రింద కూర్చుని ఒక ముసలమ్మ తనలో తానేదో మాట్లాడుకుంటున్నది. నేను పిచ్చిది కాబోలునని ఆమె వైపు చూచాను.

ఇంతలో ఆమె మా బండి దగ్గరకు పరిగెత్తుకొంటూ వచ్చి "ఏం నాయనా! ఒక పొడుగాటి ఆయనని అతనితో ఒక అమ్మాయిని రైలు దిగడం చూచావా" అని మా బండివాడినడిగింది.

అతడు " లేదమ్మా! నీ కూతురు వాళ్ళు వస్తే నీకు చెప్తానులే" అన్నాడు. ఆమె నిరాశతో వెళ్ళిపోయింది.

"ఎవరావిడ?" అని నేనడిగాను.

"ఏమోనండి. ఒక పది సంవత్సరాలు అయింది యీ గ్రామంకి వచ్చి. ఎవరైనా స్టేషను నుండి వస్తే వాళ్ళని యిలాగే అడుగుతుంది" అన్నాడు.

"ఆ పొడవైన మనిషి ఎవరు? ఆ అమ్మాయి ఎవరు?" అని మళ్ళా అడిగాను.

"ఆ మనిషి యీవిడకి భర్తటండి. ఆ చిన్న పిల్ల కూతురు. ఈమె భర్తతో ఎప్పుడో దెబ్బలాడిందట. దానితో అతనికి కోపం వచ్చి కూతుర్ని తీసుకొని వెళ్ళి పోయాడు. కొంతమంది 'నీ భర్త పాట్నాలోనున్నాడంటే' ఆవిడ బోలెడు డబ్బు ఖర్చుపెట్టి పాట్నాకి వెళ్ళింది. కాని అతను కనపడలేదు. అప్పటినుండి పిచ్చిదయిపోయింది. తరువాత ఈ ఊరికి వచ్చింది" అని ఆ ముసలమ్మను గురించి చెప్పాడు. ఇంతలో మా యిల్లు రావడంతో నేను బండి దిగి పోయాను.

★ ★ ★

సెలవులయిపోయాక నేను మళ్ళీ కాలేజీకి వచ్చాను.

నన్ను చూడగానే శీలా "లతా యిన్నాళ్ళకు వచ్చావా? మా నాన్నగారికి ఎంత జబ్బు చేసిందో తెలుసా?" అని అడిగింది.

నేను ఆశ్చర్యపోతూ "ఎంత జబ్బు చేసింది ?" అని అడిగాను.

"నువ్వే వచ్చి చూడు మా నాన్నగారు నిన్ను రెండు సార్లు చూడాలని కోరారు. సాయంత్రం తప్పకుండా వస్తావు కదూ" అంది. నేను సరేనన్నాను.

ఆ నాడు సాయంకాలము శీలా యింటికి వెళ్ళేటప్పటికి ఆనందరావుగారు యీ లోకం విడచి పోయారు. నేను విచారంతో యింటికి వెళ్ళేటప్పటికి శీలా గుండెలు బాదుకొని ఏడుస్తున్నది. నేను ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది. రాత్రి దాకా ఉండి వెళ్ళిపోయాను.

ఆనందరావు గారి దినము చేసిన రోజు నేను ఆ రాత్రి అక్కడే పడుకున్నాను. కాని ఎంతకీ నిద్ర పట్టక పోవడం వలన బయటికి వచ్చి నిలబడ్డాను. లైట్లు ఆర్పేసి అందరూ నిద్రపోతున్నారు. నేను ఆనందరావు గారి గదివైపుకి వెళ్ళాను. ఆయన బ్రతికి వున్నప్పుడు యీ గదిలోనికి ఎవరూ వచ్చేవారు కారు. ఆనందరావు గారు ఎప్పుడు తలుపుకి తాళం వేసి వుంచేవారు. ఈ నాడు తలుపు తీసి వుంచడం చూసి నేను అతి కుతూహలంతో గదిలోనికి ప్రవేశించాను. లైటు వేసేటప్పటికి ఎదురుగా ఆనందరావుగారి ఫోటో కనబడింది. నేను మనస్సులో ఆయనకు నమస్కరించాను తరువాత టేబిల్ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను బల్లమీదనున్న పుస్తకాలని తీసేటప్పటికి ఒక డైరీ కనపడింది. నేను అది తీసుకొని కొన్ని పేజీలు తిరగేసేటప్పటికి అక్కడ యీలాగా వ్రాసి వుంది.

జనవరి 30 తారీకు 1930 __

నేను పాట్నాకి వచ్చి సేవకునిగా నియమించుకొన్న వెంకయ్యకి జబ్బుగా వుందని అతనింటికి వెళ్ళాను. నేను వెంకయ్యని చాలా విశ్వసించే వాడ్ని. ఇప్పుడు అతని దుర్దశను చూచి నాకు చాలా జాలి వేసింది – డాక్టరును పిలువమన్నాను. వెంకయ్య "అయ్యా! ఇంక డాక్టరు వచ్చి ఏం చేస్తాడు ? నా చావు సమీపించింది. ఒక్క కోరిక వుంది – అదిగో నా మూడేళ్ళ కూతురు సుబ్బమ్మ– దానిని నేను రెండేళ్ళ వయస్సున తల్లి దగ్గరనుండి లాక్కొచ్చాను– ఇక నేను కూడా పోతున్నాను – మీరు దయచేసి దాన్ని పెంచండి–పెద్దయ్యాక మీకు సేవచేస్తుంది" అని ఏడ్చాడు

"అలాగనకు వెంకయ్యా. సుబ్బమ్మ ఇప్పటి నుండి నా కూతురు. నాకు కూడా పిల్లలు లేరు– సుబ్బమ్మను నేను నా కూతురులాగ చూచుకుంటాను" అని నేననేటప్పటికి వెంకయ్య ఆఖరి నిట్టూర్పు విడచాడు.

నేను సుబ్బమ్మను తీసుకుని యింటికి రాగానే ఆనందమయి మండి పడింది – కాని నేను “నోరుముయ్యి–నీ కిష్టము లేకపోతే యిక్కడ నుండి వెళ్ళిపో. కాని నేను సుబ్బమ్మను వదలను. ఆమె పేరు యిప్పటినుండి ‘శీలా’ అమె నా కూతురుగా ఉంటుంది” అని అనేటప్పటికి ఆనందమయి చేసేది లేక ఊరుకొంది.

నేను కొన్ని పేజీలు తిరగవేసి యిలాగా చదివాను.

జనవరి 11వ తారీకు, 1947 ___

శీలా పెద్దదయింది, చదువుకూడా చెప్పించాను_ నా అనంతరము శీలా యీ ఆస్తినంతను అనుభవిస్తుంది, ఆమె సేవకుని కూతురని ఇక్కడ ఎవరికి తెలియదు నాకు, ఆనందమయికి తప్ప. పాట్నాలో కొందరికి తెలిసినా వారిప్పటికి మర్చిపోయి యుంటారు, నేను బ్రతికి ఉన్నంతకాలం ఆనందమయి శీలాని గురించి ఎవరిదగ్గర ఏమి చెప్పలేదు. కాని తరువాత? అప్పుడు కూడా ఆమె శీలా యొక్క ఆస్తిని చూచి ఏమనలేదు శీలా యొక్క జీవిత రహస్యం ఎవరికి తెలియకూడదు. ఎవరికైనా తెలుస్తే శీలా జీవితమంతా మారిపోతుంది.

ఇది చదివేటప్పటికి నా చేతులు వణకడం మొదలు పెట్టాయి. నేను గబగబా ఆ పుస్తకమును డ్రాయరులో దాచేశాను. “ఇందు కొఱకే గాబోలు ఆనందరావు గారు యీ గదిలోనికి యితరులనెవ్వరిని రానిచ్చేవారు కారు” అని ఆలోచిస్తూ కూర్చున్నాను ఇంతలో వెనుక ఎవరో ఏడుస్తున్న శబ్దము విని వెనక్కి తిరిగి చూచాను_ శీల ఒక కుర్చీకి ఆనుకొని వెక్కి వెక్కి ఏడుస్తుంది. ఆమెను చూచేటప్పటికి నా గుండెలు దడదడ కొట్టుకొనసాగాయి.

“శీలా! నువ్విక్కడికి ఎలాగ వచ్చావు?” అన్నాను.

(శీల కళ్ళు తుడుచుకొంటూ) “నాకు నిద్ర పట్టక పోవడం చేత నీ గదికి వెళ్ళాను– అక్కడ నువ్వు లేవు. నిన్ను వెతుకుతూ యిక్కడికి వచ్చి నువ్వు చదివినదంతా నేను కూడా వెనుక నుండి చదివాను” అని మళ్ళీ ఏడ్వసాగింది. (కొంతసేపటికి) “అభాగ్యురాలను చిన్నప్పుడే తల్లిదండ్రులని పోగొట్టుకొని గొప్పవారింట్లో పెరిగాను ఆనందరావు గారు దయతో నాకు ఆస్తినిచ్చారు. నాకు సుఖమేది? నా తల్లయినా బ్రతికి వుందో లేదో?” అంది– ఇంతట్లోకి ఆనందమయి గారు తలుపు దగ్గరకు వచ్చి నిలుచున్నారు.

“ఎందుకు లేదు! నీ తల్లి యింకా బ్రతికి వుంది. నీ ఆస్తితో కూడా ఆమె దగ్గరకెళ్ళవచ్చును.” అన్నారు కోపంగా. ఆమె బయటనుంచుని మా మాటలు విని వుంటారు.

“నీ తల్లి యిప్పుడు పిచ్చిది– లతావాళ్ళ చిన్నాన్నగారి వూరిలోవుంది, నువ్వక్కడకి పో” అన్నారు.

నేను ఆశ్చర్యపోతూ

“మా ఊరిలోనా ? మీ కెలాగున తెలిసింది?” అని అడిగాను.

“నాకు తెలుసు మేము పాట్నానుండి వచ్చేసాక ఆవిడ యక్కడికి పోయింది; కాని సుబ్బమ్మ గాని ఆమె తండ్రి గాని కనపడక పోవడం వల్ల పిచ్చిదయిపోయింది. పాట్నాలోనే యుద్యోగం చేస్తున్న నా తమ్ముడు ఆమెను బాగు చేసి వంటమనిషిగా తన ఇంట్లో పనినిప్పించాడు తరువాత అతడు ఆమెను తీసుకొని వాళ్ళ వూరికి వెళ్తూవుంటే దారిలో ఆమెకు మరలా పిచ్చి పట్టింది. అర్థరాత్రి వేళ ఒక పల్లెటూరు కోరులు నుండి దిగిపోయింది; ఆ పల్లెటూరు మీ చిన్నాన్న గారున్న పల్లెటూర”అని చెప్పేటప్పటికి నాకు మా వూరిలో చూచిన పిచ్చిదానిమాట జ్ఞాపకం వచ్చింది. ఆ సంగతి శీలాతో చెప్పాను. ఆమె ఏడుస్తూ “ఆ పిచ్చిదే నా తల్లి అయి వుంటుంది. నేను రేపే అక్కడికి వెళ్తాను” అంది.

★ ★ ★

తరువాత రోజు మధ్యాహ్నం నేను, శీలా రైలు నుండి దిగాము మునుపటి బండివాడు మా దగ్గరకు వచ్చి “ఏమండి! బండి తీసుకొని రానా?” అనేటప్పటికి మేము తెమ్మన్నాము. సరిగ్గా ఏ చెట్టుక్రింద నేను మొట్టమొదట శీలా తల్లిని చూచానో అక్కడికి వచ్చేటప్పటికి నేను

“అప్పన్నా! ఆ ముసలమ్మ కనబడటం లేదే?” అని బండివాడినడిగాను.

వాడు “ఏ ముసలమ్మ? ఆ పిచ్చిదా? పాపం దాని మాట వింటే ఏడ్పు వస్తుందండి పది సంవత్సరములు అయిపోయినా ఆమె భర్తగాని, కూతురు గాని రాలేదు చివరకి ఆమె స్టేషను దగ్గర ఒక రోజున ఒక అమ్మాయిని జూచి ఆమెను తన కూతురనికొని పరిగెత్తడం మొదలు పెట్టింది. ఇంతలో ఒక ఎద్దు

వచ్చి ఆవిడను పొడిచేసింది దానితో ఆమె క్రిందకి పడిపోయింది ఇంక లేవలేదు పాపం చచ్చిపోయేటప్పుడు కూడా కూతురునే పిలుస్తూ చచ్చిపోయింది" నా కూతురు నా సుబ్బమ్మ ఇలారా అమ్మ ఇలాగరా అంటూనే ప్రాణాలు విడిచింది."

అని అతడు చెప్పేటప్పటికి శీలా ఒక పెద్దకేక వేసి దొర్లుకుంటూ క్రిందకి పడిపోయింది. నేను కూడా గబగబా క్రిందకి దూకాను. చాలా సేపు నీరుజల్లేటప్పటికి శీలాకళ్ళు విప్పి "లతా! నన్ను స్టేషనుకు పంపివేయవూ? నేనెవరికొరకు యిక్కడకు వచ్చానో ఆమెయే లేకపోతే నేనిక్కడెందుకు యింక?" అని దీనంగా అడిగింది. నేనామెను బండి ఎక్కించి మరలా వాళ్ళ యింటికి పంపించాను_ ఇంక నేను మళ్ళీ ఆ వూరికి వెళ్ళ కూడదని నిశ్చయించుకున్నాను.

కాని ఒక నాలుగు సంవత్సరములయిన తరువాత వెళ్ళక తప్పింది కాదు! శీల వాళ్ళ యింటి దగ్గరకు వెళ్ళి చూచేటప్పటికి అక్కడ యిల్లు లేదు కాని ఒక సత్రం ఉంది నేను గేటు దగ్గర ఒక వ్యక్తిని "ఈ సత్రంను నడిపేది ఎవరోయ్?" అని అడిగాను. అతడు "సుబ్బమ్మ గారండి ఆవిడ తల్లిదండ్రుల పేరన పెట్టించారు" అన్నాడు.

నేను వెనక్కి వచ్చేశాను శీలాకి తిరిగి తన గత జీవితమును గురించి జ్ఞాపకం చేయడం నాకు యిష్టం లేకపోయింది.

# రహస్యపు రోగిని

## అడబాల శ్రీరామ వెంకట సుబ్బారావు

## (ఆనందవాణి, 1950 ఏప్రిల్ 9 సంచిక నుంచి)

నా టెలిఫోను తెల్లవారు జామున రెండుగంటలకు సన్నగా మ్రోగింది. "దయచేసి ఒక సారి రావాలి, మీ రోగి పద్మ ప్రసవపు గదిలో వుంది" అన్నాడు నైట్ సూపర్ వైజర్. "ఒక నిముషం ఆగు" అన్నా తర్వాత "నాకు అటువంటి పేరు గల రోగి లేదు మరో డాక్టరు అయి ఉండాలి" అని మేడపైకి వెళ్ళాను.

రెండు నిముషాలలో ఫోను మరల మ్రోగింది. "అమె యిప్పుడే యిక్కడకు వచ్చింది. మద్రాసు డాక్టరు గారు పంపేరు. అందుచే ఆమెను చేర్చుకున్నాం. ఆమె మిమ్ములను రమ్మని కోరుతోంది. మరి వస్తారా?" అంది నర్సు.

నేను వెళ్ళాను. ప్రసవపు గదిలో బల్లమీదనున్న పద్మను చూచాను. ఆమె ముఖం పద్మం వలె కనబడింది ఆమె బుగ్గలు మిసమిసలాడినవి. కండ్లు కలకలలాడినవి. తెల్లని తలగడపై నల్లని జుత్తు అదో అందంగా వుంది. నేను తొందరగా బట్టలు మార్చాను. ఆమె రూపవతియే గాక విద్యావతీ అని గ్రహించాను. గంట లోపల చక్కని అమ్మాయిని కన్నదామె. తల్లిని పోలిన పిల్ల. ఆ జుట్టు ఆ కళ్ళూ.

ఉదయము జన్మ పత్రానికి కావలసిన వివరాలను పద్మను అడిగాను. అమె వెంటనే పూర్తిగా యిచ్చింది. చివరకు "అర్ధరాత్రి సమయంలో మిమ్ములను పిలచినందుకు విచారించుచున్నా" అంది.

★ ★ ★

"మద్రాసు డాక్టరు విశ్వేశ్వర్ గారు నన్ను మీ దగ్గరకు పంపారు. అమ్మాయి సరిగా వుందండీ?"

ఆమెకు తిరిగి స్థిరముగా జవాబిచ్చాను. ఒకటి రెండు రోజులు గడిచాక డా|| విశ్వేశ్వర్ కు రోగి పేరు వ్రాసి ఆమె నియమిత చర్య వివరించి ఆమె చెప్పిన ఎడ్రసుతో చురుకైన రోగిని నా దగ్గరకు పంపినందుకు ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపాను.

ఒక వారం రోజులు ఆమె ఆసుపత్రిలో వుంది. ఎక్కువమంది రోగులు నా వద్దకు వచ్చుటచే నిజంగా ఆమె ప్రత్యేకతను తెలుసుకోలేక పోయాను. ఆమె ఎల్లప్పుడూ సంతోషంగా వుండేది. ఆమెకండ్లను చూస్తే డాక్టర్లకు ఎక్కడలేని ఆనందము ప్రేమ కలుగక మానదు. తల్లులు తమ పిల్లలను చూచుకున్నట్లుగా ఆమెను చూచి పోయేవారు లేరు. ఆమె చాల తెలివి తేటలుగా మాట్లాడేది. ఆమె బల్ల మీద మంచి పుస్తకాలుండేవి. ఆమెకు ముఖ్యంగా చంటిపిల్లల నర్సుల బొమ్మలను గీయడం అంటే సరదా. ఆమె వేసిన పూలగుత్తే నిపుణత్వానికి నిదర్శనము.

తన నేర్పరి తనాన్ని గురించి చెప్పుకోదు. ఆమె డాక్టరు విశ్వేశ్వర్ కు తెలిసిన సినిమా లోకంలో మనిషి అని, యీ విషయం వెల్లడి కాకుండా ఉండాలని నా దగ్గరకు వచ్చిందని నిశ్చయించేసుకొన్నాను. అందుచే గుర్తులు తీస్కోవద్దని కోరిన ఆమె మాటను కాదనలేకపోయాను.

ఆమె నా బిల్లు అడిగి డబ్బు పూర్తిగా చెల్లించిం.ది ఆసుపత్రి బిల్లు కూడా అట్లాగే కట్టింది. మూడు నాలుగు వారాలలో నాకు మంచి స్థలం దొరికినప్పుడు అమ్మాయి కొరకు మనిషిని పంపుతానని చెప్పి అంతవరకు చంటిపిల్ల జాగ్రత్త కోసం పెద్ద డిపోజిట్ వదలి వెళ్ళింది.

ఆమె వెళ్ళిన రెండు రోజులకే డా||విశ్వేశ్వర్ వద్దనుండి ఉత్తరం వచ్చింది. "నేను మీ ధన్యవాదాలను స్వీకరించలేను. ఈ సందర్భమున మీరు వ్రాసిన పేరుగల రోగిని నేను పంప లేదు. మీరిచ్చిన ఎడ్రసు ప్రకారం మద్రాసులో ఏవీధీ లేదు" అని వ్రాశారు తర్వాత నిజంగా ఆశ్చర్యపడ్డాను..

ప్రతిరోజు ఆ చంటిపిల్లను చూస్తున్నాను. మూడు వారాలు పోయాక నేను ఆసుపత్రిలో లేని సమయంలో పద్మ వ్రాసి యిచ్చిన కాగితం చూపి ఆ పిల్లను ఒకామె తీసుకొని వెళ్ళిం.ది పిల్లపై అధికారం తల్లికేగా వుంటా. నా బాధ్యత తీరింది. నేను ఆ సంగతంతా మరిచి పోవడానికి ప్రయత్నించాను. కాని ఆ రహస్యం కుతూహుల పరచి కొన్నాళ్ళకు అసలు సంగతి తెలియ చేసింది లోకులు కాకులన్నారుగా.

మరి ఆరు నెలలకు ఒక గ్రామం వెళ్ళాను. అచ్చటిపని పూర్తి అయ్యాక నేను బసచేసిన హోటల్లో కూర్చుని హోటలు యజమాని దారిని పోయే బాటసారుల గురించి చెప్పే విషయాలు వింటున్నాను. అణగారి పోతున్న అరుణ కాంతిలో మేము వీధివైపు చూస్తున్నాము.

అకస్మాత్తుగా కొందరు వచ్చి మాముందు ఆగారు. అందులో కొన్ని నెలలక్రిందటి నా రహస్యపు రోగిని నా ముందు ఉండడం చూచి ఆశ్చర్యంతో కూలబడ్డాను. ఆ కండ్లు, ఆ ముఖం ఆ జుట్టు.. అదే పద్మ! ఆమె కొంత సేపటికి నన్ను చూచింది చేయి అడ్డం పెట్టుకొని తల ప్రక్కకు త్రిప్పుకొని తొందరగా ముందుకు వెళ్ళింది.

"ఆమెను ఎరుగుదురా?" అంటూ మొదలు పెట్టాడు హోటలు యజమాని.

"ఆమె అప్పారావు కవల పిల్లల్లో ఒకతె. వారు పుట్టినప్పటి నుండి యిక్కడే వుంటున్నారు. ఆమె మిమ్ములను ఎరుగుననుకుంటాను దారిని వెళ్ళుతూ మిమ్ములను చూసి సిగ్గుపడింది. కవలలు యిద్దరూ ఒకేలాగా వుంటారు ఒకరిని చూచి ఒకరనుకోవడం జరుగుతుంది. ఇప్పుడు వెళ్ళిన ఆమె లీల. ఇంకో ఆమె సుశీల. సుశీలకు బుగ్గమీద మచ్చ వుంటుంది. సామాన్యంగా దానివల్లే గుర్తించడం జరుగుతుంది సుశీలకు పెళ్ళి అయింది కాని లీలకు కాలేదు. కారణం తెలియదు. డబ్బు ఉన్నవాళ్ళు ఎన్నో ఆలోచించి వివాహం చేసుకుంటారు."

"అవును ఛలాకీ పిల్లలా కనబడుతుందే.. ఆమె గురించి చెప్పండి" అన్నాను.

"బాగుంది అదొక రహస్యం. సుశీలకు ఒక రెండేండ్ల అమ్మాయి వుండేది. చంద్రబింబము వంటి ఆ ముఖం చూచి మురిసిపోయేవారు. అక్క చెల్లెళ్ళు. ఈ లీల సుశీల యింట్లోనే ఉండేది ఎంతో సాంఘీక సేవ చేసేది ఒక రోజున ఎక్కడికో బయలుదేరుతూ కారు వెనుకకు నడిపింది దురదృష్టవశాత్తు వెనుకనే ఉన్న రెండేండ్ల పిల్ల కారు క్రిందపడి చనిపోయింది.

అది లీల తప్పుకాదు. కారు వెనుక వున్న పిల్లను ఎవరు చూడలేరు. కాని లీల అది కొంచెము భయంకరంగా తీసుకొని ఎల్లప్పుడూ ఏడ్చేది. సుశీల మరల చిన్న అమ్మాయిని సంపాదించలేదు.

చివరకు నాలుగు నెలల అయిన తరువాత లీల బొంబాయి వెళ్ళింది. అక్కడ శిల్ప శాస్త్రం ఒక సంవత్సరం పాటు చదివింది. క్రొద్ది నెలల క్రిందటే యిక్కడకు వచ్చింది సుశీల, సుశీల భర్త యిప్పుడు యిక్కడ వుండుట లేదు. బదిలీ అవడం వల్ల దూరంగా వెళ్ళారు. ఇక్కడకు లీల చక్కని పిల్లతో వచ్చింది. ఆ పిల్లవారు పోగొట్టుకొన్న పిల్ల వలె వుంది" అన్నాడు.

"అదొక అద్భుతం పోయిన పిల్లను మరచిపోవడానికి మరోక పిల్లను సృష్టించి వుంటాడు విధాత" అన్నాడు.

"ఆమె పిల్లను వదిలి వుండలేదు. అందరూ ఆ పిల్ల ఆమెపిల్లని అనుకుంటున్నారు" నాకు ఒక క్షణం శ్వాస ఆడలేదు.


"ఆమె వెనుకకు తిరిగి వచ్చునప్పుడు కలుసుకొందురు గాని. ఆమె కొత్తవారిని ఆహ్వానించడం అలవాటు" అన్నాడు.

"అక్కర లేదు లెండి అలసిపోయాను గదికి వెళ్ళి విశ్రాంతి తీసుకుంటాను" అని వెళ్ళిపోయాను.

# ఇప్పటి పావురం రేపటి నెమలి

**– బుచ్చిబాబు**

**(యువ, 1973 ఆగస్టు సంచిక నుంచి)**




ఏ పని చెయ్యకూడదనుకుంటామో, ఆ పనే చేయ్యాల్సివొచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. అదేంకర్మమో కూడదనుకున్న పని పట్ల కాస్తో కూస్తో యిష్టం వుండి, ఆ యిష్టాన్ని ఎదుర్కోవడం ఇష్టం లేక, దూరంగా తోసేసి, 'అది కూడదు' అని నిర్ధారణ చేసుకోవటం జరుగుతుందేమో. కామేశం విషయం చూడండి. కూడదనుకున్న పని చెయ్యాల్సి వొచ్చింది. సొంతింట్లో వొక భాగం అద్దెకివ్వడం. అద్దె కొంపల్లో అగచాట్లు పడిపడి విసిగెత్తి, ఆ రెండెకరాలూ అమ్మేసి, మరో ఆరువేలు అప్పుతీసి ఇల్లు కట్టుకున్నాడు. ఆ అప్పుతాలూకు రెండు వేలు వుండి పోయింది. తీరిపోతుంది, రేపో మాపో , బెంగలేదు. చెయ్యవల్సిన కథలూ కార్యాలూ ఏమీ లేవు. అమ్మాయి అత్త వారింటికెళ్ళింది. అబ్బాయికి పాట్నాలో ఉద్యోగం. ఇంక తనూ, భార్యా...

ఇల్లంత పెద్దదీ కాదు. తమకి సరిపోతుంది. ఎవరన్నా వచ్చినా మరో గదుంది. దాని వెనకాల మరో చిన్నగది. స్టోర్ రూమ్ గా భావించి పాతమడత మంచం, రెండు పేము కుర్చీలు పడేశాడు. ఆ గదిముందు కాస్తంత వరండా. పడక్కుర్చీ వేసుకు కూర్చోవచ్చు. కూర్చుని దూరంగా కొబ్బరి చెట్ల నడుంగా సూర్యాస్తమయం చూడొచ్చు.

ఉండదల్చుకుంటేనే కొంప కట్టుకోవాలన్న తత్వం కామేశంది. ఉన్నాక అందులో మళ్ళా వాటా అద్దెకివ్వకూడదు. ఈ విషయమై అతనిది ఖచ్చితమైన అభిప్రాయం. బి.ఏ. పాసయ్యాడు అబ్బో చాలా వెనక – ఫిలాసఫీ బి.ఏ. ఆ రోజుల్లో ఫిలాసఫీ బి.ఏ. అంటే హేళనగా వుండేది. ఎందుకో మళ్ళా మనది ఋషులు, యోగులు, మునులూ వున్న దేశంగా బడాయిలు చెప్తారు. ఈ తత్వం, గిత్వం ఉపన్యాసాలాలోనూ, పుస్తకాలలోనూ తప్ప, ఎవడిక్కావాలి! ఈ మనుషులకి కావాల్సింది డబ్బు గడించడం, ఏదో పొట్ట గడిస్తే చాల్దా; అదనంగా డబ్బుంటే పాడు బుద్దులు పుడతై; చెడిపోతారు. ధనాశకి అంతంటూ వుందా, పోదురూ.

మనం వుంటున్న ఈ భూలోకమే వొక పెద్ద అద్దెకొంప. యజమాని పరమాత్మ, ఖాళీ చేయించి తీరుతాడు. ఇంక ఇందులో మళ్ళా కొంత మరొకరికి అద్దెకివ్వడమా? మనతో పాటు వాణ్ణి కూడా ఖాళీ చెయ్యమనడమా? కట్టుకున్న కొంప సంగతీ అంతే. నిజానికి 'ఇది నాదీ' అని చెప్పుకోవాలంటే

ఇల్లు వుండి తీరాలి. ఏ భూకంపమో రాకపోతే, పునాది గట్టిదైతే నాలుగు కాలాలపాటు వుండేది ఇల్లొక్కటే. వెళ్ళేటప్పుడు కోట తీసేసి కొడిక్కివ్వాలి. అంతే జీవితం. పైకి వెళ్ళాక పర్మాత్మ నైలాన్ పంచే ఇస్తాడో, టెరిలిన్ కోటే ఇస్తాడో వెళ్ళాక చూడాలి.

కాని అద్దెకి ఇవ్వక తప్పింది కాదు; ఆ దంపతులకి, అద్దెకివ్వడమేమిటి, అసలు ఊరికే వుండమనాలనిపించింది. కాని సరస్వతి వొప్పదు. మంచిదే కాని అతిమంచి కూడదంటుంది. అనుకోకూడదు కాని సరస్వతిని డబ్బు కాపీర్నం పూర్తిగా విడలేదు. తనతో పాతికేళ్ళు కాపరం చేసి కూడా.

ఆ అబ్బాయిని చూడగానే అతని వెనకాలే వచ్చి బెంచి మీద కూర్చున్న ఆ అమ్మాయిని చూడగానే, ఇంట్లో వాటా యివ్వాలనిపించింది. అతని పేరు రామమూర్తి, వయస్సు పాతికపైన. ముప్పయ్ లోపు. కోలమొహం. నాజూకైన ముక్కు మంచి ఎత్తయిన నుదురు. పట్టుదలని సూచించే పెదవులు, గడ్డం నడుమ నొక్కు అందంగా వంగి నుదిటి మీదికి జారే వుంగరాల జుట్టు , కండ్ల జోడు తీసేస్తే స్ఫుటంగా మెరిసే కళ్ళు, ఆ పిల్ల , అతని భార్య కుమారి ఆకర్షణీయమైన మొహం. ఆకర్షణంతా అమాయకత్వంలో వుంది. జాలిగా చూస్తుంది. విశాలమై, గుండ్రంగా వుండే కళ్ళే అయినా, కాటుక అటు ఇటు పొడుగ్గా పెట్టడం వల్ల కాబోలు చేప ఆకృతిలో కనబడతాయి. మృదువైన చర్మం,మరీ నలుపు కాదు. కాస్తంత పాక్కపాపిట, వెడల్పాటి జడ , మెడలో ఒక్కటే గొలుసు, కుడిచేతికి ఒక గాజులజత, ఎడమ చేతికి రిస్టువాచ్. ఆ రిస్టువాచే నచ్చలేదు కామేశంకి. అది నాగరికతకి చిహ్నం. ప్రాచీన హైందవ సంప్రదాయానికి, ప్రకృతి శోభకి విరుద్ధం. గజిబిజి ప్రింట్ డిజైను చీర , ఎరుపు జాకెట్టు , మోచేతి క్రిందికి దిగింది , అంచులేదు. చిత్రం, ఆ బ్యాంకు కంతలో నుంచి రెండు మూడు సార్లు చూసినప్పటికీ, కామేశానికి ఇన్ని జ్ఞాపకం వుండడం, అతనికే ఆశ్చర్యం వేసింది. నెలక్రితం నూటపది రూపాయలు బాంక్ లో వేశాడు. రామ్మూర్తి ఈ నెలరోజుల్లోనూ మూడుసార్లొచ్చి, తొంభై తీసేశాడు. అతనికేం ఇబ్బంది వచ్చిందో, ఇవాళ ఉదయం కుమారి వొచ్చి, ఆ ఇరవై తియ్యడానికి కాగితం తెచ్చింది.

“ఏం, ఎకౌంట్ మూసేస్తారా,? కనీసం పదేనా వుంచాలి” అన్నాడు కామేశం.

“పోనీ పదివ్వండి,” అంది అమాయకంగా.

బాంక్ లో నుంచి డబ్బు లాగేస్తుంటే, ఆ తీసేవారి సమస్యలేమిటో ఊహించడం సరదా కామేశానికి.

"ఇరవై కావలసి వచ్చిందా?" అని అడిగాడు.

“గదివాడు తొందర చేస్తున్నాడు” అని వెళ్ళి మధ్యాహ్నం మళ్ళా వొచ్చింది కుమారి ఈ సారి రామ్మూర్తి కూడా వొచ్చాడు.

కబుర్లలో తెలిసింది వాళ్ళకి ఇల్లు కావాలి. ఎడ్వాన్సు ఇచ్చుకోలేరు. అది లేకుండా ఎవ్వరూ ఇవ్వడం లేదుట. ఒక్క గదైనా చాలన్నారు. ఎప్పుడు ఖాళీ చెయ్యమంటే అప్పుడు ఖాళీ చెయ్యడానికి సిద్ధం అన్నారు. కామేశం కరిగి పొయ్యాడు. వెనకెప్పుడో కాలేజీలో వొక ఇంగ్లీషు కావ్యం చదివాడు. పారిపొయ్యే ప్రేమికుల కథ ఆ కావ్యం లోనిది. పారిపోతుంటే పెద్ద తుఫాను చెలరేగుతుంది. ఏటి వొడ్డుకు వొస్తారు. ఆ ఏరుదాటి, తమని వెంటాడే వారి భారినుండి తప్పించుకోవాలి. కాని ఆ తుఫానులో ఏరు దాటేందుకు ఏ పడవ వాడూ సిద్ధ పడడు. ఆఖరికి వొక ముసిలాడు సిద్ధమౌతాడు. దాటేస్తాను ఎక్కమంటాడు. అవతలి వొడ్డున క్షేమంగా దిగవిడుస్తాడు. కృతజ్ఞత చెపుతూ తాతకి ఏదో ఇవ్వబోతాడు యువకుడు. నాకేమీ ఒద్దంటాడు పడవ తాత.

“నీకోసం కాదు, ఆ బుల్లెమ్మను చూసి దాటేశా” అంటాడు.

కామేశం స్థితి అలాంటిదే. తనింట్లో రెండు గదులు ఖాళీగా వున్నాయి. వెంటనే వచ్చి ప్రవేశించమన్నాడు. ఇష్టమొచ్చినంత ఇవ్వమన్నాడు. సరేనని ఆ దంపతులు వెళ్ళిపోయారు.

నిర్ధారణ జరిగి పోయింది. మాటిచ్చేశాడు. కాని, సరస్వతిని వొప్పించాలి. తనకెందుకు అంత తొందర. ఫలానా అద్దె ఇవ్వండి, అని చెప్పకూడదూ. ఈ అతిమంచితనమే అనర్థమంటుంది సరస్వతి. మొదట్లో భయపడ్డాడు కామేశం. భార్య ఏం గొడవ చేస్తుందోనని. వాళ్ళకి ఎందుకు ఇస్తానన్నాడో ఏదో కథ అల్లి, కొంత నాటకం ఆడి ఆమెను ఒప్పించాలనుకున్నాడు. కాని, అబద్ధం బయటపడితే ఆవిడతో మరీ ప్రమాదం. అదీకాక ఈ ఆడాళ్ళున్నారే చిత్రం. కొన్ని విషయాలు ఇట్టే పట్టేస్తారండీ. చెప్పవలసినవన్నీ వేళ్ళమీద లెక్కించి చెప్పాడు. తనకి బ్యాంక్ లో పని గనుక. జమా ఖర్చులాంటి చిట్టా తయారు చేసుకున్నాడు. సందు చివరి ఇల్లు. తామిద్దరూ లింగు లిటుకూ అంటూ వుంటున్నారు. రోజులు బాగుండలేదు. కాపలాకి కుక్కని పెంచుదామంటే ససేమిరా

వల్లకాదంటుంది. పోనీ, సందడిగా వుంటారు, అద్దె డబ్బులతో కొంపమీద వున్న ఆ కాస్త అప్పు తీర్చొచ్చునా. ఇదిగో ఈ చివరిమాట చెప్పడంతో సరస్వతి ముఖం విప్పారింది. ఉప్పు, కారం, సరయిన పాళ్ళలో అతని కంట్లోగాక, పులుసులో పడ్డాయి ఆ పూట.

ప్రతిరోజూ వొక అరగంటయినా భార్యతో యుద్ధం చెయ్యక పోతే గడవదు కామేశంకి వాగ్ యుద్ధం, అందులో సరస్వతి దిట్ట. వెనుక యుద్ధాలంటే, ఇరుపక్షాల సైనికులు బోలెడంత తయారై హంగులన్నీ అమర్చుకొని, సామాగ్రి సిద్ధం చేసుకొని, యుద్ధానికి దిగేవారు. సరస్వతికి ఇవేవీ అక్కర్లేదు. ఆమె ఎప్పుడూ సిద్ధమే. వెనక యుద్ధాలకి కారణాలుండేవి. రాజ్యం కబళించాలనో, శత్రురాజు చెల్లెల్ని లేవదీసుకు పోవడమో , ఏదో కారణం సరస్వతికి కారణాలతో నిమిత్తం లేదు. నిష్కారణంగా ఉత్త పుణ్యానికి సమరం జరపగలదు. ఈ పూట ఆరింటికే యింటికి రమ్మంటుంది. అట్లాగే వస్తానంటున్నాడు కామేశం, అట్లాంటప్పుడు కూడా డెబ్బలాడగల్దు సరస్వతి.

"వస్తానంటిగా."

"అనడం మట్టుకే"

"ఒసే, ఇదివరలో ఎన్ని సార్లు రాలేదు ?"

"మీ అంతట మీరే రావటం కాదు."

"ఇప్పుడేం చెయ్యమంటావ్ ?"

"సరిగా ఆరింటికి రమ్మంటా."

"వస్తానంటినిగా."

"అనడం కాదు."

"నువ్వనే దేమిటి , గడియారం ముల్లు ఆరుకి తిప్పి, బయటికెళ్ళి, ఇప్పుడే రమ్మంటావా?"

"నే అల్లా అనలేదు."

ఆ విధంగా సాగుతుంది. ఆమేదో అంటుంది. అతనేదో అంటాడు. ఆదివారమైతే, తాపీగా కూర్చొని వొక గంటైనా జగడమాడందే వారికి తోచదు.

ఆ దంపతులు – రామ్మూర్తి, కుమారి వచ్చి చేరారు. ఆ పక్క రెండు గదులు , ఆక్రమించారు. గదుల్లో రెండు కిటికీలు, ఇటువైపుకే తెరచి వున్నాయి. ఏదో గళ్ళ చీరని కర్టనుగా అమర్చింది కుమారి. వాళ్ళేం చేస్తున్నా ఇటువారికి కనిపిస్తూనే వుంటుంది. బాగు చేయించాలి, కలసి రావడం లేదు ఆ గదుల్లో వుండి పోయిన పాత కుర్చీలు, మంచం తెచ్చేసుకుందామన్నాడు కామేశం.

"తెచ్చి?"

ఏమనాలో తెలియదు

"పాతవెందుకని ?"

"ఏం పాతవైతే"

"నల్లులూ, గట్రా"

"కొత్తవి కొంటిరిగా, అవి వేసిరండి." మొదట ఇది వెటకారమేమోనని భయపడ్డాడు కామేశం. కాదుట, నిజంగానే వేసి రమ్మంది. ఎందుకో ఇంత దయ. మర్నాడు తెలిసింది. కుమారి మంచి పిల్లట. కల్లాకపటం ఎరుగదట, భర్తని కనిపెట్టుకునే వుంటుందిట. వారి ఆన్యోన్యానికి గాలిపోయిన రబ్బరు బంతి లాగైందట.

ఆ రామ్మూర్తి మరీ మంచివాడట. పెళ్ళానికి తెగ చాకిరీ చేస్తాడట. చీరలు మడతలెడతాడట. తనే దుస్తులు వుతికి ఇంట్లోనే ఇస్త్రీ చేస్తాడట. వంటింట్లో కూడా ఏదో సహాయపడుతూనే వుంటాడట. మరో రెండు రోజులయ్యాక మరికొన్ని విషయాలు బైట పెట్టింది సరస్వతి. సాయంత్రం సూర్యుడస్తమించాక వెన్నెట్లో ఆ బుల్లివరండాలో ఇద్దరూ చాపేసుక్కూర్చుంటారట. అతని వక్షంపై తలానించి పరుంటుందట కుమారి. అతని జుట్టు నిమురుతూ నక్షత్రాల కేసి చూస్తూ, నిశ్చింతగా గడుపుతారట. మాట్లాడుకోరు, కంఠం దించి చెబుతోంది సరస్వతి.

"నిన్న మధ్యాహ్నం హాల్లోకొస్తూ, చూడకూడదనుకుంటూనే అటు చూశాను. ఏం చూశానో తెలుసా. కుమారి నిలబడి అద్దం చూసుకొంటూంది. కళకళ్ళాడే ముఖం. వెనకాలే వచ్చి ఆమెను గట్టిగా కౌగలించుకొన్నాడు. యేం భయపడిందో, చేతిలో అద్దం వదిలేసింది. కిందపడి ముక్కలైంది. పోనీ అద్దం పోయిందన్న బెంగేనాలేదు. ఆ గాజు ముక్కల్ని వెదకడమా యేమన్నానా , అటు తిరిగి, అతని మెడచుట్టూ చేతులు వేసి హవ్వ ,, " వాక్యం పూర్తి చేయకుండా తొట్రుపాటు ఆవేదనా కనబర్చింది మొహంలో.

వాళ్ళని అంతగా పొగట్టం చూసి, కామేశం లోలోన విసుక్కున్నాడు. వాళ్ళతో లడాయి పెట్టుకోకుండా, ముభావంగా వుంటే చాలు. అతనంతకంటే కోరడు. కానీ, మరీ మెచ్చుకోవడం మొదలెట్టేసరికి కామేశం కాస్త చికాకుపడ్డాడు. హైందవతత్వం బాగా చదవడం వల్ల కాబోలు, కామేశానికి ఉద్రేక ప్రకర్ష సరిపోదు. సమగ్రమైన దృష్టి అలవర్చుకోవాలంటాడు.

అంతమాత్రం చేత కామేశంలో ఏ మార్పు రాలేదనుకోకూడదు. కూడదనుకుంటూనే, తనూ, ఆ యువక దంపతుల నిత్యకృత్యాన్ని కిటికీలోంచి చూస్తూనే వున్నాడు. మిగతావి కొన్నా కొనకపోయినా , చాకలాణ్ణి పెట్టుకున్నట్లు లేదు , గులాబీలు మాత్రం తెస్తాడు రామ్మూర్తి. ఒక్క గులాబీని కుమారి జడలో అమురుస్తాడు. బాల్కనీ మీద ఆమె కుర్చీలో కూర్చుని వుంటే, అతను కింద కూర్చుని, ఆమె వడిలో తన తల ఆనిస్తాడు. ఆమె అతని జుట్టు నిమురుతూ వుంటుంది. అతనికేం పనో కనుక్కోలేదు. ఎప్పుడూ ఆమెతో ఇంట్లోనే వుంటాడు. సినిమాలకి, షికార్లకి వెళ్ళరు. వాళ్ళ ప్రేమకి రాత్రి చాలినట్లు లేదు. పగలు కూడా,ఆనందంతో, ప్రేమతో వాళ్ళ మొహలు వెలుగుతున్నాయి. రోజురోజుకీ బాగుంటున్నారు. స్వస్తికా ఆకారాం ఎరుపు, తెలుపు రాళ్ళతో పొదిగిన , దుద్దులు చెవలకి అమర్చుకుంది కుమారి. కాని ఏం లాభం. ఆ జుట్టుని చెవులమీదికి లాగి, వాటిని కనబడకుండా చేసుకుంటోంది. అదేం ఫేషనో!

"హవ్వ,తల దువ్వి జడకూడా అతనే అల్లుతాడండీ" అంది సరస్వతి.

"ఎంచక్కా, చెవలమీద జుట్టు పైకిలాగి ఇటురండి. రహస్యం.. చెవుల్ని ముద్దెట్టుకుంటాడేమిటి !... జడని విప్పి, విడదీసి తన మొహం మీద కప్పుకుంటాడు... ఆ పిల్ల అసలు బాడీలే వేసుకోదు... !"

అల్లా గానం చేస్తుంది సరస్వతి. అది చెప్పడంలో, ఎంతో ఆనందం పొందుతున్నట్లు తెలుస్తూనే వుంది. తను ఇంటికి రాగానే, వాళ్ళు ఏవేం చేసిందీ, చోద్యంగా చెబుతుంది. అతనితో యుద్ధాలు మానేసింది కోపం పోయింది. విసుగు తగ్గింది. చీదరించుకోవడం లేదు. సాయంత్రం తను ఇంటికి వొచ్చేసరికి, స్నానం చేసి, కొత్తచీర సింగారించి, తల్లో చామంతి, దవనం అమర్చి తన ముందు కూర్చుని కులాసా కబుర్లు మొదలెట్టడం ప్రారంభించింది. కాసేపు డాబామీద కూర్చుని కబుర్లు చెప్పుకుందామంటోంది. తన తొడమీద తల ఆనించి కబుర్లు సాగిస్తోంది.

నడివయస్సు స్థబ్ధత దిగవిడిచి, వెనక్కి యౌవ్వనం లోకి ప్రయాణం సాగిస్తున్నామా అన్న అనుమానం రాసాగింది కామేశంలో. వెంట్రుకలు తెల్లబడు తున్నాయి. జుట్టు పల్చబడుతోంది. నడుం వెడల్పవుతోంది వొంపులు బలుస్తున్నాయి. మూలపళ్ళు ఊడటం జరుగుతోంది. ఉక్క, వొళ్ళు పేలడం, స్పర్శ సన్నగిల్లడం, చిరాకు, డబ్బు కాపీర్నం, కీర్తి దాహం, సంఘంలో పలుకుబడి పట్ల వ్యామోహం, మర్యాద, గుంభనం వీటిని విడిచి శరీరం ఎక్కడికి పోతుంది ? శరీరం కృశిస్తే ఆత్మబలం పెరుగుతుందనుకోవడం వెర్రి, అసలు శరీరమే ఆత్మ అన్నది చార్వాకులతత్వం వెనక చదివింది తన కిష్టం. చార్వాకులు దేహాత్మవాదులు. వారిది భౌతిక వాదం. బృహస్పతి నెలకొల్పాడు మొదట్లో. జాబాలి కూడా. లోకంలో రాజుకి మించిన దైవం లేదన్నాడట. బుద్ధుడి సమకాలికుడైన అజిత కేశకంలిన అనే ఆయన కూడా ఈ వాదాన్నే బోధించాడట అట్లాగే భగురి అనే ఆయన , ఈ జగత్తుకి సృష్టికర్త అంటూ లేదు. తనకు తనే ప్రమాదవశాత్తు పుట్టుకొచ్చిందన్న స్వభావవాదం ప్రచారం చేశాడట. నరకం లేదు. నరకాన్ని కఠినులు సృష్టించారు. బాధలేకుండా, శరీర సుఖం పొందటమే. మోక్షం, ఈ లోకం; శరీరం, భౌతిక ఆనందం,ఇవే యధార్థాలు, స్వర్గనరకాలు మాయ, కల్పితాలు, కామ ఏవ ఏకః పురుషార్థః ప్రేయసిని ప్రేమించి సుఖించు, రేపు చచ్చిపోతావు అంటుంది చార్వాక తత్వం. ఈ రకం తత్వాన్నే , 'ఎపిక్యూరస్' 'అరిస్టిప్పస్' , ఆ గ్రీకు తత్వజ్ఞులు కూడా బోధించినట్లు జ్ఞాపకం "రేపటి నెమలికంటె ఇప్పటి పావురం మంచిది." అట్లాంటి పావురాలు, రామ్మూర్తి కుమారి, ధన్య జీవులు, ప్రేమ ద్వారా, మోక్షాన్ని, పరమాత్మని, ఆనందాన్ని సాధిస్తున్నారు. పరిసరాలపై వారి ప్రభావం ఎంతో వుంది. సరస్వతిపై బోలెడంత. వెనకటి రోజులు ఎన్నిసార్లు స్మరించినా,

తామిట్లాంటివి చేసినట్లు గుర్తు రావటం లేదు. అప్పుడు భయం, సిగ్గు, ఇంట్లో మరో మనిషి వుంటే, భార్యతో మాట్లాడ్డం గాని, చూడ్డానికి గాని వీలు పడేది కాదు. మళ్ళా చిత్రం, పిల్లలూ పుట్టుకొచ్చారు!

ఆ సాయంత్రం పుస్తకాల షాపులో కెళ్ళాడు కామేశం ఎవరో స్నేహితుడితో, ఆ స్నేహితుడు, వొక మిత్రుడి పెండ్లికి, బహుమతిగా పుస్తకం కొనిద్దామంటే తనూ వెళ్ళాడు.

అక్కడ చూశాడు వాత్సాయనుని కామసూత్రాలు – ఇంగ్లీషు గ్రంథం. వాత్సాయనుడి ప్రభావం చాలా వుందిట. చార్వాకుల తత్వం పైన ఆ పుస్తకం నిండా బూతుబొమ్మలు. సిగ్గేస్తుంది. ఇందులో ఏముందో చూద్దాం. జ్ఞానమే శక్తి అన్నాడు ప్లాటో పండితుడు. అన్నీ తెలుసుకోవాలి మొత్తానికి కొనేశాడు. భద్రంగా తెచ్చాడు ఇంటికి, సరస్వతి స్నానం గదిలో వుంది. అమ్మయ్య అనుకుని ఆ పుస్తకాన్ని వొక మూల దాద్దామని, అలమారులో వొస్తువుల్ని కెలుకుతూండగా, సరస్వతి స్నానం గది తలుపు చప్పుడైంది. అక్కడేదో లావాటి పాత పుస్తకం విప్పి, ఆ పుటల మధ్య తను కొన్న కామసూత్రాల పుస్తకం దాచి, దానిమీద పాత పత్రికలు పడేసి అలమారు మూసి, చడిచప్పుడు కాకుండా భార్యని ఆహ్వానించాడు కామేశం.

ఆ నెల డబ్బు అవసరమొచ్చింది కామేశంకి. మూడు నెలలు గడిచాయి , రామమూర్తి అద్దె ఇవ్వలేదు. ఆ ప్రశంసే ఎత్తడం లేదు. సరస్వతిని అడగమన్నాడు కామేశం మీరే అడగండంది.

ఒక ఉదయం వెళ్ళాడు. సకిలించి గొంతు సవరించుకున్నాడు. వంటింటి గదిలోంచి బైటకొచ్చింది కుమారి. స్నానం చేసినట్లు లేదు. బొట్టు లేదు. జడంతా ఊడిపోయింది. ఆ చీర బాగుండ లేదు. అమాయకంగా నవ్వింది. ఎత్తుకు ప్రాక లేక లోనికి దిగజారిన సముద్ర కెరటంమల్లె మొదటి పేజీ చించేసిన బ్యాంకు లెడ్జర్ గ్రంథమల్లె.

"ఆయన బైటికి వెళ్ళారు" అంది కుమారి.

"మరి.. మరి.. మూడు మాసాలు..." అని మిగతాది చెప్పలేక పొయ్యాడు ఆమె ఎందుకో సిగ్గుతో తలవంచుకుంది. కాలి బొటనవ్రేలితో నేలమీద ఏదో గీస్తోంది.

"అందుకే... వెళ్ళారు" అంది.

అందుకే వెళ్ళడం ఏమిటా అనుకున్నాడు కామేశం. మరెవ్వరి దగ్గరన్నా చేబదులు తెద్దామనా? బ్యాంకులో ఎకౌంటు అంతా అయిపోయింది. డిపాజిట్ మినహా.

"కాఫీ తెచ్చేదా?"

"వద్దులే..."

లేచి, "తలుపు వేసుకో" అని తన వాటాలోకొచ్చేశాడు కామేశం. కిటికీ తలుపు బాగుచేయించాలి. అద్దం పై గుడ్డలు కట్టి గడుపుకుంటున్నారు ఆ దంపతులు. అందులోంచి వారి చేష్టలన్నీ బైటికి కనిపిస్తున్నాయి. కనిపిస్తున్నాయి గనుక చూడటం జరుగుతోంది. ఇంక అలా చూడకూడదు. తలుపు సందుల్లోంచి, తాళంచెవి కంతలోంచి చూడడం అపరాధం. అలాగే ఇతరుల ఉత్తరాలు కూడా చదువకూడదు.

మరో నెల గడిచాక సరస్వతి దూరపు బంధువులెవరో చనిపోయారన్న వార్త వచ్చింది. దుఃఖించింది. కామేశం సానుభూతి కనబరిచాడు. అతను బ్యాంక్ కు వెళ్ళగానే కుమారి వచ్చి విషయం తెలుసుకొని, సరస్వతి ఎదురుగా కూర్చుని ఓదార్చింది. మధ్యాహ్నం రామమూర్తి రాగానే వెళ్ళిపోయింది కుమారి.

సాయంత్రం పోతన్నగారి భాగవతం కోసం వెదికింది సరస్వతి. కష్టాలొచ్చినప్పుడు భాగవతం చదువుకుంటుంది. కామేశం కోప్పడేవాడు. కష్టాలొచ్చినప్పుడే మనవారు భారత భాగవతాలు చదువుతారు. ఉత్తప్పుడు వాటి జోలికిపోరు. ఇది తప్పంటాడు. ఆ పవిత్రగ్రంథాలు సంతోషంగా వున్నప్పుడు చదువుకోడానికి పనికి రాకపోవడం విశేషం అంటాడు. మనవారిదంతా శ్మశాన వైరాగ్యం అంటాడు. ఆ గ్రంథాలు చెప్పే సందేశ పరంపరలో ఒక్కదానినైనా జీవితంలో అమలు జరిపితే ధన్యులే. అదీ చెయ్యరు. దొంగ వేదాంతం, దగానీతి. వీళ్ళు చేసేదొకటి, చెప్పేదొకటి, పగలు వొక నీతి. రాత్రి మరొక నీతి. ఇది రెండు నీతుల జాతి. అందుకనే అందరు దేవుళ్ళు, అన్ని ఆలయాలు. ఎన్నిసార్లో ఈ విషయంలో భర్తకీ, తనకీ యుద్ధాలు జరిగేవి.

కనీసం కష్టాల్లోనైనా, చదువుకుని అఘోరిస్తే ముక్తి పొందుతారంటుంది సరస్వతి. కనీసం తుది ఘడియలలోనైనా దేవుడి పేరు ఉచ్ఛరిస్తే మోక్షం పొందుతారు. నారని చూపిస్తే తుది ఘడియల్లో "పీచు" అంటాడు. అన్న లోకోక్తి అందుకనే ప్రచారమైందంటాడు కామేశం.

అమ్మయ్య ఇదిగో ఇక్కడ దొరికింది భాగవతం. ఈ పత్రికల కట్టకింద అట్టలు వూడిపోయాయి. ఇదేమిటి ఇంతలా వుంది. పైకి తీసింది. అందులోంచి మరో పుస్తకం ఊడిపడింది. భాగవతం పిల్లల్ని పెడుతోందేమిటి ? అది ఇంగ్లీషు పుస్తకం. కొత్తది, పుటలు తిప్పింది. బొమ్మలు బూతుబొమ్మలు. చ.ఛ మూసేసింది. ఈయనకి ఈ వయసులో ఈ బుద్ధు లేమిటి ? మళ్ళా తీసింది ఇంకా వున్నాయి బొమ్మలు ఆడమగ కలిసి ఛీ ఛీ ... సిగ్గుశరం లేదు. ఈ మొగాళ్ళకి. కామేశం వచ్చిన అలకిడైంది.

"ఈ పుస్తకం ఏమిటండీ ఆఫీసులో కొత్తపిల్లని ఎవర్నేనా వేశారా? మనిళ్ళలో వుండాల్సిన పుస్తకమేనా , మీకేమన్నా మతి పోయిందా..."

ఇంకా చాలా సేపు సాగించింది.

"అదా ... అది, రంగారావని ... మా ఆఫీసులో వున్నాడులే వాడికి పెళ్ళట. పెళ్ళికానుకగా, చవకలో వొచ్చింది. ఈ పుస్తకం ఇస్తే తీరి పోతుందంటే కొన్నాను. మరో ఇద్దరు కూడా ఇలాంటివే కొన్నారులే నేనొక్కణ్ణే కాను."

"ఎవడా రంగారావు ... శుభలేఖ చూపించండి" అంది సరస్వతి. కామేశం గుండె జారింది. ఇదిగో ఇట్లాంటి వివరాల్లోకి దిగుతారు ఈ ఆడవాళ్ళు. అదే చిక్కు. వీళ్ళకి అందుకే పరమాత్మ చింత లేకుండా పోతూంది. ఆధ్యాత్మిక జీవితానికి తగరు వీళ్ళు. దేవుడి విషయం చూడండి. లోకాన్ని సృష్టించి పారేశాడు. వొకలీలగా, గమ్మత్తుగా అంతే , అందులో వివరాల్ని గురించి పట్టించుకోలేదు. ఆయనకి అందులో ఏమున్నాయో తెలియదు కూడా , అందమైన మంచుకొండలు, నదులు, సరస్సులు, కుమారి చక్కదనం వున్నాయి. రక్తం పీల్చే జలగా, వికృతమైన వాన పాము, పేడపురుగు, దోమ, నల్లి, ఖడ్గమృగం ... సరస్వతి .. వున్నాయి. అమ్మో. అవన్నీ పైకి అనకూడదు.

"ఆఫీసులో పడేసినట్టున్నాను."

"ఎప్పుడు పెండ్లి?"

"వొచ్చాక పార్టీ ఇస్తాడుగా. అప్పుడివ్వచ్చులే అని అట్టే పెట్టా" అన్నాడు కామేశం.

ఆ ఆపద అల్లా తొలిగిపోయింది. కాని మరో ఇబ్బంది ఏర్పడింది. రాత్రుళ్ళు ఆ పుస్తకం తీసి అందులో ఏముందో వివరంగా చెప్పమంది. చదివి, అర్థం చెప్పాడు. స్త్రీ పురుషుల అన్యోన్యం, స్నేహం, పెరగాలంటే యేం చెయ్యాలో ఎల్లా ప్రవర్తించాలో ఎల్లా ప్రేమించుకోవాలో..." అవును జగత్తంతా ప్రేమ మయం. మన కుమారి, మొగుడూ, నిత్యమూ చూపెడుతూనే వున్నారు..."

"మనకి అది లేదు గనుకనే ఈ పుస్తకాలు చదువుకోడం" అన్నాడు కామేశం.

"వాళ్ళకి మాత్రం ఎప్పుడూ వుంటుందా యేమిటి. అదుగో ఆ కుర్రతనం, ఆ వయస్సు వున్న నాలుగు రోజులు. తరువాతేముంది. మట్టిగడ్డ..."

"నిత్యమూ వుండాలనే వాత్సాయనుడి గోల పెద్దయ్యాక చిన్నప్పటి జ్ఞాపకాలు మధురంగా వుండాలి మరి..."

"శృంగారంలో పడిపోతున్నారే..." అంది సరస్వతి – కాని తనే శృంగారంలో పడిపోతూందన్న తన అనుమానం పైకి అనలేక పోయాడు కామేశం.

చేసిన అప్పులో యేదో అప్పు అనుకొని పక్కవాటా కిటికీలు బాగుచేయించాడు కామేశం.

"కుమారికి ఎంత భక్తి అనుకొన్నారు? ప్రొద్దుటే స్నానం చేసి , మధ్య పాపిడి తీస్తూంది చూశారా ... యింత బొట్టెట్టుకుని, పట్టుచీర కట్టుకుని పూజలు చేస్తూంది. చదువుకోమని భాగవతం ఇచ్చా."

"నువ్వేమో ఈ బూతుబొమ్మల పుస్తకం పారాయణ చేస్తున్నావు" అని సందు దొరికింది కదా అని లోనున్న కసిని వెళ్ళబోస్తున్నాడు కామేశం.

"అణా అద్దె లేకుండా, రాజాలాంటి వాటా ఇచ్చేసేటంత ఉదారులుగా మీరు. మీరు మట్టుకు తక్కువా ఏం,,,?"

"నువ్వు అడగొచ్చుగా అద్దె"

"అడిగాను."

"ఏమంది?"

"తనకి మూడో మాసంట"

ఫక్కున నవ్వేశాడు కామేశం.

"నవమాసాలు మోసి బిడ్డను కన్నా, అద్దె డబ్బుల బదులు ఆ పసికందు ఏడుపన్నమాట , మనకి ప్రతిఫలం"

"మీరేగా తెచ్చి పెట్టింది."

"నీ అనుమతి లేకుండా చెయ్యలేదుగా. నువ్వు 'ఊ' అంటే తక్షణం ఖాళీ చెయ్యమంటాను" అన్నాడు కామేశం.

"ఇప్పుడెల్లా అనగలమండీ! చిలకా గోరింకల్లా తిరుగుతున్న వాళ్ళని, పొమ్మనగలమా. మూడో మాసం పైగా. మీరెంత కఠినులండీ..."

"వూరికే అన్నానే. నువ్వేమంటావో చూద్దామని"

"నిన్న కాసిని బియ్యం ఇచ్చివొచ్చా. పాపం లేవుట."

"సాయంత్రం ఇంత కాఫీ పొడి, పంచదారా కూడా ఇచ్చిరా అవీ లేవు."

"యేమండోయ్..."

"ఏమిటి?"

"ఆ అమ్మాయి పూజ చేసుకుంటోంది. అటు ఇటూ చూశాడు,ఎవ్వరం లేమనుకున్నాడు కాబోలు రామమూర్తి , పీటమీద కూర్చున్న ఆమెను గట్టిగా కౌగలించుకొని తన ఒళ్ళోకి లాక్కున్నాడు,హవ్వ."

"హవ్వ , దేనికి? మొదట్లో వింత – ఇప్పుడు మామూలేగా. ఇట్లా లాక్కున్నాడా...?" అని ఎట్లా లాక్కున్నదీ ప్రత్యక్షంగా చూపే యత్నంచేసి, సరస్వతి నడుంపై చేతులు వేసి బిగించాడు కామేశం.

"వెదుదురూ,ఇది సొంతంది కాదు,ఆ పుస్తకం లోనిది..." అని అతన్ని తోసేసి లోనికి వెళ్ళింది సరస్వతి.

ఆమెలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపడ్డాడు. యౌవనంలో సంపర్కం వుంటే, మనలో కూడా ఆ ఛాయ పొడసూపుతుంది కాబోలు అనుకున్నాడు కామేశం. తనలోనూ ఏదో ఒక ఉత్సాహం చురుకుదనం వొచ్చాయా అన్న అనుమానం రాసాగింది. ప్రేమికులంటే లోకానికి అంత ఇష్టం. వారి కథలు వినడానికి కుతూహల పడతారు. ప్రేమ యౌవ్వనంతో ముడిపడి వుంది. యౌవ్వనంలోవే సృష్టి శక్తులు,అదొక జ్వాల. దేవుడు నిత్య యౌవ్వనుడై వుండాలి. దైవానికి వార్ధక్యం లేదు. అట్లా అయివుండి కూడా, మనిషి శరీరంలో నిత్య యౌవ్వనుణ్నిగా వుంచే ద్రావకాలు ఎన్ జైమ్స్ ట హార్మోన్స్ ట మరి కొన్ని చేర్చి ఎందుకు అమర్చలేదూ దైవం? తనలాగా మనిషి వుంటే ఓర్వలేడన్న మాట దైవం. అందుకే వార్ధక్యం – మృత్యువు. పరమాత్మలాగా యౌవ్వనంలో మాటలుండవు. చెప్పుకొనేందుకు ఏమీ వుండదు. వార్ధక్యం లోనే అతివాగుడంతా , వెనకటివి స్మరించుకుంటారు. యౌవ్వనానికి జ్ఞాపకాలు లేవు. అందుకనే మంచితనం కూడా యువకులకే సాధ్యం. వారిలో కల్లకపటం వుండదు. పోటీ పడటం వుండదు. దేన్నో ఆశించి విఫలులై కఠినులుగా అవరు. బాహ్యజగత్తుతో పేచీ వుండదు. డబ్బు కాపీర్నం లేదు. రోజుకి ఇరవై నాలుగు గంటలే వున్నాయన్నది తప్ప వేరే అసంతృప్తి లేదు. ఒకరి దేహాలని వొకరు పరిశోధిస్తూ, అందులో రహస్యాన్ని అన్వేషిస్తూ ఆనందం పొందుతూ పరమాత్మలో ఐక్యం అయినట్లు ఒకరైపోతారు. ఆ వొకరులోంచి మరొక ప్రాణి పుడుతుంది అదే సృష్టి. దైవం ఒక్కటే అయినట్లు, స్త్రీ పురుషులు ప్రేమపాశంలో వొకరవడంకంటే, వింత ఏముంది!

తమలో వచ్చిన మార్పుకి నెలతర్వాత నిదర్శనం దొరికింది. సరస్వతికి రెండోమాసం. రామ వనవాసం ముగిసినట్లు పదునాల్గేండ్ల తర్వాత మూడో కాన్పు కాదు నాలుగవ కాన్పు. మూడో కాన్పు సంతానం దక్కలేదు. కామేశం నవ్వుతూ సరస్వతి జుట్టుని నిమురుతున్నాడు.

"అన్నట్లు, ఇవాళల్లా రామమూర్తి గాని, కుమారి గాని, కనబడ్డం లేదే" అంది సరస్వతి.

"స్నేహితులింటికి వెళ్ళారేమో."

ఆ మర్నాడు కూడా రామమూర్తి, కుమారి కనబడలేదు. వాటాలోకి వెళ్లి చూశారు. సామానులు లేవు బట్టలు లేవు. పీటలు లేవు. వారి స్వంత కుర్చీలు, మంచమూ తప్ప. ఇంకేమీ లేవు. ఖాళీ చేసి వెళ్ళిపొయ్యారు. చెప్పకుండా అద్దె ఎగేసి వెళ్ళారు. సరస్వతికి కోపం వచ్చింది.

"తొందరపడకు. ఏదో విశేషం వుండాలి."

"ఏం విశేషం ? నా నెత్తి విశేషం. పాలదానికీ, చాకలికీ బాకీలే. మీకు మా బాగా చేశారు లెండి."

"చూడు ఎవరో వచ్చినట్లున్నారు" చూసింది. ఆ వచ్చినాయన లక్ష్మణ స్వామి. కుమారి తండ్రట. రామమూర్తి మామగారట. విషయం చెప్పాడు.

"వాడు రాక్షసుడండీ – ఆ రామమూర్తి గాడు. మా అమ్మాయిని లేవదీసుకు పొయ్యాడు. ఇదో వెర్రిబాగుల్ది కాలేజీలో చదువుకుంటోంది. వాడూ చదువుతున్నాడు. వాడికి మళయాళ మంత్రం వొచ్చునండీ , మందో మాకో పెట్టాడు. లొంగిపోయింది. లేచి పొయ్యారు" లక్ష్మణ స్వామి భాష మృదువైంది కాదు. ఆవేశంలో అనరానివంటాడు ఆయన చెప్పిన సారాంశం ఏమిటంటే రామమూర్తికి ఇదివరకే పెండ్లయిందట. ఒక పిల్లాడుట. కుమారిని మోహించి ఆ భార్యని వదిలేసి, కుమారిని లేవతీసుకు పొయ్యాడు. తల్లి, తండ్రి గుమ్మం తొక్కద్దన్నారు. మొదటి పెళ్ళి తాలూకు అత్తా, మామ తన్నిస్తామన్నారుట. కోర్టులో దావా వేస్తామన్నారుట. ఆ ఊరు ఆ ఊరు వెళ్ళి తలదాచుకుని, అప్పులు చేసి పరిస్థితి ముదిరే సరికి ఆ ఊరునించి బిచాణా ఎత్తి వేస్తాడట. ఉద్యోగం లేదు. పూటకి టికాణా లేదట. అమ్మాయి నగలన్నీ అమ్మేశాడుట.

"మీకు సున్నా చుట్టాడు పెద్ద గుండు సున్నా. ఇక్కడికి వస్తున్నట్లు అమ్మాయికి వ్రాశా. బిచాణా ఎత్తేశాడు." అల్లా వెకిలిగా నవ్వుతూ, తాగినవాడల్లె వెర్రిగా వ్యాఖ్యానం చేస్తూ చాలా సేపు కబుర్లు చెప్పి వెళ్ళాడు లక్ష్మణ స్వామి.

కామేశం ఆశ్చర్య పడ్డాడు. సరస్వతి వాళ్ళనీ, అతన్నీ దుమ్మెత్తిపోసింది.

"కనబడనివ్వండి. వాతలెట్టిస్తాను. ఈ లుచ్ఛాల కిచ్చామా మనిల్లు! ఎంత అప్రదిష్ట! మైలపడింది ఇల్లు. పుణ్యావచనం చేయించాలి. ఇంకెప్పుడు ఇలాంటి వాళ్ళని చేరదియ్యకండి..."

రెండు రోజుల తర్వాత రామమూర్తి దగ్గర నుంచి ఒక రిజిష్టర్ సంచీవచ్చింది. అందులో బంగారం గాజులు రెండు వున్నాయి. ఉత్తరం ఒకటుంది, అందులో ఇల్లా ఉంది.

"... మామ గారు మీ దగ్గరకొచ్చే వుంటారు. ఆయన మతి సరిగ్గా లేదు. కల్పించి ఏవేదో చెపుతుంటాడు. నాకు జ్ఞానం లేనప్పుడు మావాళ్ళు ఒకామెను అంటగట్టారు. ఆమె ద్వారా సంతానం వున్నట్లు చెప్తాడు మామగారు. అది వట్టిది. సంతానం కలుగలేదు. జ్ఞానం వచ్చాక ఈమెను ప్రేమించాను. ఆమె కూడా ప్రేమించింది. నాకిది వరకే పెళ్లయిందని చెప్పాను. నన్ను విడిచి వుండలేనంది. ఆమెను విడిచేసి ఈమెతో వచ్చెయ్యక తప్పింది కాదు. మీ కివ్వాల్సిన అద్దెను యివ్వకుండా వచ్చేసినందుకు క్షమాపణ చెప్పుకుంటున్నాను. ఈ గాజుల జతతో సగం తీరినట్లే మిగతాది ముందు ముందు యిచ్చుకుంటాను. ఆమెను నర్సింగు హోమ్ లో చేర్పించా ! ఉద్యోగం వేట సాగిస్తున్నాను. సరస్వతి గార్కి మా నమస్కారాలు చెప్పండి. ఆమె ఋణం ఎన్నటికీ తీర్చుకోలేము. అంత మంచివాళ్ళు ఈ రోజుల్లో దొరకరు. మీరు అదృష్టవంతులు. అమ్మాయి పుడితే ఆవిడ పేరు , అబ్బాయి పుడితే, మీ పేరు..."

ఇద్దరు నవ్వుకున్నారు.

"నీకు ఆడపిల్ల పుడితే, కుమారి పేరు పెడతావా ఏం?" సరస్వతి నవ్వుతోంది.

'మరీ బిగ్గరలో నవ్వకేం ప్రమాదం. చెడ్డవాళ్ళ మంచితనం అంతటి ప్రమాదం' అన్నాడు కామేశం.

# ఉద్ధరింపు

## – కొడవటిగంటి కుటుంబరావు

### (ఆంధ్రపత్రిక, 1950 జనవరి 1 సంచిక నుంచి)

సీత లేచిపోవటంతో నరసింహంగారి కుటుంబం మీద పిడుగు పడ్డట్టయింది. ఆయనా, ఆయన భార్య శేషమ్మా, కొడుకు పానకాలరావూ అనేక రోజుల పాటు పడ్డ ఆవేదన చూస్తే ఎవరికన్నా కడుపు తరుక్కుపోవలసిందే. తమకు మద్రాసు మహానగరంలో ఉన్న ప్రతిష్ఠ యావత్తూ మంటగలిసినట్టూ, ఇక నలుగురిలోనూ తల ఎత్తుకు తిరిగే అవకాశం తమకు లేనట్టూ వాళ్లు విలపించారు.

నిజానికి నరసింహంగారికి అటువంటి కీర్తి పట్టణంలో లేదు. అది ఆయన తలకాయలో మాత్రమే ఉంది. ఆయన పదిహేనేళ్ళనుంచీ పట్నంలో ఉంటున్నాడు. ఆయనకు కార్పొరేషనులో చిన్న ఉద్యోగం. ఆయనకున్న ఆ ఒక్కకొడుకూ, కూతురూ పట్నం తప్ప మరొక జన్మస్థలం ఎరగరనే చెప్పాలి. పానకాలరావు పట్నంలోనే చదివి, చదువు పూర్తి చేసి, ఏదో కంపెనీలో ఎకౌంటెంటుగా ఉండి ఇప్పుడిప్పుడే నూరు రూపాయలు తెచ్చుకుంటున్నాడు.

ఈ పదిహేనేళ్ళ కాలంలోనూ నరసింహంగారు స్వయంగా చాలా మంది పరిచయం సంపాదించాడు గాని వారి కుటుంబానికి ఎక్కువ కుటుంబాలతో సాన్నిహిత్యం ఏర్పడలేదు. శేషమ్మగారు అరవం బాగా మాట్లాడటం నేర్చుకున్న తరవాత చుట్టుపక్కల ఉండే అరవస్త్రీలతో కొంత స్నేహం చేసింది. ఇటు నరసింహం పరిచయస్థులుగాని, అటు శేషమ్మ స్నేహితురాళ్ళుగాని వీరి కుటుంబ గౌరవం తాలూకు ఒడుదుడుకులను గురించి విమర్శించేవాళ్ళు కారు. శేషమ్మగారు నరసింహంగారి భార్య కాదని అకస్మాత్తుగా తెలిసినా ముక్కుమీద వేలు వేసుకునే ఓపికా, తీరికా ఎవరికీ లేదు. నరసింహంగారు పెద్ద ఉద్యోగంలో ఉంటే, వేలకు వేలు సంపాయిస్తుంటే, ఆయనకుటుంబానికి మరింత పలుకుబడి ఉండేదేమో. కాని, ఎప్పుడన్నా పుష్కరానికొకసారి ఎవరన్నా చూడవచ్చినప్పుడు ఇంత కాఫీ అయినా నమ్మకంగా కాచిపోసే స్థితిలో లేని నరసింహంగారి సంసారం గురించి ఎవరు బాధపడతారు?

పోతే, నరసింహంగారి కుటుంబంయెక్క యోగక్షేమాలను గురించి ఎప్పుడన్నా విచారించేవాళ్ళు ముగ్గురు నలుగురున్నారు. వాళ్ళు తెలుగువాళ్ళే. అందులో ఒకావిడ మొగుణ్ణీ, ఇద్దరు పిల్లల్నీ వొదిలేసి వచ్చి ఎవరో నాయుడుతో ఉండి, ఆ నాయుడి భార్యనని చెప్పుకుంటున్నది. ఆవిడ ఈ కుటుంబానికి ఒక ఆప్తస్నేహితురాలు, ఎప్పుడన్నా ఆవిడ టాక్సీలో దిగి గంటా రెండుగంటలూ కూచుని, శేషమ్మగారు ఏ పని చేస్తుంటే ఆ పనిలో చెయ్యి చేసుకుని, అడిగి కాఫీ పెట్టించుకుని , కాఫీ పొడరు లేకపోతే ఒక పావు పాను తన డబ్బుతో తెప్పించిపెట్టి, నూరురూపాయల్లో "అద్భుతమైన" చీరెలు ఎక్కడ దొరుకుతాయో చెప్పి తన దారిన తాను పొయ్యేది. ఆవిడ వచ్చి వెళ్ళిన తరవాత శేషమ్మ గారు చాలా సేపు ఆవిణ్ణి తలుచుకుని అసూయపడేది.

సీతతో హైస్కూల్లో చదివిన మరొక పిల్ల అక్క ఒకతె నరసింహంగారి కుటుంబానికి స్నేహితురాలు. ఈ అమ్మాయి డాన్సు చేస్తుంది. నెలకు ఒక డాన్సు ప్రదర్శనం ఇస్తూ ఉంటుంది. వీటి మీద ఈవిడ చాలా సంపాదించేటట్టు కనిపిస్తుంది. వాళ్లిల్లు లక్ష్మీతో తులతూగుతూ ఉంటుంది. మనిషి కూడా ఆమెను పెళ్ళాడతా మని ఒకప్పుడు వచ్చారు. కాని వాళ్ల నాన్న పడనివ్వలేదు. ఇప్పుడామె పెళ్ళి ప్రస్తావన ఎవరూ

చెయ్యరు. కాకపోయినా ఆమెకు తీరిక లేదు. ఎప్పుడూ పొరుగూళ్ళకు పోతూ ఉంటుంది. ఏ వూరన్నా వెళ్ళి ఒక డాన్సు చేసిందంటే పదిపదిహేనురోజుల దాకా ఆ వూరి వాళ్లు ఆమెను పోనివ్వరట. ఈ అమ్మాయి మొట్టమొదటిసారి నరసింహంగారింట అడుగుపెట్టడానికి కారణం సీతే అయినా, ఒక్క క్షణంలో శేషమ్మగారు ఈమెతో ఎంత గాఢ స్నేహం చేసేసుకున్నదంటే, ఆ తరువాత ఆమె శేషమ్మగారి కోసమే వచ్చేది. ఈవిడ కూడా కాఫీ అడిగిపుచ్చుకునేది.

దేశంలో నరసింహంగారికీ, శేషమ్మగారికీ బంధువులున్న మాట నిజమే. కాని వాళ్ళందరితోనూ నరసింహంగారు ఏనాడో సంబంధాలు తెంచుకున్నాడు. సగం వాళ్ళ మీద ద్వేషంతోనే ఆయన ఉద్యోగం కోసం మద్రాసు వచ్చాడు. ఇప్పుడాయన కెవరూ ఉత్తరాలు రాయరు, ఆయన అంతకన్నా రాయడు. సీత పెళ్ళి గురించి ఆయన చాలా కాలం నుంచీ ఆలోచిస్తున్నప్పటికీ అయిన వాళ్ళల్లో ఒక్కరికి కూడా సహాయం చెయ్యమని ఆయన ఒక కార్డు ముక్క గీకిన పాపాన పోలేదు.

అందుచేత సీత లేచిపోవటంవల్ల తనకున్న సంఘగౌరవం ఏదో పోయిందని నరసింహంగారు గాని, ఆయన కుటుంబంగాని ఆట్టే విచారించవలసిన అవసరం లేదు. అయినా వాళ్ళు విచారించారంటే దానికి కారణం, వాళ్ల అలవాట్లన్నీ పట్టణవాతావరణానికి అనుగుణంగా మారినప్పటికీ, మనః ప్రవృత్తులు – ముఖ్యంగా అవ్యక్త మనః ప్రవృత్తులు – ఇంకా పాత వాతావరణానికి అనుగుణంగానే ఉన్నాయి.

సీత లేచిపోవటానికి కారణాలు చాలా ఉన్నాయి. ఆమె స్కూలుఫైనలు దాకా చదువుకున్నది. చదువుకుంటున్నన్నాళ్ళూ చదువులో నిమగ్నురాలై ఇతర విషయాలు గమనించలేదు. కాని చదువు మానేసినప్పటినుంచీ ఆమె తన వాతావరణం మీద తిరగబడసాగింది. ఈ తిరుగుబాటంతా ఆమె హృదయంలోనే జరగటం వల్ల ఎవరూ గమనించలేదు.

పదహారు పదిహేడేళ్ల వయసు వచ్చి, కొంత చదువుండి, పుస్తకాలు చదవటంలో అపారమైన ఆసక్తిగల పిల్లకు కొన్ని కోరికలు కలగడంలో వింతలేదు. పైగా పట్టణ వాతావరణం మరికొన్ని ప్రేరణలు కూడా కలిగిస్తుంది. కాని ఈ కోరికలు ఫలించే అవకాశం లేదు. సీతకు జీవితంలో ఎంత ఆనందం ఉన్నదో తెలుసును. చిన్న చిన్న బస్తీలలోనూ, పల్లెటూళ్లలోనూ ఉండేవాళ్ళు ఊహించలేని సుఖాలను సీత ప్రత్యక్షంగా చూస్తూ వచ్చింది. మంచి చీరెలు కట్టుకుని, అందంగా తయారై పార్కులకూ, బీచికీ, సినిమాలకూ, పాట కచ్చేరీలకూ, పార్టీలకూ, ఎగ్జిబిషనులకూ వెళ్ళే పిల్లల్ను త్తనెరుగును. ఇంట్లో కూచుని రేడియో వినవచ్చు. స్నేహితురాళ్ళతోనూ, వాళ్ళ అన్నలతోనూ పిక్నెకులకు వెళ్లవచ్చు. పెళ్ళయితే మొగుడితోనే షికార్లు వెళ్ళవచ్చు. కాబోయే భర్తను ముందుగా చూసుకుని, మాట్లాడి, అతని మీద ఇష్టం కలిగించుకోవచ్చు. ఈ పనులన్నీ చేసే వాళ్ళను సీత ఎరుగును. కాని ఇవి తనకు అందుబాటులో లేవు. ఎందుకు అందుబాటులో లేవో సీత తెలుసుకోవటానికి ప్రయత్నించింది. తన అన్నా, తండ్రీ చెప్పిన కారణాలలో ఆమెకు నమ్మకం కలగలేదు.

తిరగటం వల్ల మనస్సుకు కలిగే ఆనందం పాపహేతువన్నట్టూ, తిరగటం వల్లనే పట్టణంలో ఆడవాళ్ళు అవినీతిపాలవుతున్నట్టూ వాళ్ళు మాట్లాడారు. సీత ఈ మాట నమ్మలేకపోగా ఆగ్రహం కూడా తెచ్చుకున్నది. తాను ఎరిగిన స్నేహితురాళ్ళు అవినీతిపరులా? అవినీతిపరులైన ఆడవాళ్లకు తమ ఇంట్లో కాఫీ లెందుకు పోస్తున్నారు? వాళ్ళను దూరంగా ఉంచరేం?

మగవాళ్లు ప్రతిదానికీ డబ్బులేకపోవటం ఒక అభ్యంతరంగా చెప్పేవాళ్ళు. అరమైలు దూరంలో ఉన్న పార్కుకు రోజూ నడిచి షికారు వెళ్ళటానికి డబ్బెందుకూ? ఏడాది కొక మంచి సినిమా చూడటానికి డబ్బు లేకుండా ఉందా? నెలకొక పుస్తకం కొనటానికి డబ్బు లేదా?

తన ఇంట్లో ఉన్న వాతావరణం మీద సీత తిరగబడింది. వాళ్లకి జీవించటం చాతకాదని ఆమె నిర్ణయించుకున్నది. డబ్బు ఇబ్బందులు ఉండవచ్చుకాక, తన తండ్రీ, అన్నా చూపించే సంస్కారానికి దారిద్ర్యంతో ఏమీ సంబంధం లేదని నిశ్చయించుకున్నది.

సీత తిరుగుబాటులో రెండో దశ ఒక పత్రికతో ఆరంభమయింది. తన స్నేహితురాళ్ళ దగ్గర తీసుకుని పత్రికలు అధికంగా చదివేది సీత. ఒక పత్రికలో ఆమె ఒక కథ చదివింది. అది రాసినతని పేరు రామదాసు. ఆ కథ చదివేటప్పుడు ఆమెకు రామదాసు తనతో మాట్లాడుతున్నట్టే, అందులో ప్రతిమాటా తనకు అర్థం కావటానికి రాసినట్టే తోచింది. సీత ఎన్నో కథలు చదివింది గాని ఇటువంటి భావం ఆమెకు ఎన్నడూ కలగలేదు. పైగా ఆ కథలో కథానాయిక తనవంటిదిగానే తోచింది. కనీసం ఆమె సంస్కారం ఆమె పరిసర వాతావరణం కన్నా ఉన్నతంగా ఉంటుంది. ఆమెకన్నా సంస్కారంలో హీనులైనవారు ఆమె జీవితాన్ని నిర్ణయిస్తారు.

ఈ కథ చదివిన తర్వాత చాలా రోజులు సీత ఇంకొక విషయం గురించి ఆలోచించలేక పోయింది. ఆఖరుకు కవరు సంపాదించి రామదాసుకు పత్రిక పేర లేఖ రాసింది. అందులో ఆమె ఏమీ విశేషంగా రాయలేదు. ఫలానిపత్రికలో ఫలాని కథ చదివాననీ, అది తనకెంతో బాగున్నదనీ రెండు ముక్కలు రాసింది. ఆమె తలలో ఎన్నో పేజీలు నింపే ఆలోచనలున్నట్టు తోచిందిగాని అవి మాటలలో ఇమడలేదు. ఈ ఉత్తరం పోస్టులో వేసిన తరవాత ఆమె కేదో భయం పట్టుకున్నది – ఆ రామదాసు తనను గురించి ఎటువంటి ఆపోహలు పడుతాడో, ఎవరికైనా తనను ఎరిగిన వాళ్లకు చూపిస్తాడేమో, తనను గురించి చులకనగా ఎవరితోనన్నా మాట్లాడుతాడేమో అని, ఉత్తరంలో తన ఎడ్రసు ఇవ్వలేదు కనక అతను సమాధానం రాస్తాడనే భయం లేదు. అది ఎవరికంటనన్నా పడుతుందనే భయం లేదు.

ఆ సంఘటన అంతటితో అయిపోవలసిందే. కాని మరొక రెండునెల్లకు ఒక స్నేహితురాలి ఇంట సీతకు ఈ రామదాసే తటస్థపడ్డాడు! అతను పాతికేళ్లలోపువాడు. ఇంజనీరింగు కాలేజీలో చదువుతున్నాడు. ఆ విధంగా అతను సీత స్నేహితురాలి అన్నను తెలుసును.

అతనే రామదాసనీ, తను ఆనందించిన కథ రాసినవాడనీ తెలియగానే సీత తెల్లబోయింది. కాని అతను తన పేరు విని ఏమీ కాలేదు. ఆమెకేసి విచిత్రంగాకూడా చూడలేదు. తను రాసిన ఉత్తరం అతనికి చేరినట్టు లేదు. ఇంకెవరి చేతిలో పడిందో!

రామదాసు కథ సీతకు నచ్చటంలో ఆశ్చర్యం లేదు. అతని మాటల ధోరణీ సీతకు నచ్చింది. జీవితం పట్ల అతనికి స్వతహాగా కొంత అసహనం ఉన్నది. దాన్ని అతను తన మాటల్లోనే తెలియజేశాడు.

"జీవితం బాగా లేదని ఎవరన్నా నసపెట్టవచ్చు. కాని దాన్ని మార్చటానికి ఎవరు ప్రయత్నిస్తున్నారు? అటువంటి ప్రయత్నం ధనికులు మాత్రమే చెయ్యగలుగుతున్నారు. అందుకనే ఈ జీవితంలో దరిద్రులకూ, పనులు చేసుకునేవారికీ స్థానం లేదు. జీవితాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవటానికి ధనికులు చేసే ప్రయత్నాలను అడ్డగించేవారు లేరు. అటువంటి ప్రయత్నమే బీదవాళ్లు చేస్తే వాళ్లకోసం లాటీలూ, తులాకులూ, జైళ్ళూ సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిస్థితి మారదు. కొందరు పేదలు చావటానికి సిద్ధపడి సరిఅయిన కృషి చేస్తే గాని మారదు. సోషలిజం మన్న మాట విన్నా, కమ్యూనిజం అనే మాట విన్నా హరిహరీ అని చెవులు మూసుకునే మనం జీవితాన్ని ఏ విధంగా మార్చాలో కూడా తెలీని స్థితిలో ఉన్నాం. ఇక మనం మార్చేదేమిటి?" అని అతనన్నాడు.

చాలా సేపు వాదన జరిగింది. రామదాసు మాట్లాడుతున్నంత సేపూ సీతకు తానే మాట్లాడుతున్నట్టున్నది. అతను చెప్పే విషయాలు తనకు తెలుసునని కాదు. అతన్ని చెప్పే విషయాలు తనకు తెలుసునని కాదు. అతన్ని ఖండించేవాళ్ళకు అతనికి తెలిసిన విషయాలు తెలీవు. అతని కున్న జ్ఞానం లేదు. తన ఇంట్లో తన స్థితి ఎట్లా ఉన్నదో, ఈ సమావేశంలో రామదాసు స్థితి అట్లాగే ఉన్నది. అతను ఎదిరించి పోట్లాడుతున్నాడు; తను ఎన్నడూ పోట్లాడలేదు. అంతే తేడా.

అక్కణ్ణుంచి బయలుదేరేటప్పుడు సీత ఎక్కిన బస్సులోనే రామదాసు కూడా ఎక్కాడు. టిక్కెట్టు కొనబోతూ "మీరెందాకా?" అన్నాడు. వద్దంటున్నకొద్దీ తనక్కూడా టిక్కెట్టుకొన్నాడు. మర్యాదకు ఏదన్నా మాట్లాడాలనుకున్నదిగాని ఏం మాట్లాడాలో సీతకు తెలియలేదు. అతను పార్కు దగ్గర దిగిపోతూ, "కాసేపు పార్కులో కూర్చుందాం, రాకూడదూ?" అన్నాడు. సీత కొంచెం సంకోచించి అతని వెంట దిగింది. "ఈ

మనిషితో – పరాయివాడితో – పబ్లిగ్గా పార్కులో కూర్చుంటావా?" అని ప్రపంచం తనను ప్రశ్నించినట్టు ఊహించి సీత ప్రపంచం మీద మండపడింది "ఏమిటి తప్పు? దురుద్దేశం కలదాన్నయితే అందరూ చేరే చోట పరాయిమనిషితో కూర్చుంటావా?" అని ప్రపంచానికి సమాధానం చెప్పింది.

ఇద్దరూ వెళ్ళి ఖాళీగా ఉన్న పార్కు బెంచిం మీద కొంచెం ఎడంఎడంగా కూర్చున్నారు.

"మీ ఉత్తరం అందింది. సమాధానం రాయాలంటే ఎడ్రసు తెలీలేదు" అన్నాడు రామదాసు.

సీత గుండె ఒక్కసారిగా ఆగిపోయింది.

వాళ్ళిద్దరి స్నేహానికీ అదే మొదలు. అది చాలా రోజులు గురుశిష్యసంబంధంగా ఉండేది. రోజూ ఆ పార్కులోనే ఇద్దరూ కలుసుకునేవాళ్ళు. ఒక్కొక్కసారి అతని వెంట స్నేహితులుండేవాళ్ళు. ఎప్పుడన్నా సీత వెంట కూడా స్నేహితురాళ్ళూ, ఎరిగినవాళ్ళూ ఉండేవాళ్ళు. రామదాసు సాధారణంగా సంఘం గురించీ, సోషలిస్టు వ్యవస్థను గురించీ మాట్లాడేవారు. ఆదిమ సమాజం ఎట్లా మారూతూ వచ్చింది చెప్పేవాడు. అతను చెప్పే విషయాలు ఎంత విడ్డూరంగా ఉన్నా నిజమల్లే తోచేవి.

"అవునుగాని, ఇవన్నీ మీరెక్కడ చదువుతారు? వీటిని గురించి పుస్తకాలున్నాయా? ఉంటే నా కివ్వగలరా?" అన్నది సీత.

ఆ తరవాత రామదాసు ఆమెకు దజను కొద్దీ పుస్తకాలు ఎక్కడినుంచో, ఎవరెవరివో తెచ్చి ఇవ్వసాగాడు. ఈ పుస్తకాల మాదిరిగా సీత మానసిక చైతన్యానికి మేత దొరికింది. ఇవాళ ఉన్న కులాలూ, కులతత్వాలూ, కులాచారాలూ ఒకనాడు లేవనీ, కొంత కాలానికి పోవచ్చుననీ తెలుసుకున్నప్పుడు సీత ఆశ్చర్యానికి మేరలేదు.

సీతను ప్రణయంలోకి దింపినవాడు కూడా రామదాసే. అతను సీత ప్రేమను ఆశించను కూడా లేదు, ప్రస్తుత సమాజంలో స్త్రీపురుషులు ఒకరినొకరు అర్థంచేసుకోవటంగాని, అభిమానించి ప్రేమించుకోవటంగాని ఎంత ప్రమాదకరమో చెప్పాడు.

అతను తనమీద ప్రేమతో ఎంత బాధ పడుతున్నదీ అతని నోటనే చెప్పించింది సీత.

"నీకు ఒకమనిషి మీద ప్రేమ ఉన్నట్టు బయటపెట్టడం కూడా ఈ దిక్కుమాలిన కాలంలో అశ్లీలమే. పెళ్ళిళ్లకు ఇన్ని హద్దులు ఏ సమాజంలోనూ లేవు." అన్నాడు రామదాసు.

తనకూ, రామదాసుకూ కులభేదం ఉన్నదని సీతకు అదివరకే తెలుసు.

"వెనకటికన్న ఇప్పుడు పెళ్ళిళ్ళు నయం కాదా?" అన్నది సీత.

"ఏం మారిందని? కొందరు డబ్బున్న వాళ్ళూ సాహసించగలుగుతున్నారు. మిగిలిన వాళ్లు సంస్కారవివాహాలు చేసుకోలేరు."

"మనిద్దరం పెళ్లి చేసుకుని చూద్దాం, ఏం జరుగుతుందో?"

"ఏం జరుగుతుందో ముందుగా తెల్సుకోలేమా? నేను మీ కులం కానందు కెవరూ అభ్యంతరం చెప్పరు – కనీసం వాళ్లకు ఆ అభ్యంతరంకంటే నేను ధనవంతుణ్ణి కాననే అభ్యంతరం జాస్తిగా ఉంటుంది" అన్నాడతను.

సీత రామదాసును పెళ్ళి చేసుకుందామనుకున్నది. ఈ విషయం తన తండ్రితోనూ, అన్నతోనూ, తల్లితోనూ మాట్లాడదామనుకున్నది. కాని మామూలు విషయాలలోనే మధ్యయుగం మనుష్యులల్లే ప్రవర్తించేవాళ్ళతో ఈ పెళ్ళివిషయమై వితర్కించ బుద్ధిపుట్టలేదు.

ఆమెకు మొదట్లో లేచిపోదామన్న సంకల్పం లేదు. కాని చదువు పూర్తి అయి రామదాసు పట్నం వదిలిపోతున్నా డనేసరికి ఆమెకు ఏదో చెయ్యవలసిన అవసరం కలిగింది. చాటుగా పెళ్ళి చేసుకోవటానికామె మేజరు కాదు.

రామదాసు ఆఖరుసారి ఆమెను పార్కులో కలుసుకుని శలవు పుచ్చుకున్నాడు.

“ఆడవాళ్ళమీద నాకున్న గౌరవం ఎక్కువయేటట్టు చేశావు. అందుకని నిన్నెప్పుడూ మరిచిపోను.” అన్నాడు రామదాసు.

అతను మర్నాడు మెయిలుకు వెళ్ళిపోతున్నాడు. ఆరోజు సాయంకాలం సీత అర్ధరూపాయి డబ్బులు చేత పుచ్చుకుని పార్కు దగ్గరికి మామూలు ప్రకారమే వచ్చింది. సెంటలు స్టేషను వేపు వెళ్ళే బస్సులో ఎక్కి స్టేషనుకు టిక్కెట్టు కొన్నది.

రైలు బయలుదేరటానికింకా పదిహేను నిముషాలున్నది. ప్లాట్ ఫారం టిక్కెట్టు కొని మెయిలు పెట్టెలు వెతకసాగింది. రామదాసు మూడో తరగతి పెట్టెలో ఒక మూల కూర్చుని ఏదో ధ్యానం చేస్తున్నాడు. సీతను చూసి కంగారుగా బయటికి వచ్చాడు.

“నన్ను కూడా తీసుకు వెళ్ళండి — అభ్యంతరం లేకపోతే.” అన్నది సీత.

రామదాసు సంకోచించాడు.

“మీ కభ్యంతరమైతే ఇంటికి వెళ్ళి పోతాను.”

“నా గురించి ఏమీ అభ్యంతరం లేదు. నువు?”

“ఆలోచించుకునే వచ్చాను ... నే నాఇంట్లో ఉండలేను. నరకం.”

“టైము లేదు. టిక్కెట్టు కొనుక్కొస్తానుండు.”

రైలు సాగిన తరువాత రామదాసు సీతకు తన పరిస్థితి చెప్పాడు.

“నువు మా ఇంటికి రావచ్చు. మా ఇంట్లో కూడా మీ మాదిరిగానే శాకాహారం తింటాం. కాని మా వాళ్ళను నువు భరించలేవు. వాళ్ళు కొద్దిగా చదువుకున్నవాళ్ళు. నాజూకు లెరగని మోటువాళ్ళు. పల్లెటూరు కూడాను.”

“ఫరవాలేదు. నాకోసం మీరేమీ ఇబ్బంది పడక్కర్లేదు. మీకు మీ వాళ్లకూ మధ్య భేదాలు పెట్టాలంటే ఉద్దేశం నాకెన్నడూ లేదు. మీ వాళ్ళ జీవితం యధార్థమైన జీవితమని నా నమ్మకం. అందుచేత భరించగలుగుతున్నాను.” అన్నది.

సీతమాట ఎట్లా ఉన్నా, ఆమెను చూసి రామదాసు తల్లిదండ్రులు చాలా సంతోషించారు. ఆమె తన స్నేహితురాలని అతను వాళ్ళతో చెప్పాడు. “ఆమె ఏకులం? మన ఇంట్లో ఉంటుందా? మనను చూసి అసహ్యించుకోదా?” ఈ విధంగా రామదాసును ప్రశ్నించారు. వాళ్ళు ఆమె కోసం కొన్ని తెచ్చి పెట్టుకోవటానికి ప్రయత్నించారుగాని రామదాసు నిరుత్సాహపరిచాడు.

సీత అన్నది నిజమయింది. రామదాసు చుట్టాలు కపటంలేని వాళ్ళు, సహజమైన భావాలు గలవాళ్ళు; ప్రయోజనకరమైన వ్యాపకాలున్న వాళ్ళు, ఇంటిమీదా, పని మీదా వాళ్ళకున్న శ్రద్ధ అపారం.

రామదాసు బీదవాడు కాదు. పెద్ద భాగ్యవంతుడు కాకపోయినా అతనికి చాలా పలుకుబడి ఉన్నది. ఈ వ్యవసాయం చేసుకునే వాళ్ళలో మర్యాదలకు లోటు లేదు కాని కపట నియామాలు లేవు. సీతకు ఇప్పుడు సరిగా గాలి పీలుస్తున్నట్టుంది.

సీత ఫలాని చోట ఉన్నది కనిపెట్టటానికి నరసింహంగారికి వారం రోజులు పట్టింది. వెంటనే ఆయనా, పానకాలరావూ బయలుదేరి వచ్చారు. రామదాసు ఇంట్లో లేడు. అతనూ, సీతా సాయంకాలం పూట పొలాల్లోకి వెళ్లారు.

చెరువు దగ్గర వాగ్యుద్ధం సాగింది. మొదట్లో రామదాసు మట్లాడాడు. తరువాత సీత కూడా మాట్లాడింది. తండ్రి కొడుకుల వాదనలు వినదలచలేదు. సీతను తను వెంట పంపకపోతే పోలీసులకు రిపోర్టిస్తామన్నారు.

“మీకు నా మీద గల ప్రేమ చూస్తే కడుపు నిండిపోయింది. కాని మీ వెంట వస్తే నాకేం చేస్తారు? నా కిష్టం లేని మనిషి నిచ్చి పెళ్ళి చేస్తారా? లేకపోతే మీ వంశ గౌరవం దక్కించుకునేందుకు నన్ను యావజ్జీవనరకంలో ఊరేస్తారా? నేను కులం చెడ్డాననీ, బజారుదాన్నయినాననీ ఇప్పుడే అంటున్నారు కదా, చూస్తూచూస్తూ పరువుగలవాడి కెట్లా ఇచ్చి చేస్తారు?” అన్నది సీత.

“నీ తెలివితేటలు చూసి సంతోషించటానికి రాలేదు. నువు వెంటనే బయలుదేరి వస్తావా? కేసు పెట్టమన్నావా?” అన్నాడు పానకాలరావు.

“ఏమనీ కేసు పెడతారు?” అన్నది సీత రామదాసుతో.

“నువు మైనరువు. కేసు పెట్టవచ్చు.”

“ఎప్పటికి మేజరు అవుతాను?”

“పద్దెనిమిదేళ్ళకు.”

“ఇంకోఏడాదికా? మళ్ళీ వస్తాను. చెప్పకుండా వెళ్ళానని మీ వాళ్ళనుకుంటారేమో. తొందరగా బయలుదేరానని చెప్పండి,” అని సీత తన వాళ్ళతో బయలుదేరింది.

సీతను తిరిగి తీసుకొచ్చిన తరువాత ఇంట్లో అందరూ కుక్కను చూసినట్టు చూశారు. సీత అభ్యంతరం చెప్పలేదు. ఆమె రామదాసును పూర్తిగా మరిచిపోయినట్టు కనపడింది. కాలక్రమాన వాళ్ళు కూడా మరిచిపోయారు.

ఆరు నెల్లు గడిచింది. సీతకు సంబంధాలు విచారించసాగారు. తనకు పెళ్ళి అక్కర్లేదన్నందుకు పానకాలరావు, “అవును, రంకు సాగితే పెళ్ళెందుకు?” అన్నాడు.

సీత నవ్వి, “నీ నిజమైన సంస్కారం చూపించటానికి ఎంత మంచి అవకాశాలిస్తున్నాడు!” అన్నది.

సంవత్సరం అయింది. ఒకనాడు అకస్మాత్తుగా సీత బయటికి బయలుదేరింది.

“ఎక్కడికే ?” అన్నది తల్లి. ఇంట్లో ఇంకెవరూ లేరు.

“వెళ్లానని చెప్పు. చెప్పకుండా వెళ్ళినందుకు నాన్ననూ, అన్నయ్యనూ ఏమి అనుకోవద్దు. అయినా వాళ్ళు నాకు తగిన మర్యాద చూపించలేకపోయారు. అందుచేత వాళ్ళకు చెప్పనవసరం లేదు” అంటూ సీత బయటికి వచ్చింది.


తలి కేక వేస్తూ బయటికి వచ్చింది. కాని ఆవిడమొర ఎవరాలకిస్తారు? రోడ్డువెంట పొయ్యే బస్సుల రొదలో ఆవిడకేక లెవరూ వినిపించుకోలేదు.

సీత పార్కు దగ్గరికి వచ్చింది. అక్కడ ఆమె కోసం రామదాసు కనిపెట్టుకుని ఉన్నాడు.

# తోకాడించని కుక్క

## – పినిశెట్టి శ్రీరామమూర్తి

## ( యువ, 1974 సంచిక నుంచి)




ఈ మాట కొందరికి ఆశ్చర్యంగా తోచవచ్చు. మరికొందరికి హాస్యంగా స్ఫురించవచ్చు కాని, "నోరుండి మాట్లాడలేని వాళ్ళు, చెవులుండి వినలేని వాళ్ళు, కళ్ళుండి చూడలేని వాళ్ళు మన మనుషుల్లో వుండగా వెధవది మాటామంతీ లేని కుక్క తోకవుండి ఆడించలేక పోయిందంటే ఆశ్చర్యపోవడం ఎందుకూ."

సుబ్బారావుకు మొదటినుంచీ కుక్కలంటే పరమ అసహ్యం. అంతే కాదు ప్రబల విరోధం కూడా. తను బ్రహ్మచారిగా వుంటూ, కాలేజీలో చదివే రోజుల్లో ఒక నాడు తీయటి కలల కోసం ఎదురు చూస్తూ, అర్ధరాత్రి నిద్రకోసం తపస్సు చేసే సమయంలో నిద్రపట్టబోతూ వుండగా వీధి మొగలో ఒక కుక్క కొంప మునిగినట్టు మొరిగి మొరిగి ఎవరూ తనను ఖాతరు చేయడం లేదని బాధతో కుయ్యోమంటూ శోకాండాలు ప్రారంభించింది. దాని అరుపులకు సానుభూతి చూపిస్తున్నట్టుగా మరో నాలుగు కుక్కలు కంఠాలు కలిపినై. సుబ్బారావుకు ఈ హృదయ విదారక ధ్వనితో తీయటి కలలమాట అటుంచి నిద్ర కూడా పాడై కోపంతో లేచి, కర్ర తీసుకొని వీధిలోకి పరుగెత్తేడు. తీరా అతను వెళ్ళేసరికి ఒక్క కుక్క కూడా కనిపించ లేదు.

ఇది దినసరి కార్యక్రమైపోయి, ప్రాణం విసిగి, కుక్కలబాధ భరించలేక మరో వీధిలోకి మకాం మార్చాడు. కాలేజీకి కొంచెం దూరమని మొదట్లో బాధపడ్డా, ఆ గదిలో చేరిన్నాడు రాత్రి కుక్కల మొరుగుడు ఎక్కడా వినిపించకపోవడంతో "హమ్మయ్య" అంటూ పెద్దగండం గడిచినట్టు ఫీలయ్యాడు. ఆ రాత్రి తీయటి కలలు రాలేదు గాని చల్లటి గాలికి చక్కటి నిద్ర పట్టింది. ప్రొద్దుట వాతావరణం చూసి రాత్రి వర్షం కురిసినట్టు తెలుసుకున్నాడు రెండు రోజులు ఇలా గడవడంతో కుక్కలను తమ వీధి దరిదాపులకు రానీయని ఆ ఇళ్ళ యజమానుల నందరినీ మనస్సులో అభినందించుకున్నాడు.

బి.కాం. పరీక్షలు దగ్గర పడ్డం వల్ల రాత్రుళ్ళు చదవడం మొదలు పెట్టాడు. చదువు అనడంతోనే నిద్ర ముంచుక రావడంతో ఇప్పుడు కుక్కలు మొరిగితే ఎంత బావుండుననిపించింది సుబ్బారావుకు.

ఏదో విధంగా పరీక్షలు పూర్తయ్యాయి. ఫరవాలేదు పాసవగలనని గుండె దిటవు పర్చుకున్న తర్వాత గుండెల మీద చేయి వేసుకొని గత వారం రోజుల నిద్రబాకీని ఈ ఒక్కరాత్రి హాయిగా తీర్చేయాలని నిర్ణయించుకొని కళ్ళు మూశాడు. ఇంకా సరిగ్గా నిద్ర పట్టలేదు. ఇంతలో

ఒక వంద ఫిరంగులు పేలినట్టుగా, కొన్ని వందల వురుములు వురిమినట్టుగా, కొన్ని వేల జలపాతాల హోరులా రకరకాల ధ్వనులు వినవచ్చాయి. ఉలిక్కిపడి నిద్రలేచాడు సుబ్బారావు. కొత్తగా వచ్చాయో లేక తమ ధాటికి తప్పుకున్నాడని తనమీద కక్ష తీర్చుకోవడానికి వచ్చాయో తెలీదుగాని అరడజనుకు మించిన కుక్కలు భయంకరంగా మొరగడం ప్రారంభించాయి. అరగంట ఓపిక పట్టాడు. కాని వాటి అరుపులకు అంతం లేనట్లనిపించింది. ఆవేశంగా లేచి మంచం మీద కూర్చున్నాడు. ఏదో మంత్రం వేసినట్లు అరుపులు ఒకేసారి ఆగిపోయాయి. తనంటే భయం కాబోలు, తను లేచినట్లు ఎలా తెలిసిందో; అని తనలో నవ్వుకొని తిరిగి ఆ వీధిలోకి వెళ్ళిపోయి వుంటాయని నిర్ణయించుకొని ఈ సారి గట్టిగా నిద్రపోవాలని మెల్లగా కళ్ళు మూశాడు. అవి మళ్ళీ వచ్చి యుద్ధం ప్రకటిస్తాయని అతని మనస్సు శంకించక పోలేదు కాని పాపం మరోగంట వరకు వాటి అలికిడి లేదు.

ఈసారి వాటిసంఖ్య పదికి మించింది. ఇందాకటికి రెట్టింపు ధ్వనితో రకరకాలుగా మొరగటం ప్రారంభించాయి. ఆ అరుపులు సుబ్బారావుకు తనను ఛాలెంజి చేస్తూ మ్రోగిస్తున్న యుద్ధభేరీల్లా అనిపించాయి. లేచాడు నిద్రకళ్ళు ఒక్కసారి నలుపుకున్నాడు, ఆత్మ రక్షణార్థం మంచం క్రింద వుంచిన దుడ్డుకర్రను చేబూని, అలజడయితే శతృవులు పారిపోతారని నిశ్శబ్ధంగా, అడుగులేసుకుంటూ వీధిన పడ్డాడు. నాలుగురోడ్ల కూడలిలో కుక్కలు సమావేశమై సమూహంగా సన్నాయి మ్రోగిస్తున్నాయి. అది వేసవి కాలం కావడం వల్ల కొందరు అరుగులమీద పడుకొని, ఆ అరుపులకూ తమకూ అసలు సంబంధం లేనట్టు గుర్రు పెట్టి మరీ నిద్రపోతున్నారు. కుంభకర్ణుడిని మరిపించే వాళ్ళ నిద్రలకు, వీధి వాళ్ళను దూషించకూడదనుకున్నా తెగ తిట్టిపారేసుకున్నాడు మనసులో. కుక్కల సైన్యానికి దగ్గర పడ్డాడు. గురి చూసి ఆ దుడ్డు కర్రను బలం కొద్దీ వాటి మీదకు విసిరాడు. అంతే ! ఆ కర్ర గురితప్పింది. అది పెంటపోసే డబ్బాకు తగిలి "ధనాల్" మని పెద్ద ధ్వని చేసింది. కుక్కలు పారిపోయినా మరో అపాయం ఎదురైంది. ఆ డబ్బాతాలూకు ఇంటి వాళ్ళు అరుగు మీద పడుకున్నారేమో ఆ ఇల్లాలు "అమ్మో దొంగ" అని పొలికేక వేసి మరోమంచం మీద మంచి నిద్దర్లో వున్న వాళ్ళాయన్ని వాటేసుకుంది లేచీ లేవడంతోనే అతనూ "దొంగ దొంగ!" అని అరవడం మొదలు పెట్టాడు.

సుబ్బారావుకు కాళ్ళు వణకటం ప్రారంభించాయి. వణికే కాళ్ళను చూసే సరికి తన ఆకారం గుర్తుకొచ్చింది. కట్ బనీను, ఎరుపు మీద నల్లపువ్వుల సింగపూర్ లుంగీ... ఆ స్థితిలో ఎవరు చూసినా ఆ చీకట్లో దొంగను గురించి శ్రమపడకుండానే తన్ను పట్టుకుని తంతారని అర్థం చేసుకున్నాడు. పులిని చూసిన లేడిలా పరుగు లంకించుకున్నాడు. సుబ్బారావు తిరోగమనాన్ని గమనించిన కుక్కలు ఇదే సమయమనుకుని మొరుగుతూ వెంటపడ్డాయి. ఇంతలో వీధిలోని వారంతా లేచి కర్రలూ, కఠారులతో బయలు దేరారు. కుక్కల ధాటిని తప్పుకొని, ఊడిపోయే లుంగీపట్టుకొని గదిలో పడి తలుపు వేసుకొని లుంగీ మార్చుకొని వణుకుతూ మంచం మీద కూర్చున్నాడు. కుక్కలు మాత్రం తన గుమ్మం ముందు నిలబడి మొరుగుతూనే వున్నాయి. అనుకున్నంతా అయింది. తలుపులు దబదబమన్నాయి. సుబ్బారావు గుండె కొంచెం సేపు ఆగి మళ్ళా పని చేయడం ప్రారంభించింది. ఇంటి యజమాని లేచాడు. తలుపు తీసి "ఏమిటయ్యా! ఏమైంది" అని వాళ్ళను అడిగాడు. ఒక దొంగ పారిపోయి వస్తూ ఈ గదిలో దూరాడండి" అన్నాడొకడు "అర్జునా, పార్థవా, ఫల్గుణా" పిడుగు పడబోతున్నట్లు భావించి సుబ్బారావు గబగబ మంత్రాలు చదువుతున్నాడు. "సుబ్బారావు!" అన్న ఇంటి యజమాని గంభీరమైన పిలుపు సుబ్బారావు చెవిలో పిడుగులా పడింది. ఇక లాభం లేదనుకొని లేచి వణికేచేతుల్తో భయంగా తలుపు తీశాడు. ఎదురుగా ఒక ఏభైమంది వీరాధి వీరులు కర్రలతో నిలబడ్డారు. వాళ్ళకు తోడు సుబ్బారావు తలుపు తీయగానే మరో సారి "భోయ్" మన్నాయి. ఆ కుక్కల సపోర్టు ఆ వీధి వీరులకు అసహ్యమనిపించి, తమ ఆయుధాలు వాటిమీద ప్రయోగించడంతో కుయ్యోమంటూ తోక ముడుచుకొని పారిపోయాయి. "నీ గదిలోకి ఎవరన్నా వచ్చారా?" ఇంటి యజమాని ప్రశ్న. "అబ్బే! తలుపు గొళ్ళెం పెట్టి వుంటే ఎలా వస్తారండీ" అని ఎదురు ప్రశ్న వేసి తన సమయస్ఫూర్తికి తనే ఆశ్చర్యపోయాడు కాస్త తూలి తలుపు

పట్టుకున్నాడు. "అది నిజమే వీళ్ళంతా దొంగ దొంగ అని ఇంటిమీద పడితే అనవసరంగా లేవగొట్టా. మంచి నిద్దట్లో వున్నట్టున్నావ్ వెళ్ళి పడుకో" అన్నాడు సానుభూతిగా లోనికెళ్ళిన సుబ్బారావు మంచం మీద పడుకొని "భగవంతుడా ! ఈ రోజు పెద్ద ఆపదనుంచి కాపాడావ్!" అనుకున్నాడు మనసులో.

ఆ సంఘటన జరిగినప్పటి నుంచి సుబ్బారావుకు కుక్కను చూస్తే కోపం, ఒళ్ళు కంపరం వగైరా వగైరా ఒకేసారి పుట్టుకొస్తాయి.

ఆ తర్వాత పరీక్ష పాస్ కావడమూ బేంక్ లో వుద్యోగం రావడమూ, తదనంతరం కాస్త కట్నం తీసుకొని చక్కని చుక్కలాంటి సీతను భార్యగా స్వీకరించడము, మొదలైనవి రెండు సంవత్సరాల్లోనే పూర్తయ్యాయి.

ఆ ఇల్లాలి అదృష్టమా అన్నట్టు పెళ్ళికాగానే అతన్ని పట్నంలో పోస్టు చేశారు. పల్లెటూరి పిల్లయినా సీత, ఛాందస్సురాలు మాత్రం కాదు. ఇట్టే పట్టణావాసంలో కలిసిపోయే చనువు చకచకలు ఆమెలో వున్నాయి. అందుకే ఆదిలో కట్నం కోసం చదువు తక్కువైనా పల్లెటూరి పిల్లను చేసుకున్నానే అని ఫీలయిన ఫీలింగ్ కొద్దిరోజులు ఆమెతో కాపురం చేయగానే మాయమైంది సుబ్బారావులో.

తీసుకున్నది తక్కువ అద్దెలో వున్న బంగళా పెంకుల కొంపైనా చుట్టూ చిన్న కాంపౌండు, దానికో కర్రల గేటు ఉండటంతో ఆఫీసరు వుండే ఇల్లులా వుందని కొంతలో కొంత సంతృప్తి పడ్డాడు.

ఆ ఇంటికి వచ్చిన వారం రోజులకే తన ఇంటి ముందు చెత్త కుండీలో ఎంగిలాకు విసురుతూ సీత ఒక కుక్కను చూసింది. ఊరకుక్క అయినా దానిలో ప్రత్యేకత వుందనిపించింది. ఆకు వేయగానే కృతజ్ఞతతో సీతనొకసారి చూసి గంభీరమైన నడకతో ఆకు దగ్గరకు వెళ్ళి ఏమీ లేని విస్తరిని నాకటం మొదలు పెట్టింది. సీత మనస్సు చివుక్కుమంది. వెంటనే లోనికి వెళ్ళి కూరకలిపిన అన్నం కాస్త తీసుకవచ్చి ఆ కుక్కకు వేసింది. ఈ సారి "ఎంత మంచిదానవమ్మా" అన్నట్టు సీతను చూసి ఆ కుక్క ఆమె ఆతిథ్యాన్ని గౌరవ పునస్సరంగా స్వీకరించింది.

సీతకు కూడా కుక్కలంటే పెద్ద అభిమానం లేదుగాని, ఆ కుక్కంటే ఎందుకో సానుభూతి ఏర్పడింది. ఇక ఆ రోజు నుంచి కర్రలగేటు దగ్గర జీతం లేని గూర్ఖాలా కాపలా కాయడం ప్రారంభించింది ఆ శునక రాజం సుబ్బారావు వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ ఈ కుక్క తన గేటు దగ్గరే తిష్ఠ వేయడం చూసి కోపం ముంచుకొచ్చింది. అందులో తన విరోధి జాతికి చెందిందాయె "సీతా ఈ కుక్కేమిటిక్కడ?" ఉండబట్టలేక ఒక రోజున అడిగేశాడు. "ఇంట్లో కాదుగదండి.. వున్నది బైటేగా ! పైగా రాత్రిళ్ళు ఎవరినీ రానీయకుండా కాపలా కాస్తుందాయె" అంటూ తన పల్లెటూరి ధోరణిలోనే రాగంతీస్తూ సమాధానం చెప్పింది. "వెధవ కుక్కలంటే నా కసహ్యం" అన్నాడు. "ఈ కుక్క మంచిదేనండీ" అంది సీత. కోపంగా చూశాడు. సీత పకపకా నవ్వింది.

మరో రోజు సీత వంటగదిలో వుండగా "భౌవ్" మంటూ కుక్కల అరుపులు వినిపించాయి. అనుకోకుండా అభిమాన మేర్పడిన ఆ కుక్కను వేరే కుక్కలు కరుస్తున్నాయేమోనని వంట గది విడిచి పరుగున బైటికొచ్చింది సీత. ఇంకేముంది ... పది కుక్కలు తన కుక్కను చక్రబంధం చేశాయి. మధ్యన నిలచిన తన కుక్క వీరోచితంగా పది కుక్కలకూ సమాధానం చెబుతూ తన హక్కు భుక్తంగా భావించుకుంటున్న ఆ చెత్తకుండీని కాపాడుకోవడం కోసం ఘోరంగా యుద్ధం చేస్తోంది. ఆశ్చర్యమేమంటే ఆ పది కుక్కలు దీని ధాటికి తట్టుకోలేక తికమకపడిపోతున్నాయి.

తనకుక్క మీద వాటి వెధవ దౌర్జన్యం చూసి సీతకు మహా కోపం వచ్చింది. దగ్గరున్న రాయి తీసుకొని "ఛీ! ఛీ!!" అంటూ గట్టిగా వాటిమీదకు విసిరింది కాని, సుబ్బారావు చేతికర్రలా ఆ రాయి గురితప్పి తన కుక్కకే తగిలింది. కుక్క "కుయ్యో" మని "నన్ను కొట్టావేంటమ్మా" అన్నట్టు చూసింది పాపం. సీత విసిరిన రాయి తమ మీద పడకపోయినా, ఈ కుక్కకు మానవాంగన మద్దతు వుందని గ్రహించి, ఆ బలగమంతా పిక్క బలం చూపించాయి. సీత మాత్రం కుక్కను కాపాడపోయి దాన్నే కొట్టినందుకు చాలా బాధపడింది. వెంటనే లోనికి వెళ్ళి

తాను తినడానికి వుంచుకున్న అన్నాన్ని ఆకులో పెట్టి తీసుకొచ్చి గెటు తెరిచి ఆ కుక్క కెదురుగా పెట్టింది. ఈ ఆయాచిత ఆదరణకూ, ఆహ్వానానికి ఆ అమాయక జీవి, ఆశ్చర్యంగా తల పక్కకు వంచి చూసింది "తనకా? కాదా?" అన్నట్టు. 'నీకే ... రామ్మా" అంటూ ఆప్యాయంగా పిలిచింది సీత అర్థం చేసుకున్న కుక్క ఆత్రంగా రాలేదు. తన హుందాతనం తగ్గిపోకుండా మెల్లగా వచ్చి మరో సారి ఆమెను చూసింది. "తినూ" అంది సీత. ఇంక డౌట్ లేదనుకుందేమో వంచిన తల ఎత్తకుండా సుష్టిగా ఆరగించి మరోసారి చూపుల్తో సీతకు "థ్యాంక్స్" చెప్పి గేటువైపుకు వెళ్ళబోయింది. "అభీ" అని సీత పిలిచింది. ఇదేమిటి ? తనకు కొత్త పేరన్నట్లు తల పక్కకు వంచి వెనక్కి తిరక్కుండానే చూసింది. "నువ్వు బైటికి వెళ్ళొద్దు. ఆ వెధవ కుక్కలు కరవవచ్చు గేటులో పడి వుండు" మానవ భాషను కొన్ని కుక్కలు అర్థం చేసుకుంటాయేమో.. "జీ హుజూర్" అన్నట్లుగా ఆమె దగ్గరగా వచ్చి నిలబడింది. దాని వినయం చూసి సీతకు ఎందుకో జాలికలిగింది. మెరుపు లేని బంగారు రంగుతో నున్నగా వున్న ఆ కుక్క వీపుపైన చేయి వేసి "నువ్వు నిజంగా అభిమన్యుడివి." అని అభినందించింది. అందుకే కాబోలు "అభీ" అని పిలిచింది అని కుక్క అనుకోలేదు కాని, ఆమె అమృత హస్తం తన మీద పడగానే అంతవరకూ ఎవరినుండీ ఇంతటి ఆప్యాయతను పొందని ఆ కుక్క మనస్సు కృతజ్ఞతతో నిండి పోయింది. తల పైకెత్తి చూసింది. రెండు ఆనందాశ్రువులు కుక్క కళ్ళల్లోనుంచి జారిపడడం చూసిన సీత పక పకా నవ్వింది.

ఈ సంగతంతా ఆ రాత్రికి రాత్రే సుబ్బారావుతో పూసగుచ్చినట్లు చెప్పింది సీత. పైగా తను దానికి పెట్టిన ముద్దు పేరు గురించి కూడా వివరించింది. సుబ్బారావు మొదట తన శత్రువును సీత చేరదీస్తున్నందుకు కంగారు పడ్డా చివరికి సర్దుకున్నాడు. దానికి కారణం తను ఆఫీసుకు వెళ్ళి తిరిగివచ్చేంత వరకూ సీత ఒక్కర్తే వుంటుందన్న బెంగ కొంత తీరింది. ఈ సంఘటనతో తన విరోధి జాతిగా చిత్రీకరించుకున్న కుక్కలపైన సుబ్బారావుకు కొంత మంచి భావం ఏర్పడింది.

రోజులు గడిచేకొద్దీ, రోడ్డుమీద నుంచి కాంపౌండులోకి చేరిన 'అభి' సీతకు అభిమాన పాత్రమై హాల్లో మకాం పెట్టడం దగ్గరనుంచి సీత ఎక్కడుంటే అక్కడ బాడీగార్డులా అటెన్షన్ లో నిలవడం మొదలు పెట్టింది. ఒకటి రెండు సార్లు వెధవ కుక్కకు మరీ అంత చనువివ్వడం మంచిది కాదందామనుకున్నా సీత మనసు ఎక్కడ బాధపడుతుందో అని అనలేకపోయాడు సుబ్బారావు.

అసలు ఈ జన్మలో కుక్కను పిలవడంగాని దానికేసి చూడ్డంగాని జరగ కూడదని ఒకప్పుడు శపథం చేసిన సుబ్బారావు ఒక రోజు హాల్లో కూర్చొని భార్య ఇస్తున్న తాంబూల చిలకలు సేవిస్తూ తమ ఎదురుగా కూర్చున్న అభిని చూసేసరికి దాన్ని కాస్త పలకరించాలనిపించింది. 'అభీ' అని పిలిచాడు. ఇలా అతని పిలుపుకు నోచుకుంటానని భావించని ఆ కుక్క ఠక్కున సుబ్బారావు దగ్గరకొచ్చి నిలిచింది. "వెధవముండవి... ఎక్కడ పుట్టావో ఇక్కడకు చేరావ్." ఈ మాటలు తనని అనటం లేదు కదా అన్నట్టు అనుమానంగా చూసింది సీత. "మా సీత అభిమానానికి పాత్రమయ్యావు" అంటూ దాని మీద అంటీ అంటనట్టు చెయ్యి వేశాడు. ఈ మాటతో "హమ్మయ్య" తనను కాదనుకుంది సీత. పులకించి ఆ కుక్క చెవులు కిందకు వాల్చింది. ఇప్పుడు సుబ్బారావు ఆ కుక్కను నిశితంగా చూడ్డం మొదలు పెట్టాడు. "అభీ" అని మళ్ళీ పిలిచాడు. ఇప్పుడు చెవులు నిటారుగా నిలిపి "ఎందుకు" అన్నట్లు మెడ ప్రక్కకు వంచి చూసింది. దాని నుదురు మీద ముడతలు పడ్డాయి. "అబ్బే... వూరికేలే, దూరంగా ఫో" అన్నాడు. సీత పక పకా నవ్వింది. ఆ నవ్వే సుబ్బారావుకి సీత ఇచ్చే పెద్ద రిలీఫ్. ఎంత కోపంలో వున్నా సుబ్బారావు ఆ నవ్వుకు ఐస్ కాలేదు గాని చల్లబడిపోతాడు.

"ఏమిటి కుక్కతో మాట్లాడుతున్నారు ?" నవ్వాపుకొని అడిగింది.

"సీతా నువ్వెప్పుడన్నా కుక్కను క్లీన్ గా అబ్జర్వు చేశావ్?"

"అబ్జర్వా! అబ్బే దానికి అలాంటి గజ్జీ గిజ్జీ లేదండీ "

సీతకు ఇంగ్లీషు తెలీదు "చచ్చాం" అనుకున్నాడు మనసులో

"కుక్క సబ్బు తెప్పించి రెండు రోజులకొకసారి స్నానం కూడా చేయిస్తున్నానాయె" అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది

సుబ్బారావు ఇంక లాభం లేదనుకొని "అబ్బ! అది కాదు" అని విసుక్కున్నాడు.

ఆ విసుగుదలతో సీత ధోరణికి బ్రేక్ పడింది. 'ఈ కుక్క ఎప్పుడైనా తోకాడించడం నువ్వు చూశావా ?" నిజమే... సీత ఇప్పుడు ఆలోచనలో పడింది. అవును, ఏనాడూ అభి తోకాడించడం తను చూడలేదు. అదే సుబ్బారావుకి చెప్పింది.

"తోకాడించని కుక్క ఎక్కడైనా వుంటుందా?"

"అదేం పిచ్చి ప్రశ్నండీ! ఇక్కడుందిగా" అంది సీత.

ఆ సమాధానానికి సుబ్బారావుకి కోపం వచ్చింది. ఆ కోపం చూస్తే సీతకు నవ్వురావడం తప్పదు. వెంటనే చల్లారడం సుబ్బారావుకీ తప్పదు ఆమెకు సుబ్బారావు చిరుకోపం అందమైతే సీత నవ్వు అతనికి ఆనందం.

ఈ కుక్కతోక విషయాన్ని బేంక్ ఇంట్రవెల్ టైంలో టీ సేవిస్తూ సుబ్బారావు స్నేహితులతో చెప్పాడు. "తోకాడించని కుక్క వుంటుందా?" మిత్రులంతా ఒకేసారి ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

"ఒక వేళ పేరాల్సెస్ అనేది కుక్క తోక కొస్తుందేమో" అన్నాడు తీవ్రంగా ఆలోచించి ఇంట్లో హోమియో కొత్తగా ప్రాక్టీసు చేస్తున్న చిన్నారావు "నోనో! నథింగు రాంగ్! ఏ నరమో ఏక్షన్ తప్పి వుంటుందంతే," అన్నాడు రంగారావ్. రెండింటి భావం ఒకటే కావడం వల్ల హెడ్ క్లర్క్ వెంకట్రావు బిగ్గరగా నవ్వాడు. అంతా అతని కేసి చూచారు. "చెవులుండి వినలేని వాళ్ళూ కళ్ళుండి చూడలేని వాళ్ళూ నోరుండి మాట్లాడని వాళ్ళూ మనుషుల్లో వుండగా వెధవది మాటామంతీ లేని కుక్క తోకుండి ఆడించ లేదంటే పెద్ద ఆశ్చర్యమేమిటి." నిజంగా అది జోకే కాని ఎవ్వరూ నవ్వలేదు. తన శ్రమ వృధా అయినందుకు వెంకట్రావ్ వెంటనే లేచి వెళ్ళిపోయాడు. ఏ ఇల్లయినా సరే చూడగానే వాస్తు చెప్పి ఆ ఇంటి యజమాని గుండెల్లో రాయిపడవేసే వాస్తురోగ పీడితుడు సుబ్రమణ్యం "అలాంటి కుక్క ఇంట్లోనే కాదు... ఇంటి గుమ్మం ముందున్నా ఆ యింటి యజమానులకు అరిష్టం, అంతే కాదు ప్రాణాపాయం కూడా" అన్నాడు. ఆ మాటలతో సుబ్బారావుకి మతిబోయినంత పనైంది. ఇంతలో టైమైంది. తిరిగి ఎవరూ తోకాడించని కుక్క గురించి చర్చించే అవకాశం లేక పోయింది ఎవరి పనిలో వాళ్ళు పడ్డారు సుబ్బారావుకు మాత్రం ఎకౌంట్ బుక్స్ లోని రెండంకెలన్నీ తోకాడించని కుక్కల్లా కనిపించసాగాయి. పుస్తకాన్ని మూసి వుసూరుమంటూ నిట్టూర్చి కుర్చీకి జారగిలపడ్డాడు పని చేసుకుంటూనే ఇతర్లను అందులో ముఖ్యంగా లేడీ ఎకౌంటెంట్లను ఓరకంటితో జాగ్రత్తగా కనిపెట్టే వెంకట్రావుకు ఈ దృశ్యం కళ్ళబడింది.

"కుక్కను గురించేనా ఆలోచన?"

"వెధవ కుక్కని విడిచిపెట్టి పారేయ కూడదూ?"

"విడిచి పెట్టినా పోదయ్యా బాబూ! అది పోయినా ఆవిడూరుకోదు"

"కుక్కలంటే మీ ఆవిడికి అంత ఇష్టమా?" సుబ్బారావు అదోలా చూశాడు.

"డోన్ట్ మిస్టేక్ మి.... కొంతమందికి కొన్ని అభిరుచులుంటాయి. చూడు... పైగా బిడ్డా పాపా లేరనుకుంటా.. ఓ పని చేస్తావ్?" ఏమిటన్నట్టు చూశాడు సుబ్బారావు. "మా యింటి పక్కన రెండు ఆల్సేషన్ డాగ్స్ వున్నాయి. రెండూ మగవే. ఒక కుక్కను ఎవరికైనా కావాలంటే ఇస్తానంటున్నాడు."

"ఎవరతను?"

"మన బేంకులో ఎకౌంటున్నవాడే... చలపతి లేడా."

"ఫ్యాన్సీ షాప్ ఓనరు."

"ఆ\! ఆ? అతనే"... వాళ్ళ సంభాషణ అంతటితో ఆగిపోయింది.

ఈ ఛాన్సు ఎవరన్నా కొట్టేస్తారేమోనని బేంకుపని కాగానే చలపతిరావు ఇంట్లో వాలాడు సుబ్బారావు. గొలుసులతో కట్టివున్న రెండు కుక్కలు "భౌయ్" మని అరవడంతో బిగిసిపోయాడు అదృష్టవశాత్తూ చలపతి ఇంటి దగ్గరే వున్నాడు. అతిథి సత్కారాలయిన తర్వాత ఆపేక్షగా కుక్కలను చూస్తూ తను వచ్చిన సంగతి చెప్పాడు.

"దానికేం ఒక కుక్కను తీసుకెళ్ళండి" అన్నాడు చలపతి.

వ్యవహారం ఇంత సులభంగా చక్కబడుతుం దనుకోలేదు సుబ్బారావు. తేలిగ్గా నిట్టూర్చి "రేపు మంచి రోజు. రేపు వచ్చి తీసుకెళతా" అని లేచాడు.

"వచ్చేటప్పుడు డబ్బు కూడా తీసుకురండి"

"డబ్బా!" నోరు ఆవలించాడు

"లేకపోతే ఆల్షేషన్ ని ఎవరు వూరికే ఇస్తారండీ;"

"మీరు కుక్కల వ్యాపారం కూడా చేస్తారాండీ?"

బిగ్గరగా నవ్వాడు చలపతి. "నిజమే స్నేహంలో కొందరు ఉచితంగా కూడా ఇవ్వొచ్చు.... అసలు నేను వ్యాపారినే కదా."

"ఎంతేమిటి రేటు?"

"మీకైతే నూట ఏభై" ఈ మాటతో సుబ్బారావు కళ్ళు తేలేశాడు. "అసలు దీని ఖరీదు మూడొందలండీ" అన్నాడు.

వెధవ కుక్కక్కూడా ఇంత డిమాండు వుంటుందనే నిజం ఇప్పుడు తెలుసుకున్నాడు సుబ్బారావు.

"వస్తా." బేరంసారం లేకుండా పరుగు తియ్యబోయాడు.

"అరెరె! ఏమిటండదీ  ఆగండీ" సుబ్బారావు ఆగాడు.

"నిజం చెప్పొద్దూ రెండు కుక్కల్లో ఒకటి ఉచితంగా ఇస్తారని వెంకట్రావు చెబితే వచ్చానండీ" అని నీళ్ళు నమిలాడు.

"వెంకట్రావు గారి కయితే ఇస్తానన్నా."

"నన్ను పరాయి వాడిలా భావిస్తున్నారా ?" దీనంగా అడిగాడు.

అతన్ని చూసి నిజంగా చలపతికి జాలేసింది.

"సరే మీరెంత ఇవ్వాలనుకుంటున్నారు?"

"అసలనుకోనిదే!" అన్నాడు సుబ్బారావు.

"అయితే ఓ పని చేయండి. ముందు ఒక యాభై రూపాయిలిచ్చి పట్టుకెళ్ళండి, తర్వాత చూద్దాం." అన్నాడు చలపతి.

ఇక చూసేదేముంది... ఏభై రూపాయలకు ఆ కుక్క తనకు వచ్చినట్టే అనుకున్నాడు సుబ్బారావు. "రేపు డబ్బు తీసుకు వస్తానండీ" అంటూ తిరిగి వెళ్ళాడు.

ఆ రాత్రి సుబ్బారావు భార్యతో అభివల్ల జరిగే కీడు గురించి మిత్రుడు మణ్యం చెప్పిన సంగతి వివరించాడు. ఆమెకు కూడా గుండెలు దడదడలాడాయి కానీ ప్రాణంగా పెంచిన కుక్కను విడిచి పెట్టడం ఎలాగా అని ఆలోచనలో పడింది. దానికి ప్రత్యామ్నాయంగా ఆల్షేషన్ డాగ్ ను తెస్తానని సుబ్బారావన్నాడు "ఆల్షేషనంటే ఏమిటండీ?" అని అడిగింది అమాయకంగా.

"అవి ఈ కుక్కల జాతికే రాజుల్లాంటివి" అని సమయానుకూలంగా ఏదో చెప్పాడు.

"పాపం అభిని ఏం చేద్దామండీ?"

"ఈ చుట్టుపట్ల లేకుండా తోలేయడమే." ఈ మాటతో మరీ బాధపడింది.

"పాపం తోకాడించకపోవడం దాని తప్పెలాగవుతుందండీ!" దీనంగా అంది.

"అదుంటే మనం ఛస్తాం" అన్నాడు బిగ్గరగా.

ఈ సారి సీత నవ్వలేకపోయింది "మీ ఇష్టం" అంది భారంగా.

మరునాడు ఉదయం నుంచి సీత మనసు బాగోలేదు. కుక్కను చూడకుండా తప్పించుక తిరగాలనుకుంది. కాని అభిమాత్రం ఆమెను వదలకుండా ఎక్కడ ఆమె వుంటే అక్కడికి వెళుతోంది. తను ఏం నేరం చేశానా అనే అనుమానం అభీకి కలిగిందేమో!

"మీ ఈ అలక్ష్యాన్ని భరించలేను కారణం ఏమిటి అన్నట్లుగా మొహం పెట్టి "భౌ"మని మొరిగింది.

కుర్చీలో చతికిలపడ్డ సీత ఇప్పుడు చూడకుండా వుండలేక పోయింది. ముందుకాళ్ళు నిగడదన్ని నిటారుగా కూర్చున్న అభి నుదురు చిట్లించి "ఎందుకు బాధపడుతున్నావ్" అన్నట్లు చూసింది అభికి కన్నీరు కనిపించకుండా తల వంచుకుంది సీత,

అభి ఆమె దగ్గరకు చేరి పద్మాల్లాంటి ఆమె పాదాలను నాకింది. సీత వెంటనే లేచి, సుబ్బారావు రాత్రి తనకు తెచ్చిన నేతి లడ్లు పొట్లం విప్పి దాని ముందుంచింది. అభి ఆనందంగా తింది దాని జీవితంలో అంత రుచికరమైన పదార్థం తినడం అదే మొదటి సారి కావడంతో సీతను మరీ ఆప్యాయంగా చూస్తూ నోరు చప్పరించింది.

తోకాడించకపోయినా అభిలో వున్న కొన్ని మంచి లక్షణాలే సీతను మరీ ఆకర్షించాయి దొంగతనం చేయదు. పెట్టి పిలిస్తే గాని ఆహారాన్ని ముట్టదు. అభి ఆడకుక్కే అయినా గేటు విడిచి బైటికి పోదు ఎంత మగమహారాజు లాంటి కుక వచ్చి గేటు దగ్గర్నుంచి లొట్టలేసినా "జాగ్రత్త" అన్నట్టు గుర్రుబెట్టి బెదరగొడుతుంది. తన శరీరంపై ఏకాస్త మలినం వున్నా నాలికతో క్లీన్ చేసుకుంటే గాని నిద్రపోదు. దానికి పగటి నిద్రే అలవాటు. రాత్రంతా కాపలా కాస్తుంది. సీత ఒక రోజున పొరపాటుగా దొడ్డి తలుపు మూయడం మర్చిపోయి పడుకుంది ప్రొద్దున్న పనిపిల్ల వచ్చేసరికి గుమ్మం వెలుపల రెండు కాళ్ళూ, లోపల రెండు కాళ్ళూ పెట్టుకొని కూర్చొనుంది అభి. కను చీకట్లో పనిపిల్ల రావడంతో మీద పడి పట్టుకొంది పని పిల్ల కేకలతో, కుక్క అరపులతో సీత పరుగున వచ్చింది. 'అభీ' అని పిలవగానే ఆ పిల్లను వదిలి సీత పక్కకొచ్చి నిలబడింది.

"తలుపు ఎవరు తీశారే?"

"తెరిచే వుందండీ" అని పనిపిల్ల సమాధానం చెప్పింది.

అప్పుడు తను చేసిన పొరపాటు జ్ఞాపకం వచ్చింది. నోరులేని అభి తన యజమానురాలు చేసిన పొరపాటు గ్రహించి తెల్లవార్లూ దొడ్డివైపునే కాపలా కాసింది. వెంటనే సీత మోకాళ్ళ మీద కూర్చొని అది జంతువనేమాటే మర్చిపోయి దాని మెడను వాటేసుకొని నుదురు ముద్దు పెట్టుకుంది. కాని ఈ సంగతి సుబ్బారావుకు చెప్పలేదు. కన్నీటితో కుక్కను చూస్తూ జరిగిన సంఘటనలన్నీ గుర్తుకు తెచ్చుకుంటూ వుంటే మళ్ళీ దుఃఖం పొంగుకొచ్చింది.

గేటు తీసిన చప్పుడు కావడం పులిలా గొలుసు లాక్కుంటూ పెద్ద గొంతుతో ఆల్షేషన్ అరుచుకుంటూ రావడం సీతను మళ్ళీ ఈ లోకంలోకి తెచ్చాయి. బేంక్ ప్యూన్ గొలుసు పట్టుకున్నాడు.

అభి ఈ దృశ్యం చూసింది. తన విరోధి వస్తున్నట్లు భావించిందేమో బలాబలాలు కూడా అంచనా వేయకుండా 'భౌ' మంటూ వెళ్ళి అల్షేషన్ మీద పడింది నన్ను జయించేవారెవరంటూ గర్వంగా లోనికి వచ్చిన అల్షేషన్ జానీ వెళ్ళి గోడ పక్కన పడి పళ్ళికిలించించి మొరగడం ప్రారంభించింది. కాని అభి వూరుకోలేదు. "ఇక్కడ నుంచి పోతావా లేదా" అన్నట్టు మొరుగుతూ వార్నింగు ఇస్తోంది సుబ్బారావు ఎంత పిలిచినా వెనక్కి తిరిగి చూడలేదు. ప్యూన్ బెదిరి గొలుసు విడిచాడు. అభి అవకాశం చూసుకొని మళ్ళీ జానీ మీద కురికింది సీత "అభీ, అభీ" అని అప్పటికే చాలా సార్లు పిలిచింది. సుబ్బారావు సీత ఏదో పెద్ద నేరం చేసినట్లుగా చూస్తూ బుసలు కక్కుతున్నాడు. సీత వెంటనే లోనికి వెళ్ళి కర్ర తీసుకొని వచ్చింది ఆవేశంతో కోపంతో అభీని చావబాదింది.

ఈ దెబ్బలతో అభి నోరు మూసింది కన్నీటితో సీతకేసి చూసింది 'నేనేం తప్పు చేశా ?' నన్నట్టు.

సీత దాని మొహం చూడలేక కర్ర విసిరేసి దుఃఖం ఆపుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది. సుబ్బారావుకు సీత ప్రవర్తన ఆశ్చర్యంగా తోచింది. కాని ఏమీ మాట్లాడలేకపోయాడు.

అల్షేషన్ గొలుసు తను అందుకొని "అప్పల స్వామీ ఆ కుక్కను చుట్టు పట్లకు రాకుండా తోలెయ్యి" అని ఆర్డరు జారీ చేశాడు. రాగానే తనను బెదర గొట్టిందనే కోపంతో అప్పల స్వామి సీత విసిరేసిన కర్రనందుకుని ఫో అంటూ ఆ ఊరకుక్కను ఒక్క దెబ్బ కొట్టాడు అది 'కుయ్యో' మంది హాల్లో కూర్చున్న సీతకు ఆ ధ్వని గుండెల్లో కలుక్కుమంది వెంటనే బైటకు వచ్చింది. అప్పల స్వామి మరో దెబ్బ వేశాడు.

"అప్పల స్వామీ" సీత ఆవేశంగా అరిచింది అప్పలస్వామి భయంగా చూశాడు. "ఆ కుక్కనెందుకు కొట్టావ్?"

"అదేంటమ్మ గారు... అయ్యగారు తోలెయ్యమన్నారు... పైగా మీరే కొట్టారు గదా అన్నాడు."

"నేను కొడతాను... నా ఇష్టం. అది నేను పెంచిన కుక్క పెట్టిన వాళ్ళకే అధికారం వుంది. మధ్యన నువ్వెవడవ్?"

అప్పలస్వామి అయోమయస్థితిలో పడ్డాడు.

"అప్పల స్వామీ, నువ్వెళ్ళు అని సుబ్బారావు పంపించి వేశాడు.

"సీతా ఈ కుక్కను చూడు" అంటూ సీతను ఓదార్చే ఉద్దేశ్యంతో జానీని చూపించాడు. కాని సీత దృష్టి గేటుదగ్గర నిలబడ్డ అభీ మీదేవుంది.

"అభీ ! నువ్విక్కడి నుంచి వెళ్ళిఫో. నువ్విక్కడకు ఎప్పుడూ రావద్దు ఫో" ఆఖరి మాట దుఃఖ పూరితంగా వచ్చింది ఆమె మనోవేదన అర్థం చేసుకున్నట్టు అభి తలవంచుకొని మౌనంగా గేటు దాటి వెళ్ళి పోయింది సీత కళ్ళు మూసుకొని ఏడ్చింది. "సీతా" భయంగా పట్టుకున్నాడు సుబ్బారావు

"అది కుక్క కాదండీ.. మాటలొచ్చిన మనిషి కన్నా మంచిదండీ.. తెలివైనదండీ" అంది.

అప్పుడే కథ అయిపోలేదు సీత రెండు మూడు రోజులు అన్నం సరిగ్గా తినలేదు ఇంచుమించు బిడ్డకోసం బెంగపెట్టుకున్న తల్లిలా అయింది. ప్రతిక్షణం తనను నీడలా అంటి పెట్టుకు తిరిగే అభి జ్ఞాపకం రాసాగింది. కాని సుబ్బారావు బాధపడతాడనే వుద్దేశ్యంతో పైకి మాత్రం జానీని కూడా జాగ్రత్తగా చూడసాగింది అయితే జానీ పెంపకం ప్రత్యేకం. దాని వంట వేరు. దాని తిండి వేరు. ఆ దంపతులకది పెద్ద సమస్యే అయింది. జీతంలో సగం డబ్బు దానికి ఖర్చయ్యేస్థితికి వచ్చింది. సీత ఈ కుక్కను చూసుకుంటూ అభీని మర్చిపోతే అంతే చాలనుకున్నాడు సుబ్బారావు. సీత కూడా జానీలో అభీని చూడడానికి ప్రయత్నిస్తోంది ఎప్పుడైనా అభి వస్తుందేమోనని అప్పుడప్పుడు గేటు దగ్గరకెళ్ళి చూసేది

సీత. కాని అభిమాత్రం తిరిగి ఏనాడూ కనిపించలేదు ఒక నెల గడిచేసరికి క్రమ క్రమంగా జానీ సీత మనసులో అభి స్థానాన్ని ఆక్రమించుకుంది. అభి లాగే సీతను విడవకుండా అనుసరించేది సీతలో కూడా రాను రాను అభి గుర్తులు మాసి పోసాగాయి.

ఆ రోజు ఆదివారం. సుబ్బారావు ఇంటిదగ్గరే వున్నాడు. సీతకు అష్టాచెమ్మా ఆడ్డమే తెలుసు హాల్లో భార్యాభర్తలిద్దరూ అదే ఆట ఆడుతున్నారు. జానీ దగ్గర్లో కూర్చొని ఆ ఆటను విచిత్రంగా చూస్తోంది.

"సుబ్బారావు గారూ" అని పిలుపు వినిపించి ఇద్దరూ అటు చూశారు. చలపతి.

"రండి" అని సుబ్బారావు ఆహ్వానించాడు సీత లోనికి వెళ్ళింది జానీ చలపతిని చూడగానే తోకాడిస్తూ మీద కురికింది. నాలుకతో అతని శరీరాన్నంతా నాకింది. "అబ్బ వుండవే... నీకోసమే వచ్చాలే" అంటూ వారించాడు.

'ఎలా వుందండీ మన జానీ.' ప్రశ్నించాడు.

"మమ్మల్ని తింటోంది" ముక్తసరిగా సమాధాన మిచ్చాడు సుబ్బారావు. చలపతి నవ్వాడు. సీత కాఫీలు తెచ్చింది. కాఫీ తీసుకున్న తర్వాత చలపతి "కుక్క సరదా తీరిపోయినట్టుంది. ఇక తీసుకు పోనా" అన్నాడు. సుబ్బారావు ఆశ్చర్యంగా చూశాడు.

"ఏమిటలా చూస్తారు?"

"కుక్కను తీసుకెళ్ళడమేమిటి ? ఏభై రూపాయలిచ్చి మీ దగ్గర నేను కొన్నాను." అన్నాడు.

ఇప్పుడు కూడా చలపతి నవ్వాడు. "ఎంత అమాయకులండీ. ఆల్షేషన్ డాగ్ ఏభై రూపాయలకు రాదని ఆనాడే చెప్పాను."

"మరెందుకిచ్చినట్టు?"

"ముచ్చట పడుతున్నారు కాబట్టి... ఏభై రూపాయలిచ్చి ఒక నెల వుంచుకోమన్నాను."

"చలపతీ" కోపంగా అరిచాడు. సీత భయపడింది.

"ఏం?" ఎర్రగా చూశాడు.

"అన్యాయం! ఇంతవరకూ దీని కోసం రెండు వందలు ఖర్చు చేశాను."

"ఊరికే ఖర్చుపెట్టారా? మీ ఇల్లు కాపలా కాసింది కాబట్టి ఖర్చు పెట్టారు" అన్నాడు నిర్లక్ష్యంగా.

సుబ్బారావు ఆ మొరటు మనిషిని జయించడం కష్టమనుకొన్నాడు ఒక నిర్ణయానికి వచ్చి "సరే యాభై ఇచ్చి తీసుకెళ్ళండి"

"ఇంతకాలం మీ దగ్గరుంచినందుకు అడ్వాన్సుగా అ ఏభై రూపాయలూ తీసుకున్నాను. ఇప్పటికైనా అర్థమయిందా."

"అర్ధమయింది మీరు వట్టి వ్యాపారస్తులే కాదు... దొంగ వ్యాపారస్తులని."

"సుబ్బారావ్ ! మర్యాదగా మాట్లాడు."

"లేకపోతే ఇది మర్యాదంటావా?" ఎదురు ప్రశ్నవేశాడు సుబ్బారావు.

"మర్యాదస్తుణ్ణి కాబట్టే ఆ రోజూ, ఈ రోజూ ఒకే మాటమీదున్నా. ఇది మూడు వందల రూపాయలు విలువచేసే కుక్క... మీకు కావాలంటే సగం రేటుకిస్తా మిగతా వందా ఇటు పారేయండి" చేయి చాశాడు అతని లౌకికానికి సుబ్బారావు కోపంతో వణికి పోతున్నాడు భర్త అయోమయ స్థితిని చూసి "కుక్క మాకు అవసరం లేదండీ.. మీరే తీసుకెళ్ళండి" అంటూ సీత కంగారుగా భయంగా చెప్పింది.

"ఆడదానికున్న ఆలోచన లేదు.. పైగా పెద్ద ఎకౌంటెంటు" అంటూ గుమ్మం దాటాడు. కుక్క అతన్ని అనుసరించింది.

ఆఖరిమాటతో సుబ్బారావు తన్ను తాను మరచాడు "రాస్కెల్ ఏం పేలావ్" అంటూ వెనక బడ్డాడు. వెళ్ళే చలపతి గేటు దగ్గర వెనక్కి తిరిగి "జానీ కేచ్ హిం" అంటూ సుబ్బారావుని చూపించాడు. జానీ భౌ మంటూ వెళ్ళి ముందు కాళ్ళు రెండూ సుబ్బారావు గుండెలమీద వేసి పీకపట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. సీత కెవ్వున అరచింది.

ఇంతలో ఎక్కడ నుంచి వచ్చిందో అభి "భౌ" మంటూ వెళ్ళి జానీ పీకపట్టుకుంది. ఈ హఠాత్ పరిణామానికి అంతా విస్తు పోయారు. సీత దుఖంతో సంతోషంతో ఊగిపోయింది. జానీ తన ప్రయత్నాన్ని విరమించినా అభి వూరుకోలేదు. తరిమి తరిమి జానీని కరుస్తోంది జానీ పారిపోయింది. చలపతి బెదిరించ బోయాడు. ఇప్పుడు సుబ్బారావుకు పట్టిన గతే చలపతికి పట్టింది. రెండు కాళ్ళూ చలపతి గుండెలమీద వేసి భయంకరంగా మొరుగుతూ పీకపట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది అభి.

చలపతి భయంగా "సుబ్బారావ్" అని అరచాడు. ఇప్పుడు సుబ్బారావు ధీరోధాత్తుడయ్యాడు.

"అది నీలాగా... నీ జానీలాగా విశ్వాసంలేనిది కాదు. పిరికిదీ కాదు. ఏభై రూపాయాలూ నా ముందు పడితే గాని అది నిన్ను విడిచిపెట్టదు." కంగారుగా చలపతి వణికే చేతులు కోటు జేబులో పెట్టి అయిదు పదిరూపాయల నోట్లు తీసి ముందుకు విసిరాడు. చలపతి మీదికి మళ్ళీ మొరిగింది అభి, సీత "అభి" అని పిలిచింది. అభి చలపతిని వదలి సీత దగ్గరకొచ్చి నిలబడింది. 'బ్రతుకు జీవుడా' అనుకొని చలపతి వూడిపోయే పంచెని వెనక దోపుకుంటూ గేటు దగ్గర ఒకసారి బోల్తాపడి లేచి పారిపోయాడు. ఈ దృశ్యాన్ని చూసిన సుబ్బారావు సీతే కాదు అక్కడ పోగైన వారు కూడా విరగబడి నవ్వుకున్నారు.

"నేను మంచి పని చేశానా" అన్నట్టు చెవులు రిక్కించి, సుబ్బారావును మార్చి మార్చి చూసింది అభి. తన భర్త అవమానాన్నే కాదు ప్రాణాన్ని కూడా కాపాడిన ఆ మూగజీవి మెడను వాటేసు కొని నుదురుపై ముద్దు పెట్టుకుంది సీత. సుబ్బారావు కూడా మోకాళ్ళ మీద కూచుని "అభీ" అని ప్రేమగా పిలిచాడు సీతను విడచి సుబ్బారావు దగ్గర కొచ్చింది.

"ఏది ఏమైనా సరే ఈ జన్మలో నిన్ను విడిచి పెట్టలేం అభీ" అంటూ ఆప్యాయంగా తలపై మెల్లిగా స్పృశించాడు.


"ఏమండీ!" సీత హఠాత్తుగా అరిచింది. ఏమిటని సుబ్బారావు భయంగా చూశాడు.

సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతూ సీత "చూడండీ మన అభి తోకాడిస్తోంది." సుబ్బారావు ఆశ్చర్యంగా చూశాడు. నిజమే అభి ఇప్పుడు సంతోషంతో తోకాడించడమే కాదు చక్రంలా తిప్పు

# కాలచక్రం

– బుచ్చిబాబు

( ఆంధ్రపత్రిక, 1957 ఏప్రిల్ 1 సంచిక నుంచి)


కాలచక్రం నిలిచింది

బుచ్చిబాబు

ముకుందాన్ని బెంగుళూరు పిచ్చాస్పత్రిలో పెట్టారన్న వార్త విన్నప్పుడు కాలచక్రం నిలిచిపోయినట్లనిపించింది. ఆరుగురు అన్నదమ్ముల్లో నాలుగోవాడు ముకుందం. నలభైయేళ్ళ నడివయస్కుడు. చదువుకున్నవాడు. దత్తత వల్ల సంక్రమించిన రెండు మేడలు, పొకతోట, యాభై

ఎకరాల భూమి గల స్థితి పరుడు. మామగారు జిల్లా కలెక్టరు. జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా కాలక్షేపానికి బి.ఎల్. పరీక్షకి కడుతుంటాడు గాని, ఉద్యోగం చేసే అవసరం గాని, అభిలాష గాని అతనికి లేవు. అన్నదమ్ములందరూ మంచి పదవుల్లో వున్నారు. కుటుంబంలో ఎవరికీ పిచ్చెత్తినట్లు లేదు. మనో వ్యాకులత చీకూ చింతా లేకుండా హాయిగా జీవితం గడిచిపోతున్నప్పుడు, ముకుందం పిచ్చాస్పత్రిలో ఎందుకు గడపవల్సి వొచ్చిందో నాకర్థంకాలేదు. నాకు పిచ్చెత్తినట్లయింది. కాలచక్రం కదలనట్లనిపించింది. కాలచక్రం కవి మెళకువ. రచనా శిల్పంలో అదొక విసురు. దాని గొడవ ఎవరిక్కావలి?

రెండవ ప్రపంచ సంగ్రామం ప్రారంభమైందన్న వార్త తెలిసినప్పుడూ, మహాత్ముడు పరమపదించాడన్న వార్త విన్నప్పుడూ వో క్షణం పాటు కాలచక్రం నిలిచిపోయినట్లనిపించింది. మళ్ళా ముకుందం పిచ్చి విషయం తెలిసినప్పుడు అట్లాంటి అనుభవం కలిగింది. వైమానికుడు సహారా ఎడారనుకుని నేలమీదకి దిగి అడుగుపెట్టగానే ఎటు చూసినా మంచే. జలపాతం వొంపు దగ్గర నిలిచిపోయింది. ఇట్లాంటివి జరిగినప్పుడు వూపిరి బిగబడతాం. గుండె కొట్టుకోడంలో ఒక లయ, క్రమం వుంటాయిట. మధ్యలో వొకసారి కొట్టుగోడం మానేసి_ వొక 'బీట్' విడిచేసి, తరవాత మళ్ళా మామూలుగా గుండెకొట్టుకోవడం అసంభవం కాదని వైద్యశాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మధ్యనున్న స్థలం గుండా ప్రయాణం చెయ్యకుండానే, వొక పదార్థం వొకచోటునుండి మరోచోటుకి చేరుకోవడం సంభవమేనని భౌతిక శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇట్లాంటివి సంభవమైనప్పుడు ముకుందానికి పిచ్చెత్తడం మాత్రం ఎందుకు సంభవం కాకూడాదనుకుని సమాధానపడినా, ఆ అనుభూతి అన్వేషణకి నన్ను పురిగొల్పింది. వ్రాసేస్తే, ముకుందం వ్యక్తిత్వం విశద పడుతుందేమో నన్న ఆశతో యీ రచనకి వుపక్రమించాను.

ముకుందం అనేకమంది సామాన్య వ్యక్తులలో వొకడైతే అతన్ని గురించి నేను పట్టించుకోను. ఓ రకంగా అతను అపూర్వ వ్యక్తి. ఆధునిక యుగంలో ఆనందాన్ని సాధించగల వ్యక్తులు అరుదు. నాతోటి మానవులలో 'నా జీవితం హాయిగా, సంతోషంగా గడిచి పోతోంది' అని అన్నవారు నాకు తటస్థపడలేదు. మనలో ప్రతి వారికి ఏదో లోటు. ఆరోగ్యం వుండదు, అవకాశాలుండవు, డబ్బుండదు, ప్రేమ దొరక్క చెడిపోతాం. తీరిక కోసం పని చేసి పొందిన తీరికలో యింకా పనిచేస్తాం. ఏకాంతం లేదు. ఇల్లొక జైలు. ఇందులోంచి తప్పించుకుని గుంపులో కలిసిపోతాం. మరో వ్యక్తి సమక్షంలో గాని మనం సజీవులమై వున్న విషయం ఋజువు కాదు. కుళ్ళు, కృత్రిమం, జాడ్యం, దాస్యం, నిద్రలో కూడా విరామం లేని మనో వ్యాకులత – యీ మహా గంద్రగోళంలో పరిభ్రమిస్తూ వున్న యీ వ్యక్తులందరికీ ఎందుకు పిచ్చెత్తిలేరా అన్న సంశయం వొస్తుంది. పిచ్చెత్తకుండా, మామూలుగా వున్న వారుంటే కదా. పిచ్చి మందాన్ని కొలిచి విలువ కట్టడానికి!

ఆనందమయ జీవి ముకుందం. ఆ విధంగా అతను అపూర్వమైన వ్యక్తి. మరో విశేషం వుంది. ముకుందం లాంటి వ్యక్తులు మన సంఘంలో చాలామంది వున్నారు. ఆ రకం మనస్తత్వం గలవారికి అతను ప్రతినిధి. ఎప్పుడో వొకప్పుడు ముకుందాన్ని, అతని తెగ వారిని, కలుసుకోక తప్పదు. వారిని మీరు ప్రేమించవొచ్చు; ద్వేషించవొచ్చు. కాని వారి వారినుండి తప్పించుకు పారిపోలేరు. ఆఫీసుల్లో, క్లబ్బుల్లో, పార్కుల్లో, సినిమా హాలుల్లో, దుకాణాలలో, రైలు ప్రయాణంలో, ఎక్కడో అక్కడ అతన్ని మీరు కలుసుకునే వుంటారు. ఎవరతను? అతనొక మాటకారి. వాగుడు రాయుడు. అతను మాట్లాడటం మొదలు పెడితే, మరి ఆగదు; ఎవరూ అతన్ని ఆపలేరు. పిడుగు పైన బడినప్పుడు ఎవరు తప్పించుకోగలరు ? జలపాతాన్ని అరచేతితో ఆపడం ఎంత సులువో అతని నాలుక పరిభ్రమణాన్ని ఆపడం అంత సులువు. ఈ పాటికి మీరు గ్రహించే వుంటారు. ఆంగ్లంలో అతన్ని 'బోర్' అంటారు. ఎన్నో హాస్యపత్రికలు, ఎందరో హాస్య రచయితలు అతని వూసులు చెప్పుకుని రోజులు గడుపుకుంటున్నారు.

అతనిగాధలు వేనోళ్ళ వింటాం. అతనొక పురాణ పురుషుడు.

ముకుందం మంత్రజాలంలో చిక్కుకుని, గిల గిల తన్నుకుని, బైటపడిన వాళ్ళల్లో నేనొకణ్ణి, అతన్ని ద్వేషించాను; విమర్శించాను; నిర్మూలం చెయ్యాలని సంకల్పించాను; వెక్కిరించాను, హేళన చేశాను. జాలిపడ్డాను; చివరికి ప్రేమించాను. అతను లేని యీ ప్రపంచానికి నా కర్థం కనబడలేదు. అతన్ని పిచ్చాస్పత్రిలో పెట్టిన యీ ప్రపంచానికి పిచ్చి.

ఈ రకంగా ప్రపంచం పై కోపించి నేను సాధించిందేదీ లేదు. అందుచేత తమాయించుగుని ముకుందంతో నా పరిచయాన్ని ఉద్రేక రహితమైన దృక్పథంతో స్మరిస్తాను.

ముకుందాన్ని గురించి కుతూహలపడటానికి ఏవేవో చాలా కారణాలు చెప్పాను కాని అసలు విషయం వొదిలేశాను. అతనితో దూరపు బంధుత్వం వుంది. ఆవిడ తాలూకు దూరపు చుట్టంనా తాలూకే అని చెప్పుకోడంలో చిన్నతనం వుందని కాదుస్మాండి అసలు విషయం అది.

ఆదివారం ఉదయం తొమ్మిదైంది.

వీధిలోకని బైలుదేరి పదిమెట్లు దిగాను. పదకొండో మెట్టుమీద ముకుందం ప్రథమంగా తటస్థపడ్డాడు. తను ఫలానా అని పరిచయం చేసుకున్నాడు.

“ఓహో అలానా మిమ్మల్ని గురించి వినడమే కాని ఎప్పుడూ చూడలేదు రండి, రండి లోపలి కెడదాం.” అని ఆహ్వానించాను. భుజం మీద చెయ్యేసి నన్ను నిలిపేశాడు.

“నన్ను గురించి విన్నారన్నమాట. చూసింతర్వాత, ‘ఇదేమిట్రా ఎందుకు చూశాను?’ అని అనిపించలేదు కదా! ఏ ముసిలాడినో, ముక్కాడినో అనుకున్నారా ? అమ్మాయి చెప్పిందేమోలెండి. నేనంత పెద్దవాణ్ణి , అంటే ముసలివాణ్ణి కాదండోయ్. అసలు ముసిలాళ్ళు అంటూ వుండరని నా ధృఢ విశ్వాసం. ప్రతివాడికీ తనకున్న వయస్సుకి పదిహేనేళ్ళ తర్వాతేగాని వార్ధక్యం అంటూ వుండదు. నాకు నలభై అయితే, యాభై అయిదేళ్ళ వాళ్ళందరూ ముసిలాళ్ళన్నమాట. నాకరవై అయితే డెభై అయిదేళ్ళ వాళ్ళందరూ వృద్ధులన్నమాట. అదీ ‘థీరీ.’ మీకు ముప్పై అవునా? మీ వుద్దేశం, నలభై అయిదు దాటిన వాళ్ళంతా ముసిలాళ్ళు. నేనిక్కడికెందుకొచ్చాననా మీ ప్రశ్న మీకు తెలీదేమో అమ్మాయి చెప్పలేదేమో ఇక్కడ బ్రిడ్జి మాచస్ వున్నాయి. అందుకొచ్చాను. నేను బ్రిడ్జి ఆటగాణ్ణి లెండి. మీకొచ్చా ? ఆంధ్రలో ఎక్కడ టోర్నమెంటయినా, మావాళ్ళు నన్ను పంపిస్తూ వుంటారు, యింకెవరూ లేనట్లు. ఏం చేస్తాం. పెద్దలు మనమీద వో భారం పడేసింతర్వాత. మనం నిర్వర్తించక తప్పదు. క్రితం నెల బెంగుళూరులో రన్నరప్ పేపర్లో చూశారుగా. అంటే బెంగళూరు లోకల్ పత్రికల్లో పడ్డయిటలెండి ఇక్కడ మన పత్రికలు యూస్ లెస్. వీళ్ళ వుద్దేశంలో బ్రిడ్జి వొక ఆటేగాదు. నేనే ఇంగ్లాండ్ లో పుట్టి వుంటే, యీ నా ఆటకి, పార్లమెంట్ మెంబర్ గా చేసెయ్యరూ ! మా వాళ్ళు వొచ్చే యేడు ఇంగ్లండు పంపుతామంటున్నారు నన్ను .. భారం పడింతర్వాత...”

“...లోపలి కెడదాం...”

“ఓడలోనే వెడతాననుకోండి. నాకీ ఎయిర్ ట్రావెల్ సుతరామూ యిష్టం లేదు స్మాండి. ఎందుకంటారా. విల్లు వ్రాసి గాని విమానం ఎక్కడం మూర్ఖత్వం. విమానం ఎక్కి నేను క్రమంగా గమ్యస్థానం చేరుకుంటాను అని ధీమాగా చెప్పగల విమాన యాత్రీకుణ్ణి యీ జగత్తులో మీరు నాకు చూపగలరా స్వామీ! నిరుడు బిల్లియర్డ్స్ మాచెస్ కి విమానంలో సిమ్లా ప్రయాణం తగిలింది. ఎల్లాగో తప్పించుకున్నా వెళ్ళకుండా, ఇంతకీ మరో ఏడాదిపాటు నూకలు మనకీ భూ ప్రపంచం మీద వ్రాసి పెట్టాడు పరమాత్మ. ఎందుకు వెళ్ళలేదని సిమ్లా అమ్మాయి చెప్పే వుంటుందేమో లెండి...”

“రండి కూర్చుని, కాఫీ పుచ్చుకుని సావకాశంగా మాట్లాడుకుందాం.” అని మెట్లెక్కాను. ఆయన ఆరో మెట్టుమీద నిలిచి పోయాడు.

"నాకు కాఫీ అనీ, టీ అనీ పట్టింపులు లేవు. ఏదైనా పుచ్చుకుంటాను. అసలు లేకపోయినా, అయ్యో లేకపోయిందే అని ఇదవను. ఒక సారి చెరుకు పల్లి జమీందారు గారు డిన్నరిచ్చారు. మజ్జిగనుకుని కాఫీ వొడ్డించారు."

నేను లోపలికెళ్ళి ఆవిడ చెవిని యీ వార్తపడేసి. కుర్చీలు బల్లలు కాస్త సర్ది యివతలికొచ్చాను. ఆయన మూడో మెట్టుమీద నిలబడి మాట్లాడుతున్నాడు మెట్ల కొంపల్ని గురించి.

"తంజావూర్లో వో చెట్టియార్ యింటికి వెళ్ళాం..."

దీర్ఘోపన్యాసానికి తావివ్వకుండా, ఎక్కడికక్కడ నిలదొక్కడం మంచిదనుకొని అడ్డు ప్రశ్నలకుపక్రమించాను.

"తంజావూరా? ఎవరెవరెళ్ళారు?"

"మామ గారితో  కోయంబత్తూరు నుండి కార్లో వెళ్ళాం, ఆ చెట్టియారింటికి నాలుగు చోట్ల మెట్లున్నాయి. మధ్యహాల్లో మామగారూ నేనూ విడిపొయ్యాం. నేను వరండా మెట్లమీదుగా వెళ్ళాను. వాళ్ళు ముందు అరుగులమీద మెట్లగుండా వెళ్ళినట్లున్నారు. ఈ రెండు మెట్ల వరుసలూ పైన బాల్కనీలో కలిసినట్లున్నాయి. టపీమని ఆ చెట్టియారు నేను గుద్దుకున్నాం." నవ్వడం సాగించాడు.

చెట్టియార్ ఘట్టం ముగిసినందుకు నిట్టూర్చాను, ఇంతలో ఆవిడా లోపల్నించి వొచ్చింది చిరునవ్వుతో 'ఎప్పుడు రావడం?' అని అడిగింది.

ఇదొక అర్థం లేని ప్రశ్న.

"సామాన్లేవీ?"

అంత బొత్తుగా అర్థం లేని ప్రశ్న కాదేమో. "నేనొచ్చి నాలుగు రోజులైంది.  సరిగ్గా చెప్పాలంటే మూడున్నర రోజులు. క్లబ్బు గదుల్లో విడిది. టెన్నిస్ మాచెస్ అవుతున్నాయిగా. మా పిన మామ గారు పెద్ద టెన్నిస్ ఆటగాడులే.  నాతో ఆడితే, వో సెట్టుకి రెండు గేములు కూడా గెలవ లేదు. అయినా మామ గార్ల ఆటమెచ్చుకోడం తప్ప యీ అల్లుళ్ళు ఏం చేయగలరు ? మీరు టెన్నిస్ ఆడతారా?"

"అబ్బే లేదండి"

"సాయంత్రం ఉభయులూ రండి, నా ఆట కూడా చూద్దురు గాని. మొన్న విజయనగరంలో మన వాళ్ళంతా వొచ్చారు. నాకు తెలుసులే ఎందుకు నవ్వుతున్నావో. చిన్నప్పుడు ఆటలూ పాటలూ ఏవీ రావు, యీ ఆట ఎల్లాగొచ్చిందా అని. ఇల్వపురం జమిందారు తమ్ముడూ నేను స్నేహితులం. వాళ్ళు జెర్మనీ నుంచి వో కోచ్ ని తెప్పించారు. రాత్రుళ్ళు గ్యాస్ లైట్లు పెట్టుగుని ఆడేవాళ్ళం."

"కాఫీ పుచ్చుగోండి..." _ కాస్త చప్పరించాడు.

"సామాన్లు క్లబ్బులో పెట్టాను. మీరిక్కడున్నారని మొన్న తెలిసింది. సరే చూసి పోదామని, చుట్టాల్ని చూడకపోతే మా ఆవిడ వూరుకోదు. మా మరదలు వోసారి నెల్లూర్లో వొక స్నేహితురాలింటి దగ్గర దిగిందిట. నేనేమో గురవయ్య నాయుడు గారి చైర్మెన్ ఎలక్షన్స్ సందర్భంలో నెల్లూరెళ్ళాను. మరదలు పిల్ల అక్కడుందని నాకేం తెలుసు? ఆమెను చూడకుండా వొచ్చినందుకు మా ఆవిడ వారం రోజులు నాతో మాట్లాడలేదు _ అంటే నే యింట్లో ఆవిడతో వున్న, పదినిముషాలూనూ నాకు ఏకాంతంగా యింట్లో వుండే ప్రాప్తీ లేదంటే నమ్మండి. పనీ లేదు తీరుబడీ లేదన్న సామ్యంగా వుంది."

"మరదలుకి పెండ్లి సంబంధాలు చూస్తున్నారా?" అని అడిగింది, ఆవిడ.

"ఆవిడ పెళ్ళి చేసుగుంటుందీ? నాకు నమ్మకం లేదు. ఆయన కట్నం దమ్మిడీ యివ్వనంటాడు. ఆ గడింపంతా ఏం చేస్తాడో, కర్మ! పీనాసని కాదు. అదొక ఆదర్శంట. మరి నాకెల్లా యిచ్చాడు  కటిక సొమ్ము పది వేలు. డిన్నర్ కి నాలుగు వేలయిందిట.   గవర్నర్ గారి

అంతరంగిక కార్యదర్శి అతిథిగా విచ్చేశాడులే; బాణా సంచాకి వెయ్యి, పూరేగింపు విమానానికి ఐదొందలు ఆ రోజుల్లో. ఇప్పుడైతే, ఖర్చంతా వో యాభై వేలవును. మా కొచ్చిన పెళ్ళి బహుమతులు, వో ఐదారు వేలుంటాయి. కట్నాల ద్వారా, సగం కర్చు రాబట్టాడనుకో. నువ్వొచ్చావుగా.. నీకింకా అప్పడికి పెళ్ళి కాలేదుగా. కట్నాలు పుచ్చుగోడం మనబోటి చదువుకున్న వాళ్ళది పొరబాటే కాదన్ను. కాని సంఘంలో వో ఆచారంవున్న తర్వాత పాటించక తప్పుతుందా? సరే సరోజకి ఎంత సేపూ, చదువూ, సంగీతం సినిమాలు, షికార్లు పిక్ నిక్ లు, పెళ్ళి చేసుకోవాలన్న వుద్దేశమే లేదు. ఏమాటకామాటే చెప్పాలి–మా ఆవిడ ఎంత చదువుకున్నదైనా, పూర్వకాలపు మనిషే అనాలి. కాస్తంత దైవభక్తి, పూజ పునస్కారం, యాత్ర, కొలువు కలెక్టర్ గారు వారి హయాంలో చేసిన దుండగాలు, దురంతాలకి పరిహారార్థం పురాణ కాలక్షేపం, గీతా పారాయణం ఆదివారం జరిపించి, పండితుల్ని సత్కరించే ఆచారం వుండబట్టే, అమ్మాయికి యిదంతా అబ్బిందనుకో. మనం తప్పించుకున్నాం. సరోజకివి గిట్టవు. నాకుమల్లే, అందుకనే లోలోపల నేనంటే యిష్టం అనుకుంటా."

"నువ్వు వంట విషయం చూడు" అన్నాను ఆవిడనుద్దేశించి.

"నా కోసం వంట చెయ్యకండి. క్లబ్బులో డిన్నరుంది. కబుర్లు చెప్పుకుందాం. మీరు వొంటకెవర్నేనా పెట్టుకోండి. లేకపోతే ఇదే చిక్కు. ఇంటికెవరేనా వొస్తే, వారితో మాట్లాడే అవకాశం వుండదు. ఓ సారి సేలం సబ్ కలెక్టర్ మళయాళీ భార్యాసమేతంగా గుంటూరొచ్చాడు. అత్తగారు వొంటకనీ, అమ్మాయి కాఫీకనీ లోపలి కెళ్ళారు, పనిమనిషి పేరమ్మని వొప్పజెప్పి! ఆవిడకి కాలక్షేపం ఎల్లా జరుగుతుంది. పేరమ్మ ఏం మాట్లాడుతుంది? బుచ్చమ్మలా గుడ్లప్పగించి అల్లా నిలబడి చూస్తూ నిలబడింది. పేరమ్మ ఫాషన్ గా వుంటుందిలే ఇదుగో యీ సినిమాలొచ్చిం తర్వాత అది మరీ సినిమా స్టార్ లా తయారైంది. మా ఆవిడా, సరోజ యిచ్చిన జాకెట్లే వుంటాయి వో డజను. వీళ్ళకి సైజు కుదరక దానికి బహూకరిస్తుంటారులే. దాన్ని చూసి సరోజ అనుకుంది కాబోలు, ఇంగ్లీషులో సంభాషణ సాగించింది ఆవిడ. ఇదేమో నవ్విందట. మళ్ళా ఆవిడ ఇంగ్లీషులో ఏదో అడిగిందిట. పేరమ్మ లోపలికెళ్ళి చీపురు తీసుకొచ్చిందిట వూడుద్దామనుకుని. ఆవిడ కోపంతో చరచరా నడుచుకుంటూ బైటకెళ్ళి, మామగారి డ్రైవర్ని పిలిపించి, కార్లో ట్రావెలర్స్ బంగళా కెళ్ళిపోవడం మామ గారు పేరమ్మని మానిపిస్తానని బెదిరించడం, అది లబోదిబోమని ఏడవడం నేవెళ్ళి సర్దుబాటు చేసి, వో వంటలక్కని కుదర్చడం, వొచ్చిన అతిథుల్ని ఎల్లా వినోద పరచాలో తెలియచెప్పడం వారి కుటుంబ చరిత్రలో వొక అపూర్వ ఘట్టం..."

"కాసేపు నే అల్లా వెళ్ళొస్తాను మీరు పత్రిక చూస్తూ వుండండి." అన్నాను. ప్రశ్నార్థకంగా చూశాడు ముకుందం.

"సినిమా కా?"

ఎట్లా కనుక్కున్నాడో చిత్రం ! అసలు నిజంగా సినిమాకనే బైలు దేరాను. కాస్తంత అబద్ధం ఆడాను.

"డాక్టర్ మాధవయ్య గారింట్లోంచి టెలిఫోన్ చేసి, రాత్రికి ఏం ఆటాడుతున్నారో కనుక్కొనొద్దామని బైలు దేరాను." అన్నాను.

"అయినా, అమ్మాయి లేకుండా మీరొక్కరూ సినిమాకెళ్ళడం భావ్యమా చెప్పండి? మా కళ్యాణి వూరుకోదు. నేను వాళ్ళింట్లో వుంటే ఎక్కడికెళ్ళినా ఇద్దరం కలిసెళ్ళాల్సిందే..."

"ఆమెను కూడా యిప్పుడు మీతో తీసుకురాలేదేం?" అన్నాను.

"ఆవిడకి ఆటలు చూడ్డం అంటే విసుగు. లెక్చర్లు, క్లబ్బులు, పార్టీలు, ఇవేవీ గిట్టవు. నాకివి లేకపోతే గడవదు. మళ్ళా సరోజ అల్లా కాదు..."

ఆయనింకా మాట్లాడుతూనే వున్నాడు. నేను బైటికి నడిచాను. వెడుతూ మా పని వాడు ముసలయ్యని అయ్యగారికి ఏం కావాలో కనుక్కుంటూ వుండమని చెప్పి వెళ్ళాను. ఓ గంటలో తిరిగొచ్చాను. ఆయన ముసలయ్యతో మాట్లాడుతున్నాడు. ముసలయ్య వింటూన్నట్లు లేదు. గోడకి జేర్లబడి కునికి పాట్లు పడుతున్నాడు.

"పోరంబోకు పొలం వో ఎకరం నాకప్పజెప్పు. రెండేళ్ళలో బంగారం పండిస్తాను. మామగారిదో రెండెకరం బీడుంది. జిల్లా వ్యవసాయాధికారి నా స్నేహితుడులే. అతని సలహా మీద కావల్సిన ఎరువు అదీ వేశాను. ఇవాళ పదివేలిచ్చి కళ్ళు మూసుకొంటామని ఎగబడుతున్నారు. నువ్వు రాత్రి పొలం కాదుంటావా?"

"మాట్లాడవేం ముసలయ్యా  నిన్నే అయ్యగారేదో అడుగుతున్నారు."

"అంతే నెగండి." అని దూరంగా వెళ్ళి చుట్టుముట్టించే తతంగం జరుపుతున్నాడు.

"ముసలయ్య మా మామగారి పొలం కాపు. కాస్త సాయంగా వుంటాడు. ఇప్పుడు పొలంపనులేమీ లేవని, ఇక్కడికి పంపించారు" అన్నాను.

"పొలంలో పాముని చూసి జడుసుకునే ఘటంలా వున్నాడు. పాముని పట్టడం నేరిస్తేగాని, ఎవరికీ పొలంలో పని చేసే అధికారం లేదంటాను. ఓ సారి రావులపాడులో సాయంత్రం చేలల్లోంచి వొస్తున్నాం. కాలికేదో మెత్తగా తగిలింది. నేను గమనించలా.

రాత్రి వెన్నెట్లో భోజనాలకి కూర్చున్నాం. రెయ్యిమని నా విస్తరి ముందుగా వొచ్చి పడగెత్తింది. అందరూ అదిరిపొయ్యారు. మీరెవ్వరూ భయపడకండి నాకోసం వొచ్చింది అన్నాను. కిమిన్నాస్తి, కరణం గారి భుజంపైన సిల్కు కండువా తీసి చటుక్కున గిరవాటెట్టా. దాన్ని కరిచేసి అందులో ఇరుక్కుపోయి, లుంగచుట్టుకుపోయింది. మరోసారి మైలవరం రాజా గారింట్లో..."

'విను ముసలయ్యా!' అని వో కేకేసి, స్నానానికెళ్ళాను. వొచ్చాను. ఆయన ముసలయ్యతో ఏదో చెప్పుగుంటూ పోతున్నాడు. పులి వేట విషయం.

"చెప్పండి, చెప్పండి" అంటూ కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటున్నాను.

"నాకెన్నాళ్ళ నుంచో పులిని దగ్గరగా వో ఫోటో తియ్యాలని మనుసు. అయ్యాపురం జమీందారు బావగారొకాయన వొచ్చాడు. నలుగురైదుగురం అడవిలోకి ప్రయాణం కట్టాం. మేకని ఎరగాకట్టి చెట్లెక్కాం.

రెండుగంటలవరకూ నిశ్శబ్దం. తరవాత కోతులు కిచకిచలాడాయి... దూరంగా గర్జింపు వినబడింది. నే కూర్చున్న చోటునుండి మేక కనబడటం లేదు. ఎప్పుడొచ్చిందో ఎప్పుడెళ్ళిందో, మేక అరుపు నిలిచిపోయింది. మరో గంటకి దిగి మెల్లిగా నడచిపొయ్యాం. ఒక మైలు వెళ్ళింతర్వాత మేక కళేబరంలో తినగా మిగిలిన భాగాలు ఆకులతో కప్పబడి వున్నాయి. దాని చుట్టూ వొక వల అల్లి, అల్లిక తాళ్ళని కెమెరా క్లిక్ కి ముడేసి, కెమేరా దూరంగా పొదలో వుంచాం. పులివొస్తుంది, వలమీద కాలుపెడుతుంది, క్లిక్ మంటుంది. ఫోటో పడిపోతుంది. అదీ ఏర్పాటు. ఇంతలో ఏదో చప్పుడైంది. నాతో వున్నవాళ్ళు చెట్లెక్కేశారు. వెనక్కి తిరిగితినికదా, అరఫర్లాంగు దూరంలో నాకేసి వొస్తోంది పెద్దపులి..."

"భోజనానికి లేవండి..."

అంది మా ఆవిడ. ముకుందం కథలో లీనమైపోయి, విడిపించుకున్నట్లు లేదు.

"అప్పుడేం చేశానని మీ వూహ? కదలకుండా, వూపిరి బిగబట్టి, పులి కళ్ళలోకి చూస్తూ స్తంభించి పొయ్యాను. అది కూడా అల్లానే, నిర్ఘాంతపడి నా మొహంలోకి చూస్తూ నిలబడిపోయింది. చూపు తప్పించకుండా, మెల్లగా వొక్కొక్క అడుగే వెనక్కి వేసుగుంటూ, వో ఫర్లాంగు వొచ్చేశాను. అది విసుగెత్తి పారి పోయింది..."

"భోజనానికి..."

"ఆనాడు నేను కదిలి వుంటే, పులికి భోజనం దొరికి వుండును. నువ్వీనాడు నాకు భోజనం పెట్టే అవకాశమే లేకపోను..."

ఓహో! హో! హో! అంటూ ముకుందం దీర్ఘంగా నవ్వి, ఆ కుర్చీలోంచి లేచి పడక్కుర్చీలో కాళ్ళు జాచి విశాలంగా పడుకున్నాడు.

పన్నెండున్నర దాటింది; నాకాకలిగా వుంది. పుట్టంతా మునిగిపోయినట్లు ఆయన్ని వో ప్రశ్న అడిగాను.

"ఏమండీ వేటకి వెళ్ళినప్పుడు, తుపాకులూ అవీ తీసుగెడతారుగదా, మరి పెద్దపులి మీదకి వస్తున్నప్పుడు తుపాకీ పేల్చలేకపోయారా?"

ముకుందం గారికి చాలా కోపం వొచ్చింది. ఆయన దగ్గర తుపాకీ వుండివుంటే ఆ క్షణంలో నన్ను పేల్చేసి వుండును, ఆ ప్రశ్న అడిగినందుకు.

"ఇంకా నయం మీకు ప్రతి విషయం, తుపాకీ విషయం బొత్తుగా తెలీదనుకుంటా. తుపాకీ సరైన పొజిషన్ లోకి తీసుకురావడానికి కొంత చేతుల కదలిక అవసరం. ఏమాత్రం కదలిక జరిగినా, వెంటనే వొచ్చి మీదపడి చంపేస్తుంది పులి. అంచేత దాని కళ్ళలోకి చూస్తే అది భయపడి పారిపోతుంది. అట్లాంటి సందర్భాలలో మన తెలివి పని చెయ్యదు. శరీరం బుద్ధికీ తెలీకుండా, తన జాగ్రత్త అది పడుతుంది. ఓ సారి అరవిందుని ఆశ్రమానికెళ్ళాం కళేబరస్వామితో.

రాత్రి విడిదిలో మంచాలున్నాయి, పక్కలేసి సిద్ధంగా, స్వామీజీ వొట్టి కింద సంచీ దిండుగా పెట్టుగుని పరున్నాడు. మంచంమీదకి రండి అన్నాను. వొద్దు, అందరం కిందే పడుకుందాం అన్నాడు. ఆయనమాట తీసెయ్యలేక, అల్లాగే పడుకున్నాం. ప్రొద్దున్నే అక్కడ వాళ్ళొచ్చి మంచం సర్దారు. జానెడు పొడుగు జెర్రి, దిండుకింద విశ్రమిస్తోంది. అంటే ఏం జరిగిందన్నమాట. మంచం మీద అపాయం వుందిస్మా అని ఆయన శరీరం పసికట్టిందన్నమాట. పంచేంద్రియాలు కాక, ఆరోశక్తి అన్నమాట. అరవిందుడు వ్రాశాడు కూడాను  ఒక యోగి హిమాలయ పర్వతాలలో తపస్సు చేసి ఆత్మశుద్ధి సాధించినందువల్ల లోకానికేం వుపయోగం అని వొక దొరగారు ప్రశ్నించారట. అప్పుడు ఆయన అన్నాడుట..."

"చాలా పొద్దోయింది. మీకోసం క్లబ్బులో అందరూ కనిపెట్టుకుంటారేమో" అన్నాను.

"నాకోసం ఎవ్వరూ కనిపెట్టుకోరు. ఓ ఐదునిమిషాలు చూస్తారు – హాయిగా తింటారు. ఎవరాకలి వారిది..."

"మరి మీ కాకలిగా లేదా ?"

"ఆ ప్రశ్నకి సమాధానం మా కళ్యాణే చెప్పాలి. ఓసారి ఆమే నేనూ వాళ్ళ చుట్టాలింటికి పెళ్ళికెళ్ళాం..."

"నాకాకలేస్తోందండీ – మీరూ లేవండి – భోజనాల దగ్గర మాట్లాడుకుందాం" అన్నాను. ముకుందం మాటాడుతూనే వున్నాడు. నేను భోజనానికి లేచి ఆయన్ని కుర్చీలోంచి లేవదీయబొయ్యాను.

"కొందరిలా నాకు వేళకు భోజనం అనే పట్టింపు లేదు. అప్పుడప్పుడూ భోజనం మానెయ్యడం మామూలే – మీరు కూర్చుని కానివ్వండి. ఏం ? ఎంతవరకూ చెప్పాను! ఆ  కళ్యాణి నేనూ వెళ్ళాం. వొడ్డించారు..."

"వొడ్డించాను. లేవండి " అన్నది ఆవిడ.

"మీరిద్దరు కూర్చుని తింటుంటే చూడాలనివుంది. కూర్చోండి."

వొంటిగంటన్నరైంది. మేం లేచాం. తాంబూలం వేసుగున్నా. ఆయన కాస్త మజ్జిగమాత్రం పుచ్చుగున్నాడు. మైసూరులో తాంబూలాన్ని గురించి చెప్పడం మొదలెట్టాడు. నాకు నిద్రొస్తోంది. ఆదివారం వోగంట నిద్రించడం నా కలవాటు. ఆవులించాను. కాసేపు విశ్రమిస్తారా అని స్వగతంగా అడిగి, గదిలో పక్కసర్దాను. మైసూరు దసరా వుత్సవాలని వర్ణిస్తున్నాడు.

"ఇల్లా వుపవాసాలుంటే మీరు నీరసించి పోరు? ఆకలితో కబుర్లేం చెప్పగలరు?" అని తెగించి అడిగేశాను.

"ఆ ప్రశ్నే మా కళ్యాణీ అడుగుతుంది. చాలామందికి నిద్ర, తిండి, అవసరం. నాకవంత ముఖ్యం కావు. ఓ సారి రాజారావుగారింట్లో పేకాటకి కూర్చున్నాం..."

ఇంతలో నీళ్ళల్లో మునిగిపోతున్నవాడికి తాడు దొరికినట్లు, పక్కింటి కుటుంబరావు, పత్రిక తీసుకెడదామని వొచ్చాడు. వొకర్ని వొకరికి పరిచయం చేశాను. కుటుంబరావు స్కూలు మేస్టరు. ముకుందం గారు వెంటనే ఆయన చదువు, మేస్టరు, పరీక్ష అనుభవాలు చెప్పడం లంకించుకున్నాడు. అమాయకుడు కుటుంబరావు ఆ యింద్రజాలంలో చిక్కుకున్నాడు. నే వెళ్ళి వెన్ను వాల్చాను.

లేచేటప్పటికి మూడు కావొస్తోంది కుటుంబరావు లేదు. మా ఆవిడుంది. సరోజ చదువు విషయం చెబుతున్నాడు.

"స్త్రీలముందు అనకూడదు గాని, పురుషుణ్ణి ఘనకార్యాలకి ప్రేరేపించేది స్త్రీలే ఆ స్త్రీలే ఆ ఘనకార్యం కాస్తా సాధించనీకుండా ఆటంక పరుస్తారు. లా కాలేజీలో సుశీల అని వుండేది. ఆమె మెప్పుకోసం మలయప్పన్ అనే మళయాళీ సోదరుడు బాగా చదివి యూనివర్సిటీ ఫస్టుగా ప్యాసయ్యాడు. ఎమ్.ఎల్.డిగ్రీ తెచ్చుకున్నాడు. వారిద్దరూ వివాహం చేసుకున్నారు. అంతే అతన్ని కోర్టుకెళ్ళనివ్వదు ఇరవై నాలుగ్గంటలూ తనని చూస్తూ, మెచ్చుగుంటూ, వినోదించమంటుంది. ఏమైందని మీ ఊహ ఆరునెలల్లో ఆమెని విడిచి పెట్టాడు..."

నవ్వడం సాగించాడు. ఆవిడను కాఫీ విషయం చూడమని లోపలికి పంపించాను.

"మీరు మొహం కడుక్కోండి. కాఫీ తాగి, అల్లా బైలుదేరుదాం. మీ క్లబ్బులో ఆటలకి టైమవుతోందేమో..." అన్నాను.

"నేను మా చెస్ లో ఆడటం అనేది దైవాధీనం. వాళ్ళకీ తెలుసు. అందుచేత నాకు ప్రతిగా మరో ఆటగాడు లేకుండా నన్ను పంపించరు. ఓసారిల్లాగే ఊటీ వెళ్ళాం..."

నా గుండెలో రాయిపడింది. ఈ లెక్కని, బైటకెళ్ళడానిక్కాని, మరో పని చూసుకోడానిక్కాని వీల్లేదు. ఏం చెయ్యను?

"వారినావిధంగా భంగపర్చడం భావ్యంకాదు, పదండి నేనూ వొస్తాను. మీ ఆట చూళ్ళేదు..." అన్నాను.

"నా ఆట ఇప్పుడేముంది; యీ పూట చూడకపోడమే మంచిది. నే ఆడకపోవడం నాకూ మంచిదే. అదుగో ఆ రాజమండ్రిలో చెయ్యి, కాలూ, రెండూ వొకేసారి బెణికాయి. డాక్టర్ నెలవరకూ కదల్చకపోవడం మంచిదన్నాడు నాకు వీలు పడుతుందా. వీళ్ళు నువ్వొస్తే కాని వల్లకాదని చంపుకు తింటారు. కాళ్ళూ చేతులూ మెదణ్ణి పనిచెయ్యనియ్యవు. ఆఖరికి బ్రిడ్జి కూడా యివాళ ఆడలేను."

"పోనీ, మనం వెళ్ళి చూస్తూ వాళ్ళకి హుషారిద్దాం "

లాభం లేకపోయింది. పరమశివన్ అనే తమిళసోదరుడి వృత్తాంతం చెబుతున్నాడు. నేనిప్పుడంతా ఏకరువు పెడతానని భయపడకండి. అది నా తరం కాదు. ఆ పూట ఆయన మా యింట్లో వుండగా మాట్లాడినవన్నీ పూరాగా వ్రాయాలంటే సవాలక్ష గ్రంథం అవుతుంది. నేనే కాదు ఎవ్వరికీ అది సాధ్యం కాదు. ఆయన వొక ఏడాదిలో మాట్లాడిన వాటిని వ్రాయాలంటే, వో డజనుమంది చిత్రగుప్తులు, తమ అసిస్టెంట్లతో ఐదారు సంవత్సరాలు కృషి చేస్తే సాధ్యపడుతుందేమో అదేనా షార్టుహేండులో వ్రాయడం వారికి వొచ్చుంటే మాట. ముకుందం పొట్టిగా, సన్నగా వుంటాడు. గిరజాలజుట్టు, చామన ఛాయ, గడ్డం కిందమచ్చ, కళైన మొహం. కంఠం సన్నంగా వుంటుంది. స్ఫుటంగా, ప్రతి అక్షరం సాగదీస్తూ నోరారా ఉచ్ఛరిస్తాడు. అతనొక ధ్వని ప్రచారక యంత్రం. ఒక భాషా సంస్థ. కాలం నిల్చిపోనట్లు, గోళాల

పరిభ్రమణం ఆగి పోనట్లు, ఆయనలో వుద్భవమయ్యే ధ్వని పరంపరలకి విరామం లేదు. అడ్డు ప్రశ్నలు ఊకొట్టాడాలు ఆయనకక్కర్లేదు. వింటున్నట్లు తల పంకించడంతో నిమిత్తం లేదు. మనం చూస్తున్నప్పుడే సూర్యుడు కాంతి కిరణాలను ప్రసారం చేస్తున్నాడా? మనం కోరినప్పుడే నిండు చంద్రుడు దర్శనమిస్తున్నాడా ? ప్రియురాలొచ్చేవరకూ ఆగమంటే పువ్వు పరిమళించడం మానుకుంటుందా? నిద్రపోయిన కాసేపు మౌనంగా వుంటాడానుకుంటున్నారా ? అది భ్రమ. మేఘం వెనకాల సూర్యుడు వెలుగుతూవుంటాడు. మనకి కనబడదు. శిఖరం వెనుక చందమామ మనకి కనబడకపోవొచ్చు. అంతమాత్రం చేత లేడంటామా? ఎడారిలో వాడినపువ్వు, సంద్రాలలోతుల్లో ధగధగ మెరిసే వజ్రం – మనకేం తెలుసు? మనం ఎంత అల్పులం ! ఎక్స్ రే యంత్రాన్ని ప్రయోగించి నిద్రిస్తుండగా ఆయన మెదడును పరికించి ఒక మహాకావ్యం అల్లుతూ ఉంటుంది ఆ మెదడు. మెదడులో ధ్వని కదలికని వ్రాసే పరికరాన్ని యే శాస్త్రజ్ఞుడో ముందు ముందు తయారు చేసి తీరుతాడు. అప్పుడింక ఆధునిక యుగంలో మహాకావ్యాల లోపం వుండదు.

ఆరు కావొస్తోంది. ముకుందం గారు స్వీయ గాథలో పడ్డాడు. తనని భార్య కళ్యాణి ఏవిధంగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నదీ – పొరబాటు – ఏవిధంగా పెళ్ళి చేసుకున్న తర్వాత, ప్రేమించడం మొదలెట్టిందీ. అదే శాశ్వతమైన ప్రేమ – ప్రేమంటే ఏమిటి ? ఒక అరగంట లెక్చరిచ్చాడు. సొమ్మసిల్లి పొయ్యాను. ప్రేమలో వైరాగ్యానికి తావుందా ? పవిత్రమైన ప్రేమ యీ యంత్ర యుగంలో సాధ్యమా ? మార్క్స్ సిద్ధాంతాలకి ప్రేమకి వున్న సంబంధం ఏమిటి ? ప్లేటో ఏమన్నాడు ? వేమన్న పద్యం చూడండి వాల్మీకి రామాయణం తీసుకోండి. పోతన్న భాగవతం తియ్యండి. అమెరికా విడాకుల తఫిసీళ్ళు – మాస్కోలో విడాకుల సంఖ్య సంతాన నిరోధం ఆవశ్యకత పెరిగిపోతున్న జనాభా మన దేశంలో మూఢాచారాలు.

"నాకు పిల్లలు లేరు. వుండరు కూడా. వుంటే నా జీవితంలో వున్న ఆనందం వారికి సాధ్యం కాదు. ఆస్తి పంచుకుంటారు. ప్రేమ పంచుకుంటారు, సంతోషం పంచుకుంటారు. వారికి సంతానం కలుగుతుందిగా! నేను తాతనవుతాను. కళ్యాణి అమ్మమ్మవుతుంది. వారి సంతానం బలహీనులవుతారు. ఆస్తి సన్నగిల్లి పోతోంది. వారి సంతానానికి తినేటందుకు తిండి వుండదు. సంఘ పతనం..."

ఆయన సంతానం కూడా ఆయన లాగే తయారువుతే, యింకేమన్నా వుందీ ? ఊహించలేక పొయ్యాను.

"నా సంతానం మూగవాళ్ళవుతారు – అమ్మ పోలికే ఐతే – ఎందుకంటారా? కళ్యాణి అంత నాలా మాటకారి కాదు. ఆవిడ కంఠమాధుర్యం వొక అపూర్వ అనుభవం..."

ఏడు కావొస్తోంది. ఏమిటీ చెయ్యడం ? ఆవిడ కాస్తంత టీ, దోసెలు తెచ్చింది. ఆయన దోసెలు తిన్నాడు. నా పళ్ళెంలోనివి కూడా దగ్గరకు లాక్కుని కబుర్లు చెబుతూ తినేశాడు. టీ త్రాగాం. ఇంతలో దైవం కటాక్షించాడు. ఫైరింజన్ మా గుమ్మం ముందు నుంచి చప్పుడు చేస్తూ వెళ్ళింది. ఎక్కడో ఇళ్ళు తగలబడుతున్నాయంటూ ముసలయ్య వచ్చాడు. "రండి చూసొద్దాం" అంటూ ఆయన్ని లేవతీసి మెట్లకిందికి నడిపించాను. వెనక అహోబలరావు గారిల్లు తగులబడిన చరిత్ర చెబుతున్నాడు. నడుచుకుంటూ వెళ్ళాం. క్లబ్బుకి కొంచెం దగ్గరలో గుడిసెలు తగులబడుతున్నయి. క్లబ్బులో వాళ్ళు కూడా చూడ్డానికొచ్చారు. ఆ ఎరుగున్న వాళ్ళ గుంపులో కలిసిపొయ్యాడు. మళ్ళా రాత్రి కనిపిస్తానన్నాడు. తప్పకుండా అన్నాను. ఆ క్లబ్బు మిత్రుల్ని పట్టుకున్నాడు. అంతా ఆ ప్రవాహంలో కొట్టుకుపొయ్యారు. నే యింటికొచ్చేశాను.

ముకుందాన్ని మళ్ళా మూడేళ్ళ తర్వాత కలుసుకున్నాను. ఆ రోజుల్లో పెద్ద గాలీ వానవొచ్చి, రైళ్ళు నిలిచిపోవడం జరిగింది. రైళ్ళు తిన్నగా లేవని మా ఆవిడ పుట్టింట్లో వుండిపోయింది. కారియర్ భోజనం తప్పింది కాదు.

సాయంత్రం ఆరైంది. రైళ్ళ విషయం కనుక్కుందామని బైలుదేరుతుండగా మెట్ల మధ్యలో ముకుందం ఢీకొన్నాడు. ఏడాది క్రితం ముకుందం భార్య టైఫాయిడ్ జ్వరం వొచ్చి చనిపోయింది. సానుభూతి జాబు వ్రాశాను. కలుసుగోడం ఇదె మొదటిసారి. పరామర్శకి వాక్యాలు కూరుస్తుండగా ముకుందం వాటిని వుచ్చరించే అవకాశం యివ్వకుండా తనే సాగించాడు.

"ఈ రోజుల్లో రైళ్ళు మరీ అధ్వాన్నమయ్యాయనుకో. ఆలస్యంగా రావడానికి, నిలిచిపోడానికి యీ తుఫాను వో సాకు. వుత్తప్పుడు ప్రతి రైలు వో రోజు ఆలస్యం. తుఫానొస్తే వో వారం అంతే తేడా, గుంటూరు నుంచి బండి దిగాను. ఎక్స్ ప్రెస్ పది గంటలు లేటు. సరే ఆ ఫ్లాట్ ఫారంలో యిరుక్కుని యే జబ్బో తగిలించుకోడం యెందుకని, మిమ్మల్ని చూసి పోదామని వొచ్చాను. అర్జంటుగా ఢిల్లీ కెళ్ళాలి.

"మా వూళ్ళో రైతులంతా – భూముల్ని గురించి వో కొత్త శాసనం వొస్తోందిగా – దానిలో తికమకలు చాలా వున్నాయిలే. వారికున్న అభ్యంతరాలని వో పిటీషన్ ద్వారా, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి విన్నవించమని, ఆ పిటీషన్ వ్రాయించి, ఆ నాయకత్వం నామీద పడేశారు. ఇట్లాంటివి చాలా చేశానులే. వెనక గుర్నాధం గారి ఇంటి తగాదా ఢిల్లీకి తీసుకెళ్ళాను. ఇళ్ళ శాఖ వారు నే ఎత్తిన లా పాయింట్లకి ఖిన్నులై, సుప్రీమ్ కోర్టులో ప్రధమ స్థానం వహించనందుకు ఆశ్చర్యపడ్డారు. మనకెక్కడ తీరుతుంది. అయినా, కళ్యాణి పోయిం తర్వాత, నా పాత వ్యాపకాలన్నీ మానుకున్నాను. జీవితం పట్ల నా దృష్టే మారిపోయింది. నేనిప్పుడేవీ పట్టించుకోడం లేదు. ఇప్పుడు గూడా ఆ రైతులంతా చంపుకుతింటే, సరే పరోపకారార్థం యీ శరీరం అన్న సామ్యంగా, ఊ అన్నాను. ఇంక వో విషయం నెత్తిన వేసుగున్న తర్వాత, దానంతు తేల్చేవరకూ వూరుకోనని నీకు తెలుసుగా!"

"పాపం కళ్యాణి..."

"ఏం పాపం. పుట్టింతర్వాత చావు తప్పదు కదా. అన్ని మంచి లక్షణాలుండి, వొక ఆదర్శ ప్రాయమైన వ్యక్తిగా, నలుగురికీ కన్నెర్రగా వున్న కళ్యాణి చాలా కాలం బ్రతకదని లోలోపల అనిపించేదిస్మా ! అంతమంచిగా వుండ కూడదనుకో  యీ ప్రపంచంలో దేవుళ్ళు వోర్చలేరుట గ్రీకు పురాణ గాథలు..."

"రండి లోపలి కెడదాం..."

"ఎవ్వళ్ళం టైఫాయిడ్ అనుకో లేదు. అరడజనుమంది స్పెషలిస్టులు పూనుకున్న రోగి ఆయువు మూడినట్లే. ఇరవై రోజులయ్యాక ఫలానా అని నిర్ణయించారు. కాంప్లికేషన్ వుందేమో చూడండన్నా నా మాట పెడ చెవిని పెట్టారు. ఆమెకు తెలుసు బ్రతకనని. నన్ను దగ్గరకు రమ్మంది. మంచం బద్దీ మీద కూర్చున్నాను. నా రెండు చేతులూ పట్టుకుంది. ఆమె కళ్ళు చాలా పెద్దవిలే. నీరసించిందేమో, మరీ పెద్దవిగా కనిపించాయి. కన్నీరుతో, 'మీరు సరోజను చేసుకోండి' అంది. నాకు ఏడుపులో నవ్వొచ్చింది. చనిపొయ్యే వారికి బ్రతికున్న వారంటే అంత తాపత్రయం వుంటుంది కాబోలు!"

"రండి..."

"లోపలికెందుకు – బైటకెళ్ళి టీ తాగొద్దాం. ఈ ఆడాళ్ళున్నారే  భలే ఆసాధ్యులబ్బాయ్. వాళ్ళకి కొన్ని విషయాల్లో దూరదృష్టి వుంది. ఏకాంతంగా మొగాడు పొయ్యే పోకిళ్ళు, వేసే వేషాలు, యిట్టే పసిగట్టేస్తారు. వాళ్ళింటి పక్కన మోహనరావని వుండేవాడు. గౌరవమైన కుటుంబీకుడు. వాళ్ళింట్లో పని చేసే పిల్ల వోసారి కళ్యాణితో అన్నదిట ఏదో మాటల సందర్భంలో 'అమ్మగోరు చాలా మంచి వారండి.' అమ్మ గోరంటే మోహనరావు సతీమణి అన్నమాట. ఆ రాత్రి కళ్యాణి నాతో అంది – ఏమందో తెలుసా ? 'ఆ పని పిల్లకి ఆరో మాసం – తండ్రి మోహనరావు ఆ పనిపిల్లని తీసుకెళ్ళి పొయ్యాడు. ఎందుకు చెప్పొచ్చానంటే, కళ్యాణి విషయం యిట్లే గ్రహించింది."

"ఇటు రండి  రోడ్డునడుంగా లారీలు అవీను." అని ఆయన్ని పక్కగా లాగాను. హోటలు కెళ్ళాం.

"సరోజ పెళ్ళంటే యిష్టం లేనట్లు, మొగాడంటే గిట్టనట్లు, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుందా   అదంతా నటనేననుకో. నన్ను తెగ వేళాకోళం చేసేదిలే. సరోజ వాళ్లక్కంత చక్కంది కాదు. కాని అంతకంటే గడసరి   నేనో   ఉత్త అమాయకుణ్ణి. మా ఆవిడన్నట్లు, సరోజని గురించి నాకే యితర అభిప్రాయం, అప్పుడూ లేదు ఇప్పుడూ లేదు. కళ్యాణిని తృప్తిపరచడం కోసం సరేలే, అని వాగ్దాన పూర్వకంగా అన్నాను. కాని నాకు నిజంగా ఆమెను చేసుకోవాలన్న వుద్దేశం లేదు. ఎందుకంటావా, మనది బిజీ లైఫ్   పెండ్లికీ ప్రేమకీ టైం లేదు. ఈ ఆడాళ్ళున్నారే, మన జీవితం అంతా వారి సమక్షానా, వారి ఆరాధనలో గడపమంటారు. నాకది సాధ్యం కాదు. సరోజ తల్లి కూడా ఆమెను చేసుకోమని చాలామంది చేత చెప్పించింది. ఆఖరికి ఏమైందో తెలుసా ?"

టీ త్రాగి మళ్ళా యింటి వేపు బైలు దేరాం. అతను మాట్లాడుతూనే వున్నాడు. నా ఆలోచనలు నేను వేరే సాగిస్తున్నాను. ముకుందానికి వస్తు సేకరణలో పక్షపాతం లేదు. అతనికన్ని వస్తువులూ, ఉదంతాలూ, వ్యక్తులూ సమానమే. అన్నీ అతని వాగ్దేవిని సమంగా పురికొల్పి, సమమైన రీవితో ధ్వనులను ప్రసారం చేస్తాయి. భార్య మరణం, సరోజ పెళ్ళి, గుర్నాధం గారి యిల్లు, హాకీ ఆటలో రంగయ్య నాయుడు వోటమి, కిళ్ళీలో సున్నం ఎక్కువ పడడం యివన్నీ అతనికి మహా కావ్యాలే. ఎక్కువ తక్కువలు లేకుండా వేదాంతిలా నిశ్చల మనస్కుడై వితర్కిస్తాడు. మౌనం యోగి తపస్సు; భాష, ధ్వని యితని తపస్సు, ఊహ ద్వారా ఒక ప్రపంచాన్ని శాసించాడు. ఆ జగత్తుకి అతను చక్రవర్తి. మనం అంతా అతని ప్రజలం. రాజుగారు మాట్లాడేటప్పుడు, అందరూ నిశ్శబ్దంగా వుండాలి.

అతను చవి చూడని అనుభవం లేదు   లోనుగాని ఉద్రేకం లేదు. జయించని తృష్ణ లేదు; తరచి చూడని రహస్యానుభవం లేదు, కనని కల లేదు. ఆడని ఆబద్ధం లేదు. తెలియని సత్యం లేదు. రాజ్య విస్తీర్ణము, సరిహద్దులు తెలియని చక్రవర్తి లాగా, భార్యమరణంతో అతను మానసికంగా పేట్రేగిపొయ్యాడు. జీవిత గమనం వేగం తగ్గి నిదానంగా జరుగుతోంది   కాని, అతని ఆరాటం, ఆవేదన వేగిర పడుతున్నాయి. ఏదో సిద్ధాంతం, సందేశం, జీవిత దృక్పథం అల్లి మనందర్నీ అందులో చిక్కించుకుని స్థిమిత పడదామని అతనికి తెలియని సంకల్పం లాగుంది. ఏదో భార్యపట్ల చిన్న అపచారం చేశాడు. దాన్ని తనకు తాను సమర్థించుకుని, పోయిన వ్యక్తి క్షమాపణ పొంది, సమాధాన పడటం కోసం, యీ వేగిరపాటు   యీ భాషా ప్రయుక్త వ్యక్తి స్వైర విహారం, యీ నాదబ్రహ్మ స్మశాన నృత్యం, యీ వాగ్గేయ కారుని చివరి ముక్తాయింపు.

"ఏమైందని అడగవేం?" అంటున్నాడు వెర్రివాడు. అతన్ని గూర్చిన ఆలోచనలు నన్ను వేదాంత శిఖరానికి చేరేశాయి. ఏది, ఏమైతే ఎవరిక్కావాలి. అనంత విశ్వంలోని ప్రచండ నిశ్శబ్దాన్ని ఒక్క మాటతో, వొక్క అర్థశూన్యమైన ధ్వనితో ప్రాచీన ప్రశాంత గాంభీర్యాన్ని భంగ పరుస్తున్నా యీ వెర్రి మానవుడు !

పైకి మాత్రం 'చెప్పండి' అన్నాను.

"సరోజ నన్ను చేసుకోనని కచ్చితంగా చెప్పేసింది. ఎందుకనీ ? ఆమెకు నామీద వుండబట్టేగా. తనకు నామీద వున్న ప్రేమని మరోలా ప్రకటించ లేకపోయింది. అక్క బ్రతికి వున్నప్పుడు ఎంత గారం, ఆప్యాయత, ఆదరణ, స్నేహం చూపించిందనుకున్నావ్! అది వెన్నెల రాత్రి. కళ్యాణి రంగమ్మ గారితో గుళ్ళో కెళ్ళింది. అప్పుడే క్లబ్బునుంచి వొచ్చి స్నానం చేసి, డ్రెస్ చేసుగుంటున్నా. గదిలోకొచ్చింది సరోజ. అద్దంలో నా మొహంకేసి చూసింది.

"నువ్వు ఆలయానికి వెళ్ళలేదా?" అని అడిగా.

"ఆ ప్రశ్న నేనే అడుగుదామనుకుంటున్నా   నాకేం కోర్కెలు లేవు" అన్నది. "అంటే?" అన్నాను.

"పిల్లలు కావాలని ఒక్క భార్యమాత్రం ప్రదక్షణలు చేస్తే చాలదు. నువ్వూ చేయాలి" అంది. "మంచి భర్తని ప్రసాదించమని నువ్వూ కోరుకోవచ్చుగా" అన్నాను దెప్పుతూ "నాకట్లాంటి కోర్కెలూ లేవు, నమ్మకాలూ లేవు" అంది. "అంతా మానవ ప్రయత్నమేగాని దేవుడి ప్రమేయం లేదంటావు. నీ నమ్మకాలు, ఆదర్శాలు, ప్రయత్నాలు, వాటి ఫలితాలు కాస్తంత యీ అల్లుడి చెవిని పడెయ్యి" అన్నా వేళాకోళంగా.

"ప్రయత్నం చెయ్యనిదే నాకు పెళ్ళి కాదంటావ్?"

"పిల్లల కోసం మా ప్రయత్నం లాంటిదే అనుకోకూడదూ?" అని, తువ్వాలు భుజాన వేసుకుని డాబామీదికి నడిచాను. నా సంభాషణంతా అద్దంలో సరోజతోనే. నాకేసి అదోలా చూసింది అట్లాగనిపించింది. పదినిముషాల్లో డాబామీదికి తనూ వొచ్చింది.

"కోపం వొచ్చిందా?"

"ఎవరి మీద?"

"నామీద"

"ఎందుకు?"

"మొగాళ్ళకెందుకు కోపమొస్తుందో నాకేం తెలుసు?"

"ఇంకా నీకే వొచ్చింది కోపం, అవునా?"

"ఎందుకో?"

"స్త్రీ మనస్సు తెలియ బ్రహ్మతరంబా?"

"పోనీ తెలిసినంత వరకూ చెప్పు భయం లేదు. రోడ్డువైపు చూస్తున్నాలే. అక్కయ్య రావడం లేదు" అన్నది. నాకు నిజంగా కోపం వొచ్చింది. "అక్కయ్యంటే నువ్వు భయపడాలి నీ మనస్సులో ఏదో వుంటే" అన్నాను. సరోజకీ కోపం వొచ్చినట్లుంది. "అక్కయ్య ముందు నీ అమాయకపు అవతారం నాకు తెలియదనా అక్కయ్యకి తెలీదనుకోకేం నా మనస్సులో ఏదో వుందిట. మహా కనిపెట్టావులే నా మనస్సులో ఎవరున్నా లేకపోయినా, నువ్వు మాత్రం లేవు" అని కిందకి వెళ్ళి పోయింది. అది ప్రేమ కాకపోతే, ఏమిటంటావ్?"

ఇంటికి చేరుకొని వరండాలోకి కుర్చీలు లాక్కుని కూర్చున్నాం. భోజనానికి హోటలికెళ్ళడమా, కారియర్ తెప్పించడమా అన్న ఆలోచన సాగనియ్యకుండా మళ్ళీ మొదలెట్టాడు. ఇంక రాత్రంతా జాగారమే ఏ పరమాత్మకీ నా పైన కటాక్షం కలగదూ! నేను మాట్లాడడం మొదలెడితే! ఒక యత్నం చేశా.

"చూడండి మీరు సరోజపై మరికొంత అప్యాయత కనబరిస్తే..."

"చాల్లెండి; సరోజ విషయం మీరెరుగరు. కొందరు స్త్రీలంతే. వాళ్ళని తిట్టి, హింసించి, బాధపెట్టిన వారిని గాని కనికరించరు. ఓ సారి..."

ఇంక లాభం లేదు. ఆ యత్నం విరమించి, చంద్రుడి కేసి చూస్తూ నా పగటికలలు కంటూ కూర్చున్నాను. పగటి కలలు మానవ హృదయానికి స్వర్గం లాంటివి. నాకు క్రాస్ వర్డ్ ఫజిల్ లో ఇరవైవేలిస్తే ఎల్లా ఖర్చుపెట్టేదీ వూహించుగుంటాను. సరోజను నే చూళ్ళేదనుకోండి వివాహమాడి వుంటే నా జీవిత మెల్లా వుండేదీ వూహించుగుంటాను. ముకుందం కబుర్లని కళ్యాణి ఎల్లా భరించ గలిగిందో? ఆమె దగ్గర కూడా యిల్లాగే మాట్లాడతాడా ఆవిడ వింటుందా? ఇప్పుడు ముకుందం ఏమంటున్నాడో విందామని పగటికలని తుడిచేసి, అతని కేసి చూశాను.

"మా ఆవిడంటుంది – నేను తన దగ్గర వున్నప్పుడుకంటే దూరంగా వున్నప్పుడు తనకి దగ్గరగా వున్నట్లు వుంటుందిట. అల్లాగంటుంది గాని, దూరంగా వుంటే "ఎప్పుడొస్తారు?" అని టెలిగ్రాం మీద టెలిగ్రాంలిస్తుంది. దగ్గరగా వుంటే ఎప్పుడు వెడతాడురా బాబూ – అన్నట్లుగా ప్రవర్తిస్తుంది – మీకూ అల్లాగే అనిపిస్తోంది కాదూ?"

ఒక్క సారి ఉలిక్కిపడి కుర్చీలోంచి లేచాను.

"ఇంకా నయం – ఎంతమాట!" అన్నాను. ఇంక నాకు ఆ రాత్రికి మోక్షం లేదు. హాయిగా ఆయనకి లొంగిపోయి, ఆ ధ్వని సాగరంలో పూర్తిగా మునగడం మంచిదనుకుంటూండగా, దైవం నా భక్తికి మెచ్చి పరంధామయ్యని పంపించాడు. తుఫానులో రైలు దొరక్క యిరుక్కుపోయిన వ్యక్తులలో పరంధామయ్య వొకడు. నాకు స్నేహితుడు. ప్రసిద్ధ రచయిత. ఆయన్ని ముకుందానికి వప్పగించి నేను కాస్తంత స్వేచ్ఛపొందొచ్చు.

"పరంధామయ్య గారని – "హాయిగొల్పే హొనొలులు" అనే యాత్రా గ్రంథం వ్రాశారు. అమెరికా, జపాను దేశాలు తిరిగొచ్చాడు" అని ముకుందానికి పరిచయం చేశాను.

"అయ్యో! ఆయన్ని ఎరక్కేం... వెనకటికి వోసారి చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి గారికి సజ్జాపురంలో సన్మానం తలపెట్టారు. మా మావగారి తండ్రి అధ్యక్షులుట..."

పరంధామయ్య హతం అనుకుని, కారియర్ విషయం చూస్తానని బైటకొచ్చి, నిశ్శబ్దంగా గాలి పీల్చానని రహస్యంగా ఒప్పుగుంటున్న స్వార్థపరుణి.

బస్ స్టాండ్ దగ్గర గాని ముసలయ్యకి చుట్ట కాల్చుకునేటందుకు సరైన స్థలం దొరకలేదు. అక్కడ దొరికాడు. తీసుకొచ్చి కారియర్ యిచ్చి హోటల్ కి పంపించాను. ఎనిమిది కావొస్తుంది. పరంధామయ్య – ఆ సాహిత్య సభల్లో గంటలు గంటలు ఉపన్యసించే పరంధామయ్య – ఆ ప్రవాహంలో వుక్కిరిబిక్కిరవుతున్నాడు. నన్ను చూడగానే లేచాడు.

"ఇంతకీ యీయనెవరో పరిచయం చేశావు కాదు" అన్నాడు కాస్త కోపంగా, సమాధానం చెప్పే ప్రాప్తి నాకు లేదు. ముకుందం దొరకపుచ్చుగున్నాడు.

"నేనూ రచయితనే  ఓ వెయ్యి పేజీల గ్రంథం వ్రాశాను"

"ఎప్పుడూ చెప్పారు కారేం. అచ్చయిందా?" అన్నాను ఎల్లాగో సందుచేసుకుని.

"అంటే బుర్రలో వ్రాశాను. కాగితం మీద వ్రాయడం ప్రారంభించాలి. చాలా పెద్ద గ్రంథం, రెండువేల పేజీలు పట్టొచ్చు. ఇంకా పేరు పెట్టలేదనుకో.."

"ఏం పేరు పెడితే బాగుంటుందంటారు?"

"విషయమేమిటో తెలిస్తే..." పరంధామయ్య వాక్యం మరోలోకంలో పూర్తవుతుంది.

"అదే చెబుదా మనుకుంటున్నా. మొన్న వ్యవసాయ శాఖవారికి పిటిషన్ పెట్టానా  నేనూ లాయర్నే.  ఐనా లా పదాలు వాడకుండా, అతి సులువైన సరళమైన భాషలో వ్రాశానేమో – ఎందుకంటే మా మామగారి యింట్లో వంటాయన శరభయ్యకి కూడా యిట్టే అర్థమైంది. విషయం బోధ పడగానే ముక్కు మీద వేలేసుకున్నాడు."

పరంధామయ్య దగ్గరుండడం వల్ల కాబోలు, కొంచెం ధైర్యం చిక్కి సందేహ నివృత్తికుపక్రమించాను.

"మీ మామ గారింట్లో వున్నది వొంటలక్కగా" అన్నాను. ముకుందాన్ని పల్టీ వేయించగలిగానని గర్వ పడుతూ.

“సరేలే – ఆవిడెప్పుడో వెళ్ళిపోయింది, వెండి ముక్కుపొడుం డబ్బీ, అరడజను యింగువ పొట్లాలూ తీసుకొని, నేనారాతీశాను. అత్తగారూ వాళ్ళూ ఆడదాన్ని యాగీ చెయ్యడమెందుకని వూరుకోమన్నారు. శరభయ్యని కుదిర్చిపెట్టింది నేనే. వాడున్నాడే, వంట చెయ్యడంలో భీముడు. “అతనిచేతి భోజనం వొక్కసారి తిన్నట్లయితే, పొట్టి శ్రీరాములు యీ నాటికి జీవించేవుండును. నా గ్రంథంలో వొక అధ్యాయం అతన్ని గురించే.”

“మీరు వ్రాసే గ్రంథం స్వీయచరిత్రన్నమాట...”

“అసలు విషయం చెప్పనివ్వండి  చాలా మంది చంపుకు తింటున్నారు, మీ చరిత్ర వ్రాయండని – నాకు తీరికేది? జీవించదల్చుకున్న వారికి గ్రంథరచన పడదేమో! వోసారి...”

భూకంపం ఏ ప్రాంతంలో ఏ సమయంలో చెలరేగుతుందో ఎవరు చెప్పగలరు ? పెద్ద బీటలు తీసింది. పరంధామయ్యా నేనూ అందులో పడిపొయ్యాం  వో పావుగంట. తెప్పరిల్లి ‘దాహం’ అన్నాడు పరంధామయ్య. అని తనే లోపలికెళ్ళాడు.

"శరభయ్య మాకక్కర్లేదంటే నా దగ్గరే అట్టేపెట్టేసుకున్నాను. పేరమ్మని నా దగ్గిరే వుంచుకున్నాను! ఏం చెయ్యను తెలుగు భాష లోపం వుంచుకోక తప్పదు. చురుకైన పిల్ల. మొగుణ్ణి వొదిలేసింది  వాడే వదిలేశాడనుకో  రంగం వెళ్ళాడు. రాజకీయాలు వొదులుకున్నాను. ఆటలు పాటలు వొదులుకున్నాను. కృష్ణా రామా అనుకుంటూ, పొలం, తోట చూసుకుంటూ కడుపులో చల్ల...”

ఇంతలో ‘బాబోయ్’ అని లోపల్నించి పరంధామయ్య గావుకేకేశాడు. తొందరగా వెళ్ళాం. ఆయనకి తేలుకుట్టిందిట. కాలు గట్టిగా అదిమిపెట్టి, “మండ్రగబ్బేమో కాస్త చూడండి. ఇది మామూలు తేలు కాదు” అని బాధ పడుతున్నాడు. నేను నాలుగు మూలలూ చూస్తున్నాను. “కనబడదేం?” అన్నాను. “నీకు స్వాగతం యిస్తూ ఎదురుగా వొస్తుంది. మరీ మందేం లేదూ? డాక్టరెవడూ లేడూ?” అంటున్నాడు.

ముకుందం మళ్ళా మొదలెట్టాడు; “ఓసారి పేరమ్మ కిల్లాగే తేలు కుట్టింది. దానికెంత బాధ కలిగిందంటే, “చూడితేలు కుట్టిందర్రోయ్” అని కేకేసింది. కాదు, చీమన్నాను నేను. వెదకడం మొదలెట్టారు...”

“డాక్టర్ని తీసుకు రండి  మంత్రం వెయ్యలేరూ...”

“మీరిక్కడే వుండండి, డాక్టర్ని తీసుకొస్తాను” అని బైలు దేరాను. “నువ్వు తిరిగొచ్చేటప్పటికి నా ప్రాణమే పోతుంది. ఉండు  నేనే వొస్తాను.”

నేను పరంధామయ్యను తీసుకుని బైటకెళ్ళి వో రిక్షా మాట్లాడి అందులో ఎక్కాం.

“మీకు మంచి టైమ్ లో, అలారమ్ మోగినట్టు  తేలు కుట్టిందండీ. లేకపోతే నా రైలు తప్పను. ప్రొద్దున్న పదింటికి దిగాను. పదిగంటలు లేటన్నారు. అంటే, ఎనిమిదింటికన్నమాట. ఇప్పుడు పావుతక్కువ ఎనిమిది. కాబట్టి నాకు రైలందుతుంది. మనకి ఢిల్లీ ప్రయాణం తప్పదు. వో సారి నేను, లేబర్ కమీషనర్ రంగనాథం ఢిల్లీ ప్రయాణం కట్టాం. నాగపూర్ చేరేప్పటికి...” రిక్షా మలుపు తిరిగింది. ఓ జట్కా ఆపుచేయించి, ముకుందాన్ని అందులో ఎక్కమని, సెలవు తీసుకున్నాం. మమ్మల్ని తన వూరు ఆహ్వానించాడు. అలాగే అన్నాం. ఏదో చెబుతున్నాడు – జట్కా దూరంగా వెళ్ళింది. రిక్షావాణ్ణి తిన్నగా హోటల్ కి పట్టమన్నాడు పరంధామయ్య. కారియర్ యింటికొస్తుందిగా అన్నాను. ఇంటికెడితే యీసారి నిజంగా తేలుకుడుతుందన్నాడు పరంధామయ్య.

ఇది జరిగింతర్వాత ముకుందాన్ని నేను కలుసుకోలేదు. అటువెడుతూ ఓ సారి పరంధామయ్య, ముకుందం బంగళాని, తోటని చూసి, వోపూట భోజనం చేసి వొచ్చినట్లు, వివరాలన్నీ వుత్తరం ద్వారా తెలియబరిచాడు. శరభయ్య వొంట అద్భుతంట. పేరమ్మ బ్యూటీట. రోజూ పదిమందికి తక్కువుండరట భోజనానికి. ఆయనకున్న పలుకుబడి, పేరు, అంతా శరభయ్య వొంట మూలంగానేట. అతని స్వీయ చరిత్ర

క్లుప్తంగా నాలుగు గంటలు చెప్పాడుట. అది వినగానే తిన్నదంతా అరిగిపోయిందిట. "నా సంభాషణ వల్ల జీర్ణంకాని పదార్థం లేదు" అని ముకుందం నిర్వచనం చేశాడుట.

అట్లాంటి ముకుందానికి ఎందుకు మతిభ్రమించి, పిచ్చాస్పత్రిలో వుండాల్సి వచ్చిందో నాకు బోధపడలేదు. కొద్దిగా మానసిక శాస్త్రం నేనూ చదివాను. సంసారసుఖం లేకపోవడం అతి వాగుడికి వో కారణంగా చెప్తారు. ప్రేమ తృష్ణ మాటల ద్వారా తీర్చుకుని తృప్తిపడడం చిహ్నం. నాకిది సరైన కారణంగా తోచలేదు. కృత్రిమంగా వూహిస్తే ఏవేవో చిత్రమైన కారణాలు కల్పించవచ్చు. జాడ్యం ఎంత కృత్రిమమైందో, దానికి మందు కూడా అంత అపూర్వంగా వుంటుంది. గుడ్డివాడు విసిరిన బెడ్డలాంటిది. మానసిక శాస్త్రంలో మందు, తగులుతే తగులుతుంది, లేకపోతే లేదు. నే మొదట్లో అనుకున్న కారణమే నాకిప్పటికీ సమంజసంగా కనబడుతోంది. ముకుందం మంచి వాడు; స్వార్థరహితుడు. జీవితంలో ఏదీ కోరకుండా, అన్నీ తెచ్చుకుని సర్వమూ వదులుకున్న యోగి. విలువలు కట్టని విమర్శకుడు; సిద్ధాంతాలు అమాయక ప్రజనెత్తిన రుద్దని వేదాంతి. అయినా అతని భారినుండి పారిపోడానికి నేనూ యత్నం చేశాను. భార్య విసుగెత్తి ఇంక చాలు బాబు అనుకుని పరమపదించింది. సరోజ పెళ్ళి చేసుకోనంది. అందరూ అతన్నుండి పారిపోయి అతన్ని ఏకాకిని చేశారు. నా కళ్ళంట అప్రయత్నంగా నీళ్ళు తిరిగినై. పాపం, అతనేం అపచారం చేశాడు? రెండు రూపాయలిచ్చి – కర్నాటక సంగీత విధ్వాంసుడు, వయొలిన్, మృదంగం విద్వాంసులు కలిసి మూడు గంటలు ముమ్మొన యుద్ధం సాగిస్తే చూసి, విని "ఆహా, ఎంత అద్భుతంగా వుందండీ" అని చెప్పుగోడం లేదు? మనం ఖర్చు పెట్టిన రెండు రూపాయలనీ సమర్థించేటందుకు కాక, మరెందుకు, మనం మెచ్చుగోడం? కానీ ఖర్చులేకుండా ముకుందం మనకి వినోదం కలిగిస్తే ఏవగింపా? అతనికి పేర్లెట్టి హేళన చెయ్యడమా?

నీతిలో మెళకువలు తెలిసున్నవాడు ముకుందం. ఏనాడో భార్యకి అపచారం చేశాడు. దాన్ని ఎదుర్కొన్నాడు. తను సమాధానం పడలేకపొయ్యాడు. సంఘానికి చెప్పేసి, పాపపరిహారానికి ఉపక్రమించాడు. మాటల ద్వారా అదీ నాకు తోచిన కారణం. అతను జీవితంలో దేన్నీ కోరడు. ప్రతిఫలం కోరని సంభాషణ – అతని మాట పడిపోయిందంటే నాకీ ప్రపంచంలో ఏదో తీరని లోటు కనబడింది. అతని భార్య కళ్యాణి అన్నట్లు అతను దూరంగా వున్న కొద్దీ దగ్గరగా వొచ్చినట్లుంటాడు. దగ్గరగా వుంటే తప్పించుకు తిరుగుతాను. నాకు క్షమ లేదు.

అతని జీవితంలో ఏదో లోటుంది. దాన్ని శోధించి ఎవ్వరూ బైటపెట్టకుండా అతను 'మాటలు' అనే వల అల్లుకున్నాడు. అతన్ని కదిపి మాట్లాడిస్తే అదేమిటో బైటపడును. కాని ఇప్పుడు ఆ అవకాశం లేదు. అతనికి మాట పోయింది. దిగులుగా కూర్చున్నాను. "పోనీ, ఓ సారి వెళ్ళి చూసి రాకూడదూ?" అంది మా ఆవిడ.

ఆ రాత్రే బెంగుళూరు ప్రయాణం అయ్యాను. హాస్పిటల్ కి వెళ్ళేప్పటికి సాయంత్రం నాలుగైంది. బైట ముకుందం తమ్ముణ్ణి కలుసుకున్నాను. అతను చెప్పాడు కొన్ని సంగతులు. పనిపిల్ల పేరమ్మ, వంటాయన శరభయ్యతో లేచి పోయిందిట. వాళ్ళని వెదుక్కుంటూ తిరిగాడుట ముకుందం. పేరమ్మని రైలుస్టేషన్ లో పట్టుకున్నాడుట. ఇద్దరినీ యింటికి రమ్మనమని బ్రతిమాలాడాట్ట. జీతం ఎక్కువ చేస్తానన్నాడుట. రానందిట. ఏదో వాగిందిట. అతని మామ గార్ని, భార్యని, సరోజని – వాళ్ళ కుటుంబాన్ని చులకన చేస్తూ మాట్లాడిందిట. లెంపకాయ కొట్టాడుట. మళ్ళా ఏదో అందట. "నే నందుకు కావాల్సి వొచ్చానా? ఇప్పుడనండి ఏమంటారో ?" అని సవాల్ చేసినట్లు మాట్లాడిందిట. పళ్ళు బిగపట్టి మొహం ఎర్రగాఐ, చేతులతో రక్కేటట్లుగా అభినయం చేశాట్టా. కాని నోటంట మాటరాలేదుట. ఇవన్నీ పేరమ్మ చెప్పిందిట.

జీవితంలో ఏదీ ఆశించనివాడికి అసంతృప్తి వుండదు. కోరింది లభించలేదన్నప్పుడు వొచ్చేకోపం రాదు. ముకుందం ఉద్రేకాలకి అతీతుడు. కార్యశూరులు కోపానికి గురవుతారు. అతను ఏ కార్యం తలపెట్టడు, చెయ్యడు. కోపం అంటే ఏమిటో ఎరగని అమాయకుడు.

అట్లాంటి ముకుందాన్ని పేరమ్మ రెచ్చగొట్టింది. కోపం తెప్పించింది. దాని తీవ్రతకి అతని శరీరం తట్టుకోలేకపోయింది. వ్యక్తిత్వానికి 'షాక్' తగిలింది. తేరుకో లేకపొయ్యాడు. 'మాట' అతని ఆయుధం, అతని ఆయువుపట్టు, దాన్నే సవాల్ చేసింది పేరమ్మ. ఆయువు పట్టు మీద దెబ్బ కొట్టింది. ఊహా జగత్తు పేలిపోయింది. మానసిక గోళాలు ఢీకొన్నాయి. వాటిమధ్య నలిగి ధ్వనియంత్రం నిలిచిపోయింది.

లోపలికెళ్ళి చూశాను. దిగులుగా కూర్చున్నాడు. పెరిగిన గడ్డంలో తెల్ల వెంద్రుకలున్నాయి. కళ్ళకింద గీతలున్నాయి. జుట్టంతా చిందరవందరగా వుంది. పిచ్చి వాడులా వున్నాడు. నన్ను చూశాడు. నా కళ్ళల్లోకి లోతుగా చూశాడు. ఏమీ మార్పులేదు అతని ముఖంలో. మందహాసం లేదు. నేను ఫలానా అన్న చైతన్యం లేదు. నాకు జాలేసింది. ఇల్లాగన్నాను:

"ముకుందం గారూ – మీరు జీవితంలో అన్నీ సాధించారు, వొక్కటి తప్ప – మౌనంగా, నిశ్శబ్దంగా వుండటం తప్ప అన్నీ సాధించారు. మీరు నిండైన, పరిపూర్ణులైన ధన్యజీవులు."

ఏదో చప్పుడైంది – సంకెళ్ళు వూడిపడ్డట్లు, సముద్రం వెనక్కి వెళ్ళి ఎండినట్లు, భూకంపం బీటలు మూసుకుని లోలోన అణగారినట్లు, కాల చక్రం వొక్కసారి కదిలినట్లు.

"ఆ, నేను మాట్లాడలేనంటారా? నేను మూగనా – నిశ్శబ్దమా – మౌనమా... ఎందుకు మాట్లాడలేను. వినడం చేతకాని వారికి మాట్లాడ్డం చేతకాదు. వారే మూగవారు. ఓ సారి విజయనగరంలో అష్టావధానం జరిగింది. పదిమందీ పది ప్రశ్నలడుగుతారు వారికి సమాధానాలు, గంట తర్వాత క్రమంలో చెప్పాలి. నేనో ప్రశ్న అడిగాను, తికమకగా – కాకి గూటిలో చిలుకపిల్ల వుంటే, తోడేలు చెట్టుకింద వున్నప్పుడు, పెద్ద పులి అరుస్తే భయపడేది చిలుకపిల్లా, కాకా, తోడేలా – క్రమంలో చెప్పాలి..."

అల్లా ముకుందం గారు యథావిధిగా తన ధోరణి సాగించారు. ఆయన మాట్లాడిన వాక్యానికి ప్రతిధ్వని లేదు. వాక్యం ముగించినప్పుడు కదా ప్రతిధ్వని వినబడేది? ఆ ముగింపు లేదు ఆ ప్రతిధ్వని లేదు. నాకీ లోకంతో యింక పేచీ లేదు.

ఈ కథలో ముకుందానికి అన్యాయం చేశానా ఎక్కడేనా అని తిరిగి చూశాను. ఒక చోట చేశాను. రైళ్ళాగిపోయి, రెండోసారి నన్ను కలుసుకున్నప్పుడు 'రండి టీ తాగొద్దాం' అని ముకుందం అన్నట్లుగా వ్రాశాను. అది పొరబాటు. అట్లా ముకుందం అనలేదు, అనడు. టీకీ, భోజనాలకీ, స్థూల జగత్తులో శారీరకావసరాలకీ అతనికి టైము లేదు. వీటితో ఆ ఊహా సామ్రాజ్య చక్రవర్తికి నిమిత్తం లేదు. అతను హాస్పిటల్ లో వున్న ఆ వారం రోజులే కాలచక్రానికి విరామం.

# మార్పు

## పినిశెట్టి శ్రీరామమూర్తి

ఇస్స్.. భరించడం కష్టం ఎంతకాలం. ప్రకృతిని చూస్తే ప్రాణాలు లేచొస్తున్నాయి, ప్రేమ తీగె పెంపొందుంతూంది. అబ్బా అదుగో శశాంకమణి చక్కగా నాకేసే చూస్తూ నీ భావం గ్రహించా అని నవ్వుతోంది. చూడు గోదావరి తరంగాలు... కాదు, నా హృదయ సముద్ర తరంగాలు. ఎంత అందం. ఎంత మృధుత్వం.. ఎంత సున్నితం.. ఎంత సోయగం.. ఆ మల్లెపువ్వు. కాదు నా హృదయ కమలం; ఎలా

వికసిస్తుందో ఆ సువాసన ఎంత మధురంగా విరజిమ్ముతూందో అయ్యో కళ్ళు తేలిపోతున్నాయి. ప్రేమ మైకం.. బంధించా యిప్పటివరకూ నా సున్నిత మనసుని కఠినంగా అంటకుండా చేశా. ఆ కామాన్ని అన్యాయంగా ఎందుకూ సంఘాన్ని లెక్క చేయకుండా పునర్వివాహ ప్రయత్నాలు మానాన్న చేస్తాడని, ఏం లాభం. ఎన్నాళ్ళు చూసినా ఆయన మనస్సులోకి ఆ తలంపే రావడం లేదు. యిప్పటికి నాలుగేళ్ళయింది పుష్పవతి అయి. ఎందుకూ అనుకుంటే ఆవేదనా తరంగాలొచ్చి... నన్ను తబ్బిబ్బు చేస్తున్నాయి. పుట్టిన పదేళ్ళకే పెళ్ళి. పెళ్ళి అయిన రెండో సంవత్సరానికీ విధవను. అభాగినిని ఛీ!ఛీ! ఎందుకూ నే పుట్టడం చావడాన్కా యీ మధ్య సౌందర్యం... సౌఖ్యం.. అనుభవించడాన్కి అరహత లేదూ _ ? ఎందుకు లేదూ ఉంది. నేనేంతప్పు చేశా.. చిన్నప్పుడే పెళ్ళి చేయమని పోరెట్టేనా ? లేదు. ఆయన నన్ను ముట్టకుండా పోయున్నాడు మళ్ళీ పెళ్ళి చేస్తానంటే వద్దన్నానా ఏదీ లేదు. యిది అన్యాయం... ద్రోహం.. నన్నూ ఒక చెట్టులా పడి ఉండమనా!? అయితే చెట్టుక్కూడా పుష్పించడం ఫలించడం అంటూ వుంటుందే! సరే ఒక పక్షిని... అదుగో ఎదురుగా ఆ మామిడి తోపులో గూడెట్టుకొని ప్రియుని కేసి ఎలా పరికించి చూస్తుందో ప్రేమామణి పక్షి పక్షికన్నా యింకేముంది ఒక రాతిబండను. అయ్యో యీ కాళ్ళూ యీ చేతులు యీ అందంగా నన్నెదిరిస్తూన్న నడుజవ్వనం.. యివ్వన్ని వృధా కాదు, కాదు. నేను ఒక మానవజాతికి చెందిన స్త్రీనే నాకూ హృదయం, ప్రేమ, ఆశా అన్నీ నాలో నిబిడీకృతమై ఉన్నాయి. నాకూ యీ ప్రపంచ ప్రకృతి సౌందర్యాన్ని పొందటాన్కి ఆశ ఉంది. అర్హత కూడా ఉంది.

లేని రోగం... ఉన్నా రోగమే; విరహం. వెఱ్ఱాడు మా నాన్న నా వాలకం చూసి డాక్టర్ని పిలచాడు. ఆ డాక్టరు వచ్చి నన్ను పరీక్షిస్తూ నాకేసి ఒక్కసారి చూశాడు. అతని కళ్ళల్లో చక్కని తేజస్సు గోచరమయింది. నేనూ చూశా నా చూపులో ఏం చూశాడో అలాగే చూడ్డం ప్రారంభించాడు. యిద్దరి చూపులూ ఏకాగ్రతగా అలాగే ఒక నిమిషం వరకూ ప్రేమ మిళితంగా చూశాయి. అప్పుడే యిద్దరి పెదాలంటా చక్కని చిరునవ్వు తొణుగుల్లాడుతోంది. అయితేనేం నాలో ఉన్న రోగం ఆ డాక్టరు అన్నా ప్రేమా.. అప్పుడే కాదు, పూర్తిగా గ్రహించాడు. ఏదో మందిస్తున్నా అనే మిసమీద నన్ను చూడ్డాన్కి రోజూ మాయింటికొస్తూ యుండేవాడు. మా యిద్దరిలో అప్పుడే క్రొత్తమార్పు కనిపించింది. అతన్ని చూడ్డంలోనే నాలో ఉల్లాస తరంగం ఉబికి పైకి వచ్చేది. ఎన్నాళ్ళు యిలా దాపరికం అనుకున్నా! నేనే సాహసించా నా ప్రేమ ఒక ఉత్తరం ద్వారా తెలియపర్చా. అందుకూ ఆయనా ఒప్పుకున్నట్టు తలవూపాడు. ఉత్తరాలు గుప్పాడు; దాంతో నాకు మరింత ఆనందం కల్గింది. అతనికీ పెళ్ళి కాలేదటని తెలిసి.

ఊ అంటే ఊ అనుకున్నాం. అందచందాలకూ తెలివి తేట్లకూ యిద్దరిదీ సమాన చేయే అయితేనేం మా యిద్దరకూ ఒక్కటే తేడా కులం దానికేంలే

★ ★ ★


నాకు యిప్పుడు తెలిసింది భార్యా భర్తల్లో వుండే ఆనందం. వారు లేనిదే నాకు ప్రపంచం లేదు. నేను లేనిదే వారికీ శూన్యంలాగే తోస్తాంది. అంత ప్రేమోన్నతి శిఖర భాగానున్నాం.

ఇంతకూ ఈ మార్పుకు కారణం చిన్నతనాన్నే పెళ్ళి చేసుకొని పరలోకాన్కి వెళ్ళిన ఆయన గారిదా ? లేక చిన్నప్పుడే పెళ్ళి చేసిన నా తల్లిదండ్రులదా? నా జవ్వనాన్ని వృధా చేయకుండా మరొకన్ని చేసుకున్న నాదా ? మళ్ళీ పెళ్ళి చేస్తే మా లోకం... పదిమందీ పలకరిస్తారా నేను వప్పుకుంటానా!? అని గర్జించే సంఘభల్లూకానిదా? ఆలోచించండి.

# కదిలే రైల్లోంచి కనిపించే చెట్టు

## గొల్లపూడి మారుతీరావు

### (ఆంధ్రజ్యోతి 1980 దీపావళి సంచికనుంచి పునర్ముద్రితం)




మా నాన్నగారికి హార్ట్ ఎటాక్ రాకపోతే కృష్ణమోహన్ ని జీవితంలో కలుసుకొనే వాడిని కాదు. కృష్ణమోహన్ ని కలుసుకోకపోతే పార్వతీశం అనే వ్యక్తి ఈ లోకంలో ఉన్నట్టే తెలిసేది కాదు.

పార్వతీశం ఈ సమాజం గుర్తుంచుకొని బ్రహ్మరథం పట్టాల్సిన మనిషేం కాదు. మహానుభావుడు అంతకన్నా కాదు. కాని సమాజంలో మంచితనానికో, దౌర్జన్యానికో బాధ్యత ఎక్కడ నుంచి ప్రారంభమవుతుందని ఆలోచిస్తే అది అలా పోయిపోయి పార్వతీశం లాంటి మామూలు మనిషి దగ్గర ఆగుతుంది. చక్కెర తియ్యదనానికి ఏ అణువుది గొప్పతనం అని చెప్పగలం?

మా నాన్నగారు రూఢిగా పోతారని డాక్టర్లు పెదవి విరిచినప్పుడు. కింగ్ జార్జి హాస్పిటల్ మెట్లమీద కూర్చుని మా తమ్ముళ్ళతో కలిసి నేనూ రహస్యంగా భోరుమన్నప్పుడు. దూరంనుంచి కృష్ణమోహన్ కనిపెడుతున్నాడని మాకు తెలీదు.

"చదువుకొన్న వారు కనక చెప్పినా మీరర్థం చేసుకోగలరు. కాంప్లికేషన్స్ ఎక్కువయాయి. వయస్సూ ఎక్కువే సారీ బతకడం కష్టం" అని అందమయిన డాక్టర్ రూఢిగా తెగేసి చెప్పినప్పుడు బిక్కమొహంతో వింటున్న నన్ను గమనించాడు కృష్ణమోహన్. వెనక నిలబడిన అయిదుగురు హౌస్ సర్జన్స్ లో అతనూ ఒకడు. ఆ విషయం తర్వాత చెప్పినా, అతన్ని జ్ఞాపకం తెచ్చుకోలేనంతటి సామాన్యుడు కృష్ణమోహన్. డాక్టరు కావాలన్న బలమైన కోరికతో, శరీరాన్ని బలహీనంగా నిలుపుకొన్న తెల్లటి మనిషిమాట నూతిలోంచి వచ్చినట్టు, నవ్వితే ఊపిరి అందనంత బలహీనం. అది అతని స్వభావమనీ, అనారోగ్యం కాదనీ తర్వాత అర్థమయింది.

ఓ అర్ధరాత్రి నాన్నగారికి తగిలించిన కార్డియోగ్రామ్ పని చెయ్యడం మానేస్తే రెస్ట్ రూంలో కూర్చున్న హౌస్ సర్జన్స్ మీద విరుచుకుపడ్డాను.

"ఎందుకండీ మమ్మల్ని చంపుతారు? ఆ కార్డియో గ్రామ్ సరిగ్గా పని చెయ్యదు" అని ఒకాయన విసుక్కున్నాడు.

"లుక్ యంగ్ మాన్. మీ చేతుల్లో చాలా విలువైన ప్రాణాన్ని పెట్టిన కారణానికి మేం నిస్సహాయంగా వున్నాం. మీకన్నా ఎక్కువ కోపం తెచ్చుకోవడం మాకూ చేతనవును. ఉపయోగించే యంత్రాలు పనిచెయ్యవని, వాటితో చచ్చిపోయే మనుషులు బతుకుతారని మీరాశలు కల్పిస్తున్నారని తెలీదు. మీ ఒక్కరోజు నిద్రాభంగం మాకు ఓ జీవితం విలువ" యిలా ఏదో మాట్లాడే నా భుజం మీద చెయ్యివేసి ఐసిసీలోకి

లాక్కెళ్ళాడు కృష్ణమోహన్. ఓపికగా, ఎక్కువ మాట్లాడకుండా గంటన్నర నాన్న గారి పక్కనకూర్చున్నాడు. అతని ప్రతీ కదలికా నాన్న గారికి ప్రాణం పోస్తున్నట్టు. ఆ క్షణంలో అతను ఆప్తమిత్రుడయినట్టు చూస్తున్నాను నేను. అదే అదే మా ఇద్దరి స్నేహానికి ప్రారంభం.

అయితే, కష్టాల్లో గుర్తొచ్చే దేవుడినే అవలీలగా మరిచిపోయే జాతిలో పుట్టిన వాడిని. ఆ రెండు నెలలో నాకు మనస్థిమితాన్ని, ధైర్యాన్ని కల్పించిన మిత్రుడిని అతి సుళువుగా మరిచిపోయాను. నా వ్యావృత్తిలో, అభిరుచిలో, ఆలోచనల్లో ఏవిధంగానూ సామ్యం లేని వ్యక్తి కృష్ణమోహన్. కానీ, ఆ రెండు నెలలూ అతని ప్రపంచంలోకి నేనూ వెళ్ళాను ఆసుపత్రి. మంచాలు, చికిత్స యివే ఆలోచనలు. నాన్నగారు బాగుపడగానే నేను మా ఊరు వచ్చేశాను. రెండు సార్లు ఉత్తరం రాశాను. ఒకసారి హైదరాబాద్ వెళ్తున్నానని ఆయనకి ఉత్తరం వ్రాస్తే ఖమ్మం స్టేషన్ లో నన్ను చూడడానికి నలుగురూ వచ్చారు. కృష్ణమోహన్ తండ్రి, తమ్ముడు. యిద్దరు చెల్లెళ్ళు. అతి ప్రశాంతమైన కుటుంబం. అందరూ శాంతంగా, చిరునవ్వుతో, నిండుగా పలకరించారు నన్ను రెండు చేతులూ పట్టుకు పలకరించిన వృద్ధుని వెనక మనిషిని చూసి ఒక్క క్షణం తుళ్ళిపడ్డాను. ఆయన ఓ చిన్న సైజు కృష్ణమోహన్. అదే చిరునవ్వు. గొంతులో అదే బలహీనత. అదే మెత్తదనం. ఒక పెద్ద పొట్లంతో తాపేశ్వరం కాజాలు చేతులో పెట్టాడు. నేను ఆశ్చర్యపడ్డాను. అంతకు మించి సిగ్గుపడ్డాను. నాకు జరిగిన ఉపకారం కృష్ణమోహన్ వల్ల కాని ఈ అయిదుగురూ నావల్ల తమకేదో ఉపకారం జరిగినట్లు కృతజ్ఞతాభావంతో కనిపించారు. అది వారి సౌహార్దం. ఆడపిల్లలు పెళ్ళీడు వచ్చిన వాళ్ళు. ఒకటి రెండు మాటలన్నారో లేదో గుర్తులేదు. ఓ సీసాతో మంచినీళ్ళు తెచ్చి నాసీటు దగ్గర పెట్టాడు కృష్ణమోహన్ తమ్ముడు. అతని పేరు పార్వతీశం. "ఈ మాటు ఎప్పుడు యిటు వెళ్ళినా రాయండి" అని రైలు కదులుతుంటే నా చెయ్యి పట్టుకున్నాడు.

మిత్రుల సాన్నిహిత్యం నాకు కొత్త కాదు. వాళ్ళ ఆదరణ, అభిమానమూ కొత్తకాదు. అదేదో నా హక్కులాగా అనుభవించడం ఒక్కొక్కప్పుడు నా అహంకారమేమోననుకొంటాను. కృష్ణమోహన్ ని మరిచిపోయిన నేను. ఆయన కుటుంబాన్నీ. ఆ కుటుంబంలో అందరి వెనక నిలబడి చిరునవ్వు నవ్విన పార్వతీశాన్ని అతి సుళువుగా మరిచిపోయాను. తాపేశ్వరం కాజాలు గుర్తున్నాయి. రుచిగా వున్నాయి. ఎప్పుడయినా వాటి రుచి గుర్తుకొచ్చినప్పుడు ఎక్కువ కృష్ణమోహనే మనస్సులో కదిలేవాడు. ప్రస్తుతం కాన్పూరులో పనిచేస్తున్నాడట. కలిసే అవకాశం లేదు.

మూడున్నర సంవత్సరాల తర్వాత ఆఫీసు పనిమీద రెండు నెలలు త్రివేండ్రం వెళ్ళాల్సి వచ్చింది. దక్షిణాదికి వెళ్ళడం చాలా తేలికయిన పని అనుకొంటూ ఆనందంగా బయలు దేరాను. రైలు వెళ్తుంటే దారి పొడుగునా పచ్చిక బయళ్ళూ పొలాలూ, కొబ్బరి తోటలూ, కాలువలూ కళాకారుడు కుంచెతో గీసిన వర్ణ చిత్రంలాగా వుంది కేరళ. మనస్సు ఆనందంతో ఉరకలు వేసింది ఆ అనందం త్రివేండ్రంలో దిగిన రెండు గంటలు మిగలలేదు అక్కడ కొబ్బరి నూనెతో వంటకాలు. ఉప్పుడు బియ్యం కొయ్యముక్కల్లాగ గొంతుకి అడ్డుపడుతూ, వాటిని చూస్తేనే భయమేసింది. రెండు రోజులు తిన్నాక కడుపులో రైళ్ళు పరిగెత్తడం ప్రారంభించాయి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నీరసం, ఎవరో చెప్పారు – త్రివేండ్రం స్టేషను కాంటీనులో మామూలు బియ్యంతో వంటచేసి పెడతారని, వెళ్ళాను. కాస్తనయమే, మెల్లగా స్థిరపడ్డాను. ఓ పదిరోజులు గడిచేసరికి తిండి గురించి ఆలోచించకుండా రోజులు గడిపేస్థితికి వచ్చాను. చిన్న కొట్టాంలాంటి ఓ హోటల్ గదిలో మకాం. ఆ గదికి పక్కన పెద్ద తిన్నెలాంటి బాత్ రూం. ఏమైనా కేరళ వచ్చిన ఉత్సాహం చచ్చిపోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు.

ఎవరూ పరిచయం లేని ఆ వూళ్ళో సాయంకాలం అలా వూరంతా తిరిగి 8 గంటలకి హోటల్ గది చేరడం అలవాటు ఆ రోజు అలా వచ్చేసరికి హోటల్ వసారాలో కూర్చుని వున్నాడు పార్వతీశం. ఒక్క క్షణం అతన్ని గుర్తుపట్టలేదు. ఆయన చిరునవ్వు చూడగానే కృష్ణమోహన్ గుర్తొచ్చాడు, దురదృష్టం పేరు గుర్తురాలేదు. తెల్లబోతూ చూశాను.

"నేను కృష్ణమోహన్ తమ్ముడినండి. మా మిత్రుడొకడు ఈ హోటల్లో దిగితే చూసి పోదామని వచ్చాను. ఈ బోర్డులో మీ పేరు చూసి ఆశ్చర్యపోయాను. నేనిక్కడ వున్నట్టు మీకు తెలీదు కదా ? కలుద్దామని సాయంత్రం నుంచి కూర్చున్నాను"

ఇప్పుడు ఖమ్మం స్టేషను, తాపేశ్వరం కాజాలు గుర్తుకొచ్చాయి. యింకా పేరు గుర్తురాలేదు. అతను గ్రహించాడు. అర్థమయినట్టు ప్రశాంతంగా నవ్వాడు.

"పార్వతీశం సార్. ఖమ్మంలో మిమ్మల్ని కలిశాను. మీ గురించి పేపర్లో చూస్తుంటాను. మీరు మాకు పరిచయమని చెప్పుకుని యిక్కడ ప్రవాసాంధ్రుల్లో గర్వపడుతూంటాను" అన్నాడు.

అన్ని రోజులకి అక్కడ ఓ తెలుగు పక్షిని చూసినందుకు మనస్సు నిజంగా ఆనందపడింది. మరో గంటసేపు యిద్దరం మాట్లాడుకొన్నాం. క్రమంగా త్రివేండ్రంలో నా కష్టాలు, మరో 7 వారాల నా ప్రవాసం అన్నీ చెప్పాను. "అయ్యో ! మీకు తెలీదా ? యిక్కడ మరో గొప్ప హోటల్ వుంది. మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి పూజించే హోటల్" అన్నాడు.

నేను బ్రహ్మానంద పడిపోయాను. వెంటనే వెళ్దామని షర్టువేసుకు లేచాను. పార్వతీశం మాటల్లో చమత్కారం. చిన్న హాస్యం వున్నట్లు అప్పుడు గమనించాను ఆ రోజు స్టేషన్లో అతని వ్యవహారం బొత్తిగా పట్టించుకోలేదు. అంతా రెండు నిమిషాల్లో రైలు కదిలిపోయింది. ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ ఓ యింటికి తీసుకొచ్చాడు.

"ఇదేమిటి !" అన్నాను.

"హోటల్ సార్ కొత్తరకం హోటల్' అన్నాడు. ఇద్దరం రెండు పక్కలూ, మంచాలూ, దోమతెరలూ వేసుకు పడుకున్న ఆడవాళ్ళ బృందం మధ్య నుంచి మేడ మెట్లెక్కాం. తాళం తీసి దీపం వేశాడు. అప్పుడర్థమయింది. తీసుకువచ్చింది అతని గదికని నాక్కాస్త కోపం వచ్చింది. విసుగు కలిగింది.

"ఎందుకిక్కడికి తెచ్చారు?"

"అయ్యా, మనం ఆంధ్రులం భోజన ప్రియులం. కమ్మని భోజనం లేకపోతే మనం ఎంత విలవిలలాడుతామో నాకు తెలుసు. మంచం యిలా వసారాలో వేస్తాను. నిముషంలో స్టౌమీద బియ్యం పడేస్తాను మీరు గట్టిగా ఊపిరి పీల్చేలోగా వడ్డించేస్తాను. మన దగ్గర గోంగూర చట్నీ, గన్ పౌడర్, సామర్లకోట నెయ్యి వున్నాయి." నోరూరింది. పాములాగ ఆ గదిలో అటూ, ఇటూ చకచకా తిరిగి అరగంటలో వంట కానిచ్చేశాడు. వారం రోజుల తర్వాత, హాయిగా, సుష్టుగా భోజనం చేశాను. అప్పటికి కాని అతని అతిథ్యంలో మహిమ అర్థం కాలేదు రాత్రి పదకొండున్నరకి నాతో వచ్చి హోటల్ దగ్గర దిగవిడిచి వెళ్ళాడు.

మరునాడు సాయంకాలం ఆఫీసు వదిలిపెట్టక ముందే ఆఫీసుకి వచ్చాడు.

"త్వరగా తెమలండి సార్, ఇవాళ హోటల్ గది ఖాళీ చేసి పోవాలి" అన్నాడు.

"ఎక్కడికి ?" అన్నాను ఆశ్చర్యంగా.

"మనింటికి సార్"

"అయ్యయ్యో – మీకు శ్రమ?"

"అవును సార్ నాకు కాస్త శ్రమే అనుకోండి కానీ ఆ గదిలో ఉండడం మీకు ఎక్కువ శ్రమ. సిమ్లాలో నేను హోటల్ కూడు తింటూంటే మీరు నన్ను చూస్తూ వదిలేస్తారా ? వదిలెయ్యడం సంస్కారం అనిపించుకొంటుందా ? పదండి, మీకు తెలీదు. ఇలా హోటల్లో మరి రెండు వారాలు భోజనం చేస్తే రక్త విరోచనాలు పట్టుకుంటాయి" అన్నాడు. నేను హడలి పోయాను. నిజానికి అంత దూర ప్రాంతంలో ఎవరో ఒకరి

రక్షణ, సంరక్షణ కావాలనిపించింది. కాగా మనకి తెలిసిన మనిషి, తనంతట తను నా బాధ్యత నెత్తిమీద వేసుకుంటున్నాడు. మరో సందేహం లేకుండా అతని గదికి మారిపోయాను.

బ్రహ్మచారి యిల్లు రెండు గదులూ, వెనక చిన్న వంటగది. పక్కనే చెక్కపొట్టుతో 24 గంటలూ కొలిమిలాగ మండే పొయ్యి గోడలోకే పొదిగినట్టుంటుంది. రోజులో ఎప్పుడు కావలసి వచ్చినా అందులో నీళ్ళు మరుగుతూంటాయి. పక్క స్నానాల గది. తెల్లారగానే పది పన్నెండు బిందెల నీళ్ళు మేడమీదికి మోసేవాడు. ఏడయేసరికి ఫిల్టరు కాఫీ చేతికందించే వాడు. టొమాటో, మిరపకాయలు కరివేపాకు, నిమ్మకాయ వేసి కమ్మగా ఉప్మా. ఒంటిగంటకి అతి నీటుగా పేర్చి యిచ్చిన స్టీలు కారేజి. సాయంత్రం యింటికి వచ్చేసరికి కాఫీ సిద్ధంగా వుండేది. నాకు రాతపని వుంటుందని తెలిసి రాతకి ఏకాంతం కావాలని తెలిసి సాయంకాలం డాబామీదకి వెళ్ళి కూర్చునేవాడు. రాత్రి భోజనం కాగానె తప్పని సరిగా ఏదో ఒక పండు ముక్కలు పళ్ళెంలో సిద్ధంగా పెట్టేవాడు.

క్రమంగా త్రివేండ్రం జీవితం మీద భయం తగ్గి వాతావరణం మీద వ్యామోహం పెరిగి, అక్కడగడపగలిగినందుకు సంతోషం కలిగించాడు ఒక శనివారం నాడు యిద్దరం బస్సులో శుచీంద్రం. నాగర్ కోయిల్ వెళ్ళాం. కోవలం దగ్గర సూర్యాస్తమయం చూపించాడు. పెద్ద మనిషిలాగ నిలకడగా, నిశ్చలంగా నిలిచి వున్న నీలపు ముఖమల్ తివాసీ వెనక్కి ఎర్రటి మాంసపుముద్ద మెల్లగా జారిపోవడం గుండెల్ని జలదరింప జేసే అందమయిన అనుభవం. కన్యాకుమారి తీసుకెళ్ళాడు. మూడు సముద్రాల కలయిక, వివేకానంద మెమోరియల్, అమ్మవారి ఆలయం. ఉదయం, సూర్యోదయం అక్కడ సాయంత్రం అస్తమయం, దీనికంతటికీ వెనక పార్వతీశం సౌహార్ధం ఊహించుకొని తన్మయుడి నయాను ఆయన నాకు చేసే సేవలో ఒక ఉత్సాహం, భక్తిలాంటిదేదో కనిపించింది. నాకు ఉపయోగపడ గలిగినందుకే ఆయన ఆనందంపడేవాడు. ఈ సమయానికి ఎప్పుడయినా నా ఉద్యోగరీత్యా ఏదయినా ప్రతిఫలం కోరుతాడా అని సందేహపడిన సందర్భాలు లేకపోలేదు. డబ్బు యివ్వబోతే కంటతడి పెట్టుకున్నాడు. రెండు నెలలు అయేనాటికి ఆ యింటినీ, అతని వంటనీ, అతన్నీ వదిలి రాలేకపోయాను. త్రివేండ్రం జీవితం అతి సాధారణమయిన విషయంలాగ, దాన్ని వదిలి రావటం అతి బాధాకరమయిన సంఘటన లాగ విలవిలలాడిపోయాను. మెయిల్ ఎక్కుతుండగా పార్వతీశం నా రెండు చేతులూ పట్టుకుని.

"బ్రహ్మచారిని మేష్టారూ ! మీరు హాయిగా బ్రతకడం అలవాటు పడ్డవారు. ఏం ఇబ్బందులు పడ్డారో" అనబోతే నోరు మూశాను.

"ఈ ఆతిథ్యం నా జీవితంలో మరిచిపోలేను పార్వతీశం గారూ, మీ అన్నగారి ఉపకారాన్ని మరిపించారు. ఏదో పీడకలలాగ సాగవలసిన ఈ రెండు నెలలూ మరపురానివి చేశారు" అన్నాను. "ఎప్పుడు హైదరాబాదు వచ్చినా తప్పని సరిగా నాకు రాయాలి. నా కారులో స్వయంగా వచ్చి మిమ్మల్ని ఉంటికి తీసుకుపోతాను. నా అతిథిగా వుండాలి. నిజానికి ఎప్పుడయినా కాదు. నా కోసం ప్రత్యేకంగా వీలు చేసుకురండి." అన్నాను.

"నేను చేసేది వ్యాపారం. ఇంకా స్థిర పడలేదు. స్థిరపడ్డాక అలాగే" అన్నాడు పార్వతీశం నవ్వుతూ.

రైలు కదిలింది. ఏ ప్రయోజనం ఆశించని మంచి మిత్రుడు క్రమంగా కళ్ళ ముందునుంచి మాయమయ్యాడు.

తర్వాత ఒక్కసారి నాకు ఉత్తరంరాస్తూ నేను వాళ్ళింట్లో నా కలం మరిచిపోయానంటూ ఓ మిత్రుడికిచ్చి దాన్ని పంపించాడు. థాంక్స్ చెప్తూ ఉత్తరంరాయాలనుకొంటూ మరిచిపోయాను. కృష్ణమోహన్ కి పెళ్ళని చాలా నెలల తర్వాత శుభలేఖ వచ్చింది. కాన్పూరులోనే ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడట. అతని మీద ఆ కుటుంబం పెట్టుకున్న ఆశలు పార్వతీశం చెప్పాడు. కొద్దిగా బహుశా రెండు క్షణాలు. ఆ యింటి గురించి ఆలోచించి వుంటాను. ఏదో కాంపుకి వెళ్తూ పెళ్ళినాడు గ్రీటింగ్స్ పంపమని మా ఆవిడకి చెప్పి వెళ్ళాను. మా ఆవిడ పంపడం

మరిచిపోయింది. తర్వాత నేను అడగడమూ మరిచి పోయాను. మా నాన్నగారి ఆనారోగ్యం సమయంలో కృష్ణమోహన్ ఆదుకోవడం లాంటిదే త్రివేండ్రంలో బాధలో పార్వతీశం కనిపించడం. ఆ అవసరం తీరగానే పదేపదే గుర్తు చేసుకొనే అవకాశం లేక పోయింది.

మరో సంవత్సరన్నరకి అనుకుంటాను–ఓ రోజు ఉదయం అయిదు గంటలకి యింట్లో ఫోను మోగింది. మా పెద్దాడు ఫోన్ తీసి "ఎవరో పార్వతీశంట భార్యతో కలిసి వచ్చాడట. సికింద్రాబాద్ స్టేషను నుంచి ఫోను చేస్తున్నాడు. నీకు తెలుసుట" అన్నాడు. వెంటనే పేరు గుర్తు రాలేదు. నరాలు కొరికేసే చలిలో దుప్పటి తలమీంచి తియ్యడానికే చాలా హింసననుభవించాను. తీరా పార్వతీశాన్ని కలుసుకోవాలంటే కనీసం అయిదారు మైళ్ళు కారు నడుపుకు వెళ్ళాలి. తెల్లారితే డైరెక్టర్ల మీటింగ్. మర్నాడు మార్కెట్ సర్వే. భార్యతో అంటున్నాడు. ఈ మధ్య పెళ్ళయిందేమో కొత్త పెళ్ళాన్ని వెంటబెట్టుకు వచ్చాడంటే ఊరంతా తిప్పకపోతే బాగుండదు. డ్రైవరు లేడు కారులో చార్మినార్, గోల్కొండకోట, ఉస్మాన్ సాగర్ – భయమేసింది. డబ్బుకాదు కాని ఈ సమయంలో టైం లేదు. ఆ యాతన అనుభవించలేను. ముఖ్యంగా ఈ దుప్పటి తొలగించి చలిలో కారు నడపలేను. "ఊళ్ళో లేనని చెప్పేసెయ్, రాజమండ్రి కాంపుకి వెళ్ళానని చెప్పు" అన్నాను. అబ్బాయితో బద్దకంగా. పార్వతీశం కాసేపు అబ్బాయితో మాట్లాడాడు. ఫోన్ పెట్టేశాడు. నాకు శుభలేఖ పంపాడట అందలేదు. హైదరాబాద్ భార్యతో కలిసి వస్తున్నట్టు ఉత్తరం రాశాడట. అదీ అందలేదు. ఎందుకని? అడ్రసు "కవాడి గూడా"కి బదులు "కావేరీ గూడెం" అని ప్రతీసారీ రాసినట్టు తర్వాత అర్థమయింది. ఏమయినా ఆక్షణంలో పార్వతీశాన్ని వదిలించుకున్నందుకు నిట్టూర్చాను. తెల్లవారగానే ఆ విషయం మరిచిపోయాను. డైరెక్టర్లు చాలా హుషారయిన వాళ్ళు. కంపెనీ వ్యవహారాలు వదిలేసి ఊరంతా చూస్తామన్నారు. అభిమానంతో పార్వతీశానికి చెయ్యడానికి మొరాయించిన పని డైరెక్టర్ల విషయంలో చెయ్యక తప్పలేదు. రాత్రి వరకు తిరిగి బేగం పేటలో వాళ్ళని ప్లేన్ ఎక్కించాను.

మరి నాలుగయిదేళ్ళకి అనుకుంటాను నేను కంపెనీ డైరెక్టరుగా ప్రమోట్ అయి లక్నో వెళ్ళాను. అక్కడికి వెళ్ళిన ఆరుమాసాలకి ఢిల్లీ ట్రెయినింగ్ కి వెళ్ళాల్సి వచ్చింది. మాకు ఢిల్లీలో ట్రెయినింగ్ హాస్టల్ లేదు. అయితే కంపెనీ సెక్రటరీకి ఉత్తరం రాసి స్టేషన్లో కలుసుకోమని చెప్పి టెలిగ్రాం యిచ్చాను.

స్టేషన్లో చిరునవ్వుతో పలకరించాడు సెక్రటరీ. టాక్సీలో అడిగాను. ఏ హోటల్ లో రూం ఏర్పాటు చేశారని. నిర్ఘాంతపోయి "అదేమిటి సార్, మద్రాసీ బాబు గారు మీ బంధువులట ఇంటికి తీసుకు వచ్చేయ్యమన్నారు." అన్నాడు. నేను తెల్లబోయాను.

"ఎవరీ మద్రాసీ బాబు?" అన్నాను.

అతనూ తికమకపడ్డాడు. లావుగా, తెల్లగా, బట్టతల ఏవిధంగానూ నా అనుభవంలో, జీవితంలో అలాంటి మనిషి తటస్థపడిన గుర్తు కలగలేదు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. ఎవరీ బంధువు?

టాక్సీ ఆగగానే గుమ్మంలోనే పీలగా వున్న ఆమె నవ్వుతూ నన్ను యింట్లోకి ఆహ్వానించింది. ముఖమంతా నవ్వు చేసుకొని "రండి బాబాయి గారూ" అంటూ నా సూట్ కేసు అందుకొంది.

"అలాంటి బంధువులెవరూ నాకు లేరయ్యా" అని సెక్రటరీతో టాక్సీలో అన్నాను. ఇప్పుడతను నన్ను జాలిగా చూశాడు. "ఇంత మంచి బంధువుల్ని లేరని ఎలా అన్నావురా మూర్ఖుడా!" అన్నట్టు.

కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళిచ్చి వేడివేడి కాఫీ చేతికందించింది.

"మీ ఆయన ఏం చేస్తారమ్మాయ్?" అన్నాను కాస్సేపటికి మాట తెచ్చుకుని మరీ "మీ ఆయన పేరేమిటి? అని అడిగితే చిన్న బుచ్చినట్టవుతుందని.

"ప్లాస్టిక్ బొమ్మలు హోల్ సేల్ వ్యాపరమండి. ఎవరో పార్టీలు వచ్చారట! మధ్యాహ్నం భోజనానికి వచ్చేస్తామన్నారు. ఆయన కోసం మీరు ఎదురు చూడనక్కరలేదు, వడ్డించమంటే వడ్డించేస్తాను" అంది.

వాళ్ళకి పిల్లలు వున్నట్టు లేదు. మధ్యాహ్నం ఎవరిని చూడబోతున్నానో అర్థం కాకుండా రెండు గంటలు పాత రీడర్స్ డైజెస్టులు తిప్పుతూ గడిపాను.

ఒకటిన్నరకు దిగాడు పార్వతీశం. చూసి ఆశ్చర్యపోయాను. బాగా వొళ్ళు చేసి ఎర్రగా, మగ్గిన జామ పండులాగా వున్నాడు పార్వతీశం. తల చాలాభాగం బట్టతల అయిపోయింది. కిళ్ళీ అలవాటు చేశాడు. పెదాలు ఆడపిల్ల పెదాలకన్నా ఎర్రగా వున్నాయి. కళ్ళజోడు కూడా వచ్చింది. హఠాత్తుగా బజార్లో కనిపించి "మేష్టారూ" అంటే గుర్తు పట్టలేక తికమకపడి పోయే వాడిని.

"ఏం సార్! బాగున్నారా ! మీకో గొప్ప సర్ప్రైజ్ యిద్దామనుకున్నాను. మొదట మా ఆవిడ పరిచయం. సుబ్బులు – మా ఊరు గంగల కుర్రు నేనిక్కడే మద్రాసీ బాబు కింద లెక్క. మీరొస్తారని మొన్ననే తెలిసింది. మీ ఆఫీసులో కారు డ్రైవరు ఈ ప్లాట్ 'బర్సాతీ'లో వుంటున్నాడు. వెల్ కమ్ టు రాజధాని. ఢిల్లీ రావడం ఇదే మొదటి సారా ?"

జైల్లోంచి విడుదలైన ఖైదీ, మొదటి ఆట విడుపులాగ వుంది జీవితం అతనికి. జీవితంలో నిలకడనీ నిండు దనాన్ని సాధించుకున్న మనిషి లాగ కనిపించాడు. చేసె వ్యాపారం కూడా చాలా చక్కగా సాగుతున్నట్టుంది. ఖరీదయిన బట్టల్లో వున్నాడు. ఇంటి ముందు బులెట్.

"మీరెన్ని రోజులుంటారో ముందు చెప్పండి."

"మూడు రోజులు."అన్నాను.

"గుడ్, ఆఖరి రోజు నాదే. పొద్దుటే బయలుదేరి ఛండీఘడ్ వేళ్దాం. అక్కడ నుంచి పింజోర్ గార్డెన్స్. కారు ఏర్పాటు చేసేశాను. ఈ రెండు రోజుల్లో సాయంకాలం చిల్లర విహార యాత్ర. కుతుబ్ మినార్, జంతర్ మంతర్, టలక్ టోరా గార్డెన్స్, పార్లమెంట్ హౌస్, తాజ్ మేరియా, అశోక – అన్నీ."

సుబ్బులు నాకు స్వయానా బాబాయి కన్నా ఎక్కువ సేవలు చేసింది. భక్తితో నా అవసరాలన్నీ చూసి పెట్టింది. దాదాపు నా కాళ్ళ దగ్గర కూర్చుని భోజనం వడ్డించింది. ఇంక పార్వతీశం ఢిల్లీలో నన్ను నేలమీద నడవనివ్వలేదు రెండు రోజులు నాతోనే వున్నాడు. టాక్సీ మాట్లాడి అందులో తిప్పాడు.

"మరి మీ వ్యాపారం?" అన్నాను.

"ఫర్వాలేదు వ్యాపారం నేను చేసేది, రెండు రోజుల్లో ఏం నష్టపోను, మీలాంటి వాళ్ళు మళ్ళీ మళ్ళీ వస్తారా ? మీరొస్తున్నారంటే మా వాళ్ళు చిన్న సన్మానం కూడా ఏర్పాటు చేశారు అది రేపు" అన్నాడు.

ఈ రెండు రోజులూ నేనెందుకో సిగ్గుతో తెలీని బాధతో కుచించుకు పోయాను ఇంత మంచి మనిషిని యిన్నేళ్ళు ఎలా మరిచి పోయాను? ఈ మంచితనం తాకిడి యిది రెండోసారి. అంతకు మించి హైదరాబాదు రమ్మని స్వయంగా ఆహ్వానించిన నేను, వచ్చి ఫోన్ చేసిన అతనికి అబద్ధం చెప్పి వదిలించుకున్నాను.

ఛండీఘడ్ దాకా ప్రయాణం మరపురానిది. కారంతా ఆపిల్ పళ్ళు, బిస్కట్ పాకెట్లు, వేడినీళ్ళ ఫ్లాస్కు, ఇన్ స్టెంటు కాఫీ టిన్ను, ముందు సీట్లో నేను, వెనక అతనూ, భార్య సాయంకాలానికి హృదయం చూసిన దృశ్యాలతో వికసించింది. కాని మరో విధంగా ఆయన ఔదార్యానికి నా సంకుచితత్వాన్ని పోల్చుకుని భిన్నమూ అయింది.

వెళ్ళే రోజున కొత్తబట్టలు పెట్టి యిద్దరూ నా కాళ్ళకి నమస్కారం చేశారు. "త్వరలో కొడుకు పుట్టాలని దీవించండి సార్" అని మనస్ఫూర్తిగా నమస్కారం చేశారు. నాకు ఆర్ధ్రతతో కళ్ళ నీళ్ళు తిరిగాయి.

రైల్లో కూర్చున్నాక యింక ఆగలేక పోయాను! "పార్వతీశం గారూ ! మీకు తీరని అన్యాయం చేశాను. మిమ్మల్ని మోసం చేశాను" అన్నాను.

"ఏమిటి సార్?" అన్నాడు సిగరెట్టు వెలిగించుకుంటూ.

"ఆ రోజు మీరు హైదరాబాదు మీ ఆవిడతో వచ్చిన రోజు నేను అక్కడే వున్నాను, మీకు అబద్ధం చెప్పించాను" అన్నాను.

పార్వతీశం సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చి ఎటో చూస్తూ అన్నాడు "నాకు తెలుసు సార్."

తుళ్ళి పడ్డాను, "ఎలా?"

"ఆ రోజు టాక్సీలో నేనూ, సుబ్బులూ వూరంతా తిరిగాం. ఒకటి రెండు చోట్ల మీరు ఎవరో పెద్ద మనుషుల్తో చార్మినార్ దగ్గర, పబ్లిక్ గార్డెన్స్ దగ్గర కనిపించారు. మిమ్మల్ని దూరం నుంచి మా ఆవిడకి చూపించాను. అందుకనే మొన్న మిమ్మల్ని సుళువుగా గుర్తు పట్టింది. ఆ రోజు మైగాడ్ మీకు కనిపించకుండా ఎంత జాగ్రత్త పడ్డానో. మీకు కనిపిస్తే మీరు చిన్న బుచ్చుకుంటారని నా బాధ. నమ్ముతారా ? మళ్ళీ మీ కంటబడతానేమోనని మధ్యాహ్నానికే మేం హోటల్ రూంకి వచ్చేశాం."

నేను మరీ కీటకం లాగ, పిపీలకం లాగ అయిపోయాను. నోటమాట రాలేదు. నేను ప్రతీ క్షణం కుచించుకు పోతున్నానని పార్వతీశం కనిపెట్టాడు. ఆ యిబ్బంది కూడా కలిగించ కూడదని తనే కల్పించుకొని మాటాడాడు. నవ్వాడు తేలికగా, నిండుగా, నిశ్చలంగా.

"సార్ మీరు మా అన్నయ్యకి మిత్రులు. నాకూ మిత్రులనుకున్నాను. మిమ్మల్ని ఆహ్వానించాను. అతిథ్యం యిచ్చాను. అందులో నాకు ఆనందం వుంది. తృప్తి వుంది కాని, నేను మీ మిత్రుడినని మీరనుకోవలసిన అవసరం ఏముంది సార్. అనుకోవాలని నేననుకోవడం లేదు. ఆశించడం లేదు"

రైలు కూత కూసింది ఈసారి హైదరాబాదు వచ్చినప్పుడు ఉత్తరం రాయమని అడిగే హక్కు నేను పోగొట్టుకున్నాను అడిగినా వ్రాయడనీ. వచ్చినా ఫోన్ చెయ్యడనీ తెలుసు. రైలు కదిలింది. నవ్వుతున్న అతని ముఖం క్షణంలో దూరమయింది.

రైలు నడుస్తూంటుంది దారిలో చెట్లు మనల్ని దూసుకుపోతూంటాయి. కొన్ని చెట్లు అందంగా, నిండుగా గంభీరంగా, కనిపిస్తాయి. వాటి జ్ఞాపకం, ఆ అనుభూతి, స్పృహ మనల్ని క్షణంలో తాకి గుర్తుంచుకొనేలోగా అలా వెనక్కి జారిపోతాయి.

# అయ్యవారిని చెయ్యబోతే కోతయింది

## కరుణ కుమార

## (భారతి సంచికనుంచి పునర్ముద్రితం)

వెంకటనారాయణ శింగరాయ కొండ లేబరు స్కూలు టీచరు. నాలుగో ఫారం పరీక్ష తప్పిపోయినందున హయ్యరు గ్రేడు ట్రైనింగు ప్యాసయి, వారినీ వీరినీ ఆశ్రయించి అంతా మూడు నెలల కిందటే లేబరు డిపార్టుమెంటు స్కూలులో నెలకిరవై రూపాయల టీచరు వుద్యోగం సంపాదించుకొని ఛార్జీ తీసుకొన్నాడు.

ఛార్జీ తీసుకొన్న మూడో నెలలోనే జిల్లా లేబరు ఆఫీసరు గారు ఏప్రియల్ నెల అయిదవ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు బడికి తణిఖీ నిమిత్తం వస్తున్నామని అడ్వాన్సుగా వెంకటనారాయణకు నోటీసు కార్డు పంపారు.

నోటీసు ప్రకారం ఆఫీసరు గారు సరిగా ఆరోజున బడి వద్దకు రావడమూ, వారు వచ్చేవరకు స్కూలు తలుపు తాళం వేసి వుండి, వెంకటనారాయణ గాని, పిల్లలు కాని హాజరులో లేకపోవడమూ జరిగింది. ఇది చూచి ఆఫీసరు ఉగ్రుడయి పరవళ్ళు తొక్కుతూ ట్రావెలర్సు బంగళాలోని తన మకామునకు చక్కాపోయినాడు.

పగలు పన్నెండు గంటలు కావచ్చింది. ఎండ మిటమిట లాడుతోంది. లేబరు ఆఫీసరుగారప్పుడే భోజనం చేసుకొని పడక కుర్చీలో పండుకొని సిగరెట్టు కాలుస్తున్నారు. వారి జవాను కూడా అప్పుడే భోజనానికి పోయినాడు. బంగళా కాంపౌండులోని గుడిసెలో కాపురం వున్న యానాది వాడొకడు వరండాలో కూర్చుని పంకా లాగుతున్నాడు.

వచ్చిన పని కాకుండా ఆ రోజు దయరీ అంతా వృధా అయిపోయిందే అని విచారిస్తూ నోటీసు ముందుగా పంపినప్పటికీ వెంకటనారాయణ చూపించిన అవిధేయతకు అతను ఎదుటిపడితే ఎగిరి మింగేయాలన్నంత ఆగ్రహంతో పెద్ద నిట్టూర్పులు విడుస్తూ, నోటిలో పెట్టి ముట్టించిన సిగరెట్టును రెండు మూడు పీల్పులతోనే ఆఖరు చేస్తూ, ఇట్లా ఒక దాని వెంట మరొకటి చొప్పున ఇప్పటికి ఒకటీ రెండూ మూడూ నాలుగు సిగరెట్లు తగలేశారు లేబరు ఆఫీసరు గారు. వారు అయిదో దాన్ని బయటికి తీయబోతూ వుండగా ఒక అరడజను బత్తాయి పండ్లూ, అరడజను కమలాపండ్లూ వగైరాలతో వున్న ఒక వేపతట్ట చేత్తో పట్టుకొని, ఎదుటబడితే ఏమి చేస్తారో దొరగారన్న దిగులుతో అడుగులో అడుగు వేసుకొంటూ, వరండా మెట్లెక్కి పిల్లిలా నక్కుతూ నక్కుతూ అప్పుడే వచ్చాడు వెంకట నారాయణ. భయపడుతూ భయపడుతూ దొరగారు కుర్చీలో పరుండి వున్న గది వాకిలి వద్దకు వెళ్ళి, తట్టలో పళ్ళు తీసి బల్లమీద పెట్టి 'రక్షించండి బాబూ ! ఈ దఫాకు క్షమించండి' అంటూ మరుక్షణంలో దొరగారి పాదాల మీద వ్రాలాడతడు.

వెంకటనారాయణ అంటిన కాలు ఛర్రున విదలించి వేసి "ఛీ! బయటికి పో, ఇడియట్ ! నిన్ను డిస్మిస్ చేస్తాను చూచుకో. బుద్ధుందా లేదా నీకు?" అని తోక తొక్కిన తాచు లాగ కుర్చీలో పండుకొన్న లేబరు ఆఫీసరు గారు లేచి ఒక్క ఉరుమురిమాడు.

"క్షమించండయ్యా ! పొరపాటు జరిగిందండి. బుద్ధి పూర్వకంగా చేసిన తప్పు కాదండి. ఇట్లా ఇంతపని జరుగుతుందని నేను కలలోనూ కూడా అనుకొని వుంటే దొరగారు తమరికింత ఆగ్రహం రాకుండానే చేసుకొనేవాణ్ణి. ఇప్పుడయినా నా కథ యావత్తూ సాంతంగా వింటే దొరగారు నా మీద ఇంత ఆగ్రహపడరని మనవి చేసుకొంటున్నానండి" అని వెంకట నారాయణ నడుం వంచి రెండు చేతులూ జోడించి గజ గజలాడుతూ విన్నవించు కొన్నాడు.

"ఏం కథ ? ఆ కథేమిటో ఆ యేడుపేమిటో ఏం జరిగిందో చెప్పు అదీ వింటాం" అని కొంచెం తమాయించి వెంకటనారాయణ ఏం చెప్పుకొంటాడో సాంతంగా విందామని దొరగారు తిరిగి పడక కుర్చీలో వెనక్కి జేర్లబడి, ఆరో సిగరెట్టు ముట్టించి రెడ్డికం వేసికొని ఓరకంటి చూపుతో వెంకటనారాయణను చూస్తూ కూర్చున్నారు.

అంతట వెంకట నారాయణ కొంత ధైర్యం తెచ్చుకొని గుండె దిటవు పరుచుకొని గొంతు సవరించుకొని తన చరిత్ర నీ క్రింది విధంగా ఆరంభించాడు.

"తమరీదినం అయిదవ తేదీన తణిఖీకి వస్తామని పంపిన నోటీసు కార్డు నాకు మొన్న మూడవ తేది ఉదయం పదిగంటల కందిందండి. తమ అనుగ్రహం వల్ల నాకీ శింగరాయ కొండ గ్రామంలో నౌకరీ దొరకడమూ, నేను ఛార్జీ తీసుకొన్న మూడునెలలకే తమరు నా స్కూలు తణిఖీకి వస్తామని నోటీసు పంపడమూ తలచుకొనేవరకు నాకు ఆనందం కలిగింది. నేను నౌకరీలో చేరిన పిదప ఇదే తమరు మొదటి సారి తణిఖీకి రావడం కాబట్టి ఈ సారి తమరిని హృదయ పూర్వకంగా అహ్వానించి గౌరవించి తమరి నానందపరిచి తమ వల్ల మంచి సర్టిఫికెట్టు పొందుదామని కోరిక పుట్టింది. నా స్కూలు రావడంతోనే తమ మెడలో ఒక గులాబీ పూలమాల వేసి, పండ్లు వగైరాలు సమర్పించి తమరిని పూజిద్దామనుకొన్నాను. నిన్న నాలుగో తేదీ అంతా గడి వుంది కదా, నెల్లూరికి పోయి మంచి మాలా పళ్ళూ తీసుకు వద్దామని ఆరు రూపాయలు చేబుచ్చుకొని మొన్న రాత్రి ప్యాసెంజరులో నెల్లూరు వెళ్ళానండి.

"తెల్లవారు ఝామున అయిదు గంటలకి నెల్లూరు చేరింది ప్యాసెంజరు. రైలు దిగి ఉదయాన్నె పెద్ద బజారులో పువ్వులమ్మే సాయేబుల అంగడికి పోయి మంచిరకం ఒక మాల రూపాయన్నరకు బజానా యిచ్చి, సాయంత్రం ఆరుగంటలకు మాల తయారవుతుందని సాహెబు చెప్పినందు వల్ల అతనితో సాయంత్రం మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాను. బజారు లో రూపాయిన్నరకు గజనిమ్మ పండ్లూ, ఆపిలు, కమలాలు తీసుకొని ఇంకా ఇతర పనులు చూచుకొని మధ్యాహ్నం పూటకూటింట భోజనం చేసుకొని సాయంత్రం ఆరుగంటలకు మళ్ళీ బజారుకు వెళ్ళానండి. పూలమాల తయారుగా వుంది. దాన్ని తీసుకొని ఒక బుట్టలో నలిగిపోకుండా భద్రపరిచి, రాత్రి ఏడు, ఏడున్నర గంటలకు

మళ్ళీ పూటకూటింటికి వెళ్ళి భోజనం చేశాను. పూటకూటాయనకు డబ్బులిచ్చి వేసిన పిదప నా మనీ పర్సులో మిగిలిన పైకం లెక్క చూచుకోగా నేను తీసుకు వెళ్ళిన ఆరు రూపాయలలోనూ రూపాయ రెండణాలు మిగిలినవి. 'సరే, నెల్లూరి నుంచి శింగరాయకొండకు సరిగా రూపాయే కదా రైలు ఛార్జి _ ఇంకో రెండణాలు అదనంగానే వున్నవనుకొని పైకి తీసిన రూపాయి మళ్ళీ పర్సులో పెట్టే సమయంలో దానికి అంచున చిన్న నొక్కున్నట్టు కనిపించింది. అరే, చంద్రబింబం లాంటి ఈ జార్జిమార్కు కొత్త రూపాయికి కళంకంలా ఈ పాడు నొక్కు ఎట్టా వచ్చిందా అని అనుమానిస్తూ దాన్ని కిందగచ్చుమీద వేసికొట్టి మోగించాను. ఖంగుమని మోగింది. మళ్ళీ రెండో సారి కొట్టాను. పూటకూటిల్లంతా మారుమోగింది. అనుమానమెందుకు ఈ రూపాయికనుకొని దాన్ని పర్సులో వేసి పండ్లు నా సూటుకేసులో పెట్టి దానికి తాళం వేశాను. రాత్రి తొమ్మిది తొమ్మిదిన్నర కావచ్చింది. శింగరాయ కొండకు వెళ్ళే ప్యాసెంజరు తెల్లవారు జాముని నాలుగు గంటలకు చేరుతుంది నెల్లూరు. పూట కూటింట పడక వేస్తే మెళుకువ వస్తుందో రాదో, _ అర్థరాత్రి ప్రయాణం, వున్న యీ ఒక్క రైలూ దాటిపోతే వచ్చిన పనంతా వ్యర్థమయిపోవడమే కాకుండా దొరగారికి ఆగ్రహం కనుక వస్తే మన బతుకంతా తలకిందైపోతుంది, వెళ్ళి రైలు స్టేషనులోనే పడుకొంటే మంచిదని సూట్ కేసు ఒక చేత్తోనూ, పువ్వుల మాలబుట్ట మరో చేత్తోనూ పట్టుకొని వెన్నెట్లో స్టేషనుకు బయలుదేరాను.

"కాని దారి పొడుక్కి నాకు రూపాయి మీద అనుమానం బాధిస్తూనే వుంది." రూపాయి మోత చూస్తే బాగానే వుంది కాని ఆ టిక్కట్టిచ్చేవాడి కంటికి నొక్కు కనిపిస్తుందేమో. మోత బాగా మోగినా నొక్కున్న రూపాయలు రైలు వాళ్ళు తీసుకొంటారో లేదో. ఆ టిక్కట్టిచ్చేవాడు రూపాయి మోగించి టిక్కెట్టు నా చేతిలో పెడితే సరే; ఒక వేళ అట్లా జరక్కపోతే ఏమి గతి ? మనకీ పట్నంలో తెలిసిన వారెవ్వరూ లేరే ! అందులోనూ అర్థరాత్రి సమయం అయినా రూపాయి పడకపోవడమే ఖాయమా ? పోనీ, ఎవరికయినా దీన్ని చూపించి నొక్కున్నదని చెప్పకుండా వాళ్ళను "అయ్యా ! ఈ రూపాయికేం లోపమండీ" అని అడిగితే, వాళ్ళు దీనికేమయినా వంక పెట్టగలరా? కాని ఈ ఆలోచన కూడా బాగాలేదు. మన రూపాయి లోపం మనమే ఎందుకు బయలు పెట్టుకోవడం ? ఎవరితోనూ ఈ రూపాయి ప్రస్తావనె చేయ గూడదు. మాట్లాడక స్టేషనుకు వెళ్ళి హాయిగా తెల్లవారుజాము వరకూ పండుకొని టిక్కెట్టిచ్చే సమయంలో పోయి ఏమీ యెరగనట్లు బల్లమీద పడేస్తే ఖంగుమని రూపాయి మోగి వూరుకొంటుంది; సరేరా అని టిక్కెట్టు ఇవ్వనే యిస్తారు. అదీగాక, రాత్రి వేళ, ఆ నిద్ర కళ్ళకి వాళ్ళకీ రూపాయి నొక్కు అసలు కనిపిస్తుంది గనుకనా? రాత్రి పూట ఈ ఉద్యోగం చేసే రైలుద్యోగస్థులందరూ రైలు నడిపే ఏడ్రైవరో తప్ప గార్డూ, అందరు గార్డూ, స్టేషను మాస్టరూ, టిక్కెట్టిచ్చేవాడూ, వసూలు చేసే వాడూ _ యావన్మందీ అసలు సగం నిద్రలోనే ఉద్యోగం చేస్తూ వుంటారు. అటువంటిది టిక్కెట్లమ్మే వాడికి నా రూపాయి నొక్కు కనిపిస్తుందా ? చేస్తుందా ? మోగించాడంటే చక్కగా మోగే నా రూపాయి కేమిటి రాత్రి వేళ సగం

నిద్రకళ్ళా టిక్కెట్టిచ్చేవాడు పేరు పెట్టడమేమిటి ? ఛా! ఛా! ఎందుకొచ్చిన అనుమానం ఇది. మరేమీ ఫరవా లేదు రూపాయికి వచ్చిన భయమేమీ లేదు" అని యేవేవో ఆలోచనలు చేస్తున్నాను. ఈ ఆలోచనలోనే స్టేషను చేరాను.

"నేను స్టేషనులో అడుగు పెట్టేవరకు మిషనరీ క్లాకు టవరు టంగు టంగుమని పది గంటలు కొట్టింది. "భలే భలే శకునం. గంట కొట్టింది. ఇక ఫరవాలే" దనుకొని లోపల హాలులోకి వెళ్ళాను. హాలుకు నడుంగా పైన పలకలద్దాల లాంతరు వేలాడుతోంది. దానిలోని దీపం తప్ప యితర పెద్ద దీపాలేమీ హాలులో లేవు. మూడో తరగతి ప్యాసెంజర్లు కొంతమంది బెంచీలమీదా, కొంతమంది కిందా పండుకొని నిద్రపోతున్నారు. కొందరు కూర్చునే కునికి పాట్లు పడుతున్నారు. ఒక మూల ఒక ముసలాయన దగ్గుతున్నాడు; వేరొక మూల ఒక చంటి పిల్ల లేచి యేడుస్తోంది. ఒక పక్క కొంతమంది చుట్టలు కాల్చుకొంటూ లోకాభిరామాయణం మాటాడుకొంటున్నారు. బయట రోడ్డు పక్క జట్కాలూ, ఎద్దుబళ్ళూ వున్నవి. పదిన్నర గంట కావచ్చింది. నాకూ నిద్ర వచ్చీ రానట్టుగా వుంది. ఇంకో అరగంటకు మద్రాసు నుండి మెయిలు వచ్చి వెళ్ళిపోయింది. దానితో హాలులోని సమ్మర్దం కొంత అణిగి అక్కడక్కడ కొద్దిపాటి ఖాళీ అయింది. "తెల్లవారు జామున కదా నా రైలు వచ్చేది. ఈ లోపల కాస్త కూర్కుపోదా"మనుకొని తలకింద సూటుకేసు పెట్టుకొని పక్కన పువ్వుల బుట్ట పెట్టుకొని కాళ్ళు చాచుకొని రెండావులింతలావులించి రంగా ! రంగా అంటూ మేను వాల్చాను.

"కళ్ళు మూసుకొన్నాను కాని నిద్రపట్టలేదు. పైకి నిశ్శబ్దంగానూ, శాంతంగానూ వున్నట్టున్నానే కానీ లోపల గుండెలు దడదడ రైలింజనులా కొట్టుకొంటున్నవి. ఏమీ భయం లేదని నాలో నేను ఎన్ని సార్లు ధైర్యం చెప్పుకొన్నా గుండె నిబ్బరం కలగలేదు." ఒక వేళ రూపాయి పడకపోతే యెట్లా ? రైలువాళ్ళకు మనతో మొగమాటం గనుకనా ? ఈ రైలు దాటిపోతే గతేమిటి ?" __ ఇవే ఆలోచనలు. ఎంత అణుచుకొందామన్నా ఉఁహూఁ .. ఈ ఆలోచనలణగటం లేదు. నిద్రపట్టలేదు. లేచి కూర్చున్నాను. హాలంతా పరికించి చూచాను. రాత్రి పన్నెండు, ఒంటిగంట అయిపోతోంది. అంతా నిశ్శబ్దంగా వుంది "ఈ హాలులో ఇంతమంది ప్రయాణీకుల లోనూ ఎవరికైనా నాకులాగా ఇంత ఆందోళన వుంటుందా ? హాయిగా నిద్రపోతారా వుంటే? మనకయితే మాత్రం ఎందుకాందోళన? గడియారం టంగు టంగుమని గంటలు కొట్టింది. మనకు జయమే" అని మనస్సుకు దిటవు చెప్పుకొని మళ్ళా కళ్ళు మూశాను. కాని ఊహూ మనస్సుకు శాంతి కలుగలేదు. 'తీరా రూపాయి మారకపోతే రేపు దొరగారి తణిఖీ యేమి కావాలె? స్కూలేమి కావాలె? నేనేమి కావాలె ఇదేమిరా భగవంతుడా ! ఇట్లాంటి చిక్కులలో పెట్టావనుకొంటూ ఆ వేదనతో లేచికూచుని కొంతసేపు అటూ ఇటూ పచార్లు చేశాను. తిరిగి మళ్ళా వచ్చి నా మామూలు చోట పండుకొన్నాను.

"క్లాకు టవరు రెండు గంటలు కొట్టింది. మూడు కొట్టింది. ఆఖరుకు నాలుగు కూడా అయింది. గుండెలు మహా వేగంతో కొట్టుకొంటున్నవి. అప్పుడు నాది అదొక విపరీతమయిన స్థితి. టిక్కెట్లు తీసుకొనే టైమయిందన్నట్లు స్టేషన్ ప్లాటు ఫారం మీద గంట గణగణ వాయించాడు పోర్టరు. హాలులో నిద్రపోతూ వున్న వాళ్ళందరూ నిద్ర లేచారు. ఒక్క

నిముషకాలంలో టిక్కెట్టమ్మే కిటికీ వద్ద పెద్దగుంపు చేరింది; జనం త్రొక్కులాడుకొంటున్నారు. స్థలంలేదు. ఒకరినొకరు తోసుకొంటున్నారు. పెద్ద రభసంగా వుంది. టిక్కెట్టు తీసుకొనేటందుకిదేరా సమయమని నేనూ లేచి పర్సులో రూపాయి పైకి తీసేవరకు ఒక ముసలి తురక సాహెబు డెబ్బయి ఏండ్ల వాడు నా కడ్డంగా వచ్చి "మహారాజ్! ముసలి వాణ్ణి, కళ్ళు కనిపించవు. ఆ జనంలోకి పోయి టిక్కెట్టు తెచ్చుకోలేను. నాకు శింగరాయ కొండకో టిక్కెట్టు తెచ్చిపెట్టు మహారాజ్ ! నీకు సలాం చేస్తా"నన్నాడు. "శింగరాయకొండకా ? టిక్కెట్టా? సరే తెస్తాను. పైకం తే" అన్నాను నేను.

సాహెబు తన వణుకు చేత్తో సంచిలోనుంచి రూపాయి తీసి నా చేతిలో పెట్టాడు. "భలే ఇట్టావుండాలి అదృష్టమంటేను. ఈ తొందరలో రెండు రూపాయలూ ఒకేసారి టిక్కెట్టిచ్చే ఆయన చేతిలో పడేస్తే ఆయనకు నా రూపాయి నొక్కు అసలే కనిపించదు ఒక రూపాయి విడిగా యిస్తే పరిశీలించడానికవకాశం గాని రెండు రూపాయలూ జోడించి యిస్తే ఇక భయమేమిటి ? బతికానురా భగవంతుడా!" అనుకొంటూ టిక్కెట్ల కిటికీ దగ్గరికి వెళ్ళానండి. జనసమ్మర్ధం ఇంకా తగ్గలేదు.

"శింగరాయకొండకు రెండు టిక్కెట్లంటూ" నా చేతిని బలవంతంగా ఇతరుల చేతుల పక్కనుంచి కిటికీ గంతలోకి పోనిచ్చి రెండు రూపాయలూ బల్లమీద పెట్టాను. వాటిని టిక్కెట్టిచ్చే ఆయన మోగించాడో లేదో నాకు తెలియదు. నా చెవికేమీ మోత వినపడలేదు. "ఇదేరా పరీక్షసమయం. అటో ఇటో తేలిపోతుందిప్పుడే" అనుకొంటూ వుండగా "ఈ రూపాయి పడ"దంటూ ఆ రెంటినీ తిరిగి నా చేతిలో పెట్టాడాయన.

"నొక్కు కనిపించింది కాబోలు! ఇక నేదిరా దిక్కు?" అనుకొంటూ గుంపులో నుంచి తోసుకు బయలుపడ్డాను. నాకేమీ పాలుపోలేదు. దిక్కూ దెసా తోచలేదు. వొళ్ళంతా తేళ్ళూ జెర్రెలూ పాకినట్లయింది. ప్రపంచమంతా తిరిగిపోతున్నట్టనిపించింది. ఏమి చేయను? ఎక్కడికి వెళ్ళను? ఎవరినాశ్రయించను ? ఎవరి నెరుగుదునక్కడ? ఏమి బుద్ధి ? అని యేమీ తోచక తన్నుకులాడుతుంటే నా సూటు కేసు వద్ద తన మూట పెట్టుకు కూచున్న సాహెబు వచ్చి "అయ్యా! టిక్కెట్టేదండీ" అన్నాడు. "లేదూ, టిక్కెట్టు తేలేదు. నా రూపాయి మారదని రెండు రూపాయలూ ఇచ్చేశాడు. ఇదిగో నీ రూపాయ నీ టిక్కెట్టు నీవే తెచ్చుకో. నేతేలే"నంటూ లాంతరు దీపం వెలుతురులో రెండు రూపాయలూ నిదానంగా చూచి నా నొక్కు రూపాయి నేను జాగ్రత్తపెట్టుకొని అతని ఎడ్వర్డు రూపాయ అతనికిచ్చివేశాను. ఏమి చేయడానికీ తోచక కాలు కాలిన పిల్లిలా ఇటూ అటూ తిరుగుతూ వుండగా అంతలోనే సాహేబు నా దగ్గరికి తిరిగి వచ్చి "అయ్యో ! ఇదేమిటి మహారాజ్! నా రూపాయి మారదని వాపసు చేశాడు ఆ టిక్కెట్టు పంతులు. మా దొడ్డపని చేశావు. నా మంచి రూపాయి నువ్వు తీసుకొని నీ పడని రూపాయి నాకిస్తావు. నారూపాయి నాకియ్యి" అని గదిమాడు.

"నే నేమైనా పొరపాటుబడ్డానా" అని మళ్ళీ దీపం వెలుతురులో నా రూపాయను పరిశీలించి చూచాను. అది నా రూపాయే జార్జి చక్రవర్తి బొమ్మా అంచున నొక్కూనూ. సందేహమేమిటి? సాహేబు కిచ్చినది సాహేబు రూపాయే.

పొరబడలేదనుకొని "నీరూపాయే నీకిచ్చాను సాహెబూ! నా పడని రూపాయి నీ కివ్వలే" దన్నాను. "లేదు మహరాజ్ ! చీకట్లో పొరపాటు పడ్డారు మీరు. నా రూపాయి మంచి రూపాయి సామీ ! నాది నాకిచ్చేయండన్నాడు. ఏం చెప్పనతనికి ? "లేదు సాహెబూ ! నా రూపాయి నాకు గుర్తే. దానికి చివర నొక్కుం"దన్నాను. "లేదయ్యా నా రూపాయి తీసుకొని నీ పడని రూపాయి నా కిస్తావటయ్యా ? భలే దొడ్డవాడివే. ఇచ్చెయ్యి నా రూపాయి" అని గోల ప్రారంభించాడు. ఈ గోలకక్కడ హాలు లోని వారు దగ్గరికి వచ్చి మమ్మల్ని చుట్టుకోవడం మొదలు పెట్టారు. "ఎట్లాగ ఈ సాహెబును నమ్మించడం ? అతనికి కళ్ళు కనిపించవు. అతని రూపాయి తీసుకొన్నప్పుడు మంచిదే అనే వుద్దేశంతో మోగించకుండా తీసుకొన్నాను. మొదట మోగించినా తీరిపోయేది. ఇప్పుడేమనుకుంటే ఏమి లాభం?" అనుకుంటూ వుండగా చుట్టూ మూగిన వారు తలొక మాటా అనడం మొదలు పెట్టారు. సాహెబు తొందర ఎక్కువయింది రూపాయి ఇచ్చెయ్యమని. "ఆఖరుకు నా నొక్కు రూపాయే మంచిదనీ, సాహెబు రూపాయే చెడ్డదనీ నిశ్చయమైంది. అయితేమట్టుకు లాభం ఏమిటి ? సాహెబునెలా నమ్మించడం ? అతనికి టిక్కెట్టు తీసుకు వస్తానని యెరక్కపోయి వొప్పుకొన్నాను. మొట్టమొదట లేనిపోని అనుమానాలకు పోయి చెడ్డాను." అనుకొంటూ వుండగా సాహెబు "ముసలాణ్ణి కళ్ళు కనబడవు గనుక మోసం చేస్తావుటయ్యా? ఇచ్చెయ్యి నా రూపాయి. రైలు వస్తోంది వెళ్ళాలంటూ మరింత గంద్రగోళం చేశాడు. ఏమి చెయ్యనిక. ఇక నివ్వక విధిలేదు _ ఇదేమి రవ్వరా" అని నా రూపాయి వాడి చేతిలో పెట్టి వాడి రూపాయి నేను తీసుకొన్నాను. నా నొక్కు రూపాయితో టిక్కెట్టు కొనుక్కొని టింగురంగా అని చక్కా పోయినాడు సాహెబు.

"ఆఖరుకు బలే తమాషా జరిగిందోయి వెంకటనారాయణ! కథలాగే వుంది. తరువాతేం జరిగిందేమిటి" అన్నారు నవ్వుతూ లేబరు ఆఫీసరు గారు.

"ఇకనేముంది స్వామీ! నేనక్కడదిగడిపోవడం దొరగారు తమరి రాకా , స్కూలు తణిఖీ తలచుకొనేటప్పటికి వొళ్ళు కంపరమెత్తి పోయింది. ఏమి చేయడానికీ దిక్కు తోచలేదు. రైలు వచ్చేస్తున్నది. మతి పోయింది. మళ్ళా కిటికీ దగ్గరికి వెళ్ళాను. టిక్కెట్టు పంతుల్ని శతవిధాల బతిమాలుకొన్నాను. ఎంత బతిమాలుకొన్నా ప్రయోజనం లేక పోయింది. నా దగ్గర రూపాయి చెల్లదంటే చెల్లదని తీసుకోనన్నాడు. "సాహెబు సైంధవుడిలా అడ్డుతగిలి వాడి రూపాయి నాకంటగట్టి పోయినాడే" అని దుఃఖం వచ్చింది. "ఇక నేనేమి చేయనురా భగవంతుడా" అనుకొంటూ వుండగా ప్లాటు ఫారం మీద కొచ్చేసింది రైలు. ఇక ఆలోచిస్తే కార్యం లేదనుకొని నా దగ్గర అదనంగా వున్న రెండాణాలతోనూ ప్లాటు ఫారం టిక్కెట్టుకొని ఒక్క పరుగున ప్లాటు ఫారం మీదికి వచ్చి పడ్డాను. రైలు దాటి పోతుందేమో అన్న ఖంగారులో నాకెదురుగా వున్న పెట్టె తలుపు తెరచి లోపలికెళ్ళి కూచునే వరకు _ తీరా చూస్తును కదా అది ఇంటరు క్లాసయింది. అసలే టిక్కెట్టు లేదు; అందులోనూ ఇంటరు తరగతి ప్రయాణం! ఇదేమిరా ఎట్లా వచ్చిందనుకొంటూ, పువ్వులదండ జ్ఞాపకానికి వచ్చి చూచుకోగా ఆ బుట్ట లేదు తొందరలో స్టేషనులో మరచిపోయి వచ్చానని తెలిసిందప్పుడు. దానికోసం విచారిస్తూ వుండగా

రైలు పెన్నావంతెనమీదికి రావడమూ, ఇంతలోనే అదివరకాబండిలో ఎప్పుడెక్కాడో టిక్కెట్టు కలెక్టరొకడు టిక్కెట్లడుగుతూ వుండడమూ జరిగింది. “వస్తే అన్ని చిక్కులూ ఒక్క మాటున వస్తవి ఇదేమి ఖర్మంరా భగవంతుడా” అని హడిలి పోతున్న సమయంలో టిక్కెట్టు కలెక్టరు నా దగ్గరికి వచ్చి టిక్కెట్టడిగాడు. నా దగ్గర టిక్కెట్టేదీ ? లేదని నా సంగతంతా చెప్పబోతూ వుంటే వినక దొంగతనంగా ప్రయాణం చేస్తున్నానని నాకు మద్రాసు నుంచి ఇంటరు క్లాసుకు డబ్లి ఛార్జి కట్టి నా పేరు వ్రాసుకొని నెల్లూరు తర్వాతి స్టేషను పడుగు పాడులో దింపి వేసి స్టేషను మాస్టరుకప్పగించి తన దారిని తాను చక్కాపోయాడు.

ఏమని చెప్పుకోను దొరగారూ ! నా అవస్థ తెల్లవారేవరకూ పడుగు పాడులో వుండి తెల్లవారిన తర్వాత ఆ స్టేషను మాష్టరు కాళ్ళు పట్టుకొని ప్రార్థించి, ఆయన దయదలచడం వల్ల శింగరాయ కొండకు టిక్కెట్టు తీసుకొని ఆయనదగ్గర తీసుకొన్న చేబదులుతో ఈ పన్నెండు గంటల ప్యాసింజరులో వచ్చి పడ్డానండి.

ఈ లోగానే దొరగారు తమరు స్కూలుకు రావడమూ, నేను లేనన్న కారణం చేత కోపంచేసి ఇక్కడికి వచ్చేయడమూ జరిగిందండీ _ పోయిన పూలమాల పోనే పోయింది స్వామీ ! ఈ పళ్ళయినా తీసుకొని నన్ను కటాక్షించకపోతే _”

అని దీనంగా గాద్గద స్వరంతో చెప్పుకొంటూ నిలబడి వున్న వెంకట నారాయణ వైఖరి చూచేవరకు లేబరు ఆఫీసరు హృదయం కరిగింది, జాలిపడ్డాడతని స్థితికి; “సరే నీకు భయం లేదు. నేను రేపటి దినం స్కూలు తణిఖీకి వస్తా”నని చెప్పి అతన్ని వోదార్చడమే కాకుండా అతనికి రైలు వాళ్ళు కట్టిన డబ్లీ ఛార్జి ఏడు రూపాయలన్నరా తానే యిచ్చేసి వెంకటనారాయణ నింటికి పంపేశాడు.

# కవిరాయడు – మహారాజు

## చింతా దీక్షితులు బి.ఏ.ఎల్.టి, సాహితీసమితి సభ్యుడు

## (భారతి 1924 సెప్టెంబర్ సంచికనుంచి పునర్ముద్రితం)

ఒకనాటి ప్రాతఃకాలమున కవిరాయడు స్వప్నావస్థనుండి మేల్కొన్నాడు. బాహ్య ప్రపంచ వైఖరి అతనికి గోచరమైనది. నిజస్థితియతని మనస్సునకు తట్టినది. ఖిన్నుడై పోయినాడు!

మహారాజునకు తనపై దయతప్పినదని యాతడు గ్రహించినాడు.

1

కవిరాయడు కవి కుటుంబమున బుట్టినాడు. కవి గర్భమున జన్మించినాడు. ఆతడు పుట్టినప్పుడు కోకిలలు కూసినవి, చిలుకలు పలికినవి, మోడు చెట్లు చిగిరించినవి !

లోకమంతయు కవిరాయనికి స్వాగతము చెప్పినది. కవిరాయని జనకుడు తన హృదయమును ఆ సమయమున పరిశీలించి చూచికొన్నాడు. కవితారసమునకు బదులు ఆనందరసము హృదయమున నిండియుండుట గమనించినాడు. ఆనంద భాష్పములతో తనకు బుట్టిన కవిరాయని నొక్కమారు తలచుకొని "మహా రాజునకు కృతిగా నొసగగల నాకడసారి ప్రభంధ మితడేగదా." అనుకొన్నాడు. తన చిన్న ప్రబంధమును, ఈ కవిరాయని మహారాజు చేతిలోబెట్టి జనకుడు నిద్రావస్థను జెందినాడు.

౩

మహారాజు రాజ్యభారమున మునిగి తేలుచున్నాడు. ఎయ్యది మంచి, ఎయ్యది చెడ్డ అను విషయమును నిర్ణయించుకొనుటలో కాలము జరిగిపోవుచున్నది. ప్రజలను శాసించుచున్నాడు, పన్నులు గొనుచున్నాడు. ఉపదేశ వాక్యములను మహర్షుల వదనముల నుండి వినుచున్నాడు. రాజ్యపరిపాలనము కష్ట సాధ్యమైన పని అనుకొనుచున్నాడు. అప్పుడప్పుడు మహారాజు చెవులలో కవులగీతములు పడుచుండుట కూడ కలదు. అవి ఈర్ష్యా గీతములో, ప్రణయ గీతములో ఆ మహారాజు ఎట్లు నిర్ణయించుకొనగలడు ? కవిజనకుడర్పించిన కుమార ప్రబంధమును మహారాజు ఎక్కడనోపెట్టి మరచిపోయినాడు?

౪

కవిరాయడు చిన్ననాటి చెలిమికాండ్రతో ధృఢమైత్రి చేసికొని ప్రపంచమును మరచిపోయినాడు. చిలుకలతో జట్టుకట్టి తీయని పలుకులను నేర్చుకొన్నాడు.

కోయిలలతో సంచారము చేసి పలుకులకు మంజులత్వ మలవడ జేసి కొన్నాడు.

గోదావరి నాశ్రయించి స్వేచ్ఛాగాన మభ్యసించినాడు.

ఆతని నివాసము ఎల్లప్పుడు కొండలమీదను చెట్లమీదను.

ఆతని దృష్టులెల్లప్పుడు ఆకాశపథమున నక్షత్రమండలములవైపే.

ఈ సహవాస బలము చేత కొంతకాలము పాట పాడుటే మరచిపోయినాడు కవిరాయడు. సహవాసుల ప్రోద్భలము చేత కొంత కాలమునకు గీతములను పాడుట మొదలు పెట్టినాడాతడు.

ప్రకృతి గీతములు, ప్రణయగీతములు! చిలుకలు, కోకిలలు ఆతని గీతములు మెచ్చుకొన్నవి. ఇంతవరకును ప్రజలు రంగు బొమ్మలను మెచ్చుకొనువారు. సజీవగీతములను చూచి వారు మూకీభావము వహించినారు.

కవిరాయని వంశము వారందరు మహారాజునకు కృతులిచ్చినవారే.

కవిరాయడు చిలుకలకును, కోయిలలకును తన తొలిచూలి బిడ్డ నర్పించినాడు!

మంచి సావాసము చేయుచుండలేదని మహారాజు కవిరాయని మరచినాడన్నారు కొందరు! చిలుకలకును కోయిలలకును కృతి యిచ్చుట తగని పనిగా గణించి కోపమంది యుండవచ్చునని మరికొందరన్నారు! నిజస్థితి మాత్రమెవ్వరికిని తెలియలేదు.

౫

మహారాజునకు తనపై దయతప్పినదని తెలిసికొని కవిరాయడు ఖిన్నుడై దుఃఖ గీతములు పాడ మొదలు పెట్టినాడు. లోకమునావరించి యున్న దుఃఖసముద్రములోనవి లీనమై పోయినవి. కొంత కాలమునకు తెలివిదెచ్చుకొని మహారాజుపై గీతములల్లినాడు కవిరాయడు. మహారాజున కందచేయుదునని చెప్పి వాయువా గీతములను తన గర్భములో దాచుకొన్నది. మరల క్రొత్త గీతములనాతడు పాడినాడు. మహారాజునకంద చేతుమని చెప్పి చిలుకలా గీతములను దాచి వేసినవి.

క్రొత్త కృతుల మరల నాతడు కల్పించినాడు. ఈ మారు కోయిలలాకృతులను మహారాజున కందజేతుమని చెప్పి పుచ్చుకొని ఎక్కడకో లేచిపోయినవి.

తన చిన్ననాటి సహవాసులు తనపై కినుక వహించినట్లాతడు గ్రహించినాడు. చిన్ననాటి సావాసగాండ్రను పూర్తిగా మరచినాడు. లోకమునంతను పూర్తిగా మరచినాడు. తన దృష్టి మహారాజుపై నిల్పి ఎంతో విశ్వాసముతోనాతని దన హృదయ పీఠమున నిల్పుకొన్నాడు.

“ధన దేవతనుపాసించుచున్నావా” యని చిలుకలు గేలిచేసినవి.

“మేము లేని గీతములు గీతములా”యని కోయిలలు పరిహసించినవి.

“వంశగౌరవమును కాపాడుకొనవలెను సుమా” యని స్వప్నములో కవిజనకుడాదేశించినాడు.

కవిరాయని దృష్టిమాత్రము చెదరలేదు. ఒకటే లక్ష్యము అది మహారాజే.

కవిరాయనికి యౌవనము వచ్చినది.

మహారాజునకు దయకలుగలేదు.

౬

ధ్యానముద్రలో కొంతకాలముండి తరువాత మహారాజుపై మరల గీతములు వ్రాయ మొదలు పెట్టినాడు కవిరాయడు.

సొంతముగా వీనిని తాను కృతియీయదలుచుకొన్నాడు మహారాజునకు.

మహారాజు దర్శనము కవిరాయనికి కలుగలేదు. తన వంశీయుల పూర్వకృతులలో గలిపి తన కృతులను గూడ గొంతెత్తిపాడ మొదలు పెట్టినాడు కవిరాయుడు.

మహారాజు కార్యభారమున నుండుటచే ఆతని చెవుల బడలేదివి.

గీతముల సంఖ్య నానాటికి హెచ్చిపోవుచున్నది. పాటలు నిరతము పాడుటచే కవిరాయని గొంతు బొంగురుపోవుచున్నది.

మహారాజు కార్యనిమగ్నుడై యున్నాడు. కవి రాయనికి నిరాశ ఎక్కువగుచున్న కొలది మహా రాజుపై విశ్వాసము అధికము కాజొచ్చినది. తాను రచియించిన గీతముల నన్నింటిని లోకములో ప్రచారార్థమై వదలిపెట్టినాడు కవిరాయడు.

లోకములోని వారు గీతములను పఠించినారు. "మహారాజు హృదయము వజ్రశకల"మన్నారు కొందరు.

"కవిరాయడు ప్రకృతిని వదలిపెట్టిన తరువాత స్తోత్రపాఠములను వ్రాయుచున్నాడు గాని గీతములను వ్రాయుటలేద"న్నారు కొందరు. "సత్కార్యమునకు కవిరాయడు ఫలము నాశించుటతప్ప"న్నారు కొందరు.

"వంశాచారమును వదలించుకొనుట ఎవ్వరితర"మని కొందరన్నారు.

కవిరాయనికి లోకముపై కోపము పుట్టినది. మనస్సున కొకవిగ్రహము కల్పించుకొని తాను రచించిన కృతులనన్నింటిని దానికి కృతి యీయ మొదలు పెట్టినాడు.

ఆ విగ్రహమే మహారాజన్నాడు కవిరాయడు. ఎంతో కాలము గడిచినది.

మహారాజు తల నెరసినది, ఒడలు ముడుతలు పడినవి. రాజ్యభారము నానాటికి అతిశయించు చున్నది.


కవిరాయనికి దృష్టి మందగించినది. చేతులు వణుకుచున్నవి. కంఠము రుద్ధమైనది. గీతములను పాడుచునే యున్నాడు.

మహారాజునకు కవిరాయని పై అనుగ్రహము కలుగలేదు. కవిరాయనికి మహారాజు పై విశ్వాసము తగ్గలేదు!

# 4 వ మజిలీ

## శ్రీ సుభా

## (జ్యోతి మాసపత్రిక, 1963 మార్చి సంచికనుంచి పునర్ముద్రితం)




అలివేలు అందరి లాంటి ఆడపిల్లే. ఎనిమిదో యేట ఎలిమెంటరీ స్కూలు విడిచిపెట్టి హైస్కూల్లో చేరింది. పొడుగ్గా మోకాళ్ళ క్రిందవరకూ వ్రేళ్ళాడే పువ్వుల గౌను పరికిణీ, జాకెట్టుగా విడిపోయింది. మరో నాలుగేళ్లని జీర్ణం చేసుకుంది శరీరం. పరికిణీ, జాకెట్టుల అందాన్ని ముప్పాతిక దాకా డామినేట్ చేస్తూ పువ్వుల కండువా వచ్చి చేరింది. కొత్తగా సింహాసనం యెక్కిన యువరాజు జులంతో.

అసలు పరికిణీ, జాకెట్టూ అభ్యుదయాన్నీ, శాంతినీ ఆశించే ప్రజాస్వామ్య దేశాల్లాంటి వయితే – వాటిమీద గుత్తాధిపత్యం సంపాదించే సామ్రాజ్య దేశాల వెర్రికాంక్ష. యెగబడాలనేదీ – వోణీ గుణం. అందుకే వోణీ పడ్డ తరువాతే ఆడపిల్లల్ని “జాగ్రత్త జాగ్రత్త” అంటూ హెచ్చరిస్తారు. బడుగు దేశాల్లాంటి పెద్దవాళ్ళు.

ఆ రూపంతోనే మరో సంవత్సరానికి కాలేజీలో చేరింది అలివేలు. అలాగే మూడు సంవత్సరాలు జరిగిపోయి అలివేలు ఫోర్త్ యియర్ స్టూడెంట్ గా మారిపోయింది. సగం “లోకాన్ని” అప్పటికే అర్థం చేసుకుంది. “లోకం” ఏమిటని పాఠకులు కళ్ళెర్రజేస్తే – పొరపాటు – లోకానికి బదులు “కాలేజీ” అని చదువుకున్నా అలివేలుకు నష్టం లేదు. ఇక్కడ అర్థానికి ప్రాముఖ్యం గాని మాటల గారడికీ కాదని ఆఖరికి మీరూ నాతో యేకీభవిస్తారు – చూస్తూ వుండండి.

“ఇంక కోకలు కట్టుకోవాలమ్మా నువ్వు” అంది లేడీస్ వెయింటింగ్ రూమ్ లో వో పది గంటల ప్రాంతంలో స్నేహితురాలయిన కాంతం ఆసాంతం అలివేలు స్టడీ చేస్తూ.

“కోక లేమిటి – మోటు మాట – చీరలనక” వరలక్ష్మి అంది.

“చీరలనడం కన్నా కోక లనడమే బావుంటుం” దని నొక్కి వక్కాణించింది తర్డ్ యియర్ శేషారత్నం.

“ఏమిటమ్మా ఆ బాగు?” అన్నారు కొందరు.

“కో – అంటే కోరికల్నీ, క – అనగా కలల్నీ, లు – అంటే లుంగలు చుట్టి పడేసేవి.”

“చాలా చెత్తగా వుంది దండాన్వయం. ఇంకా నయం లుంగీ లనలేదు.” అంది ఉమ – ఖంగున నవ్వి.

“నాకు కోరికలూ లేవు. కలలూ లేవు. నేను కట్టుకోను.”

"ఇంకా చిన్నదాని వనుకుంటున్నావేమో.

"నీకన్నా జూనియర్సుం. మేం కట్టుకోవడం లేదా?"

"మీరు కట్టుకుంటే నేను కట్టుకోవాలని వుందా? అయినా యెందుకు?" అంది కోపం విరజిమ్ముతూ.

"ఎందుకా?" అని కాంతం అలివేలు గుండెల మీద, వీపు మీద చేత్తో తడుముతూ "అమ్మాయిగారు లావెక్కుతున్నారు కాబట్టి" అంది నవ్వేస్తూ.

"పొండి" అలివేలు నవ్వును దాచుకుని విసుగుని సరఫరా చేసింది.

అందరూ నవ్వుకున్నారు.

అక్కడ అందర్నీ పొండని చెప్పి కసురుకున్నా, యింటికి వెళ్ళి నిలువుటద్దం బీరువాలో చూసుకుంటే – శరీరం యెవరిదోలా యెప్పుడూ చూడనిదానిలా కనిపించింది. పెద్ద మార్పే అనుకుంది. గోడమీద ఫస్ట్ యియర్ ఫోటో తీసి, తన్ను చూసుకుని "ఎదిగిపోయాను – నిజమే" అనుకుంది. చూపుడు వేలుకు తీసుకున్న కర్పూరం కాటుక కను కొలకుల్లో దిద్దుకుంటూంటే కళ్ళు కిచకిచ లాడాయి శబ్దం లేకుండా. వేలి స్పర్శ కొత్తగా అనిపించింది.

భోజనం చేసి చదువుకోడం మొదలు పెట్టినా అలివేలు ధ్యాస పుస్తకం మీదకు పోలేదు. నాలుగేళ్ళ చదువు ముగియబోతోంది. ఈ సంవత్సరం అయిన తర్వాత యేమిటి? అన్నయ్యయితే యం. యస్సీ అని నాగపూర్ పారిపోయాడు. పెద్దన్నయ్య యెప్పుడో కరిణీకాన్నీ చేపట్టి జీవితం కొనసాగిస్తున్నాడు. తనేం చెయ్యాలి? అసలు తనెందుకు చదువుతుందో తనకే తెలియదు. అయిష్టంగానే బి. యస్సీ వరకూ రాగలిగిందా? లేకపోతే యిది యాంత్రికంగా జరిగిన అభివృద్ధా?

తల్లీదండ్రీ అలివేలును యింతవరకూ చదివించడానికి కారణం – అలివేలు "అక్కయ్యలా నేను యింట్లో కూర్చోను. చదువుకుంటా" నని దెబ్బలాడ్డం కాదు. పెద్ద పిల్ల అన్నపూర్ణకి చదువు రాలేదు. చిన్నప్పటి నుంచీ పనిపాటల మీదే మక్కువ చూపించేది. పక్కింటి సుబ్బరాజుగారి కూతురు కాంతంతో అలివేలు బడిలోకి వెడుతూండేది. ఆ నడకే, ఆ పాదాలే అలా యెలిమెంటరీ స్కూలు నుంచి హైస్కూలుకు తీసుకు వెళ్ళాయి. ఓ మధ్యాహ్నం పేపర్లో అలివేలు స్కూలు ఫైనల్ ప్యాసయి కూర్చుంది. కుటుంబం ఆ అమ్మాయి గురించి ఆలోచించి "చదువు వస్తోంది కదా. దానికి చెప్పిద్దాం." అని కాలేజీకి పంపడానికి నిశ్చయించుకుని "కాలేజీలో జేరతావటే" అని అడిగితే – శ్రావణ మంగళవారం పేరంటాని కన్నంత తేలిగ్గా "వూ" అనేసింది అలివేలు.

అలివేలుకు జీవితంపట్ల యేవేవో నిశ్చితాభిప్రాయాలు గానీ, ఆశలూ కలలూ అని గానీ లేవు. ఏదో మెకానికల్ గా నడిచే స్వభావం ఆమెది. తన చదువు గురించి యింట్లో, "వర్గ పోరాటాలూ," సత్యాగ్రహాలూ లేవని పెద్ద ఆనందమూ లేదు.

కొంతమంది ఆడపిల్లలు – తల్లినో, తండ్రినో యేడిపించో, తాము యేడిచో పంతం కొద్దీ చదువు సాగిస్తారు. మరి కొందరు యింట్లో వాళ్ళు వద్దన్న మూలంగా మాట నెగ్గించుకోవడం కోసం మొండిగా ప్రవేశిస్తారు కాలేజీల్లోకి. అంటే చదువు మీద అభిమానం కన్నా, కాలేజీలో చదువుకున్నామనే పేరు కోసం. (ఈ రకం అమ్మాయిలు – యీ కథ చదువుతూన్నట్టయితే పుస్తకం విసిరికొట్టద్దని విన్నపం. మరో కథ చదువుకోండి. ఆ కోపం తగ్గిన తరువాతే తిరిగి, యీ పేజీ తెరవండి) ఇంకొందరు చదువు వస్తుంది కదా అని చదివి వాళ్ళకి తెలియకుండానే మేధావు లయిపోతారు. ఆఖరి రకం అమ్మాయిలు పాపం – "యెక్కడ ఆనకట్ట పడితే (ఫెయిల్) అక్కడే మానచ్చు – యెలాగూ, పెళ్ళనీ, చాకిరీ అనీ – సంసార సముద్రంలోకి ప్రవహించవలసిన వాళ్ళమే. పుట్టింటిలోనయినా సుఖపడదాం" అని మీమాంస చేసుకుని జేరతారు. (ఈ అమ్మాయిలు 'చదువుకున్నానని గర్వం లేదు. ఇంటి పన్లు కూడా చేస్తుంది" అన్న బిరుదులు గడించేస్తూంటారుట).

ఈ పైన వ్రాసిన వూహలు (బ్రాకెట్లు మినహా) అలివేలు వని భావించాలి. అలా ఆలోచించుకుంటున్న అలివేలుకు ఆశ్చర్యంతో పాటు చదువుమీద విరక్తి కూడా పుట్టుకొచ్చింది. తన చదువు గురించి యెంత డబ్బు ఖర్చవుతున్నదీ తెలియంది కాదు. బి. యస్సీ అయిన తర్వాత వుద్యోగం చేస్తే అమ్మా నాన్నా వప్పుకుంటారు, ఆ తరువాత – యేముంది?

గోడమీద యెవరో టెలివిజన్ సెట్ ద్వారా ప్రొజెక్ట్ చేసిన కొన్ని చిత్రాలు ఆమెకు వుచితంగా కనిపిస్తున్నాయి ... ఉద్యోగం మీద వుండుండి విరక్తి. ఇంతలో తెలియకుండానే కలలాంటి పెళ్ళి, ఉపన్యాసాలిచ్చే భర్త. పనిలో సతమత మవుతూ చీత్కారాలు చేసే అత్తగారు. వాలు కుర్చీలో పడుకుని చుట్ట కాలుస్తూ ధూమ ముద్రలో మునిగిన మామగారు, ఆఫీసులో ప్రేమ చూపులూ, ప్రేమ లేఖలూ బట్వాడా చేసే కుర్చీలు.

'అక్కడా జయించి యింకా దూరంగా జరిగితే' – ఇటు తిరిగి పడుతుంది .. ఇటు వైపు కూడా గోడ మీద ఆలోచనలు నవ్వుతున్నాయి. "కేర్" మంటూ యెవరో యేడుస్తున్నారు .. చుట్టూ చూసింది .. ఎవరూ లేరు. మంచం క్రింద పిల్లిపిల్ల నిద్రపోతోంది తప్ప అరవడంలేదు .. ఈ మాయ ఏమిటా అనుకుని తిరిగి చూసింది. గోడమీద సిగ చుట్టుకుని యెవరో తరుణి చంటాడిని యెత్తుకుని ముద్దాడుతోంది ... ఉయ్యాల్లోంచి చటుక్కున నాలుగేళ్ళ వెధవాయి వొకడు లేచి 'అమ్మా పాలు' అంటున్నాడు...

అలివేలు కళ్లు మూసుకుని "ఆ బొమ్మ నేను కాదు" అనుకుంది. వెంటనే నవ్వు సమయం చిక్కిన దొంగలా బయటకు వచ్చేసింది అందమైన యెర్రని పెదాల్ని చూసి భయపడి.

"అయితే యిన్ని మార్పులూ, తను వూహించకుండానే జరిగి తీరతాయన్న మాట" అనుకుంది ఆశ్చర్యంగా. "అయితే మాత్రం కళ్ళ ముందు యీ చిత్రణ యేమిటి – నేనేమన్నా వుబలాట పడ్డానా. యీ రకరకాల వూహా చిత్రాల్ని చూస్తానని" అనుకుని, ఆఖరిసారిగా "యెవరు చెప్మా..యీ రోజు నన్ను కదిపింది" అని ప్రశ్నించుకుంటే జవాబుగా కాంతం కన్పించింది.

"దొంగ రాస్కెల్ – అదే. రేపు చెబుతాను దాని పని" అనుకుని బోర్లా పడుకుంది అలివేలు.

పూర్వంలో గోడమీద కన్పించిన బొమ్మ తనది కాదని – అలివేలు అనుకుంది కదూ. అయితే మీరూ అలాగే అనుకున్నారేమిటి? నాకు తెలుసు మీ రలా పొరవడరని. రచయిత యెక్కడ కళ్ళల్లో కారం జల్లుతాడో అని – అక్షరాక్షరాన్నీ లక్షల నేత్రాలతో తిలకించడం కోసం మీరు దేవేంద్రుడి శరీరంలో నేత్రాల్ని అనవసరంగా అప్పుతెచ్చుకుని వుంటారు.

అలివేలు బిన్నీ కంపెనీవారి రగ్గునిండుగా కప్పుకుంటూ యీ గొడవంతా కారణం కాంతం అని దూషించింది కదూ ... నిజం యిది.

అలివేలు క్లాసులో వో అబ్బాయి వున్నాడు .. అతని పేరూ వూరూ నాకూ తెలియదు, అతని గురించి వొక్క మాటలో చెప్పాలంటే వుత్తమా మనిషి ... అంత వుత్తమా పురుషుడూ అలివేలుని చూడగానే చేప పిల్లలా కొట్టుకు లాగాడు. ఆ అమ్మాయి గురించిన పూర్తి వివరాలు అతనికి తెలుసు ... పెళ్ళి వద్దని బ్రహ్మచారిగా జీవించాలనేది అతని కోరిక కాదు ... కాబట్టి కట్టే తాళేదో ఆ అమ్మాయి మెళ్ళో కడితే తను సుఖపడగలననే నిర్ణయానికొచ్చాడు. అది అతని దృష్ట్యా ఉత్కృష్టమైన కోరిక. అందుకే ఆమె కోసం అతను రకరకాలుగా ప్రయత్నాలు చేసేవాడు. ఉత్తరం వ్రాయబోయి అపార్థం చేసుకుంటుందని మానేశాడు. ఏ పొన్నమామిడి చెట్టుకిందో మాట్లాడాలనే ఊహ ఊహగానే మిగిలిపోయింది. అన్నీ కలలో నిజమయ్యేవి .. నిజం కలలో ఊహించుకోవడం. అది ఫలవంతం అయ్యేవరకే ... ఆ తరువాత యీ నిజం అయిన కల గురించి వాస్తవంలో అంతగా తలపే వుండదు. మననెప్పుడూ కొత్త పుష్పాలన్నీ, కొత్త పరిమళాల్నీ అన్వేషిస్తుంది ... అతను, అలివేలూ యండ్ మిత్ర బృందానికి చాలా సార్లు కనిపించాడు.

ఆ అమ్మాయిలంతా కొద్ది రోజులు ఎవరో లెమ్మని పట్టించుకోలేదు. ఓ రోజు “ఇదేమిటి యెప్పుడూ కనిపిస్తాడు?” అనుకున్నారు. మర్నాడు, “మనలో ఎవరి కోసమో యిలా తిరుగుతున్నా”డని నవ్వుకున్నారు. కొన్ని రోజుల అనంతరం “ఎవరొకోసం” అని ఒకళ్ళ నొకళ్ళు పరీక్ష చేసుకున్నారు. ఎవరిలోనూ “రెస్పాన్స్” వుండేది కాదు.

“ఆ అబ్బాయిని యెరుగుదువా?” అంది రంజని.

“ఏ అబ్బాయి?”

“దూరంగా – అదుగో – ఆ అబ్బాయి”

“మా క్లాస్ మేట్” అంది ఫైనలియర్ శారద.

“మా పక్కిల్లే” అంది పద్మ నెమ్మదిగా.

“పాపం” అన్నారు ఆ స్వరంలో గర్వం కనుపించకపోయేసరికి.

‘“ఊరుకోండర్రా” కాంతం సైడ్ చేసింది పద్మని.

వారం పదిరోజులకు ఆ అమ్మాయిలంతా వంతుల ప్రకారం అతని చూపుల్ని ఎక్స్ రేలో పరీక్ష చేసేశాడు. అందరూ ఆ చూపులు అలివేలు మీద పడుతున్నాయి అని ఓ సుప్రభాతాన మీటింగ్ లో తేల్చేశారు. స్త్రీ కంటిలో అంత నేర్పు వుంది. అవి చూస్తున్నట్టే – వుండవు; లోకాన్ని చదువుతాయి. అనుమానించినట్టే కన్పించవు; శరీరాన్ని నఖ శిఖ పరీక్ష చేస్తాయి. రెండు నల్ల లోకాల మధ్య మెరిసే నక్షత్రాల్లాంటి ఆ రెండు చుక్కలే ప్రపంచానికి కాంతి నివ్వగలవు. సప్తసముద్రాల అలజడిలో జడిపించనూగలవు.

“నన్ను కాదు. నాకేసి చూడ్డం యేమిటి? అంతా గోల” అంది అలివేలు.

“రాణీగారిలో యేం చూశాడో మరి? మా కేం తెలుసు?”

“పోవే”

“మేం పోతే వంటరిగా చూడవచ్చునా?”

అలా స్నేహితురాళ్ళు ఆమె మనసును చిలికి వదలి పెట్టిన తరువాత పాల సముద్రంలాంటి ఆమె హృదయం చిన్న చిన్న ఆలోచనల కెరటాల్ని రేపుకుంటూ సవ్వడి చెయ్యడం ప్రారంభించింది. అతను చూస్తున్నాడనే తలపు వచ్చినప్పుడల్లా చెమటలు పట్టేవి. అతను చూడకుండా వుంటే బావుణ్ణు అనిపించేది. అందుకే గమనించడం ఆగిందో, సాగిందోనని ఆ అబ్బాయిని చూస్తే అతని రెండు నేత్రాలూ డివైదర్ గా సమన్వయం చెంది, తనని కేంద్రంగా – ఆశల (ఇంద్ర) చాపాలు, కలల (ఇతి) వృత్తాలూ గీస్తూన్నట్టు, రకరకాలుగా చిత్ర విచిత్రాలయిన త్రివర్ణ చిత్రాలు చిత్రిస్తోన్నట్టు ఒక టెక్నికల్ దృశ్యం.

“ఇదేం ఖర్మ బాబూ నాకు” అనుకుంది రెండు మూడు సందర్భాలలో – తన్ని తను గుర్తించలేక పాపం అలివేలు.

ఆ తరువాత ఆ మాటలు కూడా అనుకోబుద్ధి వేసింది కాదు. “ఈ యేడాది అయిపోతే చాలు” అనుకుంది నిద్ర పట్టకపోవడంతో విసుగుపుట్టి. (ఈ మాట ఆమె అనుకుని చాలా సేపయింది.) “ఆ తరువాత యేం చేస్తావు అలివేలూ?” నాలుగు గోడలూ, కిటికీలూ, దేవుడిపటాలూ, కుర్చీ, డ్రాయరూ, నోట్, పెన్నూ, ఆఖరికి మంచం, పరుపూ రగ్గులోంచి కుదిపి అడిగాయి వొక్కుమ్మడిగా ఆమెను.

“ఇంకా పైకి చదువుకుంటాను”

“మరి చదువయిపోతే చాలు బాబూ అని యెందుకన్నావు?”

“వొట్టినే” కోపంగా అని తిరిగి “మీకు చెప్పాలేమిటి యివన్నీ?” అంది.

"నీ మాటలు రాని స్నేహితులం కదా. అడిగితే తప్పా? అవున్లే. కాంతం, ఉమా, పద్మా గిల్లీ వీపు వాయించీ దబాయిస్తే చెబుతావు."

"హాయిగా యింట్లో వుండచ్చు."

"ఇప్పుడు కష్టంగా వుందా?"

"అవును, చదవలేక, చదివినా పాసయిందాకా భయం."

ఈ లోపున అల్లర్లు, వాళ్లూ, వీళ్లూ పేర్లు పెట్టడం.

చదువయిపోతే ఎంత తేలిగ్గా వుంటుంది? సంతోషంతో సందడించిన సంగీతపు లహరిలా నిట్టూర్పు వీచింది స్వరంలో.

"వూ. తరువాత"

"అంతే"

"ఇంకా వుంది"

జవాబు దొరకలేదు ... నిజానికి వెదకలేదు అలివేలు.

"సిగ్గుపడకు, నీ లోపలి నిజాన్ని నేను. నీ నీడని." అందొక గోడ.

సరియైన జవాబు చెబుదామనుకుంటున్న నోటిని మెదడు అడ్డుకుని మరో గాడిలో మాట్లాడించింది..

"అవును, అతనూ చాలా మంది కూడా" నా వైపే చూస్తున్నారు...ముఖ్యంగా అతని చూపులేమిటి — బొత్తిగా బుగ్గలమీద గిలిగింతలు పెడతాయి..."

"అందుకని చదువు ఆపేసి యింట్లో వుండాలనుకుంటున్నావా?" అచేతన పదార్థాలైనా మనస్తత్వం తెలుకోవడంకోసం అన్నట్టుగా తప్పుదారి పట్టించే ప్రశ్న వేశాయి...

"అవును" అనేసింది.

"ఇంట్లో వుంటే అతని చూపులు నీకు తగలవని నమ్మకం యేమిటి?"

"ఇవేం స్పేస్ రాడార్సా-యేమిటి?"

"అంతకన్నా బలవత్తరమైనవి. నువ్వు నడిచే పాదం క్రింద మెత్తని ముల్లులా — పడుకునే పక్కమీద కుట్టడం చేతకాని నల్లచీమ ప్రయాణంలా — ఇలా రకరకాలుగా అలజడి తెస్తాయి జాగ్రత్త."

"మరేం చెయ్యాలి?" నాలిక కరుచుకుంది.

ఆ వస్తువులన్నీ వికవిక నవ్వ సాగాయి ... ఆ నవ్వులో అనుభవం వుంది. కనీ కనిపించని పూల దారులున్నాయి.

వెన్నెల వాడకు తీసుకుపోయే మనోరథ రథాల ఆతుత వుంది.

వివేకం, నిండుతనం కూడా వున్నాయి.

"అందుకే. వో చిన్నారి చిలుకా!..."

ఇక వాటిని మాట్లాడనివ్వకుండా అలివేలు "ఛా.పొండి" అని బూరుగు దూది తలగడలో తలదూర్చింది...

ఓ రోజు భోజనం చేసి నిలువుటద్దం బీరువా తెరిచింది మడత బట్టలకోసం అలివేలు. చేతికి చీర వచ్చింది ... అది అన్నపూర్ణది. నైలాన్ పువ్వు లద్దిన చీర. అది వదిలేసి పరికిణీ కండువా తీసుకోబోతే చేతికి ఆ చీర అంటుకుపోయింది "నన్ను కట్టుకోవూ" అన్నట్టు.

పోనీ కట్టుకుందాం అని నిశ్చయించుకుని అదే తీసుకుంది. తీరా కట్టుకోవడం ప్రారంభిస్తే, కాళ్ళూ, నడుంచుట్టూ బిగించినట్టుగా వుంది.. తిరిగి కట్టుకుంటే కుచ్చెళ్లు అమరలేదు. పమిట యెంత కొలిచివేసుకున్నా జడని సగం దాటలేదు. గుండెలకి, మెడకి – చీర ఆనక గాలి కెగిరిన పటంలా అయిపోతోంది .. ఆఖరికి వోమాదిరిగా కట్టుకుంది అరగంట ప్రయత్నం చేసి ... అద్దంలో చూసుకుంటే పెద్దరికం నమ్రతగా నిల్చుంది .. నవ్వు కూడా వచ్చింది .. తలుపు తోసుకుని అన్నపూర్ణ వచ్చింది ..

"ఇదేమిటే"

నిజంగా సిగ్గుపడిపోయింది అలివేలు.

"వోస్ .. అంత సిగ్గెందుకు – ఆ కట్టుకోవడమేమిటి .. రా ఇలా ... " అన్నపూర్ణ ఫైనల్ టచస్ యిచ్చింది ఆ కట్టడానికి.

"చాలా బావున్నావే – చీర కట్టుకుంటే"

"మొదటిసారి చీర కట్టుకుంటే సిగ్గేస్తుందేం అక్కయ్యా?" సంశయం తీర్చుకోవాలని అడిగింది అలివేలు.

"నీకు తెలియని పెద్దరికం – నీ లో దాగింది కన్పించడం మూలంగానే"

"సరిగ్గా అడుగులు కూడా పడ్డం లేదు. పడిపోతానని భయంగా వుంది"

"అప్పుడే అలా అనుకుంటే యెలా. యీ చీరలతోనే – నీ జీవితం అంతా కొత్త దారులు తొక్కడం ప్రారంభిస్తుంది. ఇవాళ అమ్మాయిగారు, నాల్గో మజిలీ ప్రారంభించారు. ఆడవాళ్లు అడ్డదిడ్డంగా యెగురుతూ నడవకుండా యిదో బంధం తెలుసా?..."

అలివేలు అదో మాదిరిగా అన్నపూర్ణని చూసి నవ్వేసి అంది:

"ఈ రోజు నుంచి నాలో వున్న చిలిపి తనం, అల్లరీ అన్నీ పోగొట్టుకుని కొంచెం హుందాగా, యెదిగిన మనిషిగా నడుస్తున్నానని బోర్డు కట్టుకోవడం అన్నమాట ..."

"ఆ" అంది.

"ఇన్ని విషయాలు వున్నాయా యీ చీరలో ? అయితే అల్లరి చెయ్యకుండా అమ్మలా, నీలా వుండాలా? నేను కట్టుకోను, విప్పేస్తానని చీర" అంది గతం అంతా అమృతమయంగా – దాని యెడబాటుని సహించలేని దానిలా వూహించుకుంటూ.

"రేపైనా కట్టుకోవాలిగా!" అంది అన్నపూర్ణ యింతలో భర్త పిలుపు వినిపించి వెళ్ళిపోతూ.

అలివేలు హాల్లోకి వచ్చింది. ఇదివరకు పరికిణీలోంచి విసవిసా పడే అడుగులు అడ్డుకుంటోన్నట్టు తూచీ పడుతున్నాయి.

హాల్లో వున్న తల్లి కూతుర్ని చూసి

"ఇదేమిటే !" అంది.

"చీర" అంది నవ్వుతూ.

"పెద్దదానిలా చీరలేమిటి. దిష్టి కూడానూ, విప్పెయ్యి."

"పెద్దదాన్ని కానామరి" అంది నవ్వుతూ అలివేలు.

తండ్రి అరుగుమీద కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు .. ఇదే అదననుకొని వీధి గుమ్మాన్ని దాటేసింది, దాటబోయింది...!!

"ఎక్కడికే అన్నపూర్ణా?"

"నేను నాన్నా, కాలేజీకి" అంది సమాధానం వినకుండా వెళ్ళిపోతూ.

ఆయన నోసారి తేరిపార చూసి నవ్వడం ఆ అమ్మాయి చూసి వుంటే మరింత సిగ్గు పడిపోయేది.

ఇంటి దగ్గరకన్నా యెక్కువ కలకలం రేగింది కాలేజీ వెయిటింగ్ రూమ్ లో , అలివేలు అప్పుడే రోదసీ యాత్ర ముగించుకు వచ్చినట్టు మిగతా అమ్మాయిలంతా ఆమెను వింతగా చూడ్డం మొదలుపెట్టారు.

ఆఖరిని అందరూ హో హో " అంటూ చుట్టు ముట్టేశారు.

"అబ్బ – ఎంత అందంగా వున్నావే" కాంతం కౌగిలించుకుంది ...

చీర కట్టుకోడంలో అనుభవం వున్న అమ్మాయిలు ఆ చీరనీ, అలివేల్నీ రకరకాలుగా తీర్చిదిద్దారు.

అలివేలు అంతసేపూ మౌనంగానే వుంది.

"మాట్లాడవే బొమ్మా!"

"మా అక్కయ్య చీర కట్టుకుంటే అల్లరి చెయ్యకూడదదంది తెలుసా!"

"బావుంది – మీ అక్కయ్యకు పి. హెచ్. డి. యివ్వచ్చు."

క్లాసులో సగం మంది విద్యార్థులు చూపులకు ఆ రోజు అలివేలు అయస్కాంతం అయింది. సముద్రంలో దారి తెలియక తిరిగే 'అతనికి' ఆమె కేవలం దిక్సూచి అయింది.

ఆ రోజు రాత్రితో ఆంధ్రాభ్యుదయ వార్షికోత్సవాలు అయిపోతాయి... శాటిన్ ఎర్రపువ్వు బాడ్జి ధరించి అలివేలు తిరుగుతూంటే నూటికి నూరు పాళ్ళు సంధ్యాకాంతిలా, దీపశిఖలా అనిపించింది చాలా మందికి. వాలంటీర్లలో అతనూ వున్నాడు ... అతనిలో ఆపేక్ష వెర్రి పూవులు పూసింది... కోరికలు ఆనందాన్ని చాచుకుంటున్నాయి శరీరం నిండుగా ..

ఊళ్ళోంచి వచ్చిన ఆడవాళ్ళని కంట్రోల్ చేస్తూ అలివేలు కెమిస్ట్రీ హాల్ దగ్గర నుంచుంది.

అతన్ని చూసి అతనే అనుకుంది. ఆ రోజు మొదటిసారి చీర కట్టుకున్నానని గుర్తుకు వచ్చి ఆమె కుదించుకుపోయింది ...

"మీరు" అన్నాడు అతను దగ్గరగా వచ్చి.

"నేను" అంది మామూలుగా.

"చీర కట్టుకుంటే చాలా బావున్నారండీ. మీరు"

"నిజమా" అంది కొంటెగా.

"ఆ"

వెంటనే అనేసింది "మీకేం పని లేదా? నే యెలా వుంటే మీకెందుకు" కోపం కూడా ఆ స్వరంలో వుంది...

"నేనూ" అతను వూహించలేదు ఆ అమ్మాయి మాటలు.

"ప్లీజ్ – వెళ్ళండి– ఇలా యెప్పుడూమాట్లాడొద్దు." జనంలో కలిసిపోయింది ...

"ఇలా బిహేవ్ చేశానేమిటి .. నవ్వుతూనే జవాబు చెబితే పోయిందేముం దింతలో..." చీర కట్టుకున్న మూలంగా అని వుంటానని అనుకోవాలనిపించింది.

ఇంటికి వచ్చింది .. ఆలోచనలు మాత్రం అతన్ని కొంగుకు ముడివేసి కూడా తీసుకు వచ్చాయి.

వెళ్ళి అద్దం ముందు నుంచుంది ... దూరంగా బెడ్ లైట్ కాంతి గదిని నింపలేక పోతోంది...

రెండు వెచ్చని హస్తాలు – వో బలమైన చప్టాలాంటి ఛాతీ ఆమెను కౌగిలించుకున్నాయి...

భయపడింది ... విదుల్చుకుంటూ 'యెవరూ' అంది.

అతను నోరు నొక్కినా కళ్ళు బావగారిని చూపించాయి అద్దంలో.

"ఛీ – వదులు బావా – యేమిటిది" కంగారుగా ఖైదులోంచి బయటపడింది ...

"చీర కట్టుకుంటే నువ్వు చాలా బావున్నావు మరదలా" అన్నాడు కొంటెగా.

"అక్కయ్యతో చెప్తాను" అంది.

ఇంతలో ఆ గదిలోకి అన్నపూర్ణ వచ్చేసింది...

"వేళాకోళంగా మంచినీళ్ళు అడిగితే, నీతో చెప్తానని బెదిరిస్తోంది మీ చెల్లాయి చూడు..." అన్నాడు వెళ్ళిపోతూ అతను...

అన్నపూర్ణ చిన్నదేం కాదు. అందుకే గ్రహించగలిగింది. వెంటనే వూహించ గలిగింది.

"అక్కయ్యా" వెళ్ళి కౌగిలించుకుంది.

"యేమిటే"

"నేను చీర కట్టుకోనే" అనేసింది. ఆ రోజు అనుభవాన్ని విప్పి చెప్పలేకా, మనసులో దాచుకోలేకా.

"ఏం ? అనుభవం చెడుగా వుందనా?"

"అవునక్కయ్యా" అలివేలు కాలేజీలో జరిగిన సంగతి చెప్పింది. బావ సంగతి చెప్పకూడదనికుంది. కాని జరిగింది అన్నపూర్ణే చెప్పేసింది. ఆఖరిగా అంది మరిపిస్తూ!

"చూశావా – నేను చెప్పలేదూ. హుందాగా జీవిస్తానని – మర్యాదగా బ్రతుకుతానని నిరూపించుకున్నావు రెండు చోట్ల – దీనికేమంటావు?"

తేలికపడ్డ మనస్సుతో అంది అలివేలు.

"ఇదంతా చీర ప్రభావం అంటావా?"

"కాకపోవచ్చు. కాని, ఈ అనుభవంతో నువ్వు గుణపాఠం నేర్చుకోవచ్చు. నీ మామూలు అల్లరిని, చిలిపితనాన్ని మరిచిపోయావు. దానికి తార్కాణం యేమిటో తెలుసా? మా ఆయన చేసిన పనికి అల్లరి చేసి అగౌరవపరచలేదు. నా దగ్గర కూడా నేను బాధపడతానని దాచావు. అదే నిన్నటి రోజయితే అల్లరి చేసి అరిచేదానివి. కాలేజీలో కూడా ఆ అబ్బాయికి కొంటె జవాబులు చెప్పే దానివి." అంది.

నిజమే ... అతని పట్ల ప్రవర్తన, బావ యెడల నిర్లిప్తత రెండూ కూడా తనకు తెలియకుండా వ్యతిరేకంగానే జరిగాయి .. అదే ఆమెకు అంతవరకూ అర్థం కాలేదు.

"నాల్గో మజిలీ ఎలా మొదలయిందో చూశావా చెల్లాయ్? అందరి అనుభవాలూ ఇలాగే వుండకపోవచ్చు. కాని స్త్రీకి దక్కే గౌరవానికి, ప్రతిష్ఠకి బంగారు వన్నె తెచ్చే ఘడియలు యీ మజిలీలోనే యెదురువుతాయి..."

కొన్ని నెలలు గడిచిపోయిన తరువాత – అమ్మా, నాన్నా, అన్నపూర్ణా, పెద్దన్నయ్యా వుమ్మడిగా నవ్వుకోడం వినిపించింది అలివేలుకు. వెళ్ళి అనగా, ఆఖరి మాటలుగా "పెళ్ళి చూపులు" అనేవి ఆమెను ఢీ కొట్టాయి ... గుండె చేత్తో పట్టుకుని గప్ చుప్ గా వెళ్ళి మంచం మీద వాలిపోయింది అలివేలు. గోడమీద ఫోటోలో కాన్వొకేషన్ దుస్తుల్లో వున్న అలివేలు బి. యస్సీ. అడిగింది నవ్వుతూ! "ఎవరి కా పెళ్ళి చూపులు?" అని.

"ఫో, కొంటి పిల్లా" అంది ఈ అలివేలు.

"అలివేలు యెవర్ని పెళ్ళాడింది? అతన్నే పెళ్ళి చేసుకుందా? లేక ఎవర్నేనా పెళ్ళి చేసుకుందా? నాల్గో మజిలీ ఎలా సాగుతోంది?" అని రకరకాలుగా ప్రశ్నించేవారికి నేనేమీ సమాధానం చెప్పదలచుకోలేదు .. మరో మజిలీ కోసం మీరే యెదురు చూడండి. ఆ వోపికా లేకపోతే. మీకు కనిపించే జంటల్లోనే అలివేలూ, భర్తా వుంటారు .. ఏ పార్కులోనో, బస్ లోనో, సినిమా హాల్లోనో వుండి మీరు గుర్తు పడతారని మొహాలు పక్కకి తిప్పుకుని నవ్వుకుంటూంటారు. ఎగ్జిబిషన్స్ లోనో, రవీంద్ర భారతిలోనో, రసికరంజనీ సభలోనో చుట్టాల పెళ్ళిలోనో మీకు తారసపడచ్చు. వారిని యీసారి వెంటనే అడిగెయ్యండి, మర్చేపోయాను. ఇలస్ట్రేటెడ్ వీక్లీలో "వెడ్డింగ్స్" కాలమ్ లో కూడా మీకు దర్శనమివ్వచ్చు. అదీకాకపోతే ఆఖరి క్లూ (హా!) మీరే అయి వుండచ్చు మీరు వెదికే జంట. అప్పుడు మీరు ఆశ్చర్యం, ఆనందం కూడా పొందుతారు. ఈ దాగిన నిజాన్ని ఇంతకాలం గుర్తించలేకపోయినందుకు.

# భావి వాంఛ

## పినిశెట్టి శ్రీరామ్మూర్తి

## (కథాంజలి , 1940 ఆగస్టు సంచికనుంచి పునర్ముద్రితం)

ఎన్ని శాస్త్రాలు వల్లిస్తేనేం, ఎంత తెలివయిన వాడైతేనేం కన్య జీవితాన్ని అధోగతి పాలు చేస్తూ స్వార్థం కోసం సంచారం చేస్తూ, సంఘాచార సంపన్నునంటూ సంకలెగుర వేసుక తిరగడం. ఉన్న భూమిని వృద్ధి చేసుకుంటూ సత్యభామలాంటి చక్కని రెండో పెళ్ళి పెళ్ళాంతో సంతోషంగా కాలం గడుపుకుంటూ నాకేసయినా చూసేవాడు కాదు మానాన్న. కన్నకడుపు కాబట్టి నేను అమాయకురాలిగా ఉన్నప్పటికీ ఆనంద సందిళ్ళలో నన్నదిమి ముద్దెట్టుకునేది మా యమ్మ... యీ మారేడు తల్లో మాయా నెపాల్తో నన్ను మరీ మరీ సాధించుక తినేది. ఎదురుగా చూస్తూ పెళ్ళాం మాటలు ప్రేమ సుధారసంలా ఎంచుకొని, పైగా నన్ను తిడుతూయుండే వాడు మా నాన్న... మారు పెళ్ళి చేసుకొన్న కొందరు మహనీయులు భార్య చేతుల్లో కీలుబొమ్మల్లా తయారవుతారు కావోసు.. నా చిన్నతనాన్నే కళ్ళల్లో కారంగొట్టి పెళ్ళిచేయడమా? తీరా ప్రపంచ ఊహల్లో పడేటప్పటికల్లా పెళ్ళి చేసుకున్న వారు పరలోకాన్కి చేరుకోవడమా? అన్నెం పున్నెం తెలీని నాలాంటి అందగత్తెల పని అంతేకదూ ? అందమేమిటి ? అందం లేకపోవడ మేమిటి? యీ నాలాంటి కన్యల బ్రతుకంతే ? ఎవరూ సమాధానం చెప్పేవారూ.. విధం చెడని ఆడాళ్ళకు మళ్ళీ పెళ్ళి చేస్తే తప్పా ? అనాచారంగా అన్యాయంగా అసహ్యంగా మగవాళ్ళు ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా తప్పులేదూ ?.... అవును సంఘ సంస్కర్తలు, మగ మహారాజులు వారికేం.

మా యింటెదురుగా శాస్త్రి గారు దాము యిల్లుంది. వాళ్ళ దామూ నేనూ అయిదో క్లాసు వరకూ ఒక్క స్కూల్లోనే చదువుకున్నాం. చాలా శాంత స్వభావం కలవాడని అతని నడవడికలే చెబుతాయి. మేం చదువుకొనే సమయంలో కూడా చాలా తెలివిగా మాష్టర్లకు సమాధానం యిస్తూ వాళ్ళ ప్రేమకు పాత్రుడయ్యేవాడు. అతని సద్గుణాల్తో బాటు అందం కూడా అభివృద్ధి జెందుతూంది. వాళ్ళ నాయన ధనం కలాడు కనుక బి.ఏ. పాసయ్యేంత వరకూ చదువు చెప్పించాడు. ఉద్యోగం మాత్రం దొరక్క పోవడం వల్ల దాము యీ మధ్య యింటిదగ్గరనే ఉంటున్నాడు. నేనెందుకైనా మా వీధి అరుగుమీద కొస్తే నాకేసి జాలిగా చూస్తూ పెదిం విప్పబోయేవాడు మాటాడాన్కి. నాకు మాత్రం చాలా భయం వేసి యింట్లోకి వచ్చేసే దాన్ని అతని మనోభావం బాగా అవగాహన చేసుకోగల్గాను. నానాటికీ అతని విరాజిల్లే నేత్రాల్లోంచి వచ్చే ప్రేమ వీచికలు నా హృదయంలో నాటుక పోయాయి.

★ ★ ★

ఆ రోజున మనశ్శాంతనే దాన్కి నా హృదయంలో తావులేదు. కారణం ఏమిటో అర్థం చేసుకోడాన్కి నా మట్టు నాకు గ్రాహ్యం కావడం లేదు. అటు యిటూ తిరిగాను. అల్లిబిల్లిగా అల్లుకొన్న మాలతీ తీగ చూచేటప్పటికల్లా నా మనో సాగరం 'తహతహ' లాడింది. ప్రకృతిలో ఉండే ప్రతి వస్తువునీ పరిపరివిధాల విమర్శించా ఏలా తర్కించినా నా మనో బాధకు శాంతి అనేది శూన్యం. యింకేమీ నాకు తోచలే, తిన్నగా వీధరుగు మీదికి పోయి నిలబడ్డా ఎదురుగా దాము ప్రత్యక్షమయ్యాడు... ఏదో పేపరు చూస్తూ యున్నాడు. నేను కొద్దిగా కాలుతో ధ్వని చేశా. ప్రక్క వాటుగా నాకేసి చూశాడు. శాంతి యుతంగా యుండే చల్లని చూపుల వల్ల నా మనస్సులో ఉండే కలవరం కొంత శాంతించింది. 'చిలిబిలా' చిందులాడే ఆ పెదాల చిరునవ్వు నాకు స్వర్గధామంలా తోచింది. నా నేత్రాల కోరిక చూసినా యింకా చూడాలనే ఉంది. నా జంకు వాంఛా ఎవరయినా చూడబోతారు యింటోకి నడు అన్నట్టుంది యిప్పుడెట్లా...

"లీలా... యిలారా..."

అనే మధురధ్వని నా చెవులకు శోకింది... "కలా..." అనుకున్నా మళ్ళా అదే పిలుపు... "ఎవరా?..." అని ఆశ్చర్యంగా చూశాను. అర్థం లేని ఆనందం నన్నావరించింది. ఆ పిలుపులో వాణి ప్రతిధ్వనిస్తుంది. 'చటుక్కున' లేచి తన వీధరుగు మీద దాము నిలబడ్డాడు. అతడే పిల్చాడు అనుకున్నా అప్పుడు.

యీ సమస్య ఎలా పరిష్కారం కావడం భావి వాంఛకు భగవానుల్లా తోస్తున్నాడు. ఎన్నడూ నన్ను ఆహ్వానించని ఆ చక్కని పిలుపును ఏలా తిరస్కరించనూ? వెళ్ళాలి తప్పదు.. అయ్యో! అన్నింటికీ అప్పట్లో ఆధారంగా కనుపించే సవతి తల్లి చూస్తే చంపేయదూ?... చంపినా యిష్టమే లేని పోని అపనింద నా మీద త్రోస్తే నే భరించగలనూ?... వెళ్ళూ వెళ్ళూ వద్దు... వద్దు... అంతరాత్మ ఆ మాయా మనసు నాలో అట్టహాస కోలాహాలాన్ని రేకెత్తిస్తున్నాయి.

"ఏం... లీలా... నీకంత భయం. పిలిస్తే రాకూడదూ..." అన్నాడు ఆదరణగా దాము.

"... రాకేం.. కాని.. మా.." అంటూ తలవంచుకొని ఎదురకు ఒక్క పాదం వేశా "సిగ్గూ__ బొగ్గూ__ లేదటే; వెధవముండవు. వీధిలో పడి వయసొచ్చిన కుఱ్ఱాళ్ళతో మాట్లాడుతావూ .. యింట్లోకి రావేం... తలగొరిగేస్తేనె గాని నీ రోగం కుదరదు. మీ నాన్న రానియ్యి.." రయ్యి మంటూ రణగొణ ధ్వనితో నా దగ్గరకు మా సవతి తల్లి వస్తే అట్టే నా ప్రాణాలు పోయినట్టయింది. దాము నిర్ఘాంత పడి నా అభాగ్య జీవితాన్ని ఆశ్చర్యపోతూ అలాగె నిలబడి పోయాడు. ఎదురు కేసిన పాదం వెనక్కేసుకున్నా నా కళ్ళలోంచి ధారగా కన్నీటి జలం ప్రవహించింది. అదే దాము పాదార్పితం అనుకున్నా స్వాతంత్రము లేని జీవశ్చవం లాంటి నా జన్మ వృధా...

★ ★ ★

ఆ రాత్రి....

యిద్దరూ కలసి ఏకటాకీని అర్ధరాత్రం వరకూ అనరాని మాట్లు అంటూంటే అన్నింటికీ వోర్చుకున్నా. పెళ్ళాం మాట ఊతంగా తీసుకొని అన్యాయంగా "ఏమేవ్ అమ్మాయీ నీ బుద్ధి మారిపోతూంది మా కులాన్ని భ్రష్టత గావించేలాగున్నావూ" అన్నాడు మా నాన్న.

"యింకా సందేహం ఎందుకూ?" రాగంతీస్తూ మరీ అంది మారేడు తల్లి.

"మరీ__ దీనికీ___ ఆలోచన."

"ఏముందీ__ నున్నగా క్షవరం చేయించడమే__"

అబ్బా! ఏమిటో దుఃఖ మైకం నన్ను కమ్మేసింది ఆలోచన అవగాహనా అన్నీ శూన్యమయ్యాయి. ఆ సమయంలో అందంగా నొక్కు నొక్కులుగా నొక్కుకో మెరుపుతో 'తళుక్' మని మెరసిపోయే నా తల వెండ్రుకల్ని ఖండన చేయడాన్కి ఆ మంగలాడ్కి చేతులెట్లా వస్తాయి... ఆ మాట ఉఛ్చరించడాన్కి మా నాన్నకు నోరెట్లా వస్తుందీ? .. అయ్యో! నా మనస్సు కోమలం. అంచేత అందరి మనస్సూ అలాంటి మృదుత్వం దాల్చే వుంటుందని నా అభిప్రాయం. అంత సున్నిత మనస్సు సంఘాన్నాశ్రయించుక తిరగేవాళ్ళకుండవు. వాళ్ళవి మనస్సులు కావు నల్లటి యినుప గుళ్ళు. కఠినపు పాషాణపు రాళ్ళు. ఒకళ్ళను ఏడ్పించడం వాళ్ళ ఉసురు తమ శరీరాన్కి మర్దనా చేసుకోవడమే వాళ్ళ నిత్య ప్రవర్తన. 'ఉసురు' అంటే హృదయంలోంచి వచ్చే వేడి నిట్టూర్పు. అదే కఠినాత్ములను పటాపంచలు చేసే పర్వ ఔషధం అదే విధవ కన్యల ఒంటినింకి యున్న రక్తధార అదే దానికి గురి అయిన వాళ్ళను అధోగతి పాలు చేసె పిశాచం.

ఛీ! ఛీ! నూరేళ్ళ జీవితం దుఃఖ సాగరంలో చేతరాని యాతతో శ్రమపడే దానికన్నా ఒక ఘడియలో అకాల మృత్యువునకు బలి కావడం మంచిది. ఆ తరువాత యీ జీవి ఎటు పోతే ఎవరికేం: భగవత్ సృష్టిలో బాల్య యవ్వన కౌమార వృద్ధాప్యాల్తో మిళితమై పుట్టిన యీ శరీరాన్నీ, భర్తలేని బాధపడే భయానక నరక కూపాన్ని త్యజిస్తేనే మంచిది.

చక్కటి ఆలోచన. అంధకార బంధురమైన ఆ అర్ధరాత్రాన్ని యిల్లు విడచి బయటపడ్డా. నలుదిశలూ నల్లటి మసి పూచినట్టుంది నా హృదయ సీమ ఆ ఆకారమే దాల్చుంది. కాని ఆకాశాన్కేసి చూస్తే 'మిలుకు మిలుకు' మంటూ నక్షత్రాలు' పూర్ణ వెల్తురు లేక మెరుస్తున్నాయి. వాటిని చూడ్డంతోనే ఆశ బంధువులు కూడా నా అత్మలో అక్కడక్కడా ఉద్భవిస్తూన్నాయి. దాము నా హృదయ పటం మీద స్పష్టపడుతూ భావి వాంఛకు పాశబద్ధురాలుగా చేస్తున్నాడు. ఛీ ! ఆ నక్షత్రాలు కూడా గగనాన్ని లేకుండా వుంటే ఒక్క మేఘం వచ్చి ఆ నక్షత్రాలన్నింటినీ మింగేస్తే నా దాముని కూడా మృత్యువాత పడేంత వరకూ మర్చిపోగలను.

★ ★ ★

అప్పుడే మైలుదూరం వరకూ నడిచా, శరీరం అంతా ముచ్చమటలు కూడా పోశాయి. ఎదురుగా తన చిన్నవాగులుతో చెలరేగుతూన్న నదీగర్భంలో దాక్కొందామనే వాంఛ మరీ పెరిగిపోయింది. ఆ చీకటి రేయి, ఆ అర్ధరాత్రి సమయాన్నీ, ఏం పుట్టె మునిగిపోయిందో 'కూఁ!' అని కూస్తూంది కోకిల. దానికూత యిదివర్లో ఎంతో ఆనందం గొల్పేది. కాని యిప్పుడో ఆ కూత ఒక బల్లెం పోటులా అనిపిస్తుంది. నిశ్శబ్దంగా వున్నట్టయితే నా కార్యాన్ని నెరవేర్చుకోడాన్కి ఏమీ అడ్డంకులూ రావు. కాని యీ శకుంతసంతానాలు కొద్దిగా గజబిజ చేస్తూంటే నా మనస్సు భయ కంపిత మవుతుంది.

నది దగ్గరగా చేరుకున్నా నదీ తరంగాల్లోంచి చల్లని పిల్ల వాయు వీచికలు 'రా' రమ్మని నా శరీరాన్ని తమ స్పర్శచే లాగుతున్నాయి. నవమీ రాత్రి కావడం వల్ల అర్ధబింబాకారంతో శశాంకుడు సముద్ర గర్భంలోంచి అప్పుడే లేస్తూ వెలుతురు రేఖలు విరజిమ్ముతున్నాడు. ఆ చంద్ర బింబాన్ని చూడ్డం తడవుగా దాము నా హృదయంలో కదిలాడు. కదలడంతోనే భావివాంఛకు మనస్సు వెనుక్కి లాగుతోంది.

తర్జనభర్జన చేసే కొద్దీ భావికాలాన్ని దాముతో సంచరించాలనే వాంఛనీయం పెచ్చు పెరుగుతోంది. 'పిచ్చి దాము... నాతో సంచరిస్తాడూ? వట్టిది కల్ల అబద్ధం.. సంఘాన్ని నిరసించడు' అనుకున్నా పూర్తిగా విరక్తిభావం కలిగింది. నదివడ్డుకు జేరి చేతులెత్తి "కృష్ణా! నాలాంటి అభాగ్య జీవితాల్ని నీ నాటక రంగంలో సృష్టించద్దు. సృష్టించినా నా సోదరీ మణులకు భర్తలతో తులతూగే భాగ్యం కలగజెయ్యి. అన్యాయంగా నాలాంటి కన్యలను తనపొట్టను పెట్టుకొంటున్న యీ సంఘాన్ని మారణ హోమంలో త్రోచెయ్యి. కృష్ణా నీలో నను ఐక్యం చేసుకో!" అంటూ చేతులెత్తి అమాంతంగా గోదావరి గర్భంలో వాలిపోయా...

..........................

"ఎ...వ...రూ" వికారంగా వుంది. తల తిరిగిపోతూంది. కళ్ళంట ముక్కు వెంటా నీళ్ళు కారుతున్నాయి. నా శరీరం నాయధీనాన్ని లేదు. ఓపిక లేకుండా ఎదురుగా నిలబడ్డ వ్యక్తిని ప్రశ్నించా!

"లీలా.. మాట్లాడేవూ.. బ్రతికావూ.. "అంటూ అపరిమిత సంతోషంతో నా చేతులదిమి పట్టి ముఖంలో ముఖం పెట్టి చూశాడు. చందమామల్లే వెలుతుర్లలో. అతని ముఖంలో చక్కని మెరుపు ప్రతిధ్వనించింది. అతని శిరోజాలు చింపిరి చింపిరిగా నీటితో తడిస్తున్నాయి. ఆపాద మస్తకంగా నీటితో తడిసుంది. చలితో వడకుతున్నాడు. ఆంత అవస్తకు గురి అయిన వారెవరా ? అని తేరిబార చూశా! అర్ధమయింది.

"దామూ?" అని ప్రశ్నించా

"ఆఁ లీలా! నిన్ను నీటిలోంచి పైకి లాగింది నేనే! నేనే!" అత్యుత్సాహంగా ఆత్రుత భావంతో సమాధానం యిచ్చాడు.

"నాలాంటి అభాగ్యులను దుఃఖ పరంపరలో కృంగిపోయేదారి చూపించడాన్కి అవతరించావా దామూ?"

"ఏం నేనేం తప్పుచేశా?"

"నా దుఃఖాన్ని నదిగర్భంలో అంతం చేయడాన్కి ఆనందంతో దుంకితే నా ఆనందాన్ని మళ్ళా దుఃఖమయం చేయడాన్కి పైకి లాగావు అది తప్పు కదూ?"

"దుఃఖాన్ని అంతం చేసి ఆనందాన్ని చేకూర్చాలనే సద్భావంతోనే పైకిలాగేను లీలా! నాపై అలాంటి నేరం మోపడం అధర్మం కదూ?"

"ఏట్లా నాకు ఆనందాన్ని చేకూర్చగలవూ?"

"పెళ్ళే ఆనందాన్కి కారణం"

"సంఘం"

"ఆ.. సంఘం. స్త్రీల పాలిటి ఆనంద భంగం. స్వార్థం కోసం ప్రాకులాడే ఆ సంఘాన్కి లొంగను లీలా!"

"నిజం... నిజం..." అపరిమిత నూతనోత్సాహంతో అన్నాను.

"ముమ్మాటికీ __" ఆనందంతో సమాధానం యిచ్చాడు.

"దామూ నేనిలా వెడతాననీ గోదావరిలో పడాతాననీ నీకేలా తెల్సు?"

"నిన్న నీకు అవమానం జరగడం నాకాశాభంగం కలగడం మొదలు మీ యింటిలోంచి వచ్చే ప్రతిధ్వనీ ఆలకిస్తూ ప్రతిఛాయా పరిశీలిస్తూ వున్నా. అర్థరాత్రాన్ని నీ విలా రావడం నేను నీ వెనుకాలే బయలుదేరడం నీవు నీటిలో పడిన తర్వాత నే లేవదీయడం యిది జరిగిన కథ. అయితే లీలా యింత సాహసించడం నీలాంటి..."

"సాహసించాను. కాబట్టే యింత సంతోష ప్రధమైన ఆనందమయమైన భావి. వాంఛకు గురి అయ్యా" అన్నాను.

ఆనాటి నుంచి మేమిద్దరం ఒకటయ్యాం.

# ఓ సినిమా కథ

# – గొల్లపూడి మారుతీరావు

## (ఆంధ్రజ్యోతి వారపత్రిక , 1985 దీపావళి సంచికనుంచి పునర్ముద్రితం)

*లండన్లో బెనజీర్ భుట్టోకి సానుభూతిగా ప్రదర్శనలు జరిపినప్పుడు జరిగిన కాల్పుల్లో చచ్చిపోయిన వారిలో అతని పేరు కనిపించింది. బి.బి.సి. స్క్రిప్టు డిపార్టుమెంటులో పని చేస్తున్న అస్రార్ అని స్పష్టంగా వ్రాసి వుండకపోతే అతణ్ణి గుర్తుపట్టేవాడిని కాను. అస్రార్ లండన్లో స్థిరపడి ఎనిమిదేళ్ళయింది. ఎప్పుడు ఈ రాజకీయాల వేపు దృష్టి మళ్ళించాడో, ప్రదర్శనల్లోకి ఎలా వచ్చాడో, ఎలాగాయపడ్డాడో, ఎలా చచ్చిపోయాడో అర్ధంకాలేదు. ఏమయినా ఏలూరులో ప్రారంభమైన జీవితం లండన్లో ముగిసింది.*

నేను సినిమాలు వ్రాయడం ప్రారంభించిన తొలిరోజుల్లోనే ఎవరో నాకు అస్రార్ ని పరిచయం చేశారు. అప్పటికే వయస్సు ముప్పై ఐదు రాలిపోతున్న ఎర్రటి జుత్తు, మరీ ఎర్రటి పెదాలు – అస్రార్ ఆడపిల్లలాగా వుంటాడు. అంటే ముద్దుగా, ముచ్చటగా మాట్లాడుతాడు. ఎమ్మే ఫస్ట్ క్లాసులో ప్యాసయాడు. ఇంగ్లీషు అనర్గళంగా చదువుకున్నాడు. ఈ కథలు సినిమాకి పనికి వస్తాయని అనిపించేంత కథల్ని నోరు వెళ్ళ బెట్టుకని వినాలనిపించేంత అద్భుతంగా చెప్తాడు. అస్రార్ బొత్తిగా పెద్దమనిషి కాకపోతే, మరీ గొప్పగా చదువుకొని వుండకపోతే, కాస్త దౌర్భాగ్యపు బుద్ధులు వుండి వుంటే రచయితగా చాలా ప్రసిద్ధి సాధించగలిగేవాడు. తెలుగు సినిమా రచయితకి అక్కరలేని చాలా లక్షణాలు అస్రార్ కి ఆ రోజుల్లోనే వున్నాయి.

అస్రార్ తండ్రి నిజాం సంస్థానంలో పనిచేసి చాలా డబ్బు గడించిన మనిషి. కానీ తాగుడు, అమ్మాయిలు ఎక్కువయి బాధ్యతా రహితంగా తిరగడం అస్రార్ తల్లికి నచ్చలేదు. ఆమె ఊపిరి పట్టుదల, పౌరుషం భర్తని నిలదీసింది. ఎదిరించింది. అమ్మాయిల గురించి అంతగా పట్టించుకోకపోయినా, ఎదిగే పిల్లలున్న ఇంటికి తాగి రావద్దంది. ఒకరోజు ఆయన తాగి వచ్చాడు. మర్నాడే బిడ్డల్ని తీసుకొని తన సొంత వూరు ఏలూరు వచ్చేసింది. ఆ తర్వాత 20 సంవత్సరాలు భర్త ముఖం చూడలేదు. భర్తని కాదన్న కారణంగా అతని తదనంతరం అతని ఆస్తినీ ముట్టుకోలేదు. అస్రార్ కి

తమ్ముడున్నాడు. పేరు అఫ్జాల్. తల్లి పట్టుదల వల్ల వాళ్ళిద్దరికీ వచ్చిన వారసత్వం పేదరికం. అస్రార్ ఏలూరులో నీటికావిళ్ళు మోసి డబ్బు సంపాదించుతూ చదువుకున్నాడు. కావిళ్ళు మోసినప్పుడు బుజానికి కట్టిన కాయలు చేతితో తడివి నాకు చూపించాడు. అతని మేనమామ ఏలూరులో స్కూలు టీచరీ చేసేవాడు. అతనే చెల్లిలి కుటుంబాన్ని కనిపెట్టుకు వున్నాడు. ఆయన కూతురు ఇద్దరికంటే చిన్నది. పేరు దీనా. సంపన్నమయిన ముస్లిం కుటుంబాల్లో ఆడపిల్లల అందమంతా ఆ అమ్మాయిలో వుంది. ఎదురుగా నిలబడితే రక్తనాళాల్లో రక్తం ప్రవహించడం తెలిసేంత తెలుపు. ఆ శరీరంలో జుత్తు, రెండు కళ్ళే నలుపు. నేను ఆ అమ్మాయిని విచిత్రమైన పరిస్థితుల్లో చూశాను.

పిల్లల చదువులు పూర్తయాక వాళ్ళిద్దరినీ తీసుకొని హైదరాబాద్ వచ్చేసింది తల్లి. వున్న డబ్బుతో రెండు పాత కార్లను కొని టాక్సీలకు తిప్పేవాడు అస్రార్. క్రమంగా చిన్న యిల్లు కొన్నాడు. వాళ్ళు హైదరాబాద్ వచ్చేసరికి తండ్రి బ్రతికే వున్నాడు. పాతికేళ్ళ వయసొచ్చినా బాగా జ్ఞానం తెలిశాక పిల్లలు తండ్రిని చూశారు. తండ్రి కూడా ఆ పేటలోనే వుండేవాడు. కాని ఒక్కసారీ అతణ్ణి కలుసుకోడానికి, మాట్లాడడానికీ యిష్టపడలేదు తల్లి, తండ్రి పిల్లలతో పూసుకుని తిరగాలని ప్రయత్నించేవాడు. పసితనం నుంచీ తల్లి పెంపకం, పేదరికం వాళ్ళ మనసుల్ని మరో విధంగా మలిచింది. తండ్రిని చూసినప్పుడు వాళ్ళిద్దరికీ ఆప్యాయత, అభిమానం పొంగి పొరలలేదు. వృద్ధాప్యంలో, ఒంటరిగా వున్న అతని మీద ఏ కాస్తో జాలి కలిగింది. తర్వాత క్షయతో ఆరు నెలలు బాధపడి కన్నుమూశాడు. అప్పుడూ తల్లి రాలేదు. మేనమామ వచ్చి పిల్లల్ని పక్కన ఉంచుకొని చెయ్యాల్సిన ఖర్మకాండ చేయించేశాడు. మిగిలిన ఆ కాస్త ఆస్తినీ బీదా బిక్కికి పంచేశాడు.

నాకు అస్రార్ పరిచయం అయే నాటికే అతని జీవితంలో చాలా కథ జరిగిపోయింది. మేనమామ దీనాను ముస్లింల పద్ధతిలో ఘోషాలో పెంచాడు. కాని కాలం మారి, చుట్టుప్రక్కల వాతావరణం, నగర సంస్కారం ప్రభావం చూసే సరికి అమ్మాయి చదువుకోవలసిన అవసరం, అమ్మాయిని కాలేజీకి పంపడంలో ఉపయోగం తెలిసి వచ్చింది. అప్పటికీ ఆమె వయస్సు మించిపోయింది. ఇక తప్పని సరిగా అస్రార్ సలహా మేరకు ఆలీఘర్ విశ్వవిద్యాలయానికి ప్రైవేట్ గా చదివించాడు. పరీక్షలు వ్రాయడానికి ఆమె తండ్రి, అస్రార్ టిక్కెట్లు తీసుకొన్నారు. కాని రైలు ఎక్కడానికి నాలుగైదు గంటల ముందుగా తండ్రికి గుండెనొప్పి వచ్చింది. పెద్ద సీరియస్సేం కాదు కాని, ప్రయాణం చేయలేని పరిస్థితి. అతన్ని ఆసుపత్రిలో చేర్చి, తల్లిని పక్కన వుంచి దీనాతో రైలెక్కాడు అస్రార్. ఈ ప్రయాణం అతని జీవితాన్ని విచిత్రమయిన మలుపు తిప్పింది.

చిన్నతనం నుంచీ దీనాని అస్రార్ కిచ్చి చేయాలనుకుంటున్న విషయం ఇద్దరికీ తెలుసు. ఇద్దరిది తొందర పడే మనస్తత్వం కాదు. కాగా, వైవాహిక జీవితం మీద ఇద్దరికీ నిర్దుష్టమయిన అభిప్రాయాలున్నాయి. పరీక్షలకి పది రోజులు ముందుగా ఆలీఘర్ చేరారు. ఇద్దరూ ఒకే గదిలో వుండడం మొదట ఇద్దరినీ భయపెట్టింది. రాత్రంతా దీనా చదువుతూ కూర్చుంటే టీ తెచ్చి, భోజనం కేరేజీ మోసుకొచ్చి సేవలు చెశాడు అస్రార్. మొదటి మూడు రోజులు పరీక్ష బాగానే

రాసింది. నాలుగో రోజున వళ్ళంతా నెప్పులతో జ్వరం ప్రారంభమయింది. రాత్రి వేళల్లో చలితో వణికింది. చివరి పరీక్ష ఎలా రాసిందో కూడా తెలీదు. భయంతో, భాదతో వొణికే ఆమెని ఓదారుస్తూ కూర్చున్నాడు అస్రార్. పరీక్షలయాక కూడా హోటల్ విడిచి పోలేకపోయారు. రాత్రి వేళల్లో అతని వొళ్ళో తలపెట్టుకుని నిద్రపోయేది దీనా. ఒక రోజు సగం రాత్రికి మెలుకువ వచ్చేసరికి తనని కావలించుకొని పడుకొని వుంది దీనా. ఆమె తల అతని గుండెలమీద వుంది. కళ్ళు నీళ్ళతో చారికలు కట్టి వున్నాయి. ఆప్యాయంగా ఆమెను దగ్గరికి తీసుకున్నాడు. నీరసంతో కాని కోరికతో అతణ్ణి వాటేసుకొంది దీనా. ఆ తర్వాత వారం రోజుల పాటు జ్వరం ప్రమేయం లేకుండా వుండి పోయారు ఆలీఘర్ లో. అయితే ఈ బాంధవ్యం ఇద్దరికీ తప్పుగా కాని, ఎబ్బెట్టుగా కాని అనిపించలేదు. చిన్నతనం నుంచీ వాళ్ళిద్దరినీ కాబోయే భార్యాభర్తలుగానే చూశారు ఇంటిల్లిపాదీనూ. ఇవ్వాళ ఆ అభిప్రాయానికి రహస్యంగా నాందీ జరిగింది.

పరీక్ష ఫెయిలయింది దీనా. కారణం అనారోగ్యం కానీ మరేదైనా కానీ ఆమె ఎక్కువగా బాధపడలేదు. అలీఘర్ నుంచి వచ్చాక తనకి తెలీని ఉత్సాహం ఆమెలో వచ్చింది. ఆ యింటికి తరుచూ వస్తూపోతూండేది.

వ్యక్తితః తొందరపాటు మనిషి కాదు అస్రార్. కాకపెద్ద మనిషి. ఆలీఘర్ సంఘటన ఆవేశంలో జరిగినా అతన్నెక్కువ ఆనంద పరచ లేకపోయింది. దీనాని చూసినప్పుడల్లా అతను సిగ్గుపడేవాడు. తప్పు చేసిన మనిషి లాగ కంగారుపడేవాడు. దీనాకి మాత్రం అటువంటి సందేహమూ, సంకోచమూ లేదు. తన సొత్తుని కాస్త ముందుగానే చేజిక్కించుకొన్న తృప్తి ఆ అమ్మాయిది. తల్లి ఒకటి రెండు సార్లు పెళ్ళి ప్రసక్తి తీసుకు వచ్చింది. అందుకు కారణం మేనమామ కావచ్చు. దీనా వయస్సు కావచ్చు, లేదా దీన పరోక్షంగా తండ్రిని ప్రోత్సహించడం కావచ్చు. కాని తమ్ముడి చదువు, కుటుంబ బాధ్యతలు, చిన్నతనంలో అనుభవించిన పేదరికం యివన్నీ మరిచిపోలేదు అస్రార్. ఆమె చదువు పూర్తయాక చేసుకొంటానన్నాడు. అందుకు దీన నిరుత్సాహ పడినా, తల్లి కాదనలేకపోయింది.

ఈ అభ్యంతరాలతో రెండేళ్ళు నెట్టుకు వచ్చాడు అస్రార్. దీనా యింటికి వచ్చినప్పుడు, అతను ఏకాంతంగా తటస్థపడినప్పుడు: “ఎంతకాలం నన్ను తప్పించుకు తిరుగుతావో చూస్తాగా?” అనేది వెక్కిరింపుగా. అంత అందమయిన భార్య ఇంట్లో తిరగడం తనకీ ఆనందమయిన విషయమే. కానీ తల్లి సుఖంగా బ్రతకడానికి కావలసినంత డబ్బు సంపాదించడం అతని లక్ష్యం. ఆ లక్ష్యానికి తన సుఖం అడ్డురాకూడదు. అదీ అతని ఆలోచన.

టాక్సీల వ్యాపారం మెరుగయి, పెరిగి, బాగా స్థిరపడింది. ఓసారి హైదరాబాదు నుంచి బొంబాయి మీదుగా ఢిల్లీ వరకు వెళ్ళాల్సిన పార్టీ తగిలింది. తన మిత్రుడు దినేష్ మిత్ర అని బొంబాయిలో కెమేరా డిపార్టుమెంటులో పని చేస్తున్నాడు. అతని కుటుంబం కారులో ప్రయాణం సాగిస్తోంది. న్యాయంగా డ్రైవర్ కిచ్చి కారుని పంపగలడు అస్రార్. కాని మిత్రా పట్టుదల మీద తనే స్వయంగా బయలుదేరాడు. అసలు ప్లాను ప్రకారం కనీసం మూడు నాలుగు వేలు లాభంతో 25 రోజుల్లో తిరిగి రావలసింది. కాని మూడు నెలల తరువాత రెండు వేలు అప్పుతో, బెంగాలీ భార్యతో తిరిగివచ్చాడు అస్రార్.

కారణం – ఇప్పటికీ అస్రార్ చెప్పలేకపోయాడు. సంఘటనలన్నీ సినిమాలో రీళ్ళలాగ ఒకటొకటి జరిగిపోయాయి. కారు పాట్నా సమీపంలో చెడిపోయింది. అందరూ అక్కడే పది రోజులు పైగా ఆగిపోయారు. కారు వదిలి బొంబాయి వెళ్ళిపోదాం, తర్వాత కారు వస్తుంది అన్నాడు మిత్రా. కారు వదిలి ససేమిరా రానన్నాడు అస్రార్. అస్రార్ ని వదిలి ససేమిరా వెళ్లడం మంచిది కాదంది మిత్రా చెల్లెలు. ఆ అమ్మాయి పేరు శ్రీతి. నల్లరంగులో వున్న సుచిత్రా సేన్ లా వుంటుంది. కళ్ళల్లో అదే తేజస్సు, అంతే జీవం, మనిషిలో అంతే గాంభీర్యం. పదిరోజులు ఆలోచించి ఒక్కమాట చెప్పే మనస్తత్వం. ఆ మాట వెనుక ఎంతో హృదయం, ఎంతో ఆలోచన, ముఖంలో నల్లదనం తప్ప ఆకర్షణే. ఆమె పక్కన అస్రార్ నిలబడితే ఆ నలుపుకి మాసిపోతాడేమో అనిపిస్తుంది. వాళ్ళిద్దరి మధ్య ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలీదు. రెండు నెలల తర్వాత మిత్రా తండ్రి బొంబాయిలో చచ్చిపోయాడు. చచ్చిపోయే ముందు ఇద్దరు దండలు మార్చుకోవడం చూసి మరీ పోయాడు. ఆమె పట్ల ఆకర్షణకీ పెళ్ళికీ ఒప్పుకోడానికి బలమయిన కారణం చెప్పలేకపోయాడు. శ్రీతి తన భార్య అవాలనుకున్నాడు. కారణం కేవలం ఆడదాని పట్ల ఆకర్షణేనా? కాదంటాడు అస్రార్.

ఏమయినా బొంబాయి నుంచి వచ్చిన తర్వాత హైదరాబాదులో పెద్ద భూకంపమే ఎదురయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తల్లి ఆ పెళ్ళి అంగీకరించలేదు. చిన్నతనం నుంచీ తల్లి కారణంగా పేదరికాన్ని అంగీకరించి, ఆమె పట్టుదలని గౌరవించి, తండ్రికి దూరమయి, తమ్ముడి అభివృద్ధిని సాధించి, యింటిని ఒడ్డారికి తెచ్చిన కొడుకు చేసిన ఈ పనిని ఆ తల్లి క్షమించ లేక పోయింది. కోడల్ని కన్నెత్తయినా చూడలేదు. కొడుకు యింటికి తిరిగివచ్చిన గంటలో రిక్షా చేయించుకొని కొడుకు కారు కూడా ఎక్కలేదు, అన్నయ్య యింటికి వెళ్ళిపోయింది. ఇందుకు ఆశ్చర్యపోలేదు అస్రార్. తల్లి స్వభావం తనకు తెలుసు. కాని అతని బాధ్యత దీనాని ఓదార్చడం. తనవల్ల ఆమెకు జరిగిన అన్యాయాన్ని యిప్పుడు ఏవిధంగానూ సరిదిద్దలేడు. ఆమె దృష్టిలో అతను నమ్మక ద్రోహి. దానికి దీనాకి నిందించే హక్కుంది. ఎదిరించే హక్కుంది. కాని ఆ రెండూ చెయ్యలేదు దీనా. విచిత్రంగా కళ్ళనీళ్ళు పెట్టుకోలేదు. నా మాటేమిటని నిలదీయలేదు.

"నాకంటే అందమయిన అమ్మాయినేం పెళ్ళి చేసుకోలేదు బావ" అని అనలేదు. "కంగ్రాచ్యులేషన్స్" అని మాత్రం అంది.

"నీకోసం నేను శీలాన్ని, చదువునీ అన్నిటినీ నష్టపోయాను. నువ్వు దౌర్భాగ్యుడివి" అని ముఖం మీదే తిట్టుంటే కాస్త ఉపశమన పడేవాడు అస్రార్. అర్థం చేసుకొనే ఔదార్యం, క్షమాపణ, సహనం – ఒక్కొక్కప్పుడు మనిషిని కోత పెడుతుంది. అస్రార్ అలాంటి నరకమే అనుభవించాడు.

ఇదిగో, ఈ రోజుల్లోనే అస్రార్ నాకు పరిచయం అయ్యాడు. ఎంత నవ్వుతూ, ఆనందంగా వున్నా – జీవితంలో అతను చేసిన ఈ పొరపాటు కనీసం దీనా విషయంలో అతనిలో పశ్చాత్తాపాన్ని కలిగిస్తుండడం నేను చాలా సార్లు గమనించాను. శ్రీతిని పెళ్ళి చేసుకున్నందుకు అతనికి ఎటువంటి చింతా లేదు. ఆలీఘర్ సంఘటన జరగకపోతే చాలా

గర్వంగా తలెత్తుకు తిరిగేవాడేమో కూడా కాని వ్యక్తితః అతనిలో వున్న నిజాయితీ అతని వ్యక్తిత్వాన్ని దెబ్బకొట్టింది. దాన్ని ఈ జన్మలో అతను సవరించుకోలేదు.

కుటుంబ విషయాలూ, వ్యాపారం విషయాలూ మాట్లాడవలసి వస్తే తల్లి రిక్షాలో యింటికి వచ్చి వీధిలోనే మాట్లాడి వెళ్ళేది. అతను పరిచయమయిన రోజుల్లోనే ఓ సాయంకాలం ఎవరో వచ్చారంటే బయటికి వెళ్ళాడు. కాస్సేపు మాట్లాడి వచ్చి – "మా అమ్మ వచ్చి వెళ్ళింది" అని చెప్పాడు. తల్లి ఇంటి బయట నిలబడి మాట్లాడి వెళ్ళడం చూసి నేను నిర్ఘాంతపోయాను. "నాది చాల విచిత్రమయిన కథ సార్. చెప్తాను. కానీ చాలామంది నమ్మలేని, ఊహించలేని కథ. కల్పన కన్నా కాస్తంత వింతగా వుంటుందంటారు. కాని నా కథ వాస్తవం కంటే వింతయినది" అన్నాడు. ఓ సారి రోడ్డుమీద తల్లిని పరిచయం చేశాడు. బాగా ఒడిలి, నీరసించిన మనిషి. మెత్తటి చిరునవ్వు. తెలుగు బాగా రాదు. చాలా నెమ్మదయిన మాట. ఈ వ్యక్తిలో పట్టుదలకి నిలబడే కరకుదనం, గుండె దిటవు ఎక్కువ వున్నవా అని ఆశ్చర్య పోయాను.

దీనా ఎలావుందని ఉర్దూలో అడిగాను. రిక్షా ఎక్కుతుండగా ఆ ప్రశ్నకి సమాధానం కూడా చెప్పలేదు ఆమె.

ఆ రోజు నాకు బాగా గుర్తుంది. సినిమా నిర్మాతలు, నేనూ, మరికొందరు మిత్రులకి పార్టీ ఏర్పాటు చేశాడు యింట్లో. దాదాపు పదిమందిమి పోగయాం. అపూర్వంగా బిరియానీ, యితర వంటకాలు చేయించాడు. అంతకు ముందు ఒకటి రెండు సార్లు అతని తమ్ముడు అఫ్జాల్ ని కలిశాను. అఫ్జాల్  బొత్తిగా మేధకదు. తల్లి చాటు బిడ్డలా కనిపించాడు. ఉస్మానియాలో డిగ్రీ చదువుతున్నాడు. ఆ రోజు పార్టీలో అఫ్జాల్ కూడా వున్నాడు. కొందరు బంధువుల్ని కూడా పిల్చాడు గావును, మధ్యలో వెళ్ళి వాళ్ళతో మాట్లాడి వస్తున్నాడు. ఆ రొజునే మొదటి సారీ, ఆఖరి సారీ, ఒకే ఒక్కసారి దీనాని చూశాను. ఒక్క గడియసేపు మెరుపు తీగెలాగ కనిపించి మాయమయింది.

ఇల్లు చిన్నదేమో భోజనాలు చేస్తూ లోపలికి నడిచినప్పుడు దీనా అస్రార్ కి వసారాలో తటస్థపడింది. చాలా సేపు ఇద్దరూ మాట్లాడుకోవడం గమనించాను. ఆమె ముఖంలో చిరునవ్వు వుంది. తన జీవితాన్ని ఎంతో కొంత నాశనం చేసిన వ్యక్తి ముందు నిలబడిన ధోరణి లేదు. అస్రార్ అలీఘర్ విషయం ఏమయినా కట్టుకథ చెప్పాడా అనిపించేంత సన్నిహితంగా ఇద్దరూ నిలబడి మాట్లాడుకొన్నారు. ఆ తర్వాత మేం మరో రెండు గంటల సేపు ఆ యింట్లో గడిపాం. కాని అస్రార్ మామూలు మనిషి కాలేకపోయాడు. ఆ సంభాషణ తర్వాత అతని ముఖం పాలిపోయింది. మనిషి పరాకయాడు. ఏం జరిగిందన్నాను, అప్పుడు చెప్పాడు.

శ్రీతితో అతని పెళ్ళి జరిగాక ఒకే ఒక్క సారి ఆ యింట్లో ఆ రోజు అడుగు పెట్టింది దీనా. ఆమెను తను పిలవలేదు. కాని అఫ్జాల్ తో కలిసి తనే వచ్చింది. వచ్చినప్పట్నుంచీ అతనితో ఏకంగా మాట్లాడాలని ప్రయత్నిస్తోందట. భోజన సమయంలో అస్రార్ దొరికాడు. వెళ్ళబోతున్న అతన్ని గోడకి అడ్డంగా చెయ్యి జాపి ఆపింది. "బావా! నీకో విషయం చెప్పాలని వచ్చాను."

అస్రార్ ఆగాడు.

"నువ్వంటే నాకు చిన్నప్పట్నుంచీ ప్రేమ, అభిమానం, నీతో కలసి జీవితాంతం బ్రతకాలని ఆశపడ్డాను. అది యివాళ్టికి సాధిస్తున్నాను"

అస్రార్ తెల్లబోయి చూశాడు.

"అవును బావా. నేను మీ యింటికి కోడలు కావాలనే కోరికని తీర్చుకుంటున్నాను. అఙ్జాల్ ని పెళ్ళి చేసుకో బోతున్నాను."

అస్రార్ నిర్ఘాంతపోయాడు. నెత్తిన పిడుగు పడినట్టయింది.

"ఎందుకు బావా ఆశ్చర్య పోతున్నావు. నువ్వు నన్ను వెన్నుపోటు పొడిచినప్పట్నించి నీమీద ఎలా పగ తీర్చుకోవాలా అని ఆలోచించాను. సమాధానం దొరికింది. నీ తమ్ముడికి పెళ్ళాన్నయి జీవితాంతం నీ కళ్ళ ఎదుటే వుంటాను. నువ్వు నాకు చేసిన అన్యాయం, నేను నీ తమ్ముడికి చేస్తాను. నువ్వు నీ భార్యతో ఆనందంగా కబుర్లు చెప్పినప్పుడల్లా – నాకు నువ్వేం దక్కనివ్వలేదో గుర్తొచ్చేలాగ నీ ఎదురుగ్గానే నీ యింట్లో వుంటాను. నువ్వు కోరుకున్న భార్యతో, నన్ను మోసం చేసి చేసుకొన్న భార్యతో నువ్వు సుఖంగా గడపినప్పుడల్లా ఆ అవకాశాన్ని లేకుండా చేసిన మరో మనిషి వుందన్న విషయం నీ కళ్లముందే తెలుస్తుంటుంది. నీమీద పగతీర్చుకోవాలనే అఙ్జాల్ ని రెచ్చగొట్టాను, లొంగదీసుకున్నాను. అత్తయ్యని వొప్పించాను. నువ్వు నీ డబ్బుతోనే మా యిద్దరికీ పెళ్ళి చెయ్యబోతున్నావు. ఆనందంగా బ్రతకమని ఆశీర్వదించబోతున్నావు. మా ఆనందాన్ని కళ్ళారా చూడబోతున్నావు. మీ తమ్ముడికి అన్యాయం జరుగుతోందని బాధపడుతున్నావా ? అది నువ్వు నీ మరదలికి చేసిన అన్యాయానికి ప్రతిధ్వని గుడ్ లక్"

ఎవ్వరికీ చెప్పకుండా రాత్రి పదిగంటలకి రిక్షాలో యింటికి వెళ్ళిపోయింది దీనా. ఆ తర్వాత ఆ షాక్ నుంచి తేరుకోలేక పోయాడు. "నిజంగా యీ పెళ్ళే జరిగితే ఈ దేశం వదిలి పారిపోతాను సార్. ఈ యింట్లో వుండను" అన్నాడు. తల్లి పట్టుదల ఏదో మూల అతనిలోనూ కనిపించింది. ఆ మాట చెప్తున్నప్పుడు.

ఆ పెళ్ళి ఆపాలని ఎంతో ప్రయత్నించాడు అస్రార్. నాచేత కూడా అఙ్జాల్ తో చెప్పించాడు. కాని దీనాని పెళ్ళి చేసుకోకుండా వుండడానికి ఏం కారణాలు చెప్పాలి. చెప్పవలసిన ఒక్క కారణం ఎలా చెప్పాలి? అస్రార్, నేనూ అఙ్జాల్ ని ఆపలేకపోయాం. అదీ గాక, అఙ్జాల్ ని కావాలని, ప్రయత్నించి, కోరి కోరి చేసుకుంది దీనా. ఒకప్పటి శ్రీతి పట్ల అస్రార్ లాగే అఙ్జాల్ దీనా విషయంలో పిచ్చివాడయిపోయాడు. జనవరిలో అఙ్జాల్ పెళ్ళి జరిగింది. ఆ పెళ్ళికి నేను లేను. విజయవాడ బదిలీ అయి వచ్చేశాను. ఆ పెళ్ళి అస్రార్ గుండెల్లో ఎన్ని తుపాకులు పేల్చి ఉంటాయో నాకు తెలుసు. చాలా రోజుల తర్వాత అస్రార్ కి ఉత్తరం రాసిన గుర్తు. కాని సమాధానం రాలేదు. కారణం మరో ఏడాది తర్వాత తెలిసింది.

పెళ్ళికి అస్రార్ ఈ దేశంలో లేడట. లండన్ వెళ్ళిపోయాడు. మరో నాలుగైదు నెలలు తరువాత శ్రీతి కూడా లండన్ వెళ్ళిపోయింది.

కథ యిక్కడితో ముగియవచ్చు. ఎప్పటికయినా ఓ మంచి నవలకి యిది యితివృత్తం కావాలని అనుకొంటూ వుండే వాడిని. కాని మూడేళ్ళ కిందట ఓ అర్ధరాత్రి నా మంచం పక్క టెలిఫోన్ మోగింది. విసుగ్గా ఎత్తాను. అస్రార్ గొంతు. ముందు పోల్చలేక పోయాను. అతన్ని కలిసి, అతని గొంతు విని దాదాపు ఏడేళ్ళయింది. బెంగుళూరు నుంచి ఫోను చేశాడు. ప్రతీ రెండేళ్ళకీ ఇండియా వచ్చి పోతున్నారుట. లేకపోతే ఈ దేశం పౌరసత్వం నష్టపోతారుట. అందుకని వచ్చారుట. బి.బి.సి.లో పని చేస్తున్నానని చెప్పాడు ఫోన్ లోనే. మూడో రోజు మద్రాసు వచ్చాడు. నేనిప్పుడు పూర్తిగా సినిమా రంగంలో వున్నానని తెలిసి, ఏదో కొత్త కథలు చెప్తానన్నాడు. బి.బి.సి. స్క్రిప్టు డిపార్టుమెంటులో పని.

ఇపుడు తెలుగు మరీ అధ్వాన్నంగా మాట్లాడుతున్నాడు. ఏవో నాశిరకం కథలు చెప్తాడని నా ఊహ. ఏమాత్రం ఆవేశం లేకుండానే, ఒకరిద్దరు నిర్మాతలకి ఫోన్ చేశాను. కథ చెప్పడానికి నన్ను రమ్మన్నాడు. అస్రార్ చెప్పిన కథ విని నేను నిశ్చేష్టుడి నయిపోయాను. హాలీఉడ్ లోనో, లండన్ లోనో మరెక్కడో తీయవలసినంత అందమయిన కథలవి. దాదాపు ఆ కథలని కళ్ళముందు సినిమాలాగ చూపించాడు. అస్రార్ ని పక్కన పెట్టుకొని, ఏ నాలుగు మిలియన్ల డాలర్లో చేతిలో వుందనుకొంటే ప్రపంచ మార్కెట్ కి అందే అందమయిన చిత్రాలు తీయవచ్చు. దురదృష్టమేమిటంటే కన్నీళ్ళతో, సెంటిమెంటుతో జిడ్డుకారుతూ నత్తనడక నడిచే నేలబారు కథలు మనకి కావాలి. అతని కథ విన్న ప్రతి నిర్మాత నిర్ఘాంత పోయాడు. కాని ప్రతి నిర్మాత వింటున్నపుడే అవి తమకి పనికి వచ్చే కథలు కావని నిర్ణయించుకొన్నాడు. తెలుగు సినిమా రంగానికి తేలిగ్గా పాతికేళ్ళు ముందున్నయీ కథలు, ఈ మధ్య కాలంలో అస్రార్ ఎంత పెరిగాడో, ఆ కథలు వింటున్నప్పుడు గ్రహించాను. సొంత ఖర్చులతో అస్రార్ పది రోజులు పైగా మద్రాసులో వున్నాడు. మొదట చెప్పలేకపోయినా చివరి రోజుల్లో చెప్పాను. “మా నిర్మాత మీద ఆశ పెట్టుకోవద్దు. ఆ కథను మాకర్థమయ్యేలా తీయగలిగే వారు లేరు” బాగా నిరుత్సాహ పడిపోయాడు అస్రార్. ఈ కథలతో డబ్బు చేసుకోవడం కంటే, తన అవసరాన్ని ఈ దేశంలో నిరూపించుకోగలిగితే కనీసం బెంగుళూరు వచ్చి స్థిరపడాలని అతని ఆలోచన. తల్లి రోగంతో మంచం పట్టింది. తమ్ముడికి ఇద్దరు కొడుకులు. తమ్ముడు వచ్చి బెంగుళూరులో అతణ్ణి చూసి వెళ్ళాడు. తల్లిని చూడడం పడలేదు. కారణం తనని చూడాలని వున్నా లేచిరాగలిగే స్థితిలో ఆమె లేదు. ఆమెను చూడడానికి దీనా వున్న యింటికి వెళ్ళగలిగే స్థితిలో అతను లేడు.

మద్రాసులో బొంబాయి విమానం నేనే ఎక్కించాను.

“మళ్ళీ ఎప్పుడు ఇండియా వస్తావని” అడిగాను.

"మీ భాషకి సరిపోయే నాసిరకం సినిమా కథలు వ్రాయడానికి రాజీ పడినప్పుడు" అన్నాడు. ఆ మాటలో కసి లేదు. నిస్సహాయత వుంది. బాధ వుంది.

కానీ ఆ అవకాశం అస్రార్ కి లేదు. ఎందుకనో, ఎలాగో బెనజీర్ భుట్టో సానుభూతి ప్రదర్శనల్లో ఇరుక్కొన్నాడు. తర్వాత అతను పోయిన వార్త పేపర్లో చదివాను.

❦❦❦

# కాకి చొక్కాలో కాఫీ చుక్క

## గొల్లపూడి మారుతీరావు

## (ఆంధ్రజ్యోతి వారపత్రిక , 1978 దీపావళి సంచికనుంచి పునర్ముద్రితం)

రామేశంగారు పిల్లలకి పాఠాలు చెప్పి సైకిలు మీద యిల్లు చేరేసరికి లోపల కోడలి మాటలు వినిపిస్తున్నాయి.

"ఈ కాకీ చొక్కాలో కాఫీ మరక లెలా వచ్చాయండీ?"

"చొక్కాలోనా? చొక్కాపైనా?"

"మీదకి మడతపెట్టిన చొక్కా చేతి మడతలో సరా? – నా ప్రశ్నని సవరించడం కాదు, సమాధానం చెప్పండి."

పకాలున నవ్వేశాడు సుబ్రహ్మణ్యం. అదే పొరపాటు. అబద్ధం చెప్పాలనుకొన్నవాడికి నవ్వు సరైన ప్రారంభం కాదు. నిజం చెప్పాలనుకుంటే నవ్వు అవసరం లేదు. సుబ్రహ్మణ్యం నవ్వింది అందుకు కాదు అసలు ఎప్పుడూ అలాంటి విషయాలు పట్టించుకోని పంకజం అంత సూటిగా, అనుమానంగా ప్రశ్న అడిగినందుకు.

అనుమానంతో ఎర్రబడిన ఆ ముఖాన్ని చూస్తూ, ప్రతీ ఆడదీ మగాడిని అనుమానించడం కనీసం ఒక్కసారయినా అవసరం అనిపించింది. అనుమానం ఆడదానికి భర్త మీద ఉన్న 'పొజెసివ్ న్స్" ని చాటుతుంది. భర్త రహస్యంగా గర్వపడే క్షణం అది.

"మైడియర్ వైఫ్ ! నా జీవితంలో మరో ఆడది లేదు. నీదైన ఈ సుమధుర స్వప్నాన్ని మరొకరి నిద్రలో తెల్లవారనివ్వను." ఎవరో కవి మాటల్ని అంటూ ఆమె భుజం చుట్టూ చెయ్యి వేశాడు.

చెయ్యి తీసేసింది.

"ఏమిటండీ ఈ మరకలు?" అన్నప్పుడు "ఏం లేదు నీ మొహం!" అంటే తీరుపోయేది.

కానీ "దొంగాడా కరవకురా" అన్నట్లు ఆడదీ, స్వప్నం, మాధుర్యం ఏమిటీ ఖర్మ! పంకజం అమాయకురాలు. భర్త మాటలకి బొత్తిగా కన్ ఫ్యుజ్ అయిపోయి చొక్కా తీసుకు వెళ్ళి పెరట్లో బాల్చీలో పారేసింది.

ఇది జరగబోయే తతంగానికి కేవలం నాంది మాత్రమే.

అసలు ఈ సంభాషణ సుబ్రహ్మణ్యానికి కేవలం నవ్వు పుట్టించినా రామేశం గారికి మాత్రం వణుకు పుట్టించింది. ఎంచాతనో ఆపాదమస్తకం కంపించి పోయాడు.

భర్త పట్ల భార్య విశ్వాసం పంకజాన్ని అక్కడితో ఆపింది కాని, సాటి మగవాడి పట్ల మరొక మగవాడి అనుమానం లాంటిదేదో రామేశాన్ని పట్టి పీడించింది.

అందుకు కారణాలు చాలా వున్నాయి. మొదటిది సుబ్రహ్మణ్యం పుట్టి బుద్ధి ఎరిగాక ఎప్పుడూ కాఫీ తాగలేదు. అసలు దాని రుచి ఎలా వుంటుందో కూడా తెలీదు. కాఫీని విషంలాగ చూస్తాడు. మరి ఫ్యాక్టరీకి వెళ్ళే కాకీ యూనిఫారం మీద కాఫీ చుక్క ఎలా పడింది? దానికి సమాధానం వెనక చిరునవ్వు ఎందుకొచ్చింది?

ఆ రాత్రి రామేశంగారికి నిద్రపట్టలేదు. సుబ్రహ్మణ్యం లోకో షెడ్ లో మెకానికల్ ఇంజనీరు. డీసిల్ యింజన్లు ఆగిపోకుండా ఎలా నడపాలో బాగా తెలుసు. కాని ఆడదాని మనసు ఎలాంటి సందర్భంలో ఆగిపోతుందో తెలీదు. రామేశంగారికి పాఠాలు చెప్పడం ముప్పై ఏళ్ళ అలవాటు, మనస్సులు మరమత్తుకి రాకముందే దారిన పెట్టడం అతని వృత్తి.

లేచాక కొడుకుతో ఒకసారి మాట్లాడాలనుకొన్నాడు.

★★★★★★★★★★★★★★★★★★

మరునాడు ఉదయం పేపరు చదువుకొంటున్న రామేశంగారి దగ్గరికి వచ్చి కూర్చున్నాడు సుబ్రహ్మణ్యం.

"చోప్రా కేసు ఏమయింది డాడ్!" అంటూ.

పేపరు మీదకి దృష్టి పోవడం లేదు రామేశంగారికి, న్యూస్ పేపరు అందిస్తూ అడిగాడు. "అబ్బాయ్! ఒక చిన్న విషయం!"

"ఏమిటది!"

"కాకీ చొక్కాలో కాఫీ చుక్క."

ఒక్క క్షణం తెల్లబోయి చూసి ఫక్కున నవ్వేశాడు సుబ్రహ్మణ్యం. "నీకూ పట్టిందా ఆ పిచ్చి? ఏదో నాన్స్ న్స్" అంటూ వెళ్ళిపోయాడు.

మామగారు ఆ ప్రశ్న అడగడం, భర్త సమాధానం చెప్పకుండా వెళ్ళడం పంకజం గమనించింది. ఆమె గమనించిన సంగతి రామేశంగారూ గమనించారు. గాభరా పడ్డారు. చినుకుల్ని చూసి గాలివానని గుర్తు పట్టే వయస్సు రామేశానిది.

ఎందుకు ఆ విషయం చెప్పడం లేదో రామేశానికి అనవసరం. కాని చెప్పక పోవడం కోడలిమీద ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తోందో అతను గ్రహించాడు. ఆ మధ్యాహ్నం కోడల్ని అడిగాడు.

"అబ్బాయి మీద నీకు నమ్మకం లేదా అమ్మాయ్?" పంకజం మామగారి ముఖం చూసింది "నామీదే ఆయనకి నమ్మకం లేదు."

ఇవే – ఇవే – మాటలు!

ఆ సాయంకాలం ప్రైవేట్లు మానేసి లోకో షెడ్ వేపు నడిచాడు. డ్యూటీ ముగించుకు వస్తున్న సుబ్రహ్మణ్యం తండ్రిని చూసి మొదట నిర్ఘాంతపోయాడు.

"ఏమిటి డాడీ? – మరిక్కడికి"

"ఎప్పుడూ యిలా రాలేదు కదూ?"

"అవును"

"ఎప్పుడూ జరగకూడనిది జరుగుతుందేమోనని భయంతో వచ్చాను."

"ఏమిటది?" తెల్లబోయాడు సుబ్రహ్మణ్యం.

"కాకీ చొక్కాలో కాఫీ చుక్క."

మళ్ళీ నవ్వేశాడు సుబ్రహ్మణ్యం. స్టాఫ్ బస్సు హారన్ మోగిస్తోంది. అప్పుడే అంతా ఎక్కేశారు. సైకిలు పట్టుకు నిలబడిన తండ్రిని చూస్తూ "త్వరగా వెళ్ళాలి. యింటి దగ్గర మాట్లాడుకొందాం. ప్రైవేట్లు పూర్తి చేసుకురా" అన్నాడు.

పరుగున వెళ్ళి బస్సు ఎక్కాడు.

అలాగే నిలబడిపోయారు రామేశంగారు.

రెండు రోజుల తర్వాత అర్థమయింది. కోడలు సరిగా భోజనం చెయ్యడంలేదని. ఇంట్లో తండ్రీ కొడుకులు చాలా అరుదుగా కలుసుకుంటారు. రామేశం అయిదుకే లేస్తాడు. రామేశం తొమ్మిదికి నిద్రపోతాడు. సుబ్రహ్మణ్యం పన్నెండుకి నిద్రపోతాడు. ఇద్దరినీ, ఆ యింటినీ సాకే భాధ్యత పంకజానిది. పంకజానికి చదువు లేదు. కాని సంస్కారం వుంది. మూర్ఖత్వం లేదు కాని పట్టుదల వుంది. అవిశ్వాసం లేదు కాని అనుమానం యిప్పుడు వుంది.

రామేశానికి అన్నం సయించడం లేదు. ఇదంతా సుబ్రహ్మణ్యానికి తెలీదు, ఈ యింటినీ, యీ యింట్లో ప్రశాంతతని కాపాడవలసిన భాధ్యత ఎంత ఉందో రామేశానికి తెలుసు.

ఆదివారం నాకు పదిగంటలకి అబ్బాయి దొరికాడు. "సుబ్బా – నువ్వు చెప్తానన్న విషయం" మళ్ళీ కదిపాడు.

"ఏమిటీ?"

"కాకీ చొక్కాలో.."

"డాడ్ ! అయామ్ బిజీ. కెన్ యిట్ నాట్ వెయిట్?" విజయవాడలో ఆగిపోయిన డీసిల్ యింజన్ ని రిపేర్సు లేకుండా వాల్తేరు ఎలా తీసుకురావడం అన్న విషయం గురించి మదనపడుతున్నాడు సుబ్రహ్మణ్యం. ఒక యింజను మూల పడడం వల్ల ఒక వారం ప్రోగ్రాం తల్లకిందు లవుతుంది. మధ్యలో ఈ కాకీ చొక్కా, కాఫీ చుక్క. ఏ పని చేపట్టినా ఆ ఏకాగ్రతకు భంగం కలగడాన్ని సహించడు సుబ్రహ్మణ్యం. బాత్ రూంలో వీపు రుద్దుకొంటున్నప్పుడు వీపు గురించి ఆలోచించినట్టే. ఆఫీసులో డీసిల్ ఇంజన్లు గురించి, బజారులో కాకరకాయల గురించి ఆలోచిస్తాడు. అంతేకాదు ఆ సమయంలో బయటి ప్రపంచం. దానికి సంబంధించిన విషయాలన్నీ అసందర్భంగా కనిపిస్తాయి. అందుకనే సుబ్రహ్మణ్యం సమర్ధత మీద ఆఫీసులో అందరికీ గురి – అయితే యిప్పుడు అతని నిజాయితీకీ, వ్యక్తిత్వానికి పరీక్ష. అది చాలా చిన్న విషయమని అబ్బాయి పక్కకి తోసేస్తున్నాడని గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు రామేశంగారికి.

నాలుగో రోజు పంకజానికి జ్వరం వచ్చింది. డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళి మందు లిప్పించాడు కాని, ఆమె మనస్సు లోని అస్వస్థత యింకా అలాగే ఉందని ఒక్క రామేశానికే తెలుసు.

మరునాడు సాయంకాలం సుబ్రహ్మణ్యం ఆఫీసునుంచి వస్తూనే రామేశం చెప్పాడు. "రేపు నువ్వు ఆఫీసుకు సెలవుపెట్టు."

"ఎందుకు?"

"పని వుంది – యిప్పుడు చెప్పను."

"ఆఫీసులో తీరిక."

పాతికేళ్ళనాటి రామేశంగారి వ్యక్తిత్వం మళ్ళీ తిరగబడింది.

"తీరిక లేకపోయినా సరే. అవసరమయితే ఉద్యోగానికి రాజీనామా చెయ్యి. నేను మరో కొత్త ఉద్యోగం చూసి పెడతాను!"

ఆ కంఠంలో అధికారం సుబ్రహ్మణ్యానికి తెలుసు. వయస్సులో నిరంకుశంగా బ్రతికిన పాత డి. ఈ. ఓ. గారిది, వృద్ధాప్యం ఆ వ్యక్తిత్వాన్ని అర్ధం చేసి యిప్పుడు కేవలం బడి పంతుల్ని మాత్రం మిగిల్చింది. కాని మళ్ళీ యివాళ?

సుబ్రహ్మణ్యం మరునాడు రెడీ అయాడు. ప్రైవేటు టాక్సీ పిలిపించారు రామేశంగారు.

"అమ్మాయ్! టాక్సీ సిద్ధంగా వుంది" అని కేకేశారు కోడల్ని వుద్దేశించి.

సుబ్రహ్మణ్యం ఆశ్చర్యపోయాడు. కాని ఆయన ముఖంలో నిశ్చలతని చూసి ఏమీ అడగలేకపోయాడు. నీలిరంగు పట్టు చీర కట్టుకుని దేవాలయానికి, బయలుదేరినట్టు సిద్ధమయి టాక్సీలో ఎక్కింది పంకజం. టాక్సీ ఊరుదాటాక మాట్లాడారు రామేశంగారు.

"సుబ్బూ! ఈ పాతికేళ్ళలో నీతో ఎప్పుడూ ప్రస్తావించనదీ, నువ్వు అడిగినా సమాధానం చెప్పనిదీ ఓ విషయం వుంది తెలుసా?"

"ఏమిటది?"

"మీ అమ్మ!"

తుళ్ళిపడ్డాడు సుబ్రహ్మణ్యం. చిన్నతనంలో తనకి జ్ఞానం వచ్చినప్పటి నుంచీ గోరుముద్దలు నాన్నే తీసుకెళ్ళాడు. బలపం పట్టుకొని అక్షరాలు దిద్దించాడు. బాలశిక్ష చదివించాడు. పండగకి తలంటి పోశాడు. పరీక్షకి చదువు నేర్పాడు. డిగ్రీ పుచ్చుకోడానికి తనతో పాటు యూనివర్శిటీకి వచ్చి గర్వంగా చూసి ఆనందించాడు. చివరగా నాలుగేళ్ళ క్రిందట తనొక్కడే పెళ్ళి జరిపించాడు. కాని జీవితంలో అన్ని దశలలోనూ కనీసం ఒక్కసారయినా తప్పని సరిగా గుర్తుకొచ్చే వ్యక్తి అమ్మ.

ఆ ప్రశ్నకి సమాధానం ఎప్పుడూ నాన్న దగ్గర్నుంచి రాలేదు. ఆ ప్రస్తకికి నుదురు ముడుతపడేది. బాధతోనా? కోపంతోనా? విసుగుతోనా? ఇంట్లో అమ్మ ఫొటో లేదు. తన జీవితంలో అమ్మ జ్ఞాపకాలు లేవు. నాన్న నోటితో అమ్మ ప్రస్తావన ఏనాడూ తీసుకురాలేదు. ఆశ్చర్యం, అతని మిత్రులు. అక్కడా అక్కడా తటస్థపడే కొద్దిమంది బంధువులూ ఎవరూ ఆవిడ ప్రసక్తి ఏనాడూ ఎత్తలేదు. అమ్మ ఎలా వుంటుంది? ఎప్పుడు పోయింది? ఎందుకు పోయింది. యివన్నీ సుబ్రహ్మణ్యం జీవితంలో సమాధానం రాని ప్రశ్నలు. అందువల్ల, తండ్రి తన జీవితంలో మొదటిసారిగా తనంతట తానై అమ్మ ప్రసక్తి తీసుకురావడంతో నిర్విణ్ణుడయి చూస్తూ వుండిపోయాడు.

పంకజం కూడా అంత కాకపోయినా, అలాంటి కారణాలకే నిర్ఘాంతపోయింది కాని రోడ్డువేపే చూస్తూ నిర్లిప్తంగా చెప్పారు రామేశంగారు.

"అబ్బాయ్? గత పది రోజులుగా ఆలోచించి ఆలోచించి ఈ జీవితంలో చెయ్యనక్కరలేదనుకున్న పనిని చేస్తున్నాను. ఇలా జరిగే రోజు వస్తుందని, రావాలని ఎదురు చూడలేదు. ఊహించలేదు. కాని యివాళ మళ్ళీ ముప్పై ఏళ్ళ కిందట మూసేసి ఒక తలుపుని తెరుస్తున్నాను."

"అంటే!" అర్ధం కాక చూశాడు సుబ్రహ్మణ్యం.

"మరో పది నిముషాల్లో మీ అమ్మని చూడబోతున్నావు నువ్వు. అవును. నీకు జన్మనిచ్చిన తల్లిని. నేను తాళి కట్టిన భార్యని." నా జీవితంలో కేవలం బాంధవ్యాన్నేతప్ప మరే పాత్రనీ వహించని నా ఊహలో – నీ తల్లిని – ఆ మాటలు లంటున్నప్పుడు ఆయన కంఠం గాద్గదికమయిందా? గొంతు బొంగురుపోయిందా?

ఒక్క క్షణం సుబ్రహ్మణ్యం నిశ్చేష్టుడయిపోయాడు. అనూహ్యమయిన ఆ సంఘటనకి ఎలా సిద్ధపడాలో మనస్సుకి అర్థం కావడం లేదు. పుట్టి బుద్ధెరిగాక ముప్పై ఏళ్ళు పెరిగిన కొడుకు మొదటిసారిగా తల్లిని చూడడం ఎలా వుంటుంది? అసలు తల్లి బతికి ఉందని, దేశానికి అడ్డంగా డీసిల్ యింజన్లు నడిపే తాను, యింత సుళువుగా, యింత చిన్న ప్రయాణం చేసి తల్లి సమక్షంలో నిలబడగలడనీ ఎన్నడూ వూహించలేదు. సుబ్రహ్మణ్యానికి తెలియకుండానే కళ్ళ నీళ్ళు తిరిగాయి. తండ్రి వేపు చూశాడు, కాని రామేశంగారు కారులోంచి బయటకు చూస్తున్నారు. ఇంకేం మాట్లాడలేదు ఆయన.

తను చూడని అత్తగారిని మొదటిసారిగా చూడబోతున్నానన్న ఆలోచన ఒక్క క్షణం పంకజాన్ని భయపెట్టింది. ఉత్సాహపరిచింది.

ముందు తోట, దారి పొడుగునా ఫెర్న్, గులాబీ మొక్కలు వున్న ఆవరణలోకి టాక్సీ తిరిగింది గేటు మీద "ఎన్ మీనాక్షి డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్" అన్న బోర్డు. టాక్సీ దిగుతున్న కొత్త మనుషుల్ని చూసి అనుమానంగా – మొరిగింది అల్సేషియన్. ఏ విధంగా చూసినా హోదాలోనూ, సంపదలోనూ, తన కంటే పెద్ద స్థాయినే వుంది అమ్మ, అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

"జిమ్మీ! ఏమిటా అరుపులు .." అని కసురుకుంటూ బయటికొచ్చింది ఆవిడ. ఎదురుగా నిలబడిన వాళ్ళని చూసి హఠాతుగా ఆగిపోయింది. భర్తని గుర్తుపట్టింది. పక్కనున్న పొడవాటి మనిషిని యింకా సుళువుగా గుర్తుపట్టింది. పంకజానికి భర్త పోలికలు ఎవరివో యిప్పుడర్థమయింది. పొడవాటి ముక్కు, నిలువెత్తు విగ్రహం, ఠీవి, అన్నీ తల్లి పోలికలు.

అమ్మ చాలా అందంగా ఉందనుకున్నాడు సుబ్రహ్మణ్యం. అమ్మలో ఆప్యాయత ఎలాంటిదో చూడని అతనికి మొదట ఆమెలో హుందాతనం, ఠీవి కనిపించాయి. అసంకల్పితంగా ఆ క్షణంలోనే ఆమె కళ్ళు – అశ్రుపూరితాలయాయి.

"రాములూ ! హాల్లోకి కాఫీ తీసుకురమ్మని, నాగమ్మతో చెప్పు. ఫైల్సు తరువాత చూస్తాను. రండి." అని కొడుకు వేపు తిరిగి "రా సుబ్బూ ! నీ పేరు సుబ్రహ్మణ్యం– నాకు గుర్తుంది." అని కోడలి వేపు తిరిగి "నీ పేరు నిన్ననే తెలిసింది యూనో – నేను నీ అత్తగారిని. రండి." అంది. పోర్టికోలో నిలబడి వున్నారు రామేశంగారు. ఆ వయస్సులో కూడా ఆయనకి చేతికర్ర అలంకారంగా కనిపించేది సుబ్రహ్మణ్యానికి. కాని మొదటిసారి దాని అవసరం తెలిసినట్టు దాని మీద వాలి పోయారు. ఒక్క అడుగు వెనక్కి వేసి "రండి" అంది.

అర్హతని పోగొట్టుకున్న ఉద్యోగికి అధికారియిచ్చే ఆహ్వానం లాగ వుంది ఆ పిలుపు.

తండ్రీ తల్లీ పలకరింతని అబ్బురపాటుతో చూస్తున్నాడు సుబ్రహ్మణ్యం. మొదటి సారిగా ఆ సమక్షంలో తను పసివాడయినట్టూ అనిపించింది. నాగమ్మ వచ్చింది. "అందరికీ మొదట కాఫీ యియ్యినాగమ్మా – కాదు, అబ్బాయికి బోర్న్ విటా – అయ్యగారికి కాఫీలో పంచదార వద్దు." అని ఆయన వేపు తిరిగి "రైటేనా ?" అంది. రామేశంగారు తలూపారు.

ఆడది ఎంత అధికారి అయినా, సంసారంలో ఆమెకి సంక్రమించే "గృహిణి" పాత్ర మొదటి అధికారం రాములుకి. నాగమ్మకీ యీ సంసారం చాలా ముచ్చటగా కనిపించింది. వాళ్ళ అనుభవంతో మొదటిసారిగా ప్రవేశించిన ఆ 'అయ్య' ని విస్తుపోయి చూశారు.

మీనాక్షిజుత్తు అక్కడా అక్కడా – నెరిసింది, కళ్ళకి అద్దాలు, తలలో పువ్వులు, నుదిటిన ఎర్రని కుంకుమ బొట్టూ, కూర్చో బోతూంటె ఫోను మొగింది. మీనాక్షమ్మ ముఖంలో విసుగు కనిపించింది. వెళ్ళి ఫోను తీసింది. "మీనాక్షీ !" అంది. "నో యివాళ రాను. యూ నో. యివాళ మా అబ్బాయి, కోడలూవచ్చారు. అయామ్. బిజీ, ఓకే – ఓకే" అని ఫోను పెట్టేసింది.

నాగమ్మ తెచ్చిన ఫలహారాన్ని తానే స్వయంగా అందరికీ వడ్డించింది. కొడుకు వేపు తిరిగి "రైల్వే ఉద్యోగం ఎలా వుంది? త్వరలో ప్రమోషన్ వస్తుందట? మీ నాన్నగారు చెప్పారు. యూ ఆర్ ఏ హార్డ్ వర్కర్ ట. గుడ్ – గుడ్" – అంది.

సుబ్రహ్మణ్యం ఆశ్చర్యంతో, ఆనందంతో ఆమెని అలానే చూస్తున్నాడు. రామేశంగారు ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

నాగమ్మ రెండు కాఫీలు టేబిలుమీద పెట్టి "ఈ రెండిట్లో పంచదార లేదమ్మ గారూ" అంది.

రామేశంగారు అశ్చర్యంగా భార్య వేపు చూశారు.

"అంటే నువ్వు కూడా."

మీనాక్షమ్మ నవ్వింది. "సహధర్మం మనల్ని దూరంగా వుంచినా, ఆరోగ్య ధర్మం మనలో యింకా సామాన్య లక్షణాల్ని వేటినో మిగిల్చింది. డోన్ట్ ఫర్ గెట్, నాకూ వయస్సు మీద పడింది. నాకు ముప్పై ఏళ్ళ కొడుకున్నాడు." అంది.

పంకజం తలమీద చెయ్యివేసి నిమిరి, భర్త వేపు తిరిగి "కోడలు నాకు నచ్చింది, చాలా అందమైన పిల్లని చేశారు. కోడల్ని ఎంచడంలో భార్యని ఎంచుకొనే పొరపాటే మీకు కనువిప్పు అయిందో!" రామేశంగారు తెల్లబోయారు.

మాటలో అధికారంతో వచ్చిన వ్యంగ్యం కంటె ఏ మూలనో బాధ కొట్ల వచ్చినట్టు కనిపించింది.

"ఇవాళ మీ అందరి భోజనం యిక్కడే నేనే వంట చేసి పెడతాను."

"మళ్ళీ నీ కెందుకు శ్రమ మాట్లాడాక వెళ్తాం" అని రామేశంగారు నసిగారు.

మీనాక్షమ్మ కళ్ళలో మళ్ళీ నీళ్ళు తిరిగాయి. "శ్రమా! అది నా హక్కు అని మరిచిపోతున్నారు మీరు. మీరు కట్టినా మాంగల్యం యింకా యిక్కడే వుంది ముప్పై ఏళ్ళ తర్వాత మళ్ళీ నా పాత్రని ఒక్కసారి గుర్తుచేసుకుంటాను."

సుబ్రహ్మణ్యానికి కళ్ళవెంట బొట బొటా కన్నీళ్ళూ కారాయి. ఆపుకోలేక పోయాడు. పంకజం గంభీరమయిన ఆ స్త్రీ మూర్తిని అబ్బురపాటుతో చూస్తూ కూర్చుంది. ఇటువంటి వ్యక్తి తన అత్తగారన్న గర్వమేదో ఆమె కళ్ళలో ద్యోతకమయింది.

"అమ్మాయ్! నీ భర్తకి యిష్టమయిన దేదో చెప్పువుగాని, నాతోరా." అంటూ రామేశం వేపు తిరిగి – "పోర్టికో దగ్గర మీ యిద్దరికీ కుర్చీలు వేయించాను. చలిగాలి ఎక్కువగా వుంది. గార్డెన్ లో వద్దు. మరో అరగంట పోయాక లోపలికి రండి మజ్జిగ చేసి యిస్తాను" అంది.

తల్లితో వంటగదిలోకి పరుగున వెళ్ళి ఆమె ఎదురుగా పీట వాల్చుకు కూర్చోవాలని వుంది సుబ్రహ్మణ్యానికి. ఆ యింట్లో ఏ క్షణమూ వృధాగా గడపాలని లేదు. ఇంతకాలం ఎంత నష్టపోయాడతను.

పోర్టికోలోకి వచ్చిన తరువాత సుబ్రహ్మణ్యం తండ్రిని అడిగిన మెదటి ప్రశ్న అదే. "డాడ్! నువ్వు నాకు చాలా అన్యాయం చేశావు. అమ్మని యింతకాలం నాకు దూరం చేశావు."

రామేశంగారు విషాదంగా నవ్వారు. "ఆ అన్యాయం గురించి చెప్పడానికే యింత దూరం తీసుకొచ్చాను. నీకు జీవితంలో కామాక్షిగురించి చెప్పవలసిన అవసరం రాదేమో ననుకున్నాను. కాని, గత పదిరోజులుగా నీ ప్రవర్తన నన్ను భయపెట్టింది. వణుకు పుట్టించింది. భార్యని దూరం చేసుకొనే దురదృష్టాన్ని నా కొడుక్కి వారసత్వంగా యిస్తానేమోనని భయపడి నిన్నూ యివాళ యిక్కడికి తీసుకొచ్చాను. నిన్నూ, కోడల్ని తీసుకువస్తానని కామాక్షికి నిన్ననే ఫోన్ చేసి చెప్పాను".

"దానికీ, దీనికీ ఏం సంబంధం డాడీ?"

"ఉంది సుబ్బూ! మీ అమ్మ వ్యక్తిత్వంలో ఎంత గర్వం. పట్టుదలా వుందో ఈ గంటలో నీకు అర్థమయి వుంటుందనుకుంటాను. ఇంతకు పదిరెట్లు ఉండేది ఆ రోజుల్లో కామాక్షికి. ముప్పై ఏళ్ళ కిందట బి.ఏ. చదువుకున్న ఆ అమ్మాయికి వూరంతటని పిలిచి గర్వంగా పెళ్ళి జరిపించారు నాన్న. మొదటి సంవత్సరం సంసార జీవితం బాగానే సాగింది. నాకు వయస్సులో విచ్చలవిడితనం ఉండేది. చిన్న నిర్లక్ష్యం ఉండేది. ఆ ఒక్క గుణం నీకు రాలేదని పదిరోజుల కిందటివరకు అనుకొనేవాడిని. ఓ డ్రాయింగు టీచరుతో చిన్న ప్రేమ వ్యవహారం నడిచింది – ఓ సారి నా స్కూలు బాగ్ లో వాడిపోయిన మల్లెపూల దండ కనిపించింది మీ అమ్మకి. నిలదీస్తే ఏదో అబద్ధం చెప్పి మాట తప్పించాను అలాగే ఏవేవో సందర్భాల్లో మరో నాలుగయిదు సార్లు దొరికిపోయాను. ఆవిడ నీ భార్యంత అమాయకురాలు కాదు, కాగా చాలా పౌరుషంగల మనిషి. మరో నాలుగు నెలలకి నువ్వు పుట్టావు. నీ పురిటికి వెళ్ళిన కామాక్షి తిరిగి రాలేదు. ఆ నాటికీ, యీ నాటికీ, ఆ రోజుల్లో అనుహ్యమయిన విషయం – నలుగురూ కథల్లాగ చెప్పుకొన్న విషయం – మా యిద్దరి విడాకుల కథ. కోర్టులో విడాకులకి దావా వేశారు వాళ్ళ నాన్నగారు. ఎవరేం చెప్పినా వినిపించుకోలేదు కామాక్షి నా వ్యవహారం వల్ల తనకి వచ్చిన నష్టం కంటె తనను మోసం చేశారన్న ఆలోచనకు తట్టుకోలేకపోయింది. ఆమె అహంకారం దెబ్బతింది.

వయస్సులో వేడి తరగని రోజులు. అంతే. మరో సంవత్సరానికి కోరు విడాకుల్ని అంగీకరించింది నేను కోర్టుకు వెళ్ళలేదు. నీ మూడో ఏట నిన్ను నా దగ్గరికి పంపించింది. నీకు బారసాల జరుపలేదు. నేనే 'సుబ్రహ్మణ్యం' అని పేరు పెట్టాను. "ఇదీ కథ".

నిర్విణ్ణుడయి కూర్చుండిపోయాడు సుబ్రహ్మణ్యం.

"జీవితంలో చేసిన ఒక్క పొరపాటుకి నేను భార్యని నష్టపోయాను. నా వల్ల నువ్వు తల్లిని నష్టపోయావు. ఆ తప్పుకి మనిద్దరం చెల్లించిన విలువయిన మూల్యం యిది. మళ్ళీ అలాంటి తప్పువల్లే నువ్వు నష్టపోవడం నేను భరించలేను. అది నీ కెలా చెప్పాలో తెలీక, ఆలోచించి ఆలోచించి నిన్నిక్కడికి తీసుకురావాలనే నిర్ణయానికి వచ్చాను.

సుబ్రహ్మణ్యం మాట్లాడలేదు.

"తర్వాత కామాక్షిని అయిదారుసార్లు చూశాను. న్యూస్ పేపరు తెరిస్తే ఆవిడ ఉద్యోగం వివరాలు తెలుస్తూండేవి. కాని — కాని మళ్ళీ నా జీవితంలోకి ఆహ్వానించలేకపోయాను." అని ఆగి "సుబ్బూ! నువ్వేం చేసినా మంచికీ, చెడుకీ నీకు స్నేహితుడూ, హితుడూ అంతా నీ భార్యే. ఆమె విశ్వాసాన్ని పోగొట్టుకుంటే నువ్వెంత నష్టపోతావో చెప్పడానికి నా జీవితం కంటె మంచి ఉదాహరణ మరొకటి లేదు." అన్నారు.

★★★★★★★★★★★★★★★★★★★★

లోపల వంట చేస్తూ కోడల్ని పీటమీద కూర్చోబెట్టి, తల దువ్వి — పూలజడ కుడుతోంది కామాక్షమ్మ. "ఇవాళ నిన్నూ, అబ్బాయినీ, ఎందుకు తీసుకొస్తున్నారో మీ మామగారు అంతా చెప్పారమ్మా. చూడమ్మా అనవసరమయిన పట్టుదలకి పోయి, భర్తని నిలదీసి నేనేం నష్టపోయానో నాకు తెలుసు. నా గర్వాన్ని, నా వ్యక్తిత్వాన్ని నిలుపుకోగలిగాను. కాని భర్తనీ, బిడ్డనీ, యిల్లాలిగా నా అదృష్టాన్ని దూరం చేసుకున్నాను. ఒక్క మాట మరచిపోకు. మంచికీ, చెడుకీ నీ స్నేహితుడూ, హితుడూ, నీ భర్త. ఆ నీడని ఏ ఖరీదయినా చెల్లించి నువ్వు నిలబెట్టుకోవాలి. వయస్సులో నువ్వు చేసిన త్యాగాలు వృద్ధాప్యంలో కలిసొస్తాయి. అప్పుడు కాదు యిప్పుడు నాకు భర్త, బిడ్డా, కోడలి అవసరం వుంది. నాకు అధికారం, హోదా, జీపు, యిల్లూ వున్నాయి. కాని మీరు, మీరంతా లేరు.

ఆ మాటలంటున్నప్పుడు కామాక్షమ్మ కొంత జీరపోయింది. అంత ఠీవయిన మనిషి కన్నీరు కారుస్తుంటే పంకజానికి భోరున దుఃఖం తోసుకొచ్చింది.

"చొక్కా మీద కాఫీ చుక్క కనిపిస్తే కారణం ఏమిటని నిలదీయకమ్మా. అతను చూసే ముందు వీలయితే కడిగెయ్ ఆ 'మరక'. భర్తని చూడనివ్వకు. నువ్వు గుర్తించలేదన్న తృప్తి. నీ దగ్గర దాచానన్న గర్వం మగాడికి మిగలవీ. ముప్పై ఏళ్ళ జీవితాన్ని నష్టపోవడం కంటే అదేం పెద్ద నష్టం కాదమ్మా."

అత్తగారి వొళ్ళో తలపెట్టుకొని పసి బిడ్డలాగ భోరుమంది పంకజం. కోడల్ని గుండెలకి హత్తుకొని తృప్తిగా ఒక తల్లీ, అత్తగారూ అయింది కామాక్షమ్మ.

★★★★★★★★★★★★★★★★★★★★

జీపు వెనక్కి తిరిగి వస్తూంటే ముగ్గురి మనస్సులూ ఆలోచనల్లో, ఊహించని అనుభవంతో బరువెక్కి వున్నాయి.

చివరకి నిట్టూర్చి రామేశంగారు కొడుకుని అడిగారు. కొడుకుకి వినిపించేలాగ "ఇంతకీ కాకీ చొక్కాలో కాఫీ చుక్క ఎందుకొచ్చిందో చెప్తావురా?" అవి.

సుబ్రహ్మణ్యం నవ్వేశాడు. "చెప్తాను డాడీ అది నా చొక్కా కాదు. రంగనాధానిది. వాడు డ్యూటీ రూంలో తగిలించిన చొక్కా పొరపాటున తొడుక్కుని యింటికి పోయాడు. పంకజం కాఫీ మరక చూపించాక ఆ విషయం తెలిసొచ్చింది. దాని అనుమానం చూస్తే నవ్వొచ్చింది." అని పక్కన కూర్చొన్న పంకజం వేపు తిరిగి "ఐయామ్ సారీ మైవైఫ్ నన్ను క్షమించు. నా బిడ్డకి తల్లిని దూరం చెయ్యకు ఆ నరక మేమిటో నా కివాళ తెలిసొచ్చింది." అన్నాడు.

రామేశంగారు కళ్లు తుడుచుకొన్నారు ఆ మాటలు వింటూ.

జీపు ఊరు పొలిమేరలకి వచ్చేసింది. అప్పటికి బాగా చీకటిపడింది. కాని కనుచూపు మేరలో ఊళ్ళో అక్కడా అక్కడా దీపాలు వెలుగుతున్నాయి.

# తెలివితేటల విలువ

## భానుమతీ రామకృష్ణ

### (ఆంధ్రజ్యోతి రజతోత్సవ సంచిక – 1985 - నుంచి పునర్ముద్రితం)

కొందరు తెలివి గల వాళ్ళని చూస్తే తెలివిలేని వాళ్ళకి వళ్ళుమంట! కొంతమంది తెలివిగలవాళ్ళకి ఒక్కోసారి ఎదురు చూడని చిక్కులూ, చీకాకులు తటస్థపడుతుంటాయి. అలాంటప్పుడు తెలివిలేని వాళ్ళుగా వ్యవహరించబడే వాళ్ళు భలే సంతోషపడిపోతుంటారు.


# తెలివితేటల విలువ

భానుమతీ రామకృష్ణ

కొందరు తెలివిగలవాళ్ళని చూస్తే తెలివిలేని వాళ్ళకి వళ్ళుమంట! కొంతమంది తెలివిగలవాళ్ళకి ఒక్కోసారి ఎదురుచూడని చిక్కులూ, చీకాకులు తటస్థపడుతుంటాయి. అలాంటప్పుడు తెలివిలేని వాళ్ళుగా వ్యవహరించబడే వాళ్ళు భలే సంతోషపడిపోతుంటారు.

తెలివిలేనివాళ్ళు అని ఎలా చెప్పగలం! అని కొందరికి సందేహం కలగవచ్చు! అలాంటప్పుడు ఒకేఒక గుర్తు! తెలివిగలవాళ్ళుగా పేరు ప్రఖ్యాతులు గడించిన ఎవరైనా ఏదో ఒక టైమ్‌లో బిజినెస్‌లోనో, ఎందులోనో పొరపాటున దెబ్బ తిన్నారంటే తెలివిలేనివాళ్ళుగా చెప్పుకోబడే వాళ్ళు బ్రహ్మానంద పడిపోతూ కసితీరా పకపకా గట్టిగా నవ్వి కడుపులో వున్న అక్కసు వెళ్ళగక్కేస్తుంటారు!

మావారికి రావుగారనే చిన్ననాటి ఫ్రెండు న్నాడు. రావుగారు చాలా తెలివైనవాడూ బిజినెస్

మావారికి మరొక చిరాకు! తన డబ్బు నయా పైసాగూడా ఖర్చుపెట్టడు! యితర్లు సిగరెట్ ఆఫర్ చేస్తే తాగుతాడు!... డ్రింక్ కూడా అంతే!... తానుగా డబ్బిచ్చి కొనడు! మావారు చాలా మొగమాటం మనిషి! డబ్బు విషయంలో లెక్కచూట్టం అలవాటు లేదు! అందుకే బిజినెస్‌లో మా వారికి బుర్రలేదని రావుగారి అభిప్రాయం! అంతేగాదు తాను చాలాచాలా తెలివైనవాడననే అహంభావం గూడా జాస్తి రావుగారికి!... కాని భగవంతుడు యిలాంటి

తెలివైనవాళ్ళకు పక్కనే రిపేరు చేయలేని ఒక లోపంగూడా పెడతాడు! అదే రావుగారి తెలివితేటలకొక పెద్ద దెబ్బ! రావుగారు ఎక్కడ

తెలివిలేని వాళ్ళు అని ఎలా చెప్పగలం. అని కొందరికి సందేహం కలగవచ్చు. అలాంటప్పుడు ఒకేఒక గుర్తు . తెలివి గల వాళ్ళుగా పేరు ప్రఖ్యాతులు గడించిన ఎవరైనా ఏదో ఒక టైమ్ లో బిజినెస్ లోనో, ఎందులోనో పొరపాటున దెబ్బతిన్నారంటే తెలివి లేని వాళ్ళుగా చెప్పుకోబడే వాళ్ళు బ్రహ్మానంద పడిపోతూ కసితీరా పకపకా గట్టిగా నవ్వి కడుపులో వున్న అక్కసు వెళ్ళగక్కేస్తుంటారు .

మా వారికి రావుగారనే చిన్ననాటి ఫ్రెండున్నాడు. రావుగారు చాలా తెలివైనవాడూ బిజినెస్ బాగా తెలిసినవాడు. రావుగారు తను మొదట్లో ఉద్యోగం చేస్తున్న కంపెనీనే కొనేశాడు తన తెలివితేటల్తో.

తనకున్న తెలివితేటలు ఎప్పుడూ బిజినెస్ లో దెబ్బతింటున్న మా వారికి లేవని "నువ్వు ఒట్టి ఫూల్ విరా." అంటూ చివాట్లు పెడుతూంటాడు. "పోరా ఫూల్. నీ అతి ఆశ నాకులేదు" అని పైకి మావారు అన్నప్పటికీ బిజినెస్ లో రావుగారు తెలివైన వాడనే జలసీ, ఉక్కురోషం ఒక్కంత మావారికి ఏమూలో వుందని నాకు తెలుసు. అయినా ఆ యిద్దరూ చిన్ననాటి స్నేహితులూ ఒకళ్ళనొకళ్ళు 'ఫూల్' అంటే 'ఫూల్' అనుకొంటుంటే యిద్దరి 'ఫూల్స్' మధ్య నేనెందుకు 'ఇంటర్ ఫీర్' కావడం అని వింటూ వూరుకొనేదాన్ని.

రావుగారు మంచి తెలివైనవాడు మాత్రమే గాదు బాగా బ్రతకనేర్చిన వాడు గూడా . అది మావారికి మరొక చిరాకు. తన డబ్బు నయాపైసా గూడా ఖర్చుపెట్టడు. యితర్లు సిగరెట్ ఆఫర్ చేస్తే తాగుతాడు.... డ్రింక్ కూడా అంతే... తానుగా డబ్బిచ్చి కొనడు. మా వారు చాలా మొగమాటం మనిషి . డబ్బు విషయంలో లెక్కచూట్టం అలవాటు లేదు. అందుకే బిజినెస్ లో మా వారికి బుర్రలేదని రావుగారి అభిప్రాయం. అంతేగాదు తాను చాలా చాలా తెలివైన వాడననే అహంభావం గూడా జాస్తి రావుగారికి.... కాని భగవంతుడు యిలాంటి తెలివైనవాళ్ళకు పక్కనే రిపేర్ చేయలేని ఒక లోపంగూడా

పెడతాడు. అదే రావు గారి తెలివితేటలకొక పెద్ద దెబ్బ. రావుగారు ఎక్కడ కూర్చుంటే అక్కడ మాట్లాడుతూ నిద్రపోతాడు. అదీ బ్రహ్మాండమైన గురకలో. ఒకసారి రావుగారు బిజినెస్ పనిమీద కలకత్తా వెళ్ళవలసి వచ్చింది.

స్వతహాగా డబ్బు ఖర్చుపెట్టని పిసినారి గనక తాను తీసుకెళ్ళిన పదివేల రూపాయల కట్టా పెట్టెలో పెడితే బస్సులో కొట్టేస్తారని భద్రంగా 'ప్యాంట్' జేబులో పెట్టుకొని కూర్చున్నాట్ట.... తను వెళ్ళాల్సిన చోటికి ఆ బస్సు చేరడానికి కనీసం గంటన్నా పడుతుందట. అసలే ప్రయాణపు బడలికతో వున్న రావుగారు బస్సులో కూర్చోగానే చల్లటిగాలి తగలడంతో అలవాటు ప్రకారం మంచి కునుకు పట్టింది. ఎంతసేపైందో. కండక్టరు వచ్చి లేపితే లేచి జేబు చూసుకున్నాట్ట. ఏముంది. పదివేలు.

ఆ కాసేపు నిద్ర ఖరీదు పదివేలు. ఈ విషయం మావారి చెవిన పడగానె ఆవసరమైతేనే నవ్వే మా వారు ఆనందంతో కసికొద్దీ విరగబడి నవ్వారు. వాడికి మోకాల్లో వుంది బ్రెయిను అంటూ.

ఒకసారి మావారు ఏదో 'ఎక్విప్మెంట్' కొంటే తన సలహా లేకుండా మా వారు అవతల వాళ్ళు చెప్పినంత ధరకి కొనేశాడనీ, తనుంటే వేరే కంపెనీది అంతకంటే చీప్ గా యాభై వేలు ఆదా చేసేవాళ్ళనీ, డబ్బు పోగొట్టుకోవడం తప్ప బిజినెస్ తెలీదు అంటూ మా వార్ని చివాట్లేశాడు రావుగారు. కాని మావారు నలుగురు మంచి కంపెనీ అన్నచోటే కొన్నారు. అది చాలా పెద్దకంపెనీ బేరం చేస్తే బాగుండదురా ఫూల్ అన్నారు మావారు. నీకు బిజినెస్ తెలీదు పోరా ఫూల్ అన్నాడు రావుగారు. ఆ యిద్దరి ఫూల్స్ సంభాషణ వింటూ వూరుకున్నాను.

యిది జరిగిన వారంరోజుల్లోగానే రావుగారికి మరొక శృంగభంగం జరిగింది.

రావుగారు కొన్ని 'ఎక్విప్మెంట్స్' సినిమా షూటింగులకి అద్దెకిస్తుంటారు. వాడుకగా కంపెనీ వాళ్ళు వచ్చి యింట్లో రావుగారి మేనేజర్తోనో లేక పి.ఎ.తోనో చెప్పి తీసుకెళ్తుంటారు. ఎక్విప్మెంట్ షూటింగ్స్ కి రేపు ఫలానా 'ఎక్విప్మెంట్' కావాలని ఫలానా కంపెనీ వాళ్ళు అడిగారు. రేపు పదిగంటలకి వాళ్ళ మనిషి వస్తే పంపించెయ్యి అని చెప్పి వెళ్ళాట్ట.

రావుగారు చెప్పిన ప్రకారం ఆ ఫలానా కంపెనీ మనిషివని చెప్పి ఎవరో వచ్చి 'ఎక్విప్మెంట్' కావాలన్నాడు. రావుగారు చెప్పి వెళ్ళాడుగదా అని పనివాడు యిచ్చేశాడు.

నాలుగు రోజుల తర్వాత రావుగారు వచ్చారు. అదే 'ఎక్విప్మెంట్' కోసం ఆ కంపెనీ వాళ్ళే ఫోన్ చేశారు కావాలని. ఆ ఎక్విప్మెంట్ వాళ్ళ దగ్గరే వుందనుకొన్న రావుగారు ఖంగుతిన్నారు. చివరకు తేలిన విషయం ఆ తీసుకెళ్ళినవాడు ఆ కంపెనీ వాడు కాదనీ దొంగ అనీ.

ఒకటా రెండా. అది యాభైవేల రూపాయల ఖరీదు చేసే ఎక్విప్మెంట్.

అన్యాయంగా దొంగ వెధవ తీసుకెళ్ళి పోయాడమ్మా. అని రావుగారు 'ఫోన్'లో నాతో చెప్తూంటే ఆ సంగతి విన్న మావారు మరొకసారి 'హా హా హా' అంటూ సినిమా 'విలన్' లాగా గట్టిగా నవ్వుతూ "అంతే కావాలి. నాకు బుర్ర లేదంటాడా. వీడి బుర్ర వాడి మోకాల్లో వుంది." అంటూ ఫోన్ తీసుకుని రావుగార్ని మరికాస్త ఏడిపించారు.

ఆ తర్వాత ఒకరోజు ఫోన్ వస్తే మావారు స్నానం చేస్తూండడం వల్ల నేనే తీశాను. రావుగారు పాపం చాలా డల్ గా మాట్లాడారు. ఎలా వుంది బిజినెస్ అని అడిగాను. ఆ అంతా ఒకే నష్టంగా వుందమ్మా. ఎవడో పాతికవేలు యివ్వాలి. పక్కింట్లోనే వున్నాడు యిస్తా యిస్తా అంటాడు మూడేళ్ళు దాటిపోయింది అన్నాడు."నోటీసు యివ్వకపోయారా. అన్నాను ఖంగారు పడుతూ." ఆ అదే "టైమ్ బారయి పోయింది." అన్నాడు నవ్వుతూ యిది మావారు వింటే మరొకసారి హార్టీగా నవ్వుతారే. ఎందుకంటే ఎవరికో ఒకప్పుడు ఆపదలో మా వారు ఆదుకొని యిరవై వేల రూపాయలకి పూచీపడి హామీ పత్రం మీద సంతకం చేశారు. ఆ తీసుకున్న వాడు యివ్వకుండా మా వారి దగ్గర కలెక్ట్ చేసుకోమన్నాడు. మావారు యిచ్చి చేతులు కడుక్కున్నారు. యిది విన్న రావుగారు ఫూల్ లాగా నువ్వు సంతకం చెయ్యడం ఏంటి. అని చివాట్లు వేయడం నేవిన్నా. ఈ రోజు పాతికవేలు రావుగారు పోగొట్టుకొన్నారు చేబదుల్లా యిచ్చి.

టాపిక్ మార్చడానికి "అమ్మాయి, అల్లుడూ 'ఫారిన్' నుంచి వచ్చారు గదా అల్లుడు గారు యిక్కడ ఏదైనా బిజిబెస్ పెడ్తాడా." అన్నాను. దానికి రావుగారు నవ్వుతూ "ఆ ప్రస్తుతం ఆయన బిజినెస్ విజయా హాస్పిటల్లో బెడ్ లో వున్నాడు." అన్నాడు అదే అలక్ష్య ధోరణిలో నవ్వుతూ. నా గుండె గతుక్కుమంది.

'ఏమైందండీ అల్లుడుకీ. అని ఖంగారు పడుతూ అడిగాను. మళ్ళీ అదే అలక్ష్య ధోరణిలో రావుగారు నవ్వుతూనే "అబ్బే ఏం లేదండీ మొన్న అతనికి స్కూటర్ యాక్సిడెంట్ అయింది" అన్నాడు. నాకింకా ఖంగారు పట్టుకుని "స్కూటర్ యాక్సిడెంటా. ఏమైంది రావుగారూ?" "అబ్బే ఏం కాలేదండీ, అతని చెయ్యి విరిగింది. అంతే" అన్నాడు నవ్వుతూనే. ఏం మనిషి. చెయ్యి విరిగిందని చెప్పి నవ్వుతాడేంటీ. రావుగారు భలే తమాషా అయిన వ్యక్తి. "అయితే అమ్మాయి ఎక్కడుంది." "హాస్పిటల్లో ఆయన దగ్గిరే వుంది." అన్నాడు. నాదో చచ్చు ప్రశ్న అల్లుడికి దెబ్బ తగిలితే కూతురెక్కడుంది అని అడగడమే ఒక అర్థంలేని ప్రశ్న. నేనలాంటి తెలివిలేని ప్రశ్న వేయడానికి కారణం రావుగారు అల్లుడి చెయ్యి విరిగిందని నవ్వడమే. నాకు మతిపోయినట్లయింది. ప్రపంచంలో యిలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు గాభరాపడుతూ అడగడం, ఖంగారుగా బదులు చెప్పడం సహజం. కాని రావుగారికి అన్నీ సమానమే.

మా వారు వచ్చారు. ఈ సారి రావుగార్ని "ఏరా ఫూల్ అల్లుడికి కారు యివ్వకుండా స్కూటరెందుకిచ్చావ్." అన్నారు. "అతనికి స్కూటరే అలవాటు. పైగా నా కారు పాతికవేలు లాభానికమ్మేశాను మొన్ననే" అన్నాడు. అది విని మావారు విసుగుతో ఫోన్ పెట్టేస్తూ ఛాఛా. "పెన్నీ వైజ్ పౌండ్ ఫూలిష్" పన్లు చేస్తుంటాడు. పద హాస్పిటల్ కెళ్ళి అల్లుణ్ణి

చూసొద్దాం. అంటూ మావారు చొక్కా వేసుకోడానికి గదిలోకి వెళ్ళారు. ఆ యిద్దరి స్నేహితుల మనస్థత్వాన్ని గురించి ఆలోచిస్తూ నిలబడ్డాను.

# ఒడ్డుకు చేరిన ఒంటి కెరటం

## శివరాజు సుబ్బలక్ష్మి

## (రచనా కాలంః 1960)

జీవితం ఎందుకు అన్న ప్రశ్న ఆ రోజు వొచ్చింది ఆశమ్మకి. సమాధానంగా వార్ధక్యం నడుము ఎక్కి, వికటంగా నవ్వినట్టు ఆశమ్మ నడుము వంగిపోయింది. పూర్వ స్మృతులు, వయస్సుని మధ్య పెట్టి శరీరం వయస్సుతో పోటీపడి గోడ పైకి తూలింది ఆశమ్మ.

దూరంగా ఆడుతున్న నాగు చూసి "తాతమ్మ" అంటూ పరుగెత్తుకువచ్చి పట్టుకోబోయి ఆశమ్మ మీద పడ్డాడు. అది నాగు తల్లి సీతమ్మ చూసింది. నాగుని లేవనెత్తి వీపుమీద తట్టి "ఎన్నిసార్లు చెప్పినా వినవుకదూ! ఈసారి ఆవిడ దగ్గరికి వచ్చావంటే వీపు చిట్లకొడతాను" అని బెదిరించింది.

"అయినా! వచ్చే ఏడా! పోయే ఏడా! అన్నింటికీ తగుదునమ్మా అంటూ బయలుదేరడం ఎందుకంట? ఆ పాకలో మంచం వుందిగా పడి వుండరాదూ!" అని ఆశమ్మని విసుక్కుంది సీతమ్మ.

"పడి వుండరాదూ" అన్న మాట వొక్కటీ ఆశమ్మ మనస్సుని పట్టుకుంది. నెమ్మదిగా లేచి వొంటిని వసారాలోనికి చేరవేసింది. ఎముకలకి దూరంగా జరిగిన చర్మం గాలికి వుయ్యాల వూగుతోంది. వొంటరిగా వున్న పన్ను కదిలి నేనూ వుండను అంటూ సలుపుతోంది. వసారాలో కొంగు పరుచుకుంది పడుకోవాలని. పక్కింటి పంతులు భార్య మంచినీళ్ళకని బిందె పట్టుకువచ్చి, తులసికోట గట్టుమీద కూర్చుని,

"పెళ్ళి భోజనానికి వెడుతున్నారా? అని లోపల వున్న సీతమ్మని అడిగింది.

"పిలవని పేరంటం వెళ్ళాల్సిందే. అయినా అంత కచ్చిగా వాళ్ళుంటే మాకేనా ఏమిటి జరగనిది. సొంత తమ్ముడిని కాదు అనుకొని, మిమ్మల్ని పట్టుకు పెళ్ళికి వచ్చి సవ్యంగా జరిగేటట్లు చూడమని పాకులాడుతున్నారటగా, మా బావగారు. అసలు ఈ కొంపల్లో గొడవలకి కారకురాలు బ్రతికి వుండగా ఎల్లా కలుస్తాంలే" అని ఆశమ్మని చూపిస్తూ మెటికలు విరిచింది సీతమ్మ.

"పోనిస్తురూ మీ గోడవలు ఎప్పుడూ వుండేవే. మిమ్మల్ని పిలవకపోతేమానె. చిన్నప్పటినించీ అష్టకష్టాలుపడి పెంచి పెద్ద చేసింది. ఆవిడని గౌరవించి పీటలమీద కూర్చోటం మీ బావగారికి ధర్మం. ఏమంటారు? అని తనే ప్రశ్నించుకు ఆశమ్మ మీద జాలిపడింది పంతులు భార్య.

ఆశమ్మ పొడి ఆరిన పెదిమలు తడిచేసుకు "ఏ వూరు ఇస్తున్నారేమిటి? నాగమ్మా" అని అడిగింది.

"ఊరు పేరు ఏమొకాని పిల్లాడు పెద్ద చదువులు చదివాడట. పిల్ల నచ్చిందని ఒప్పుకున్నారు కాని వాళ్లతో వీళ్లెక్కడ తూగ్గలరని అంతా అనుకుంటున్నారు. పోనీలే నీ పేరు పెట్టినందుకు పిల్లకి అదృష్టం పట్టింది" అని అంది నాగమ్మ.

"పేర్లో ఏముందిలే? పిల్ల అదృష్టవంతురాలు అని ఒప్పుకుంటా. అయినా ఆ పేరు పెట్టి వక్కనాడయినా మా తోటికోడలుకానీ మరెవరైనా పిలవటం విన్నావా? ఆవిడికి ఆ పేరంటేనే అసహ్యంట. చిట్టి అని ఎవరు పెట్టారోగాని, అదే సార్థకం అయింది. అయినా మా బావగారికి ఆ రోజుల్లో మేనత్త మీద డబ్బుకోసము మోజు వుండేదట. పిల్లలకి పేరు పెట్టి ఈవిడచేత ఈ ఇల్లు తోట రాయించుకున్నాడు. నన్నడిగితే ఆ పేరు మార్చుకోమనే చెపుదును. ఈవిడ ఏమి వృద్ధిలోకి వచ్చిందేమిటి?" అని తల చిక్కు తీసుకుంటూ కసిగా అంది సీతమ్మ.

"ఆశ అత్తా అని కూతుర్ని ఎన్నోసార్లు మీ బావగారు పిలవటం విన్నా. అయినా ఆవిడకేం, ఆవిడ చేత్తో చిల్లిగవ్వ యిచ్చినా చాలు అని వూళ్లో వాళ్ళు అనుకుంటూనే వుంటారు" అంది నాగమ్మ.

"ఆ కనపడతూనే వుందిగా. చిల్లిగవ్వతో గుమ్మిడి కాయ ఎగిరిపోయింది" అని వెటకారంగా ఆశమ్మ కేసి చూస్తూ అంది సీతమ్మ.

సీతమ్మ ధోరణి నాగమ్మకి నచ్చలేదు. ఇంకేమయినా తనంటే వాదానికి దిగి ఆశమ్మని తిట్టిపోస్తుంది. అని గుర్తుకొచ్చి "ఎంతయినా మీరూ, మీరూ వకటే అవుతారు" అని చివరికి బిందె తీసుకు వెళ్లిపోయింది.

దూరంగా భజంత్రీలు వాయించటం వినపడుతోంది. ఆశమ్మకి కూర్చోబుద్ధి పుట్టలేదు. తను వెడితే వద్దంటారా? అనుకుంది. తన రంగం పెట్టె వున్న గదిలోకి వెళ్ళింది. పెట్టె మూతకి బీటలు పెద్దవయ్యాయి. తనలాగే పెట్టికి కూడా వార్ధక్యం వచ్చింది అనుకుని బీటల పైన చేత్తో తడిమింది. మూత జరిపి పెట్టి అడుగున వున్న భరిణ తీసి రుద్రాక్షమాల మెళ్ళో వేసుకుని వుంగరం భరిణిలోనే పెట్టి కొంగుకి కట్టుకుంది. పెట్టి మూత వెయ్యబోతే వేలు మీద

పడింది. ప్రాణం కడగట్టినట్టయింది ఆశమ్మకి.

గడపమీద కాలు పెట్టుకు నిల్చుని "ఎక్కడికేమిటి ప్రయాణం? వాళ్లింటికేనా! మీ మేనల్లుడికి చెప్పకుండా వెళ్ళడానికి వీలులేదు. అసలే కోపంగా వున్నారు. మళ్లీ గడప తొక్కనివ్వరు తెల్సిందా?" అని వురిమింది సీతమ్మ.

"బొత్తిగా పసిదాన్ని కసిరినట్టు కసురుతావేం? నేనేం కాని పని చెయ్యటంలేదు. అంతా నావాళ్లేననుకుని వొళ్లు విరుచుకు చేశాను ఆనాడు. అందరికీ విరోధినే ఈనాడు" అని వచ్చే దుఃఖాన్ని ఆపుకునేందుకు నోరు చప్పరిస్తూ నడవాలోంచి వీధిలోకి వచ్చింది ఆశమ్మ.

"ఎవరు చెయ్యమన్నారు. ఇప్పుడు చెప్పటంకోసం చేశావన్నమాట! చేశావో లేదో ఎవరు చూశారులే. ఇప్పుడు నీకు చెయ్యలేక నా దుంప తెగుతోంది. నీ పాపిష్టి డబ్బు నిలవాలేదు సరే కదా! అయినవాళ్లని విడతీసింది. చివరికి నీ చాకిరీ మిగిలింది నాకు. ఆ ఇచ్చేది ఇద్దరికీ పడెయ్యకపోయావా" అని కసురుగా తలుపులు మూసింది సీతమ్మ.

యాత్రలకి వెళ్లాలనే కదా! ఆ డబ్బు వడ్డీకి ఇచ్చుకున్నది. దేశం చూసే యోగం తనకి లేకపోయె. ఏమనుకుంటే ఏమి ప్రయోజనం. రామేశ్వరమైనా చూడలేదు తన జీవుడు. రామాయణం చదివినప్పుడల్లా పారవశ్యంలో రామేశ్వరం ఆరోజే వెళ్ళాలనిపించేది. అయినా ఆ భగవంతుడికి ఇచ్చిన డబ్బు మనం ఇముడ్చుకోగలమా! అందుకే చిన్న మేనల్లుడు పెట్టిన వ్యాపారం రాణించలేదు అనుకుంది. అయినా దీని దుర్బుద్ధే వాడిని పైకి రానివ్వలేదు. ఏమొ, నాకెందుకు ఇంకా ఈ తాపత్రయం. అన్నీ వదులుకున్నా, ఆత్మసన్యాసం పుచ్చుకోలేదు అనుకుంది ఆశమ్మ.

అరుగు మీద కూర్చున్నదానికి ఏదో గుర్తొచ్చినట్టు లేచి నిల్చుని కొంగును నడుముకి బిగించి కట్టుకుంది. కర్ర తోడుతో విసురుగా రోడ్డు ఎక్కింది. మళుపు తిరిగకమునుపే, వీరన్న ఎదురై "పెద్ద అప్పగారు ఎక్కడికి ఎల్తున్నారు" అని అడిగాడు.

మనస్సులో మరుగుతున్న దుఃఖం వేడి తగ్గి పొడి మాటలగా బైట పడ్డాయి. "నువ్వా నాయనా" అంటూ వీరన్న దగ్గరగా వొంగుని "ఏమి చెప్పనులే మీ నాన్న దగ్గర డబ్బు అల్లాగే వుంచినా బాగుండేదేమో. అప్పుడు అది తీసి ఇచ్చేదాకా నిలువనియ్యలేదు. ఇప్పుడేమొ ఎవరికీ గిట్టకుండా పోయాను. అయినా ఆ పరమేశ్వరుడికి దయ రాలేదు. ఇంకా ఎంతకాలం పరీక్షిస్తాడో" అంటూనే పెండ్లిపందిరి దగ్గరికి వచ్చింది ఆశమ్మ.

వీరన్న శలవు తీసుకు వెళ్ళిపోయాడు.

వొచ్చిందే కాని లోపలికి వెళ్ళేందుకు మనస్సు వొప్పలేదు. సందు గుమ్మం పట్టుకు నిల్చుని ఎవరైనా వస్తున్నారేమోనని చూసింది. పెళ్ళికూతురు తమ్ముడు పసివాడు ఆనంద్ వచ్చి వూడిపోయేలాగు చేత్తో పట్టుకుని "తాతమ్మరా" అంటూ కర్ర పట్టుకు నడిపించి దొడ్డి పందిట్లోకి తీసుకు వెళ్ళాడు. పెళ్ళికూతురికి పువ్వులజడ కడుతున్నారు. వొచ్చిన బంధువుల్లోని అమ్మలక్కలు ఎవరూ పలకరించకపోయినా పెళ్ళికూతురు గడ్డం పట్టుకు మొహం పైకెత్తి ఆప్యాయంగా వొకసారి చూసి కొంగుని కట్టిన ఉంగరం విప్పి పిల్ల చేతిలో పెట్టి తృప్తిగా బోసినోరు తెరిచి నవ్వుకుంది ఆశమ్మ.

పిల్ల తల్లి రంగమ్మ వొక్క విసురునివచ్చి వుంగరం తీసి విసిరికొట్టి కోపంతో "ఎవరిక్కావాలి ముదనష్టం డబ్బు. వాళ్లకే ఇచ్చుకో పట్టుకెళ్లి" అని అరిచింది.

వొక బంధువు "వాళ్ళే పంపివుంటారు ఏమి జరుగుతుందో చూసిరమ్మని. పిలవలేదని వుడుక్కోపోతోందిటగా సీతమ్మ. పంతులు భార్య చెప్పిందిలే" అని మాట అందించింది మరొక ఆవిడ.

"పిలవాల్సిందే ఎప్పటికి అప్పుడు పోటీయే. ఈ సంబంధం కూడా కుదరనియ్యకుండా చెయ్యాలని ఎంత తాపత్రయ పడింది. అప్పన్నగారు చెప్పి ముక్కుమీద వేలు వేసుకున్నాడు. ఈ ముసిల్ది ఏమి తక్కువది కాదు.

పిల్లకి తన పేరు పెడితే నోటుమీద తిప్పే డబ్బు దానికిస్తానని పిల్ల తండ్రికి చెప్పి పేరు పెట్టించుకుంది. చివరకి డబ్బు అంతా పట్టుకెళ్లి వాళ్లకి కట్టింది. ముష్టి వుంగరం తెచ్చి ఇస్తోంది" అని అక్కసు వెళ్లబోసుకుంది రంగమ్మ.

ఆనంద్ కి తల్లి మాటలు అర్థం కాక చూస్తున్నాడు. దూరంగా బురదలో పడ్డ వుంగరం మెరుస్తూ కనిపించింది. తీసి లాగుకీ తుడిచి తాతమ్మ చేతిలో పెట్టాడు.

"కొత్త లాగుకి బురద తుడుస్తావురా!" అని రంగమ్మ వీపుమీద చరవటంతో ఆనంద్ పందిరి అదిరిపోయేట్లు ఏడుపు మొదలు పెట్టాడు. రంగమ్మ తమ్ముడు "మీరు రావటంవల్ల జరిగే వుపకారం పాత పగలు బయట పడటమేగా" అని ఆశమ్మగారి పై విసుక్కుని, "ఇంక వెళ్ళ"మన్నట్టు కర్ర పుచ్చుకు దూరంగా తీసుకెళ్లి వదిలాడు.

"ఆశమ్మకి మరిచిపోయిన అభిమానం గుర్తుకొచ్చింది. "నా యింట్లోంచి నన్నే గెంటుతున్నావా! ఎవరికీ తక్కువ చెయ్యలేదు. ఈ ఇల్లు ఎవరు రాసి యిచ్చారో మీ అప్పకు గుర్తు చెయ్యి" అంటూ గాడిపొయ్యి దగ్గరగా వున్న గట్టు మీద కూర్చుంది.

"ఇహ లడ్డూలు ఇవాళ అయినట్టే ఆవిడ ఇక్కడ చేరింది" అని పెళ్ళికూతురు పినతల్లి అనటం, మరో ఆవిడ "ఇంత దిష్టితీసి మరీ పొయ్యి ఎక్కించండి. వయస్సు వస్తే సిగ్గు శరం వదిలేస్తారనుకుంటా. అక్కడ అన్ని అంటున్నా ఇక్కడ వచ్చి చతికిలపడింది" అని దూరపు బంధువు ఆశమ్మని విదిలించింది రంగమ్మ మెప్పుకోసం.

ఈసారి కర్ర తీసుకు విసురుగా నడవబోయి గాడిపొయ్యిలో పడబోయింది ఆశమ్మ. వంటమనిషి చటుక్కున పట్టుకోకపోతే ఏమయ్యేదో అని అక్కడివాళ్ళు దవడలు నొక్కుకున్నారు.

దూడలపాక గుమ్మందాకా వంటమనిషి ఆశమ్మని తీసుకువచ్చాడు. వాడి చిన్నతనం అంతా ఆశమ్మ నీడనే జరిగింది. ఆకలెరిగి తిండి పెట్టింది. వొక ఇంటివాడిని చేసేదాకా వూరుకోలేదుకదా? అని తనలో కృతజ్ఞతగా అనుకున్నాడు. బొడ్డులో వున్న రూపాయి తీసి ఆశమ్మ అతని చేతిలో పెట్టింది. వంటమనిషి, కళ్ళు తుడుచుకుని ఆమె కాళ్ళని మొక్కాడు.

నూనె పొంగి గాడిలో పడి మంట లేచింది. ఇసుక పొయ్యమని అరుపులు "హమ్మయ్య ఎంత ప్రమాదం తప్పింది" అన్న మాటలు గట్టిగా వినపడ్డాయి.

ఆశమ్మ ఆ దారిని నడిచి ఎన్నో ఏళ్ళైంది. తన హయంలో ఇంటి పెత్తనం ఎల్లాగా చెయ్యాలో నేర్చి ఇన పెట్టి తాళాలు చేతిలో పెట్టి కళ్ళు మూశాడు తండ్రి. అన్నగారు ఎక్కువ కాలం లేకపోయినా, పిల్లలు పసివాళ్లు, పొలాలు జాగ్రత్త అని చేతిలో చెయ్యి వేయించుకున్నాడు. ఆ యింటికి ఆడా, మగా తనే అయి మర్రిగింజ వేసి మహావృక్షంలా ఆస్తిని పెంచి అప్పగించింది. ఎవరు సంతోషిస్తున్నారు అన్న ప్రశ్నకి సమాధానం రాలేదు.

మామిడితోపు దగ్గర ఆగింది. బోదిగట్టున కూర్చుని దూరంగా కనపడే పచ్చని చేలు చూసుకుంది. మామిడిచెట్టు అన్నీ పుల్లలు విరిగిపోయాయి. చీమలపుట్టలుగా రాలిన ఆకులు మృత్యువు చేతిలోని జీవుడులా రెపరెపలాడుతున్నాయి.

"ఏమి తల్లీ ఈడ కూకున్నావు" అని బాపి పలకరించేటంతవరకు ఆశమ్మ మనస్సు మామిడిచెట్ల మీద కూర్చుంది.

బాపి చెయ్యి వూతగా తీసుకుని ఆశమ్మ నడవడం మొదలు పెట్టింది. "నాకంటే చిన్నదానివి ఎట్టాగయ్యావో సూడు. పేగు సంబంధం వుంటేగద. తిన్నావో వున్నావో అడిగేందుకు" అని బాపి వాపోయింది.

ఆశమ్మ దుఃఖంతో మాటరాక మూలుగుతోంది.

"సిన్నాయన పెళ్లాం కూడా నిన్ను సీదరిస్తోందంటగా! అల్లా గిన్నాలే" అంది బాపి. ఊ కొట్టడం తప్ప మాట్లాడలేదు ఆశమ్మ. ఇల్లు దగ్గరకొచ్చింది బాపి వెళ్లిపోయింది. ఆశమ్మ వంటరిగా పెరటిలోకి వెళ్లింది.

అప్పటికే అక్కడ చేరినవాళ్లు సీతమ్మకంటే గట్టిగా మాట్లాడటం వినిపిస్తోంది. దూరంగా వున్న పారిజాతం చెట్టు దగ్గరికి వెళ్లి కూర్చుంది ఆశమ్మ.

"పిల్లిలా ఏమీ ఎరగనట్టు ఎట్లా వచ్చి కూర్చుందో చూడండి. మిమ్మల్ని తిట్టించాలని కాకపోతే అసలు ఎందుకు వెళ్లినట్టు అంట? అప్పన్న కనపడకపోతాడా నేను మీ ముందు అడక్కపోతానా?" అని రొప్పుతూ సీతమ్మ పెద్ద గావుకేకలు ఆశమ్మకు వినపడుతున్నా మనస్సు శూన్యంగా నిలిచినట్లుంది. సూర్యాస్తమయం చూస్తూ సంధ్యా ప్రార్థనకోసం ముక్కలు గొణుక్కున్నా ఆ వొకటికొకటి అతకటం లేదు. అక్కడక్కడ గుర్తుకొచ్చినవి కలిపి ఒకటిగా చేరుస్తోంది. చిన్నప్పుడు సూర్యాస్తమయం చూస్తే బెంగగా ఉండేది. దూడల్ని ఇళ్లకి తరిమినట్టు చీకటి దుమ్ముతో చేరి వూరిలోకి రావటం. వూరిళ్ళు, పెద్ద లోగిళ్ళు, భవనాలు పైన చేరిన పొగ చీకటికి ఎదురెళ్లి వచ్చేది. వెలుతురు దిగులుగా మారి ఆకాశంలో చేరిందని తండ్రితో చెపితే ఎంతో మురిసిపోయేవాడు. "మా తల్లికి కావ్యాలు చెప్పించాలి. దాని వయస్సెంత ఆ వూహ చూడండి" అని గర్వంగా చెప్పుకోవడం గుర్తుకొచ్చింది.

"తాతమ్మా" అంటూ వీపు మీద పడి "ఎక్కడికెళ్లావే!?" అని వొళ్లంతా తడిమి కొంగు విప్పి పటికబెల్లం తీసుకున్నాడు.

తండ్రి గొంతు దూరంగా వినపడి లోపలికి పరుగెట్టాడు నాగు, నూతిదగ్గర చేద చప్పుడు.

గొడ్లసాలలో దూడల అరుపు, కీచురాళ్లు కప్పలు అన్నీ కలిసి వకటిగా గోల చేస్తున్నాయి. వాటితో కలిపి

సీతమ్మ కేకలు అన్ని సద్దుమణిగేసరికి చంద్రుడు బాగా పైకొచ్చాడు. దూరంగా మళ్ళా భజంత్రీలు గట్టిగా వాయించడం వినపడుతోంది. ఇప్పుడు మనస్సు ఇంక అటు పోలేదు. అసలు తను చిన్నప్పుడే ఏ కాశీకో వెళ్లివుండిపోతే ఎల్లా వుండేదో అనుకుంది. తనకి ఎల్లా వస్తుంది. అట్లాంటి అదృష్టం? తను చీకటిలోనే పెరిగి చీకటిలోనే కలవాలని రాసివుండి వుంటుంది. ఆకాశంలో అక్కడక్కడ కొద్దిగా మబ్బులు కనబడుతున్నాయి. ఎంత రాత్రి అయిందో ఏమో కంటిమీదకి కునుకు రావటం లేదు. కడుపులో పేగులు కదులుతున్నాయి. బాపి తనకంటే నయం కడుపుడు పిల్లలు, అది అన్నట్టు తనకి ఎవరు వున్నారు. తన సంతతే అవుతే తిండికి పిలవకండ వుండగలరా? ఏమో వున్నా ఇల్లాగే వుండేవారేమో అని సమాధానపరుచుకుంది. అసలు వయస్సు మళ్లిన వాళ్లని చూస్తే వయస్సులో వున్నవాళ్లకి చులకనట. మళ్లా ఆకలి గుర్తుచేసింది కడుపు. వెళ్లి సీతమ్మని అడిగి తినటమా. ఛీ, ఈ చపలత్వం ఏమిటి అని తనే మందలించుకుంది. వయస్సులో ఆ ఇంట్లో ఎన్ని కథలూ కార్యాలూ తన చేతిమీద జరిపించింది! అప్పుడు తిండి మీద ఎప్పుడయినా మనస్సు పోయింది? ఎన్నిసార్లు తిండి మానలేదు? చచ్చిన వదినగారు గుర్తుకి వచ్చింది.

నీకు పనిగోల తప్ప తిండి జాస వుండదని అనటం, పోదూ వెధవ తిండికేం వచ్చె అని తను విదిలించటం జ్ఞాపకం వచ్చింది.

ఇప్పుడు ఆ తిండికోసం ప్రాణం రెపరెపలాడుతోంది. చిత్రం. అన్ని అందుబాటుగా వుంటే ఆ కోరిక చస్తుందేమో, లేకపోతే ఏమిటి... ఇప్పుడు ఎక్కడ కమ్మటి వాసన వచ్చినా జిహ్వకి తినాలన్న కోరిక. ఆలోచించే వోపిక లేక మనస్సు అలసినట్టు మూలుగుతోంది. జాలితలిచినట్టు పారిజాతం పూలు వకటి వకటి ఆశమ్మ మీద పడుతున్నాయి. దూరంగా పొలాల్లో దీపాలు కదులుతున్నాయి. కాశీ కావిడి తీసుకు భజగోవిందం పాడుకుంటూ దాసరి కంఠం దగ్గరగా వినపడింది. ఆశమ్మ మధ్యలో గుర్తువచ్చి మొదలు పెట్టింది సంప్రాప్తి. సన్నిహితే అని పూర్తికాకుండానే పంతులు భార్య పలకరించింది "అప్పుడే లేచావా? స్నానానికి వెడదామని పెందరాళే లేచానే, నువ్వూ వస్తావేమిటి!" అని ఆశమ్మని అడిగింది..

"వెళ్లేటప్పుడు పిల్చుకెళ్ళు" అని, గోవిందగీతం మొదలు పెట్టింది ఆశమ్మ.

చీకట్లో ముడుచుకున్న జీవాలకు తన తెల్లటి పల్చటి కాంతిని కప్పి ప్రశాంతంగా ప్రకృతి ఆకాశపు ఎఱుపంచు చీరతో దోబూచులాడుతోంది. ఆశమ్మ నెమ్మదిగా లేచి వొళ్ళు తూలుతున్నా ఎల్లాగో ఇంట్లోకి చేరింది. జ్ఞాని అజ్ఞానంలోకి జరిగినట్లు ఇంట్లోకి చీకటి వదల్లేదు. ఆశమ్మ తడుముకుంటూ రంగం పెట్టె తెరచింది. ఈసారి మూతస్థానం విడిచి కింద పడిన చప్పుడు చేసింది. ఆశమ్మ పెట్టెలో వస్తువులు కింద పోసుకుని అన్నీ చూసుకుంది. మళ్ళా పెట్టింది. జీడిగింజని మాత్రం కంటికి దగ్గరగా పెట్టుకు చూసుకుంటోంది.

ఊడిపోయిన జుట్టు ముడి పెట్టుకుంటూ, “అప్పుడే ఏమి పుట్టి మునిగింది! వెధవ గోల ఆ పెట్టెని కూడా పాకలో పడవెయ్యవే” అని పనిమనిషికి వినపడేలాగ గట్టిగా కేక పెట్టింది సీతమ్మ.

ఆ కేకకి ఆశమ్మ గుండె అదిరింది. తప్పు చేసినట్టు వణికిపోయింది. జీడిగింజా రాగిచెంబు పట్టుపంచిలో పెట్టి చుట్టుకు లేచింది. ఏదో కిందపడి చిన్నగా శబ్దం చెయ్యటంతో మళ్ళా కూర్చుని చేత్తో తడుముతోంది. చేతికేదో దొరికింది. కంటి దగ్గర పెట్టుకు చూసింది. పన్ను ఎవరిది! తన నోట్లో వెతుక్కుంది. ఎప్పుడు వూడిందో. చిత్రమే, అనుకుని దాన్ని భద్రంగా కొంగుని కట్టుకు ఇవతలకి చేరింది. కాలవగట్టుమీద నడుస్తూంటే కళ్లు చీకట్లు కమ్మి కింద పడబోయింది. ఎలాగో రేవుకి చేరి రెండు చెంబులు ముంచి పోసుకుంది. మళ్ళా బలం వచ్చి నెమ్మదిగా వడ్డుకి వచ్చి, రావిచెట్టు మొదట్లో కూర్చుంది. ఏనాటి నుంచి వుందో చాలా పలవలు మోడుబారాయి. అయినా ఏదోపక్క చిగురిస్తూనే వుంటుంది. ఆరోజు ఏది చూసినా కళాహీనంగా కనపడుతోంది.

నదిలో నీళ్ల పై ఇసగ కప్పువేసింది. చిన్నతనంలో వడ్డుని వరుసుకుపోయే నది గుర్తుకు వచ్చింది. దాని అవసరం కూడా వూరికి తగ్గి వుంటుంది. లేకపోతే బాగుచేయించేవరకూ మునసబు కనపడితే చెప్పాలి అనుకుంది. గుడిగంటలు వినపడి బయలుదేరింది ఆశమ్మ.

పూజారి అచ్చన్న ఎదురై కళ్లు పట్టుకు నడిపించాడు. “మా కుటుంబాన్ని రప్పించింది, అప్పటినించీ ఎంతో వృద్ధిలోకి వచ్చాము. నిన్ను అనుకోని క్షణం వుండదు అనుకో” అని ఆశమ్మ వినేలా అని లోపలికి తీసుకువెళ్లాడు.

గుడిలో నంది ముందుకు జరిగి కూర్చుంది. అచ్చన్న చేతిలో జీడిగింజ పెట్టి విడతియ్యమంది ఆశమ్మ.

ఏమి వుందోనని మిగిలినవాళ్లు చూస్తున్నారు. గుండురాయితోటి కొడితే డిప్పలు విడి కాసులు కిందపడి చప్పుడు చేశాయి. అచ్చన్న అర్థం కానట్టు ఆశమ్మకేసి చూశాడు.

అచ్చన్న ఏదో అనబోయి సరేనంటూ పసుపుదారం తెచ్చి గుచ్చి కట్టి కర్పూరం వెలిగించి చూడమన్నాడు.

బాగా దగ్గరిగా జరిగి పార్వతిని చూసుకుని కళ్యాణ దంపతులకి మొక్కుకుంది. జీవితం వ్యర్థంగా గడిచిపోయింది. ఈ జన్మకి తను ఏమీ చెయ్యలేదు. అవివేకాన్ని మన్నించి జీవితానికి ముక్తిని ఇవ్వమంది. ప్రమిదలో దీపం మిణుకు మిణుకుమంటోంది. గుళ్లో పూర్వపు కళ తిరిగి ఏదో వెలి కనపడినా మనస్సులో ఏదో ఆనందం ఏదో కాంతి ఏదో తృప్తి అన్నీ వక్కసారి ఆశమ్మలో ఆఖండంలా మెరిసిపోయాయి.

“అచ్చన్న ఆ గుళ్లోకి వస్తావా” అనటం విని ఆఖరిచూపులా మూల విరాటుకి మొక్కి బయలుదేరింది. ఈ రామాలయానికి చేరేసరికి సోషవచ్చినట్టు వరిగింది. అచ్చన్న తులసితీర్థం తెచ్చి ఇచ్చాడు. లేచి కూర్చుంది ఆశమ్మ.

“ఆ రెండోకాసు ఈ అమ్మవారికి కట్టు” అని చెప్పి తారకం వల్లె వేసుకుంటోంది. అచ్చన్న హారతి వెలిగించి చూడమని మంత్రపుష్పం చెపుతున్నాడు.

మెరుగు పోయింది ఏమి మెరుస్తుందిలే అనుకుంది. తల్లీ శలవా? అని ఏదో పాడబోయి వూరుకుంది ఆశమ్మ. పూజ ముగించుకు వచ్చి కూర్చున్నాడు అచ్చన్న. మెళ్లో రుద్రాక్షమాల తీసి, "నువ్వు జపం చేసుకో" అని అచ్చన్న చేతిలో పెట్టింది ఆశమ్మ.

కృతజ్ఞతతో వంగి ఆశమ్మ కాళ్లు కళ్లకి అద్దుకున్నాడు. "కాసేపు భాగవతంలో భీష్మస్తవం చదువుదూ" అంది ఆశమ్మ. అచ్చన్న చదువుతున్నాడు. ఆశమ్మ తనలో నవ్వుకుంటూ వన్నెకాడు, అనుకుంటోంది.

"నైవేద్యం పెట్టేందుకు రమ్మని" అచ్చన్నకి పిలుపు వచ్చింది. గంటలు వుండి వుండి మోగుతున్నాయి.

ఆలయం ఆవరణ విడిచి రావిచెట్టు దగ్గరకి చేరింది ఆశమ్మ. ఆనంద్ ఆవిడని చూసి భయంతో వణుకుతున్న చేతులు తాతమ్మ మెడకి చుట్టాడు. పక్కలు ఎగురుతున్నాయి. మాట రాక వెక్కుతున్నాడు. నాగు వగరుస్తూ వచ్చి పక్కన నిల్చుని "వీడేం లేదు, ఆంబోతుని రాయి పుచ్చుకు కొట్టాడే."

"నేను కాదు వాడే కొట్టాడు" అని ఆనంద్ చెప్పటం పూర్తి కాకుండానే ఆంబోతు దగ్గరికి వచ్చేసింది.

ఏమిటో సరిగ్గా అర్థం కాకపోయినా పిల్లలిద్దర్ని దగ్గరికి తీసుకు పట్టుకుంది ఆశమ్మ.

రంకెవేసి ఆంబోతు ఎత్తిపడేసింది ఆశమ్మని... రాళ్ళమీదికి దొర్లి నీళ్ల దగ్గర వున్న బండకి కొట్టుకు నిల్చింది. పిల్లల్ని పట్టుకున్న పట్టు విడవలేదు. ఆఖరిచూపు పసివాళ్లని చూసి తృప్తిగా కళ్లు మూసింది ఆశమ్మ.

అలసినట్టు పిల్లలు అలాగే వుండిపోయారు. మాట తెల్సినంతవరకూ జనం పోగయ్యారు. రంగమ్మ సీతమ్మ పిల్లలకోసం గోల పెడుతూ వచ్చారు.

"ఇంకా అల్లా చూస్తూ వూరుకుంటారేం పిల్లాడిని ఇవతలికి తియ్యండి" అని పెనిమిటిని కసిరింది.

రంగమ్మ ఏదో అనాలనుకున్నా భర్త వాలకం చూసి వూరుకుంది.

పిల్లల్ని ఇవతలకి జరిపి ఆనంద్ తండ్రి ఆశమ్మ గుండెలో తలదాచుకు పసివాడిలా అయ్యాడు. తనని గోదావరిలో పడకుండా కాపాడింది. తమ పిల్లలకోసం కళ్లు మూసింది. తనేం చేశాడు. ఏమీ చెయ్యలేదు ఆవిడకి అంటూ విలవిల్లాడాడు. నాగు ఆనంద్ వకరికి వకరు దగ్గరగా జరిగి కూర్చుని తాతమ్మకోసం రాళ్లు కరిగేలా గోల పెడుతున్నారు.

పూజారి అచ్చన్న, బాపి, వంటవాడు, వీరన్న, నాగమ్మ ఆవిడని గురించి కథలుగా చెపుతూ, ఎండిపోయిన కళ్ల కొలుకలు తడుపుకున్నారు.

రంగమ్మ మనస్సు ఎల్లాగో అయింది. ఎదురుగా పెద్ద సముద్రం వున్నట్టు అందులో ఒక కెరటంపై ఆశమ్మ ప్రశాంతంగా నిద్రపోతున్నట్టు అనిపించింది. మనస్సులోనే ఆశమ్మ ఆత్మకి కృతజ్ఞత చెప్పుకుంది.

సీతమ్మకి అందరి మొహాల్లో కనపడే దుఃఖం కపటంగా తోచింది. తన మనస్సు ఎందుకో తేలికగా వున్నట్టు వుంది. కొత్తగా వచ్చిన స్వతంత్రంలా, ఏదో మనస్సులో వుద్రేకం తిరుగుతోంది. "కన్నవాళ్లు లేరన్న లోటు లేకుండా చేశాను. మిగిలినవాళ్లలా నేనూ వదిలేస్తే ఏమయ్యేదో" అని రంగమ్మ కేసి చూసింది కసిగా.

అవతల వడ్డున వున్న కుర్రాడు వచ్చి అప్పన్నకి చెపుతున్నాడు. ఆంబోతు రావటం గురించి. "భలేగా పట్టుకున్నార్లే ఈ కుర్రోళ్లని లేకుంటే ఇయ్యల ఎమయ్యేవోళ్లో" అంటూ, ఆశమ్మకేసి చూసి "పోయిందా?" అంటూ ఆశ్చర్యంగా తెరచిన నోటితో చూస్తూ వుండిపోయాడు కుఱ్ఱాడు.

రంగమ్మ చూపు నీటి అంచునే చూస్తోంది. ప్రశాంతంగా నదిలో నీళ్లు జరుగుతున్నాయి. గాలి వచ్చి నీళ్లని సుడులు తిప్పుతోంది. ఆశమ్మ ఆత్మ నీటిపైన తేలుతూ వెళ్లి వడ్డుకు చేరినట్టు అయింది. ఒడ్డుకి చేరిన ఒంటి కెరటంలా రంగమ్మ కంటి బిందువు బరువుగా జారింది.